శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి కృతులలోని

# శివశక్తి తత్త్వము, సంగీత సాహిత్య ప్రాశస్త్యము

గ్రంథకర్త

డాక్టర్ (శ్రీమతి) వంక (దావలి) లలిత అన్నప్పారావు

ఎం.ఏ (మ్యూజిక్) పిహెచ్.డి



తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

# శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి కృతులలోని
# శివశక్తి తత్త్వము, సంగీత సాహిత్య ప్రాశస్త్యము


గ్రంధకర్త

**డాక్టర్ (శ్రీమతి) వంక (చావలి) లలిత అన్నప్పారావు**

ఎం.ఏ (మ్యూజిక్) పిహెచ్.డి



ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

**SRI MUTHUSWAMI DEAKSHITHULUVARI KRUTHULALONI SIVASAKTHI TATVAMU, SANGEETHA SAHITHYA PRASASTHYAMU**

By

**Dr. (Smt.) VANKA (CHAVALI) LALITHA ANNAPPARAO**

M.A., (MUSIC) Ph.D.

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No : 752

First Print : 2006


Copies : 1,000

*Cover Design:* P. Siva sankar

*Published by:*

**Sri A.P.V.N. Sarma, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati — 517 507

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.







# కృతజ్ఞతలు

సంగీత త్రిమూర్తులలో ఒకరగు **"శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి కృతులలోని శివశక్తితత్త్వము, సంగీత సాహిత్య ప్రాశస్త్యము"** అను గ్రంథమును1998 నవంబరు కార్తీక శుద్ధ ఏకాదశి దినమున శ్రీ వేంకటేశ్వరుని చరణారవిందములకు అర్పితము చేసినాను.

సప్తగిరి వాసుడైన శ్రీ వేంకటేశ్వరుడు ఏడుకొండలను దాటుటకు ఏడు సంవత్సరములు పరీక్ష చేసి చివరకు ఆశీర్వదించి ఆశ్వయుజ బహుళ ఏకాదశి శుక్రవారము అనగా 28- 10- 2005 సంవత్సరమున శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారి 170వ జయంతి(నరకచతుర్ధశి)కి ముందుగా వచ్చిన శుక్రవారము నాడు సర్వహక్కులతో తిరుమల తిరుపతి దేవస్థానము వారికి అర్పింపజేసి నా జన్మను చరితార్థము చేసిన ఆ స్వామికి నా మన:పూర్వక సాష్టాంగ ప్రణామములు.

సర్వకాల సర్వవేళ, సర్వావస్థలయందు మా కుటుంబమును సంరక్షించు ఆ జగన్మాతకు నా హృదయపూర్వక సాష్టాంగ ప్రణామములు.

పూజ్యులైన కళాబంధు, శివభక్తులు అయిన శ్రీ టి. సుబ్బిరామిరెడ్డి, యం.పి. (రాజ్యసభ), చైర్మన్, తి.తి.దే. సహృదయతతో ఈ గ్రంథమును ముద్రించి, ప్రచురించుటకు అంగీకరించినందుకు వారికి నా హృదయపూర్వక నమస్సుమాంజలులు.

ఈ గ్రంథమును ముద్రించి, ప్రచురించుటలో సంపూర్ణ సహకారములను అందజేసిన శ్రీ ఎ.పి.వి. నారాయణ శర్మ, ఐ.ఎ.ఎస్., ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, తి.తి.దే. గారికి, మరియు శ్రీ ఎన్. ముక్తేశ్వరరావు, ఐ.ఎ.ఎస్., జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, తి.తి.దే. గారికి నా మన:పూర్వక కృతజ్ఞతాభివందనములు.

ఈ గ్రంథ ప్రచురణ చేయుటలో సంపూర్ణ సహకారములను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానము సంపాదకులు శ్రీ సి. శైలకుమార్, ఎమ్.ఏ. గారికి నా ధన్యవాదములు.

ఈ గ్రంథమును పరిపూర్ణముగా పూర్తిచేయుటకు సద్గురువులైన శ్రీ విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వేంకట సుబ్రహ్మణ్యం గాడ్ గారు, వెదురుపాక, పరిపూర్ణ ఆశీస్సుల నందించినందుకు వారికి, శ్రీ శృంగేరి శారదాపీఠాధిపతి శ్రీ స్వరూపానంద స్వామీజీ, విశాఖపట్నం వారికి నా నమ:పూర్వక నమస్సుమాంజలులు.

ఈ గ్రంథమును పరిశీలించి ఆశీర్వదాపూర్వకముగా వారి అభిప్రాయముల నొసంగిన పూజ్యులు, గురుతుల్యులు అయిన పద్మవిభూషణ్, సంగీత కళానిధి, డాక్టర్. మంగళంపల్లి బాలమురళీ కృష్ణ గారికి, అవధాన సహస్రఫణి, బృహత్ ద్విసహస్రావధాని బ్రహ్మశ్రీ డాక్టర్. మాడుగుల నాగఫణి శర్మ గారికి, జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణ రెడ్డి గారికి, నా హృదయ పూర్వక కృతజ్ఞతాభి వందనములు.

నాకు ఆలోచన నేర్పి నా పరిధిని పెంచి, ఈ గ్రంథమును వ్రాయుటలో కోరిన వెంటనే అమూల్యమైన సూచనలు చేసి, విషయ వివరణమును గావించి, పూర్తిచేయుటకు అండగా నిలచిన సద్గురువులైన గానకళా ప్రవీణ శ్రీమతి అరుంధతి సర్కారుగారికి, సంగీత కళానిధి శ్రీ నేదునూరి కృష్ణమూర్తి గారికి, అవధాన సరస్వతి, శ్రీ పేరాల భరతశర్మ గారికి, శ్రీ ఆకెళ్ళ మల్లికార్జునశర్మగారికి, డాక్టర్. రామవరపు శరత్‌బాబుగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

నా చేత సంగీత విద్యాభాసము చేయించిన శ్రీ ఇవటూరి విజయేశ్వరరావుగారికి, నన్ను ఇంతగా తీర్చి దిద్దిన శ్రీ ద్వారం దుర్గాప్రసాదరావుగారికి , శ్రీ కొమండూరి కృష్ణమాచార్యుల వారికి నా నమస్సుమాంజలులు.

నన్ను పెంచి పెద్దచేసి విద్యాభివృద్ధికి కారకులైన మా అమ్మ శ్రీమతి వంక నాగమణి, మా తండ్రి శ్రీ వంక రామచంద్రరావు గారికి, అత్తవారింట నన్ను ఆదరించి నా విద్యకు ప్రోత్సాహము కల్పించిన మా అత్తగారు శ్రీమతి చావలి వీరభద్రమ్మ గారికి, మా మామగారు డాక్టర్. చావలి వెంకటలక్ష్మీకాంతం గారికి నా హార్దిక కృతజ్ఞతాభివందనములు.

నన్ను పైచదువులకు ప్రోత్సహించి గ్రంథ పరిశోధన యందు అండగ నిల్చి, నా అభ్యుదయ కారకులైన మా శ్రీవారు చావలి సూర్య అన్నప్పారావుగారికి నా మన:పూర్వక ధన్యవాదములు. గ్రంథ పరిశోధనా కాలములో నాకు తోడ్పడి సహకరించిన మా కుమారులు చి॥ రవికాంత్, చి॥ పవన్ చంద్రలకు నా శుభాశీస్సులు.

గ్రంథములను పరిశీలించి వ్రాసికొనుటకు అనుమతించిన ఆంధ్ర విశ్వకళాపరిషత్ గ్రంథాలయాధికారులకు, తెలుగు విశ్వవిద్యాలయ గ్రంథాలయాధికారులకు, మదరాసు విశ్వవిద్యాలయ గ్రంథాలయాధికారులకు, విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల ప్రిన్సిపాల్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఇంకను ఈ గ్రంథ పరిశోధనకు ప్రత్యక్షముగను, పరోక్షముగను ఆత్మీయతతో సహాయ సహకారములందించిన శ్రేయోభిలాషులకు, మిత్రులకు, కళాభిమానులకు - అందరికీ నా కృతజ్ఞతలు.

Dr. M. Balamurali Krishna
National Artist
Padma Vibhushan awarded by
President of India

5, Kanakasri Nagar,
Chennai - 600 086
✆ 28112223
28110192
24937989
Cell 9444362223

శ్రీ ముద్దుస్వామి దీక్షితుల వారి కీర్తనలు,

వాటిలోని శివతత్వము, సంగీత సాహిత్య పరమైన ప్రాశస్త్యము, గురించి శ్రీమతి డా॥ వంక (బొమ్మలి) లలిత గారు సమర్పించిన సిద్ధాంత వ్యాసమును పరిశీలించినాను

ఇందులో ముద్దుస్వామివారి జీవిత చరిత్ర, శివశక్తి తత్వము, శివశక్త్యాత్మకమైన శ్రీచక్ర విశేషము, క్షేత్ర, నవగ్రహ, నవావరణాది కీర్తనల ప్రాముఖ్యత, మొదలైనవి పరిశోధించి గ్రహించి, తెలియజేసిన వివరణ, వర్తమాన భవిష్యత్ తరాల వారికి, మిక్కిలి ఉపయోగకరమైనవి.

శ్రీ ముద్దుస్వామి వారి కీర్తనల సంగీతమును గానము చేయునప్పుడు ఊహించను,

వారు నాదయోగి, మంత్రాత్మకులు, యంత్రాత్మకులు, మహిమాన్వితులు, వారి సంగీతం, వైణికం, వైదికం, దైవికం.

నవగ్రహ, నవావరణాది కీర్తనలు, భగవదనుగ్రహమును, గ్రహశాంతిని, ఆరోగ్యమును ప్రసాదించునవి.

వేంకటమఖి రూపొందించిన అసంపూర్ణ మేళముల ననుసరించిరి ముద్దుస్వామి.

మేళకర్తలనగా ఆరోహణావరోహణలు సంపూర్ణముగా నుండవలె. ఈ విషయమును గ్రహించి 'గోవింద' యను మహనీయుడు, లక్షణకర్త, అసంపూర్ణ మేళములను క్రమబద్ధీకరించి సంపూర్ణ మేళకర్తలను రూపొందించువారు.

ఇవియే త్యాగరాజాది నేటి వాగ్గేయకారులందరూ పాటించుచున్నారు.

Dr. M. Balamurali Krishna
National Artist
Padma Vibhushan awarded by
President of India

5, Kanakasri Nag
Chennai - 600 08
✆ 28112223
28110192
24937989
Cell 9444362223

వేంకటమఖి అసంపూర్ణ మేళ పద్ధతి, ఇంద్రగాత్రములకూ, ప్రత్యేకముగా వీణా వాదమునకూ, వన్నె తెచ్చునను భావములో ముద్దుస్వామి వేంకటమఖి శైలిననుసరించినారు.

ముద్దుస్వామి, వారి కాలములో సంఘములో నుండిన సంప్రదాయములను, సంస్కరించి వినూత్న సత్సంప్రదాయములను సృష్టించినారు. ఆచరించి, నిరూపించిన ఆచారమూర్తి. ఏతత్ సంప్రదాయముల వల్లనే మహిళాలోకము, కళలలో ప్రసిద్ధిగాంచినారు.

సంగీత త్రిమూర్తులలో నాకగ్రరుగా భావించుచున్న శ్రీ ముద్దుస్వామి వారిని గురించి పరిశోధించి గ్రంథమును వెలువరించిన శ్రీమతి లలితగారు, ధన్యులు, సఫలీకృతులు.

వీరికి శ్రీ ముద్దుస్వామి వారి అనుగ్రహము, ఆయురారోగ్య సకల సంపత్తి, ఆశీస్సులు, లభించి, వీరి భవిష్యత్ పరిశోధనలు విజయవంతములగుట నిస్సంశయము.

ఆశీఃపూర్వక అభినందనలతో

మంగళంపల్లి బాలమురళీకృష్ణ.
15-1-05

అవధాన సరస్వతీ పీఠం

అవధాన సహస్రఫణి
బృహత్ ద్విసహస్రావధాని
బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణి శర్మ


# మంగళాభిముఖి

సంగీతత్రయముగా పేరుగాంచిన వాగ్గేయకారులలో శ్రీ ముత్తుస్వామి దీక్షితులు ఒకరైనవారు. తనకన్నా పూర్వుడైన శ్రీ త్యాగరాజస్వామి వారితో గురురూపబంధము - తనతర్వాత తనకన్న చిన్న- వయస్కుడైన శ్యామశాస్త్రి గారితో మైత్రీ సంబంధము నెఱపి సంగీతత్రయ మహామాలలో మధ్యమణిగా భాసించిన మహనీయుడు శ్రీ ముత్తుస్వామి దీక్షితులు.

శ్రీమతి వంక (బావల) లలితగారు పరిశోధనకై ఎన్నుకున్న విషయము చాలా గొప్పది. ఆమె జన్మ సంస్కారమును సూచిస్తున్నది. నవాక్షి లలితానుగ్రహముతో తాను జన్మించినది కావున, చిన్న తనమునుంచే అనేకులను మహాత్ములను పండితులను సిద్ధులను యోగులను తల్లిదండ్రులు ఇంటికి పిలిచి సత్కరించి సేవించు చుండగా — తానూ భక్తితో సేవించినది కావున,


AVADHĀNA SARASWATHI PEETHAM
3-4-8, Barkathpura, Hyderabad - 500 027, Phone : +91-40-27567726, 27567227
E-mail : nagaphanisarma@rediffmail.com

# అవధాన సరస్వతీ పీఠం

అవధాన సహస్రఫణి
బృహత్ బృహత్సహస్రావధాని
బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణి శర్మ


పెద్దలనుండి గ్రహించిన అనేక మంత్రములను జపోపాసనా క్రమమున సిద్ధింప జేసుకొన్నది కావున — శ్రీమతి లలిత గారికి పరిశోధనకై ఈ విషయము లభించినది.

"శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి కృతులలోని శివశక్తి తత్త్వము - సంగీత సాహిత్య ప్రాశస్త్యము." ఇది పరిశోధన గ్రంథము.

కృత్తికా నక్షత్రము - కార్తికేయుడు కుమారస్వామి యొక్క నక్షత్రము. అటువంటి నక్షత్రములో వైద్యేశ్వరుని అనుగ్రహముతో పుట్టినవారు శ్రీ ముత్తుస్వామి దీక్షితులు. ఆయన కృతులలోని శివ-శక్తుల తత్త్వము శ్రీ సుబ్రహ్మణ్యస్వామియే. ఆ స్వామియే దీక్షితులవారి ఉపాస్య దైవతము. శివుడు సాహిత్యము. శక్తి సంగీతము. ఈ రెండింటి కలయిక కృతి.

శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామి చెంగల్వరాయడై "మధుర మంత్రాక్షర నీ కృతి అనుగాక" అని కలకంఠ పలుకు నోటిలో వేసినాడట. ఆ అనుగ్రహ మాధుర్యంతోనే దీక్షితులవారు "శ్రీనాథాది


AVADHANA SARASWATHI PEETHAM
3-4-8, Barkathpura, Hyderabad - 500 027, Phone : +91-40-27567726, 27567227
E-mail : nagaphanisarma@rediffmail.com

గురుగుహో జయతి జయతి" అను "గురుగుహ "మకుట
కృతుల తొమ్మిదింటిని రచించినారు. సూర్యాది నవ
గ్రహముల పై తొమ్మిది కీర్తనలను రచించినారు.
ఎఱిగియో ఎఱుగకయో డాక్టరు శ్రీమతి లలితగారు
ఈ సిద్ధాంతగ్రంథమును తొమ్మిది అధ్యాయములలో
విభజించి శ్రీ ముత్తుస్వామి దీక్షితుల హృదయాన్ని
నిర్ధారించినారు. 270 (పేజీలలో) పుటలలో - కూడితే
ఈ సంఖ్య కూడా తొమ్మిది కావడం లలితాదేవి సంకల్పం.
తిరువారూరు శ్రీ త్యాగరాజస్వామి వారిపై రచించిన
13 కృతులు పంచభూతలింగ స్థల కృతులు 5 (13+5=18)
కలిపితే కూడా తొమ్మిది. నవావర్ణ మంత్రోపాసియైన
లలితాదేవి డా|| లలితగారిని నవదుర్గా స్వరూపిణియై
లలిత లలితంగా ఈ విధంగా అనుగ్రహించినది.

పంచమాధ్యాయములో నవావరణ కృతుల
విశిష్టతను తెలుపుతూ - శ్రీ చక్రములోని బిందు కోణ
సన్నివేశమును వివరించడం, శ్రీమదాచార్య శంకరుల-
గౌడపాదాచార్యుల స్తోత్రములను స్పృశించడం, శ్రీదేవి
ఖడ్గమాలా ధారణం, మూలాధారాది సహస్రారపర్యంత

# అవధాన సరస్వతీ పీఠం

అవధాన సహస్రఫణి
బృహత్ బృహన్మహావధాని
బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణి శర్మ


షట్‌చక్ర శోధనం — యివన్నీ డాక్టరు శ్రీమతి లలిత గారికి శ్రీ లలితోపాసనలో గల ఆసక్తిని - ఆ - శక్తిని ప్రస్ఫుటీకరిస్తున్నాయి.

ఈ తొమ్మిది అధ్యాయాలలోను శ్రీముత్తుస్వామి దీక్షితుల కృతులలోని శివ-శక్తి తత్త్వము విశదీకరింపబడి, శ్రీ దీక్షితుల సంగీత-సాహిత్య ప్రాశస్త్యము విపులీకరింపబడి - శ్రీ దీక్షితుల వారి జీవితములోని అన్ని పార్శ్వములు ఆవిష్కరింపబడినవి.

శ్రీ త్యాగరాజస్వామి వారిని - శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు తన కృతుల ద్వారా ఆరాధించినారు. శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారిని - ఈ సిద్ధాంత కృతి ద్వారా శ్రీమతి లలితగారు ఉపాసించినారు.

కాశీ మహాక్షేత్రంలో గంగా మహాస్రోతస్సులో "చిదంబరనాథస్వామి" యోగి అనుగ్రహంతో శ్రీ దీక్షితుల వారికి — యాళి ముఖము తంగా గల వీణ లభించినట్లు — పెద్దల అనుగ్రహంతో శ్రీమతి డాక్టరు లలిత గారికి ఈ సిద్ధాంత విషయం లభించింది. ఈమె చేతిలో ఈ గ్రంథం సహస్రదళ పద్మమై వికసించింది.

సంస్కృతాంధ్ర భాషా భూషితులైన డాక్టరు రామవరపు శరత్‌బాబు గారి వంటి విద్వత్ పర్యవేక్షణలో


**AVADHĀNA SARASWATHI PEETHAM**
3-4-8, Barkathpura, Hyderabad - 500 027, Phone : +91-40-27567726, 27567227
E-mail : nagaphanisarma@rediffmail.com

# అవధాన సరస్వతీ పీఠం

అవధాన సహస్రఫణి
బృహత్ బృహస్పతి
బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణి శర్మ


ఈ సహస్రదళ పద్మం సహస్రధా పరిమళ మిళితమైనది.
పరంపరాఽభివృద్ధిరస్తు. అవధాన సరస్వతీ పీఠనిలయ
యైన వాగ్దేవత యొక్క కటాక్షము శ్రీమతి లలితగారి
యందు - వారి కుటుంబమునందు ప్రసరించుగాక!
వారికి మా ఆశీర్వచనములు.

కం॥ దీక్షితుల కృతుల విభవము
దీక్షగ శోధించి యిచ్చు ధీశాలిని - శ్రీ
సాక్షాల్లలితా మాతృక
టాక్షములన్ తనియుగాక శ్రీమలలితయే

శుభమ్

ఆశీః
డా. నాగఫణిశర్మ
18-9-2004
తారణ. భాద్రపద శుద్ధ చతుర్థి.




AVADHĀNA SARASWATHI PEETHAM
3-4-8, Barkathpura, Hyderabad - 500 027, Phone : +91-40-27567726, 27567227
E-mail : nagaphanisarma@rediffmail.com

*Jnanpith Awardee*
**Dr. C. Narayana Reddy** Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
CHAIRMAN
Andhra Pradesh State Cultural Council
Government of Andhra Pradesh
Kalabhavan, Hyderabad - 500 004.
Phone : (O) 23214603 (R) 23548451
Fax : (O) 23214603

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
**డాక్టర్ సి. నారాయణరెడ్డి** ఎక్స్ ఎం.పి.
ఎం.ఎ. పిహెచ్.డి. డి.లిట్.
అధ్యక్షులు
**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
కళాభవన్, హైదరాబాదు-500 004.
ఫోన్ : (ఆ) 23214603 (ఇ) 23548451
ఫాక్స్ : (ఆ) 23214603

<u>సుహృదభినందన</u>  21.4.2004.

శ్రీముత్తుస్వామి దీక్షితులవారు అగ్రశ్రేణి వాగ్గేయకారుల్లో ప్రాతఃస్మరణీయులు. వారి కృతులు ఒకవైపు ఆధ్యాత్మిక తాత్త్విక నిధులు. మరొకవైపు సుమధుర రససుధలు. అపార వైదుష్యం, అనితర ప్రతిభాపారమ్యం మేళవించుకున్న వారి కృతులను గురించి పరిశోధించి ఎన్నెన్నో విషయాలను ఆవిష్కరించిన గ్రంథమిది.

ఈ గ్రంథ రచయిత్రి శ్రీమతి వంక (చావలి) లలితగారు సంస్కృతాంధ్ర భాషా పాండిత్యాలతోపాటు, కర్ణాటక సంగీతాన్ని సాధన చేసిన విదుషీమణి. దీక్షితులవారి కృతులలోని ప్రధానాంగమైన శివశక్తి తత్త్వాన్ని గురించి ఈ గ్రంథంలో తలస్పర్శి పరిశీలన ఉంది. సంగీత సాహిత్యాంగాలను గురించి కూలంకష సమీక్షణముంది.

ఈ గ్రంథంలో డా. లలితగారు ఆయా కృతులను గురించి, నవావరణ కృతులను గురించి, పంచభూత లింగ స్థల కృతులను గురించి సర్వాంగీణ పరిశోధన చేశారు. దీక్షితులవారి కృతుల్లో సంగీత సాహిత్యాల ప్రాశస్త్యాన్ని గురించి వివరంగా విశ్లేషించారు.

దీక్షితులవారు సంస్కృతంలో రచించిన కృతులను ప్రతి పదం అవగతం చేసుకొని అనేక విశేషాంశాలను పరమ పఠనీయమైన రీతిలో జిజ్ఞాసువులకందించిన ఈ గ్రంథ రచయిత్రి డా. లలితగారి విశిష్ట కృషికి నా హార్దికాభినందన.

(డా. సి. నారాయణరెడ్డి)

శ్రీ :

## తొలి పలుకు

సంగీత, సాహిత్యములకు నిలయమైన విజయనగరములో మా తల్లి దండ్రులు దసరా నవరాత్రులు చేయుట ప్రారంభించిన తరువాత సంవత్సరము నేను జన్మించుటచే నాకు లలిత అని నామకరణము చేసినామని చెప్పుదురు. నా చిన్నతనములో విజయనగరము కొత్తగ్రహారంలో శ్రీ ఇవటూరి విజయేశ్వరరావు గారు స్థాపించిన శ్రీ ద్వారం నరసింగరావు నాయుడు గారి సంగీత పాఠశాల ఉండుట వలన అక్కడ ప్రతి ఇంట సంగీతము వినిపించుచు ఉండెడిది. ఆ వినికిడి ప్రభావమే ఈనాడు నేను ఈ పరిశోధన చేయుటకు దోహదకారియైనది. ఆ రోజులలో మా సంగీత పాఠశాలలో ప్రార్థనగా "నాదతనుమనిశం శంకరం" అను త్యాగరాజు కృతి, సరస్వతీ పూజ నాడు విద్యార్థులందరు గానము చేసే "శ్రీ సరస్వతీ నమోస్తుతే" అను ముత్తుస్వామి దీక్షితుల వారి కృతులు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నవి.

మా సంగీత పాఠశాలలో ఏటేట దీక్షితుల వారి వర్ధంతి సందర్భముగా వారి జీవిత చరిత్ర విశేషములు చెప్పుచున్నపుడు "దీక్షితుల వారి కృతులు నారికేళపాకములో ఉండును, వారి కృతులు వేద, వేదాంగ, మంత్ర, తంత్ర, ఆగమ జ్యోతిష శాస్త్రములతోను, గంభీర భావనా పటిమతోను, సంగీత సాహిత్య సొగసులతోను, అలరారు చుండును." అని మా గురువుగారు చెప్పిన మాటలు వినినప్పుడల్లా నాకు అవి ఏమిటో, ఏ విధముగా వాటిని ఇమిడ్చినారో ఎప్పటికైనా తెలుసుకుంటే బాగుండునని అనిపించుచుండెడిది.

ఆ తరువాత నేను ఆంధ్రయూనివర్శిటీ, సంగీత విభాగములో ఎం.ఏ. చదువుటకు జేరినపుడు, మొట్టమొదటి క్లాసులో శ్రీమతి అరుంధతి సర్కారు గారు గురుగ్రహముపై దీక్షితుల వారు రచించిన 'బృహస్పతే తార' అను కృతితో

ప్రారంభించిరి. నాలుగు దశాబ్దముల కాలము దీక్షితుల వారి కృతులపై విశేష కృషిచేసిన ఆమె మాకు అధ్యాపకురాలుగా నియమితులగుట వలన ఆ మొదటి సంవత్సరములో దీక్షితుల వారి కృతులు ఎక్కువ నేర్చుకొనుటకు అవకాశము లభించినది. ఆ సంవత్సరము ఆంధ్రాయూనివర్సిటీ తరఫున మా విద్యార్థులందరూ తిరువయ్యూరు త్యాగరాజు ఆరాధనలో పాడుటకు, వాయించుటకు వెళ్ళి అక్కడ సంగీత త్రిమూర్తుల గృహములను, అచటగల శ్రీ త్యాగరాజేశ్వర, కమలాంబిక, నీలోత్పలాంబిక, షోడశ గణపతులను దర్శించి అక్కడ ఒక్కొక్క కృతి గానము చేయు భాగ్యము లభించినది. అప్పటి నుండి దీక్షితుల వారి కృతులలోని విశేషములను తెలిసికొనవలెననెడి నాలోనున్న ఆశ కొత్త చివురును తొడిగినది.

మా తండ్రిగారు ఆ రోజులలో విజయనగరమునకు విచ్చేసిన స్వాములవారందరిని మా ఇంటికి భిక్షకు ఆహ్వానించెడివారు. ఆ సమయములో స్వామి వారికి వింజామర వీచుట వంటి సేవలు చేయుటకు, వారి ఉపన్యాసములు వినుటకును మా తల్లిదండ్రులతో వెళ్ళుచుండెడిదానను. కొందరు స్వాములవార్లు మా గృహమునకు వచ్చినపుడు నాకు కొన్ని మంత్రములుపదేశించి, పునశ్చరణ చేయుమని చెప్పుట జరిగినది. ఆ మంత్రనామములు గాని, తదధిష్ఠాన దేవతలు గాని అప్పుడు నాకు తెలియకపోయినను ఆ మంత్రములు మాత్రము రోజూ మననము చేయుచుండెడి దానను. కాలక్రమమున అవి గణపతి, బాల, పంచదశీ, గాయిత్రీ, ప్రాసాద శివశక్తి పంచాక్షరీ మంత్రములని తెలిసినది.

మా అమ్మ నిత్యము లలితా సహస్ర నామము, విష్ణు సహస్ర నామము, ఆదిత్య హృదయాది స్తోత్రములనెన్నింటినో, తెల్లవారుఝామున ప్రారంభించి తన పనులు పూర్తి చేసికొనుచు పైకి చదువుతూ ఉండెడిది. అవి మా చెవులలో పడి నోటికి వచ్చినవి. ఆ విధముగా ఏదియు స్పష్టముగా తెలియకుండగనే మంత్రోచ్చారణ చేయుట జరిగినది.

ఈమంత్రముల పునశ్చరణ ఫలితమేమో - నాకు దీక్షితులవారి కృతులలోని శివశక్తి తత్త్వమును, సంగీత సాహిత్య ప్రాశస్త్యమును పరిశోధన చేయుటకు అవకాశము కల్పించినదనిపించును. నేను చిన్నతనము నుండి చేయుచున్న మరియొక మంత్రము పేరు 'హంస గాయిత్రి' అను విషయము దీక్షితుల వారి కృతులను పరిశోధన చేయుచున్న ఈ తరుణములో శ్రీ పేరాల భరతశర్మ గారి ద్వారా తెలిసినది. నాకు పుత్రికా వాత్సల్యముతో ఈ విషయ వివరణము గావించిన నా గురువులకు నా హృదయపూర్వక నమస్సుమాంజలులు.

ఈ పరిశోధన వలన నాకు దీక్షితుల వారు ఈ కృతులలో ఇమిడ్చిన శివశక్తి తత్త్వమును, ఆ మంత్రముల విశిష్టతను ఆ కృతులలో గల, సంగీత సాహిత్య ప్రాశస్త్యమును తెలిసికొనుటకు అవకాశము కలిగించిన ఆ సదాశివ శక్తులకు నా సాష్టాంగ ప్రణామములు.

★★★

శ్రీః

# విషయసూచిక


| | | పుట సంఖ్య |
|---|---|---|
| | ఉపోద్ఘాతము | 1 – 3 |
| I. | ప్రథమాధ్యాయము<br>దీక్షితుల వారి పూర్వుల చరిత్ర - ఆనాటి చారిత్రక సాంఘిక నైపథ్యము | 4 - 9 |
| II. | ద్వితీయాధ్యాయము<br>శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి జీవిత చరిత్ర | 10 - 29 |
| III. | తృతీయాధ్యాయము<br>శివశక్తి తత్త్వము<br>శివశక్త్యాత్మకమైన శ్రీ చక్రము సంగీత సమన్వయము | 30 - 37 |
| IV. | చతుర్థాధ్యాయము<br>దీక్షితుల వారి కృతులలో గల శివశక్తి తత్త్వము<br>తిరువారూరులోని త్యాగరాజస్వామిపై రచించిన 13 కృతులు | 38 - 98 |
| V. | పంచమాధ్యాయము<br>నవావరణ కృతులు - వాని విశిష్టత | 99 -176 |
| VI. | షష్ఠాధ్యాయము<br>పంచభూత లింగ స్థల కృతులు | 177 - 201 |
| VII. | సప్తమాధ్యాయము<br>శ్రీ దీక్షితుల వారు సందర్శించిన ఇతర క్షేత్రములలో<br>శివశక్తులపైగల కృతులు | 202 - 243 |
| VIII. | అష్టమాధ్యాయము<br>శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి కృతులలో గల సంగీత-సాహిత్య ప్రాశస్త్యము | 244 - 268 |
| IX. | నవమాధ్యాయము<br>ఉపసంహారము | 269 - 270 |
| | ఉపయుక్త గ్రంథ పట్టిక | 271 - 275 |

శ్రీః

# ఉపోద్ఘాతము

"బ్రహ్మ ప్రణవ సంధాన నాదో జ్యోతిర్మయః శివః

స్వయమావిర్భ వేదాత్మా మేఘాపాయేఽంశు మానివ" -

అని యోగశిఖోపనిషత్ చెప్పుచున్నది.

బ్రహ్మమునకు ప్రణవమునకు అనుసంధానమైన నాదమే జ్యోతిర్మయుడైన శివుడు. శివ జ్యోతిర్మయమే సర్వజగత్తు. ఆ జ్యోతి నిత్యప్రకాశమైనది. అవరోధములు మన కర్మవశముగా ఆ జ్యోతిని మనకు కానరాకుండ చేసినను అది మేఘములు తొలగినపుడు సూర్యుడు కనబడునట్లు మనకు గోచరించునే యుండును.

మన దేశమున సమస్త విద్యలు, కళలు, శాస్త్రములు మూడు దశలలో ప్రభావితములై, పరిణతమై, పరిఢవిల్లినవి. అవి ఆధ్యాత్మిక, అధిదైవిక, అధిభౌతిక సంపద. వానిచే ఆ దేశపు తత్త్వము, మూల పదార్థము, వైభవము యావత్ప్రపంచము నందు దీప్తివంతములైనవి. మన వాఙ్మయ ప్రపంచమంతయు వైఖరీ రూపమున లోకము నందు అధి భౌతిక ప్రయోజనములను సాధించి పెట్టినది. ఈ వైఖరీ సంపద చేతనే దైవీభావనయు సంపన్నమైనది. దీనిచే మూలమున పరారూపమైన శివశక్త్యాత్మకమైన వాగర్థ సంయోగముల చేత పరమేశ్వర పరమేశ్వరీ భావమున పరాత్పరయై సర్వవిద్యా మూలమైన ఆధ్యాత్మిక కేంద్రముగా గుర్తింపబడినది. అట్లే సంగీతము నాదరూపమై కళావిలసితమై శ్రీ చక్ర విలసితమై అధి భౌతిక తత్త్వమున నాభీ హృత్కంఠ రస నాసాదుల యందు శోభిల్లుచు సప్త స్వర సుందరి బృందగాన విద్యగా విలసితమైనది.

అట్టి విశిష్టమైన మన భారతీయ సంప్రదాయమున సంగీత జ్ఞానము భుక్తి ముక్తి ప్రదమైన గొప్పకళగా, శాస్త్రముగా విద్యగా భాసించినది. సంగీతము స్వతో రంజక ధర్మము గల స్వరములచే ఏర్పడినది. స్వరములు ప్రాణములు. వానిచే విలసిల్లిన విద్య సంగీతము. కనుక దీనిని మించిన జీవ చైతన్య సుందర రూపమైన విద్య, కళ, శాస్త్రము మరియొకటి లేదు. వేదమువంటిదే గాంధర్వ వేదము అన్న ఖ్యాతి గడించినది సంగీతము.

అందుచే ఒక దీపిక రాగము కాంతిని ప్రసాదించు జోతిస్సు కాగా, ఒక అమృతవర్షిణి రాగము లోని కృతి వర్షము కురిపించెను. వేయేల శంకరుడు నాదస్వరూపుడు కాగా సంగీతము ఆ శంకరునకు ఆభరణమైనది. "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గాన రసం ఫణిః" అని పేర్కొనబడిన సంగీతములోని పున్నాగవరాళి రాగము నాగులకు ప్రియమును కలిగించు రాగము. మనలోగల కుండలిని కూడ సర్పము. ఇది ఆ శంకరునకు ఆభరణమై శంకరాభరణమైనదని చెప్పవచ్చును. కనుక ఈ రాగము అన్ని దేశ సంగీతములలో (కర్ణాటక, హిందుస్థానీ, పాశ్చాత్య సంగీతములలో) విశిష్ట స్థానమును కల్గియున్నదని పేర్కొనవచ్చును.

కనుక ఈ దేశమున సంగీతమును ఉపాసించు వారు నాదతనుడైన శంకరుని ఉపాసించినవారు. ఈ భావము ముత్తుస్వామి దీక్షితులవారికి సమకాలీనమైన శ్రీ త్యాగరాజు "నాదతనుమనిశం శంకరం" అను కీర్తనలో నిరూపించినారు. వారు సప్తస్వర విద్యాలోలురు. శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు కూడ ఈ తత్త్వమును చతుర్దశ రాగమాలిక యందు నిక్షేపించిరి.

"పక్వాశ్చ అపక్వాశ్చ దేహినో స్మృతాః"

శరీరధారులలో పండినవారు కొందరు పండనివారు కొందరు. పండినవారు లోకమును పండించగలరు. వారే యోగులు, మౌనులు, సిద్ధులు, కవులు, వాగ్గేయకారులు. యోగి సాధారణముగా మౌని, మౌనముగా నుండును. కవి, వాగ్గేయకారులు రససిద్ధులు. రసము వాగ్రూపమున పరమేశ్వర ప్రతిపాదనము. అట్టి వాగ్దేవతా ప్రసన్నత కలిగిన మహాపురుషులే సంగీత త్రిమూర్తులు, వారు శ్రీ త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి. సంగీత త్రిమూర్తులు శ్రీ విద్యానిధులు. వీరి రచనలు నిగూఢములైన శాస్త్ర, కళా, విద్యా, దివ్య రహస్యములతో నిండియున్నవి.

సకల చరాచరాత్మక జగత్తునకు మూలమైన పరమేశ్వర పరమేశ్వరీ తత్త్వము సమస్తము శ్రీ విద్యా పరమైనది. అదియే శివశక్తి తత్త్వము. ఈ శివశక్తి స్వరూపము మహాకాల మహాకాళీరూపము. సమస్త వాగ్రూపము. ఆ వాగర్థములతో సంగీత సాహిత్యోపాసన చేసిన వారి పరిపక్వ హృదయమే శివశక్తుల రూపమును చూపగల ఆదర్శమై భాసించును. అటువంటి హృదయముగల శ్రీ విద్యోపాసకులు శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు.

శ్రీవిద్య జగన్మంగళకరమైనది. శకార రేఫ ఈకారముల సంయుక్త రూపమే శ్రీకారము. శకారము పరమేశ్వర వాచకము. ఈకారము పరమేశ్వరీ వాచకము. రేఫ ఆనందవాచకము. పరమేశ్వర పరమేశ్వరీ సంయుక్త ఆనందగ్రంథి సంకేతమే రేఫము. శ్రీకారము ఉపాసకులకు ఏకాక్షర బీజమై విద్యగా శ్రీవిద్య యని లోకమున చిరప్రతిష్ఠమైనది.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి కృతుల అధ్యయనమున కలుగు శ్రుతి, స్మృతి, పురాణేతిహాసరహస్యాభి వ్యక్తియే ఈ సిద్ధాంత వ్యాస సముద్దేశ్యము. ఈ నేపథ్యమున శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి కృతులలో శివశక్తి తత్త్వప్రతిపాదనములు, సంగీత సాహిత్య ప్రాశస్త్యమును పరిశీలన చేయు ప్రయత్నములోని కొద్దిపాటి ఫలమే ఈ సిద్ధాంత వ్యాసరూపముగ సముద్భవించినది.

★★★

# ప్రథమాధ్యాయము

# ప్రథమాధ్యాయము

## దీక్షితుల వారి పూర్వులచరిత్ర - ఆనాటి చారిత్రక సాంఘిక నైపథ్యము

క్రీస్తు శకము 1530 నుండి 1572 వరకు తంజావూరును పాలించిన మొదటి నాయక మహారాజా 'చెవ్వప్పనాయకుడు'. వారి కుమారుడు 'అచ్యుతప్పనాయకుడు'. 1577 నుండి 1614 వరకు చోళ మండలమును పాలించిరి. అచ్చుతప్పనాయకుని మంత్రి గోవింద దీక్షితులు. అచ్యుతప్పనాయకుడు రాజు, గోవింద దీక్షితులు మంత్రిగా నున్న కాలములో స్తుతిపరముగా చేయబడిన యొక శ్లోకము కనబడుచున్నది.

శ్లో: "త్రినామాద్యంతనామానౌ మహీక్షిద్దీక్షితావుభౌ

శస్త్రే శాస్త్రేచ కుశలావాహవేషు హవేషుచ." [1]

అచ్యుత, అనంత, గోవింద అను మూడు నామముల యందు మొదటి నామములు గల అచ్యుతప్పనాయక రాజును, కడపటి నామమును ధరించిన మంత్రి గోవింద దీక్షితులను క్రమముగా శస్త్ర, శాస్త్రముల యందును, యుద్ధ, యాగ ప్రక్రియల యందును సమర్థులని దీని భావము.

ఈ గోవింద దీక్షితులు అప్పయ్యదీక్షితులు సమాకాలీనులని అప్పయ్యదీక్షితుల వారి చరిత్ర వలన తెలియుచున్నది. ఈ అప్పయ్య దీక్షితుల వారి జనన కాలము క్రీ॥ శ॥ 1554-1626 అని తెలియుచున్నది. గోవిందదీక్షితుల భార్య నాగమాంబ. వీరికి యజ్ఞనారాయణ దీక్షితులు, వేంకటమఖి అని ఇరువురు కుమారులు. గోవింద దీక్షితులు సంగీత శాస్త్రకోవిదుడు, సంస్కృతాంధ్ర పండితుడు. 'అచ్యుతప్ప నాయకుని' అనంతరము 1614లో పట్టాభిషిక్తుడైన రఘునాథనాయకుడు నాయక రాజుల వంశమున మూడవ రాజు. ఈయన సకల విద్యాపారంగతులని ప్రతీతి. 'రఘునాథనాయకుని'కి అంకితముగా గోవింద దీక్షితులు 'సంగీతసుధానిధి' యను నొకలక్షణ గ్రంథమును రచించిరని వేంకటమఖి రచించిన చతుర్దండి ప్రకాశికలో వీణా ప్రకరణమున పేర్కొనబడినది.

1. సం. సం. ప్ర. మొ. భా. పుట - 4

తల్లక్షణంతు సంగీత సుధానిధి ప్రదృశ్యతే,

చెవ్వయాచ్యుత భూపాల రఘునాథ నృపాంకితే

అస్మత్తాతకృతే గ్రంథే ప్రోక్తాన్ శ్లోకాన్ లిఖామితాన్" [1]

గోవింద దీక్షితుల జ్యేష్ఠ పుత్రుడైన 'యజ్ఞనారాయణదీక్షితులు - 'సాహిత్యరత్నాకరము', 'రఘునాథ భూపతి విజయము', 'రఘునాథ విలాసము' అను నాటకములను రచించిరి. గోవింద దీక్షితులు మంత్రిగానున్న కాలంలో మహారాజుచే కుంభకోణమున షోడశలింగములను, అనేక దేవాలయములను పునరుద్ధరింపచేసిరి. కనిష్ఠపుత్రుడైన వేంకటమఖి అసలుపేరు వేంకటేశ్వర దీక్షితులు.

వేంకటమఖి తమ సోదరుడైన యజ్ఞనారాయణ దీక్షితుల వారి శిష్యులు. మరియు తండ్రి ఆజ్ఞచే ఔత్తరాహుడు, వాగ్గేయకారుడైన 'తానప్పాచార్యుల' వద్ద సంగీత శాస్త్ర లక్ష్య, లక్షణములను అభ్యసించిరి. వేంకటమఖి తమ గురువును గూర్చి "గంధర్వ జనతాఖర్వదుర్వార గర్వభంజనురే" అను 'ఆరభి' రాగగీతమునందు పేర్కొనిరి. అప్పయ్య దీక్షితుల వారి సహోదరుడైన అచ్చాదీక్షితుల పౌత్రుడైన నీలకంఠ దీక్షితులు, వేంకటేశ్వరదీక్షితుల (వేంకటమఖి) యొక్క శిష్యుడని గంగావతరణ కావ్యము నందు గలదు. క్రీ॥శ॥ 1638లో నీలకంఠ దీక్షితులు 'నీలకంఠ విజయము' అను గ్రంథమును రచించిరని తెలియుచున్నది.

రఘునాథ నాయకుని తరువాత అతని కుమారుడైన విజయరాఘవ భూపాలుడు సకల విద్యాపారంగతుడై చోళమండలమును పరిపాలించెను. 'విజయరాఘవ' భూపాలుని ప్రేరణచే వేంకటమఖి "చతుర్దండి ప్రకాశిక" అను లక్షణ గ్రంథమును రచించెను. వేంకటమఖి కర్ణాటక సంగీతమునకు అపారమైన సేవ చేయుటయేకాక 'వేంకటమఖి' సంప్రదాయమును ఏర్పరచిన ప్రత్యేక సంప్రదాయ ప్రవర్తకుడు. చతుర్దండి ప్రకాశిక యందు పది ప్రకరణములు కలవు.అవి వీణా, శ్రుతి, స్వర, మేళ, రాగ, ఆలాపన, ఠాయ, గీత, ప్రబంధ, తాళములు. అంతేకాక రాగాంగ, ఉపాంగ, భాషాంగ రాగములకు లక్షణములను శ్లోక రూపమున చెప్పిరి. మరియు గీతములలో, శుద్ధ, వికృతి భేదములను కూడ పేర్కొనిరి.

1. సం. సం. ప్ర. మొ. భా. పుట - 5

వేంకటమఖి 72 మేళకర్తల విభాగమును, కటపయాది సూత్రమునకు అనుకూలముగా నామములను కల్పించి 1660 నాటికి కర్ణాటక సంగీత లక్షణమును ఒక క్రమపద్ధతిలో ఏర్పరచిరి. ఈ 72 మేళకర్తల మూర్ఛనల ఆధారముగా శ్లోకములు, లక్షణ గీతములు రచించి కర్ణాటక సంగీతమునకు అపూర్వ సేవ చేసిరి.

శ్రీ వేంకటమఖి జయదేవుడు రచించిన గీతగోవిందము వలె శ్రీ త్యాగరాజుపై ఇరువది నాలుగు అష్టపదులు రచించినట్లు తెలియుచున్నది. వేంకటమఖి సేతుయాత్ర చేయునపుడు చోర బాధా పీడితులై లలితరాగమున "అరెనిబిడ కంటక దుష్ప్రవేశ" అను గీతము పాడిన వెంటనే శ్రీరామ లక్ష్మణులు కోదండపాణులై వచ్చి చోర బాధను తీర్చిరను ప్రతీతి కలదు. ఈ గీతము మాయామాళవగౌళ ఉపాంగరాగ వరుసలో నున్నది.

ఒక పర్యాయము విజయరాఘవ భూపాలుడు తన దేశస్థులందరును శంఖచక్ర ముద్రాంకితులై యుండవలెనని ఆజ్ఞాపించెనట. అప్పుడు వేంకటమఖి మధ్యార్జున క్షేత్రమున వెలయు మహాలింగమూర్తిని "శంఖచక్రాంకనత్యాచరేరే" అని రీతిగౌళలో ఒక గీతమును పాడి ప్రార్థించెను. వెంటనే మహారాజు ఉదర బాధచే పీడితుడై వేంకటమఖిని ప్రార్థించి తనదేశస్థుల వారివారి మతములోనే ఉండవలెనని ఆజ్ఞాపించిన మాత్రమున ఉదరబాధ తీరి సౌఖ్యముగా నుండెనను ఉదంతమొకటి కలదు.

## రామస్వామి దీక్షితులు

వేంకటమఖి సంప్రదాయమునకు చెందిన వారు శ్రీరామస్వామి దీక్షితులు. వీరి తల్లి భాగీరథమ్మ. తండ్రి వేంకటేశ్వర దీక్షితులు. కాశ్యపస గోత్రీకులు. రామ స్వామి దీక్షితులు క్రీ॥శ॥ 1735లో జన్మించిరి. వీరు ద్రావిడ బ్రాహ్మణులు ఆపస్తంబ సూత్రులు, ఔత్తరాహులు. క్రీ॥శ॥ 1742లో వేంకటేశ్వర దీక్షితులు విరించిపురము నుండి కావేరి ప్రాంతమున తంజావూరు మండలములోని గోవిందపురమునకు కుటుంబముతో వలస వెళ్ళెను. ఈ గోవిందపురాగ్రహారమును తంజావూరు నాయక రాజుల పరిపాలనలో ప్రధానమంత్రిగా ఉన్న గోవింద దీక్షితులు నిర్మించిరి. వీరు మహావిద్వాంసులే కాక సంగీత శాస్త్రజ్ఞులు కూడ. గోవింద దీక్షితులు "సంగీతసుధ" అను శాస్త్ర గ్రంథమును రచించిరి. గోవింద

దీక్షితుల కుమారుడు వేంకటమఖి.

రామస్వామి దీక్షితులు సంగీత లక్ష్య లక్షణవేత్త, వాగ్గేయకారుడు, సంస్కృతాంధ్రముల యందు బహుముఖ ప్రజ్ఞాశాలియైన వీరభద్రయ్య గారి వద్ద రెండు సంవత్సరములు సంగీతమునభ్యసించిరి. రామస్వామి దీక్షితులు విద్యాభివృద్ధికై "మయూరవము" వచ్చి శ్రీ వేంకటవైద్యనాథ దీక్షితుల వారి వద్ద ఒక సంవత్సరము విద్యనభ్యసించిరి. ఈ వేంకట వైద్యనాథ దీక్షితులు వేంకటమఖి మేనమామకు మనుమడు. ఆసమయమునందే రామస్వామి దీక్షితులు "చతుర్దండి ప్రకాశిక" లోని రాగాంగ, ఉపాంగ లక్షణములను గ్రహించి గుర్వనుగ్రహమును పొందిరి.

సంగీత శాస్త్రజ్ఞుడుగా కీర్తి గడించిన రామస్వామి దీక్షితులు తంజావూరు రాజు ఆదరమును పొందిరి. తంజావూరు సమీపమున తిరువారూరు గ్రామమున త్యాగరాజస్వామి దేవాలయమున నాద స్వర కచేరీలు జరిపించుటకు రామస్వామి దీక్షితులు నియమింపబడిరి. తిరువారూరులో నుండగ శ్రీ త్యాగరాజేశ్వరుడు ఒకనాటి రాత్రి స్వప్న దర్శనమొసగి ఉత్సవ సమయములలో ఏఏ వేళలలో ఏఏ రాగములనాలాపించవలయునో నిర్ణయింపుమని పలుకగా, రామస్వామి దీక్షితులు అచటనున్న నాదస్వర విద్వాంసులకు త్యాగరాజస్వామి అనతి ప్రకారము ఆయా రాగములను నిర్ణయించిరి. నాటి నుండి నేటికిని 'తిరువారూరు' నందు స్వామి సేవలు జరుగు సమయమున ఆయా రాగములనే నాదస్వర విద్వాంసులు వాయించుట ఆచారముగా నున్నది. రామస్వామి దీక్షితులు కనిపెట్టిన హంసధ్వని రాగము నేడు భారతదేశమందంతటను ప్రసిద్ధి పొందినది. ఈ రాగము ప్రణవ మంత్ర సాధనతో కుండలినీ శక్తిని జాగృత మొనర్చి మనలోగల మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా అను షట్ చక్రములను "హంసస్సోహం" అను నాదముతో బేధమొనర్చినపుడు సహస్రారమునందున్న పరమాత్మ స్వరూపమును దర్శించవచ్చును. ఈ సాధనచే ఆత్మ సాక్షాత్కృతి సిద్ధించుననునది యోగాశాస్త్ర నిష్కర్ష. ఈ సాధనాసంకేతమే హంసధ్వని రాగరూపము. ఈ 'హంసస్సోహం' అను ధ్వనియే హంసధ్వని అయినది.

రామస్వామి దీక్షితులవారు, పెక్కు కృతులను, వర్ణములను, దరువులను, కీర్తనలను, రాగమాలికలను రచించిరి. రామస్వామి దీక్షితులు 'తిరువారూరు' లోని కమలాంబా త్యాగరాజేశ్వరులను సేవించు సమయమున దర్శనార్థియై వచ్చిన 'అమరసింహ' మహారాజుపై రాగమాలికను రచించి, గానమొనర్చి వారిచే సన్మానితులైరి. ఒకనాడు తిరువారూరు శ్రీ త్యాగరాజేశ్వరుని దర్శనార్థము విచ్చేసిన 'ముద్దుకృష్ణ మొదలియార్' అను ప్రభువు రామస్వామి దీక్షితుల వారి యోగ్యతను గుర్తించి సన్మానించి సకుటుంబముగా 'మణలి' తీసికొనివెడలిరి. తరువాత ముద్దుకృష్ణ మొదలియార్ కుమారుడు వేంకట కృష్ణుడు అను చిన్నయా మొదలియార్ రామస్వామి దీక్షితులు రచించిన 108 రాగతాళ మాలికను విని వారికి కనకాభిషేకమొనర్చిరి. రామస్వామి దీక్షితులు చిదంబరనాథస్వామి యను యతీంద్రుని అనుగ్రహము వలన శ్రీ విద్య యందు పూర్ణాభిషిక్తులైరి. వీరు మీనాక్షిదేవిపై 44 రాగములతో రాగమాలికను రచించిరి. రీతిగౌళ, హిందోళ, మనోహరి, పూర్ణచంద్రిక రాగములలో చౌకవర్ణములను, శంకరాభరణరాగమున తానవర్ణమును రచించిరి. వీరి రచనలు "వేంకటకృష్ణ" అను ముద్రతోయున్నవి. వీరి రచనా వైశిష్ట్యము, భాషాసౌందర్యము ఆంధ్ర భాషా పాండిత్యమును తెలియజేయుటకు ఉదాహరణముగా తోడి రాగమునందలి చౌకవర్ణమును పేర్కొనవచ్చును.

రామస్వామి దీక్షితులకు చాలాకాలము వరకు సంతానము లేనందున భార్య సుబ్బమాంబతో వైద్యనాథ క్షేత్రములోని 'ముద్దు కుమారస్వామి' ని బాలాంబికను ఒక మండలము నవావరణ క్రమమున సేవించిరి. ఆ స్వామి అనుగ్రహమున క్రీ. శ. 1775 మన్మథనామ సంవత్సరమున ఆ పుణ్యదంపతులకు ఒక కుమారుడు జన్మించగా, వానికి 'ముద్దుస్వామి' అని నామకరణము చేసిరి. ఆ తరువాత వారికి కొంతకాలమునకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తెయు కలిగిరి. వారికి "చిన్నస్వామి, బాలస్వామి" 'బాలాంబ' అను పేర్లు పెట్టిరి. జ్యేష్ఠుడైన 'ముద్దుస్వామి' యే సంగీత త్రిమూర్తులలో నొకరైన 'ముత్తుస్వామి దీక్షితులు'.

రామస్వామి కుమారులలో ఒకరైన 'చిన్నస్వామి'కి దృష్టి దోషము కలుగగా రామస్వామి దీక్షితులు తిరుపతి వేంకటేశ్వరునిపై 'మనసా వేరితరుల దలచక' అని 43 రాగములలో మాలికను, "ఇంకా దయరాకున్న" అను "వేగవాహిని" రాగమున కృతిని రచించి, సేవించగా, చిన్నస్వామికి ఆ దోష నివృత్తియై చూపు వచ్చినదట. 'నేత్ర హీనాక్షిదాయినే నమః" అను వేంకటేశ్వర నామము కలదు. రామస్వామి దీక్షితులు వారు నిత్యము గీతగోవింద కావ్యమందలి అష్టపదులను గానము చేసెడివారట. అవసానకాలమాసన్నమైనదని తెలిసి రామస్వామి దీక్షితుల వారు సకుటుంబముగా తిరువారూరు చేరి క్రీ.శ. 1817 'ధాత' నామ సంవత్సర మాఘ కృష్ణ చతుర్దశి మహా శివరాత్రి దినమున శివ సాయుజ్యమును పొందిరి. మహా ప్రతిభాసంపన్నులు, లక్ష్య లక్షణ వేత్తయైన, వాగ్గేయకారకులు శ్రీ రామస్వామి దీక్షితులు.

★ ★ ★

# ద్వితీయాధ్యాయము

# ద్వితీయాధ్యాయము

## శ్రీ ముత్తు స్వామి దీక్షితుల వారి జీవిత చరిత్ర

కర్ణాటక సంగీత త్రిమూర్తులలో ఒకరైన శ్రీ ముత్తుస్వామి దీక్షితులు క్రీ.శ. 1775-1835 కాలమునకు చెందినవారు. వేంకటమఖి వంశీయులు. తండ్రి రామస్వామి దీక్షితులు. గురువు గారు వేంకట వైద్యనాథ దీక్షితులు. రామస్వామి దీక్షితులకు సంతానము లేనందున తన 40వ ఏట భార్యాసహితుడై వైద్యనాథ క్షేత్రమునకు వెళ్ళి అక్కడ ముత్తు కుమార స్వామిని భక్తితో సేవించగా అస్వామి వరప్రసాదమున 'కృత్తికా' నక్షత్రమున కుమారుడు జన్మించగా అతనికి ముద్దు కుమార స్వామి అని నామకరణము చేసిరి. వీరి జన్మవృత్తాంతము "భజరేరే చిత్త బాలాంబికాం" అను శాంతకల్యాణి రాగ కృతిలో

"సేవక జనపాలన గురు గుహ రూప ముద్దు కుమార జననీమ్", అని కలదు. "సుబ్రహ్మణ్యేన రక్షితోఽహం" అను శుద్ధ ధన్యాసి రాగ కృతిలో "కృత్తికాసుత శుద్ధధన్యేన" అని నక్షత్ర రాగనామములను మనోహరముగా ఇమిడ్చిరి.

శ్రీ ముత్తు స్వామి దీక్షితులు క్రీ.శ 1775 మన్మథనామ సంవత్సర ఫాల్గుణ మాసమున, కృత్తికా నక్షత్రమున (మార్చి 24వ తేది) రామస్వామి, సుబ్బలక్ష్మి అమ్మాళ్ దంపతులకు " ముద్దు కుమారస్వామి అనుగ్రహమున తిరువారూరులో జన్మించిరి. కృత్తికా నక్షత్రమునకు అగ్ని దేవత. కనుక అది వహ్ని నక్షత్రము.

శ్లో: తేజస్వీ నీతిమాంశ్చైవ బహుభుగ్ధన వల్లభః।

గంభీరః కుశలోమానీ వహ్ని నక్షత్రజ శ్శుచిః॥

అని జ్యోతిష్యశ్శాస్త్రము కృత్తికానక్షత్ర జాతకుల లక్షణములను వివరించుచున్నది. అనగా కృత్తికా నక్షత్రమున జన్మించిన వారు తేజోవంతులు, నీతివంతులు, తిండి పుష్టి కలవారు, ప్రజలకు ప్రీతిపాత్రులు, గంభీరులు, నేర్పరులు కాగలరని అర్థము.

ముద్దు కుమారస్వామి అను వీరి పేరు ముత్తుస్వామి దీక్షితులుగా మారుటకు ఒక కారణము కలదని చెప్పుదురు. "చిదంబరనాథస్వామి" అను సన్యాసి అనుగ్రహముచే

శ్రీవిద్యయందు పూర్ణాభిషిక్తుడైన రామస్వామి దీక్షితులు సంతానము కొఱకు వైదీశ్వరన్ గ్రామమునగల శ్రీబాలాంబికాదేవిని ఆగమోక్తముగా నవావరణ పూజలుచేయగా ఆదేవి స్వప్నమున ముత్యాలహారము ప్రసాదించెనట. తత్ఫలితము శ్రీదేవి సంతానము అనుగ్రహించుటగా భావించిరి. తమిళమున ముత్తు అనగా ముత్యమని యుండుటచేత 'ముత్తుస్వామి' అనియు, వీరి వంశీయులు శ్రీవిద్యా పూర్ణదీక్షాపరులగుట వలన దీక్షితులు అను నామము అనుస్యూతముగా వచ్చుటచే వీరికి ముత్తుస్వామి దీక్షితుల నామము స్థిరమైనది.

బాల్యము లోనే దీక్షితుల వారు కావ్య, నాటకాలంకార శాస్త్రములలోను మంత్ర, యోగ, జ్యోతిష్య, ఛందఃశాస్త్రములయందును పరిపూర్ణమైన కృషిచేసి విశేషపాండిత్యము నంపాదించిరి. మాతృభాషయైన తమిళమున విశేషపాండిత్యముతోపాటు, సంస్కృతాంధ్రములలో అపార పాండిత్యము సంపాదించిరి. సంస్కృత భాషలో పెక్కు కీర్తనలు రచించినను తెలుగు నందు కూడ రచనలు చేసిరి. మరి కొన్ని కీర్తనలలో సంస్కృత, ఆంధ్ర, తమిళ భాషలను కలిపి మణిప్రవాళ శైలిలో రచనలు గావించిరి.

దీక్షితులు తన సంగీత భక్తిభావావేశమును వెల్లడించుటకు మాతృభాషయైన తమిళమును కాదని, మాధుర్య ప్రవాహ రమణీయమైన, శ్రావ్యమైన తెలుగు భాషను గ్రహింపక, దివ్యగంభీరమైన సంస్కృత భాషనే తన కృతులకు స్వీకరించిరి. దీక్షితుల వారి కృతులలో ప్రత్యేకత వాటి యందున్న రాగసంచారముల యొక్క ఉత్కృష్టత సౌందర్య నిష్ఠమైయున్నది. వీరికృతులన్నియు దేవతా సంకీర్తనములగుటవలన, ఆయనకు కావలసిన ఉదాత్త సాహిత్య భావములకు నంస్కృతమున సౌలభ్యముండుట వలన వీరు ఎక్కువ కృతులు సంస్కృతములోనే రచించుటకు కారణమై ఉండవచ్చును.

దీక్షితుల వారు విద్యాభ్యాసము గురించి తండ్రి ప్రత్యేక శ్రద్ధవహించినట్లు విశదమగుచున్నది. దీక్షితులవారిచే సంగీత సాధన చేయించుటయేగాక నంగీత శాస్త్రమర్మములను రామస్వామి దీక్షితులు విశదీకరించిరి. ధీక్షితుల వారు గాత్రసంగీతము నందు మాత్రమేగాక వీణావాద్యము నందు నిష్ణాతులైరి. వేంకటమఖి నిర్మించిన కర్ణాటక సంగీత విధానము ధీక్షితులు సులభముగా గ్రహించి నిష్ణాతుడయ్యెను.

మద్రాసునకు ఉత్తరముగా నున్న మణలి జమిందారైన ముత్తుకృష్ణ మొదలియార్ రామస్వామి దీక్షితుల సంగీతమునకు ముగ్ధుడై తన ఆస్థాన సంగీత విద్వాంసునిగా నియమించి అమితముగ గౌరవించిరి. ముత్తుకృష్ణ మొదలియార్ కుమారుడైన వేంకటకృష్ణ మొదలియారు మదరాసు జార్జికోటలో ప్రభుత్వము నడుపుచున్న ఈస్టిండియా కంపెనీ వారికి ద్విభాషి. వేంకటకృష్ణ మొదలియారు అక్కడ ఆంగ్లేయుల బ్యాండు వాద్యమును వినుచుండుట వలన పాశ్చాత్యసంగీత స్వభావములు తెలిసికొని బాలురైన ముత్తుస్వామి దీక్షితులను వారి సోదరులను అక్కడకు తీసుకొని వచ్చి వారికి పాశ్చాత్య బ్యాండు సంగీతమును వినిపించెడివారు. అందువలన దీక్షితుల వారు కొన్ని పాశ్చాత్య సంగీతమర్మములను ఆకళింపు చేసుకొనగల్గిరి. 'కల్నల్ బ్రౌను' అను ఆంగ్లేయుని కోరికపై దీక్షితుల వారు కొన్ని ఆంగ్లపాటల బాణీల (ట్యూన్ల)కు సంస్కృత సాహిత్య శబ్దములనుకూర్చిరి. ఇవి నేటికిని సుమారు ఏబది లభించుచున్నవి. వానిలో ముఖ్యమైనది ఆంగ్ల జాతీయ గీతమునకు సంబంధించిన God save the King. దీనికి దీక్షితులవారు దేవీ పరముగా సంస్కృత సాహిత్య శబ్దములు కూర్చిరి.

"సతతం పాహిమాం సంగీత శ్యామలే సర్వాధారే।
జననీ చింతితార్థ ప్రదే చిద్రూపిణీ శివే।
శ్రీ గురుగుహ పూజిత శివ మోహాకారే।
సతతం పాహిమాం॥

పాశ్చాత్య సంగీత పరిచయము వలన పాశ్చాత్య సంగీత వాద్యమైన ఫిడేలును కర్ణాటక సంగీతమునకు ప్రక్కవాద్యముగా స్వీకరించి ఆవాద్యమునకు ప్రత్యేక స్థానము కల్పించినది దీక్షితుల కుటుంబము వారే. దీక్షితులవారి కనిష్ఠ సోదరుడైన బాలస్వామి దీక్షితులు సాధన చేసి దీక్షితుల వారి వీణావాదనముతో సమానముగా ఫిడేలు వాద్యమును వాయించగలిగిరి. ఆనాడు కర్ణాటక సంగీత వ్యవస్థలో స్థానమును కల్పించుకొన్న ఫిడేలు నేటికిని తని వాద్యముగా, ప్రక్క వాద్యముగా స్థిరపడినది.

వివాహానంతరము మణలి వచ్చి మొదలియార్‌చే ఆదరింపబడి యుండగా

మహాసిద్ధుడైన చిదంబర నాథ యోగి అచ్చటికి వచ్చి దీక్షితుల వారి వినయ విధేయతలకు, పాండిత్యగరిమకు మిక్కిలి సంతసించి దయతో శ్రీవిద్యా మహామంత్రమునుపదేశించిరి. వెంటనే దీక్షితులు యతీంద్రుని వెంట కాశీకి వెళ్ళి 5 సం॥లు మంత్ర పునశ్చరణ చేసికొనుటయేకాక అష్టమహాసిద్ధులను సంపాదించిరని ప్రతీతి. శ్రీ చిదంబరనాథయోగి దీక్షితులవారిచే శ్రీశంకరభగవత్పాదుల అద్వైత సిద్ధాంత గ్రంధములను శ్రవణము చేయించిరి. కాశీలో ఉండగా ముత్తుస్వామి దీక్షితులు హిందూస్థానీ సంగీతమును శ్రద్ధగావిని దానిలోని మెళుకువలను అవగాహన చేసికొనిరి. వారు 'బృందావన సారంగ' రాగమున రచించిన "రంగపుర విహార", "సౌందర రాజం", "స్వామినాథేన" కృతులలో హిందూస్థానీ బృందావన రాగ సంచారమే కలదు. ఇట్లు వారు రచించిన అనేక కృతులలో వారికున్న హిందుస్థానీ సంగీత జ్ఞానము వ్యక్తమగును. ఈయన వేంకటమఖి వంశీయుడగుటచే ఆయన మేళకర్త రాగ సంప్రదాయము ననుసరించి తన కీర్తనలను రచించిరి.

ఒకనాడు చిదంబరనాథయోగి కాశీలో అన్నపూర్ణాంబికా ఆలయమునకు దీక్షితుల వారిని తీసికొని వెళ్ళి, దేవికి పరిపూర్ణమైన అనుగ్రహము కలిగినదనియు, ఇహపరమునందు భుక్తి, ముక్తి నొసగి కాపాడగలదని, తుదకు మోక్షము కూడా నీయగలదనియు, బ్రతికియున్నంత కాలము ఆమెను పూజింపుమని చెప్పిరి. మరునాడు ప్రాతఃకాలమున శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారు గంగాస్నానమునకు బయలుదేరగా యోగీంద్రుడు "ముత్తుస్వామీ, మనము విడిపోవలసిన సమయమాసన్నమైనది. నీవు స్వస్థలమునకుపోయి తల్లిదండ్రులను సోదరులను చూడవలెనని" చెప్పిరి. దానికి దీక్షితుల వారు "ఈ ముక్తి క్షేత్రమున దేవతాదర్శనము చేసికొనుచు, తమ పాదసేవ చేయుచున్న నాకు మరేమియు జ్ఞాపకము వచ్చుట లేదని" సమాధానము చెప్పిరి. యోగీంద్రుడు "నీవు గంగానదిలో దిగినపుడు నాలుగైదు అడుగులు ముందుకు వేసి నీకు లభ్యమైన దానిని తీసుకురమ్ము" అని ఆనతిచ్చిరి.

దీక్షితుల వారికి గంగానదిలో ఒక వీణ లభించినదట! దానిపైన దేవనాగరిలో 'శ్రీరామ' అని వ్రాసియున్నదట! దాని యాళిముఖము పైకితిరిగియున్నది. దీక్షితులవారు

దానిని తెచ్చి యోగీంద్రునికి సమర్పించిరి. యోగీంద్రుడా వీణను తన ఆశీస్సులతో మరల అతనికి అనుగ్రహించి "ఇది నీకు గంగాదేవి అనుగ్రహించిన ప్రసాదము. నీవు గొప్ప వాగ్గేయకారుడవు, వైణికుడవు కాగలవు" అని వాక్రుచ్చిరి. గురువుగారి ఆ అనుగ్రహభాషణమే వారి అంతిమపలుకులైనవట! వెంటనే చిదంబరనాథయోగి గంగానదిలో మునిగి ప్రాణత్యాగము చేసినారట. ఆయన దేహమును ఇతరుల సహాయముతో బయటకు తీసికొని వచ్చి హనుమాన్ ఘట్టమున దీక్షితుల వారు సమాధి చేసిరి. గురువియోగ దుఃఖములో కాశీనుండి మణలి చేరుసరికి దీక్షితుల వారి కుటుంబము వారు తిరిగి తిరువారూరు చేరిరి. ఈ వర ప్రసాదమైన వీణ నేటికిని తిరువారూరున దీక్షితుల వారి మంటపమున ఉన్నది.

మార్గమధ్యమున తిరుత్తణి వెళ్ళి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధిలో సుబ్రహ్మణ్యషడాక్షరీ మంత్రావృత్తి చేసికొనుచుండగా చెంగల్వ రాయుడనబడు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడు ఒక మహాపురుషుని రూపములో దర్శనమిచ్చి నోటిలో కండ చక్కెరను వేసి అంతర్ధానమయిన ఉదంతమొకటి ప్రసిద్ధమైనది. దైవానుగ్రహము వలన దీక్షితుల వారు ఆశువుగా "శ్రీనాథాది గురుగుహోజయతి జయతి" అను మొట్టమొదటి కృతిని 'మాయామాళవగౌళ' రాగములో ఆదితాళములో ప్రధమావిభక్త్యంతముగా సంస్కృతములో రచించిరి.

అంత ముత్తు స్వామి దీక్షితులు శ్రీవల్లీ దేవసేన సమేతుడైన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి అనుగ్రహము, గుర్వనుగ్రహము కల్గినందుకు ఆనందించి 'గురుగుహ' ముద్రతో అనేక కృతులను రచించిరి. ఈ తొమ్మిది కృతుల వర్గమునకు 'గురుగుహకృతులని', 'తిరుత్తణికృతు' లని పేరు వచ్చినవి. ఈ కీర్తనలలో 1. "శ్రీనాథాది గురుగుహోజయతి జయతి", (మాయామాళవగౌళ రాగమున) 2. "మానస గురుగుహరూపం భజరే రే" (ఆనందభైరవిరాగమున) 3. "శ్రీగురుగుహస్యదాసోహంనోచేత్" (రాగంపూర్వీ) 4. "శ్రీగురుణాపాలితోస్మి" (పాడి రాగమున) 5. "గురుగుహాయభక్తాను గ్రహాయ" (సామరాగమున) 6. "గురుగుహాదన్యం" (బలహంసరాగమున) 7. "గురుగుహస్వామి భక్తింకరోమి" (భానుమతి రాగమున) 8. "శ్రీ గురుగుహమూర్తే చిచ్ఛక్తి స్ఫూర్తే" (ఉదయరవి

చంద్రిక రాగమున) 9. ''శ్రీగురుగుహ తారయాశుమాం" (దేవక్రియ / శుద్ధసావేరి రాగమున) రచించిరి. ఈ కృతులలోని పూర్వీ, పాడి, ఉదయరవి చంద్రికరాగములకు ఈ కృతులే ఆధారములుగా ఉన్నవి. భానుమతి రాగము అపూర్వరాగము మరియు వివాదిమేళమునకు చెందినది.

ఈ కృతులు రచించు నాటికి దీక్షితుల వారికి 25 సంవత్సరములు. వీనిలో మొదటి ఎనిమిది కృతులు ఒక్కొక్క విభక్తియందు ఒక్కొక్క కృతిని రచించిరి. తెలుగు భాషలో ఉదాహరణ కావ్యములందు ఇట్టి ప్రక్రియ ప్రసిద్ధమైనదే. తెలుగు సాహిత్యములో పాండిత్యముగలిగిన శ్రీముత్తుస్వామి దీక్షితుల వారు తెలుగు ఉదాహరణ కావ్య శిల్పమును అనుకరించిరి. ఉదాహరణకావ్యము అనగా భాషయందుకల సప్త విభక్తులను, సంబోధన విభక్తిని ఉదహరించుచు స్తుతి రూపమున ఉండుకృతి. ఉదాహరణ కావ్యముల వివరణము "ఆంధ్ర సాహిత్య చరిత్రం" పింగళి లక్ష్మీకాంతం గారు రచించిన త్రిపురాంత కోదాహరణములో పుట సంఖ్య 49 నందు కలదు.

తిరుత్తణికి ఏభై (50) మైళ్ళ దూరములో నున్న తిరుపతి చేరి శ్రీవేంకటేశ్వరునిపై 'కాఫీరాగమున' ''వేంకటా చలపతే నిన్ను నమ్మితి" యని మణి ప్రవాళశైలిలో కృతిని తెలుగు, తమిళ, సంస్కృత భాషాపదములతో రచించి ఆదైవమును కీర్తించిరి.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు చరిత్ర బట్టివీరికి చిన్నతనములోనే వివాహము జరిగినదనియు, వీరికి ఇద్దరు భార్యలున్నట్లు తెలియుచున్నది. పెద్దభార్యకు ఒక కుమార్తె కలదు. చిన్న భార్యకు సంతానము లేదు. వీరికి పురుష సంతానము లేదు. వీరికి ఇరువురు భార్యలున్నప్పటికి గృహస్థ జీవితమునందు కాలమును గడుపక తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రములు సందర్శించి నిష్కామయోగిగా జీవితమును చివరివఱకు గడిపిరి. తాను సందర్శించిన ప్రతిక్షేత్రములో నున్న దేవతా మూర్తులను కీర్తించుచు కృతులను గానము చేసి తన జీవితమును సార్థకము చేసికొనిరి. దీక్షితుల వారు అద్వైత సిద్ధాంత భావమును

ఆకళింపు చేసికొనుటవలన శైవ, వైష్ణవ, శాక్తేయ, సౌర, దేవీ, సుబ్రహ్మణ్య గణాధిదేవతల భేదము లేక సమస్త దేవతలపై కృతులను రచించిరి.

శ్లో॥ ఆకాశాత్పతితం తోయం యధాగచ్ఛతి సాగరం।

సర్వదేవ నమస్కారః కేశవం ప్రతి గచ్ఛతి॥

అనునట్లు యదార్థ తత్త్వమును తెలిసిన మహాత్ములకు సర్వము బ్రహ్మమయముగా గోచరించును. దీక్షితుల వారు అటువంటి సిద్ధపురుషులు. దీక్షితులవారు విష్ణీశ భేదమెరుగని అద్వైతి, స్మార్త సంప్రదాయస్థులు. శ్రీ ముత్తు స్వామి దీక్షితులవారి కీర్తనలు భక్తి, జ్ఞాన వైరాగ్య, భావసమ్మేళనములతో సుందరముగా నుండును.

తిరుపతి నుండి దీక్షితులవారు శ్రీకాళహస్తి క్షేత్రమునకు వెళ్లిరి. దక్షిణ కాశీక్షేత్రముగా ప్రసిద్ధినొందిన శైవ క్షేత్రమున శ్రీకాళహస్తి. ఇచట స్వామి వాయులింగ రూపమున విలసిల్లిన శంకరుడు. ఈ క్షేత్రనామముతోనే ''హంసేని'' రాగమున ''శ్రీకాళహస్తీశ శ్రితజనావన'' అని స్వామిని స్తుతించుకృతిని రచించిగానము చేసిరి. వీరు పంచభూతలింగస్థల కృతులు ఐదింటిని రచించిరి. వానిలో శ్రీకాళహస్తి ఒకటి. 2. చిదంబర క్షేత్రమును దర్శించినప్పుడు నటరాజ రూపమున శివకామ సుందరీ సమేతుడైన సదాశివునిపై 'కేదార' రాగములో ''ఆనంద నటన ప్రకాశం'' అనేకృతిని గానం చేసిరి. చిదంబరములోని శివలింగము ఆకాశలింగము. 3. తిరువణ్ణామలైలోని అరుణా చలేశ్వరుడు తేజోలింగము. అరుణాచల క్షేత్రమున తేజోమయలింగరూపములో అపీత కుచాంబాసమేతుడైన ఆస్వామిని దర్శించి 'సారంగ' రాగములో ''అరుణాచలనాథంస్మరామి'' అనుకృతియందు పల్లవిలోనే క్షేత్రనామమును, చరణములో 'తేజోమయలింగనామమును'నిమిడ్చి రచించిరి. 4. శ్రీరంగక్షేత్రమునకు మైలుదూరములో జంబుకేశ్వర క్షేత్రములోని లింగము ఆపోలింగము. దీక్షితుల వారు ఆక్షేత్రమును దర్శించి జలలింగ రూపమున వెలసిన శివునిపై "జంబూపతేమాంపాహి" అని 'యమునాకల్యాణి' రాగములో కృతిని రచించిరి. 5. కాంచీపురమున వేంచేసి యున్న శంకరుడు పృథ్వీ లింగము. ఏకామ్రేశ్వర నామముతో 'పృథ్వీ' లింగ రూపమున ఉన్న శంకరుని దీక్షితుల

వారు దర్శించి ఆ స్వామి పై 'భైరవి' రాగమున "చింతయ మాకంద" అను కృతిని రచించిరి. ఈకృతి యందు 'భైరవి' రాగనామమును 'పృథ్వీలింగం' అను వానిని చరణము తరువాత మధ్యమకాల సాహిత్యములో ఇమిడ్చిరి. పై విధముగా ఆకాశాది పంచ భూతముల ప్రత్యేకాంశములతో పంచలింగ క్షేత్రములపై కృతులు రచించిరి.

కొంతకాలము శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు కాంచీపురములో నివసించుట జరిగినది. ఆ సమయమున ప్రతినిత్యము ఏకామ్రేశ్వర, కామాక్షి దేవిని సందర్శించుచు పదిహేడు (17) కృతులను రచించిరి. పూర్వీకళ్యాణిరాగములోని "ఏకామ్రనాథం భజేహం' ' - హిందోళరాగములో "నీరజాక్షి కామాక్షి" - కమలామనోహరి రాగములో 'కంజదళాయతాక్షి' మొదలగునవి. మరియు కంచి లోని కైలాసనాథేశ్వరునిపై 'కైలాసనాథం' వేగవాహినిరాగమున "కైలాస నాథేన" యని కాంభోజిరాగ కృతులలో కీర్తించిరి. విష్ణుకంచి యందలి వరదరాజ స్వామిని సేవించి సారంగ రాగమున "వరదరాజముపాస్మహే" యను కృతిని రచించిరి. ఇంకను దీక్షితుల వారు పెక్కు కీర్తనలతో ఆయనను స్తుతించిరి. ఆకాలములోనే కాంచీపురమున ఉపనిషద్బ్రహ్మేంద్ర సరస్వతియను గొప్ప విద్వాంసుడు ఉపనిషద్వ్యాఖ్యానములు రచించెను. ఆయన శ్రీరామచంద్రుని పై 'రామాష్టపది' అను సంగీత రూపకమును రచించెను. ఈ ఉపనిషద్బ్రహ్మేంద్రస్వామి వద్ద దీక్షితుల వారు వేదాంత గ్రంథాధ్యయనము సలిపిరని తెలియవచ్చుచున్నది. వీరి కోరికపై దీక్షితుల వారు 'రామాష్టపది'కి రాగతాళాదులను నిర్ణయించిరి. ఉపనిషద్బ్రహ్మేంద్రస్వామి వేదాంత గ్రంథములు ప్రవచించుట మాత్రమే కాక దీక్షితుల వారికి రామభక్తిని కలిగించిరి. ఈ ప్రభావము దీక్షితుల వారు శ్రీరామునిపై రచించిన కృతులలో ప్రస్ఫుటముగా గోచరించుచున్నది. "రామ చంద్రేణసంరక్షితోహం" అను 'మాంజి' రాగమునందలి కృతియందు శ్రీరాముడు త్రిమూర్తుల సమష్టిరూపమని వర్ణించిరి. శ్రీరాముడే పరబ్రహ్మమని శివాదులు చెప్పినట్లు "మామవరఘువీర" అను 'మాహురి' రాగకృతి యందు వర్ణించిరి 'రామచంద్రం భావయామి' అను వసంత రాగములోని కృతిలో శ్రీరాముడు రఘుకుల తిలకుడని కీర్తించిరి. మరియు 'మాహురి' రాగకృతియందు పండిత పామర పావనకర నామధేయుడని గురుగుహసుతుడని దీక్షితులవారు

శ్రీరాముని అనేక విధములుగా స్తుతించిరి.

ముత్తుస్వామి దీక్షితుల వారు ''వైదీశ్వరన్" కోవెలను దర్శించి అచటనున్న వైద్యనాథ, బాలాంబికా, ముత్తుకుమార స్వాములపై పెక్కు కృతులను రచించి గానము చేసిరి. వానిలో "భజరేరే చిత్త బాలాంబికాం" అను 'కల్యాణి' రాగమున కృతి ''శ్రీవైద్యనాథం' ' అను 'అఠాణా' రాగమున కృతి, ముత్తు కుమార స్వామిపై ''కుమారస్వామినం" అను 'ఆసావేరి' రాగమున కృతి, ''శ్రీసుబ్రహ్మణ్యాయ నమస్తే" అను 'కాంభోజి' రాగమున కృతి, ''శ్రీవల్లీపతే పాహిమాం" అను 'నాగస్వరావళి' రాగమున కృతి మొదలగునవి బహుళ ప్రచారములోనున్నవి.

దీక్షితుల వారు ''వైదీశ్వరన్" నుండి మయూరమునకు వెళ్లి కొన్ని మాసములు నివసించి అతి పురాతన శివాలయమును సందర్శించి తదధిష్ఠాన దేవతలైన శ్రీమయూరనాథస్వామి, అభయాంబ దేవతలపై అనేక కృతులను రచించి గానము చేసిరి. అభయాంబదేవిపై రచించిన తొమ్మిది కృతులను ''అభయాంబా నవావరణకృతులు" అందురు. ఈ కృతులు వరుసగా ప్రథమా, ద్వితీయ, తృతీయ, చతుర్థీ, పంచమి, షష్ఠీ, సప్తమి, సంభోధన ప్రధమావిభక్తులలో ఎనిమిది కృతులను, మంగళహారతిగా పాడవలసిన ముగింపు కృతి తొమ్మిదవదిగా రచించిరి. ఈ కృతులలో రాగ ప్రస్తారవిశేషమేగాక తాంత్రిక విషయములను కూడా పేర్కొనిరి. "అభయాంబికాయాః - అభయాంబికాయాః" అను 'కేదార' రాగములోని షష్ఠీవిభక్తి కృతియందు కుండలినీ శక్తిని గురించి పేర్కొనిరి. మంగళహారతి కృతియైన ''శ్రీ అభయాంబనిన్ను" అను 'శ్రీ' రాగములోని కృతి మణిప్రవాళ శైలి యందున్న కృతులలో ముఖ్యమైనది. ఈ కృతిలో పల్లవి తెలుగు భాషలో రచించిరి. సంస్కృత, తమిళ భాషలు కూడా తరువాత వచ్చినవి.

మయూరము నుండి దీక్షితుల వారు తిరువారూరు చేరి స్వగృహమున స్థిరపడిరి. తిరువారూరును కమలాపురము, శ్రీపురమని కూడ పిలుతురు. తిరువారూరు సంగీత త్రిమూర్తుల జన్మస్థానము. తిరువారూరు క్షేత్రమున శివుని నామము శ్రీత్యాగరాజేశ్వరుడు. జగదంబ నీలోత్పలాంబ. శాక్తేయ సంప్రదాయానుసారము యోగినీస్వరూపములో గల

శ్రీకమలాంబపై నవావరణ కృతుల పదకొండు, శ్రీ నీలోత్పలాంబ నవావరణకృతులు తొమ్మిది రచించిరి. ఈ నీలోత్పలాంబ కృతులను 'గౌళవర్గరాగ' కృతులని అందురు. ఈ ఆలయమున వేరు వేరు నామములతో తాంత్రిక పూజా పద్ధతులతో ఆగమ సంప్రదాయానుసారము భిన్న భిన్న మంత్రములతో ప్రతిష్ఠించబడిన షోడశగణప్రతులపై ఆగమ శాస్త్ర నిష్ణాతుడైన దీక్షితుల వారు షోడశ గణపతి కృతులను రచించిరి. ఇందు ఏకవింశతి గణపతులు కూడా ముఖ్యమైనవి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పైన, అచటగల

1. సదాచలేశ్వర 2. హటకేశ్వర 3. వల్మీకలింగేశ్వర 4.ఆనందేశ్వర 5. సిద్ధేశ్వరులను ఐదు ప్రసిద్ధ శివాలయములలోని శంకరునిపైన దీక్షితుల వారు అనేక కృతులు రచించిరి. ఈ రచనలన్నియు దీక్షితుల వారి పాండితీ ప్రతిభకు నికషోపలములు.

'శ్రీకమలాంబా నవావరణకీర్తనలు"-కర్ణాటక సంగీత సామ్రాజ్యము నందు అత్యంత ప్రముఖ స్థానమునలంకరించినవి. ఈ కీర్తనలలో శ్రీచక్రస్వరూప వర్ణన, మంత్రయంత్ర తంత్ర రహస్య గర్భితములగుటయేకాక అనేక సాంకేతిక వివరములను సైతము మనకందించుచున్నవి.

దీక్షితులవారు గణపతిపై రచించిన కృతులలో 'హంసధ్వని' రాగమున "వాతాపిగణపతిం" అను కృతియు, 'గౌళ' రాగమున "శ్రీమహాగణపతి రవతుమాం". పంచముఖ గణపతిపై వ్రాసిన 'మలహరి' రాగమునందలి "పంచమాతంగముఖ గణపతి నా", అనుకృతియు, శ్రీరాగమున "శ్రీమూలాధార చక్రవినాయక" అను కృతియు మిక్కిలి ప్రసిద్ధమైనవి.

శ్రీముత్తుస్వామి దీక్షితులు రాజసన్మానములను, కనకాభిషేకములు పొందినను ధనార్జనయందు ఆసక్తి లేని వారు అనునిత్యము రచనలు చేయుచు, శిష్యులకు విద్య నేర్పుచు, తీర్థయాత్రలతోనే జీవితమును గడిపిరి. దీనికి నిదర్శనముగా వీరి జీవితము నందలి యదార్థ సంఘటనలు చరిత్రకెక్కినవి.

ఒకనాడు దీక్షితుల వారి ఇంటిలో వంటపదార్థములన్నియు నిండుకొనినవట! దైన్యతతో దీక్షితుల వారికావిషయము చెప్పుటకు ఆయన భార్యలు భయపడి శిష్యులలో

దేవదాసి యైన 'కమలమ్మ'ను పిలిచి "సాయము చేయగలవా!" అని అడిగిరట!. "నా ఆభరణములను అమ్మి నా గురుస్వాములకు బాధకలుగకుండా సేవించు కొందును" అని సమాధానము చెప్పి బయటకు వచ్చుచున్న కమలమ్మ మాటలు సంగీత పాఠములను నేర్పుచున్న దీక్షితుల వారికి వినిపించినవి. ఆయన "కమలా! మమ్ము జీవితాంతము పోషించు భారము నీవు వహింపగలవా? అందరిని భరింపవలసిన వాడు భగవంతుడు. నాహృదయమున నిజమైన భగవద్భక్తియున్నదేనినన్నాయన విస్మరింపడు. నీ ఆభరణములను నాకైవినియోగించు దురవస్థ నాకు రానీయకు"అని చెప్పిరి. వెంటనే శ్రీత్యాగరాజేశ్వరుని దేవాలయమునకు వెళ్ళి "త్యాగరాజం భజరే చిత్త - తాపత్రయం త్యజరే రేచిత్త" అను "యదుకుల కాంభోజి" రాగమున కృతిని గానము చేసి తిరిగి గృహమునకు చేరునప్పటికి రెండు బండ్లతో సామగ్రి వారి ఇల్లు చేరి యుండెను. విచారించగా తెలిసిన విషయము ఒక రాజోద్యోగి తిరువారూరు మకాము వచ్చునని అవస్తు సంభారమును సత్రాధికారి సమకూర్చి పెట్టిరి. రాజోద్యోగి వచ్చుట లేదని కబురు తెలిసిన సత్రాధికారి ఆ వస్తు సామగ్రిని శ్రీ దీక్షితుల వారి యింటికి పంపిన సద్వినియోగమగునని తలచి అవిధముగా చేసిరి. ఆ విషయము తెలిసిన దీక్షితుల వారు ఆనందపారవశ్యమున దైవలీలలను గుర్తించి "త్యాగరాజేన సంరక్షితోఽహం" అని 'సాళగ భైరవి' రాగములో కృతిని రచించి కృతజ్ఞతతో గానము చేసిరి. దీక్షితుల వారు శ్రీ త్యాగ రాజ స్వామిపై పదమూడు కృతులు రచించిరి. పైన పేర్కొనిన రెండు కృతులేకాక 'ఆనందభైరవి' రాగములో "త్యాగరాజ యోగవైభవం' ' అను కృతిలో తాళ దశప్రాణములలో తొమ్మిదవ ప్రాణమైన యతి ప్రాణము నందు పేర్కొనబడిన గోపుచ్ఛయతి, స్రోతోవహయతులతో అత్యంత రమణీయముగా రచించిన కృతులు సుప్రసిద్ధములైనవి.

శిష్యురాలు దేవదాసి కమలమ్మ భరత నాట్యమున అరంగేట్రం, చేయుటకై క్రొత్తపాటలు కావలెనని కోరగా త్యాగరాజ స్వామిపై "రూపముజూచి" అను పదవర్ణమును 'తోడి' రాగ మున, "నీ సాటిదైవ మెందులేడని" అను దరువును "శ్రీరంజని" రాగమున రచించి యిచ్చిరి. ఈ రెండును తెలుగు భాషలోనే ఉన్నవి. ఈ కృతులను వినిన తంజావూరు

సోదరులని పేరుగాంచిన వడివేలు, పొన్నయ్య వారి సోదరులు చిన్నయ్య, శివానందం దీక్షితుల వారిని దర్శించి తమను శిష్యులుగా స్వీకరించి, తంజావూరు వచ్చి నివసింపుడని కోరిరి.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి శిష్యుడైన "శుద్ధమర్ధళంతంబియప్ప" శూల నొప్పితో బాధపడుచుండెను. వైద్యమునకు నయముకాలేదు. జ్యోతిష్కులు గురు, శని గ్రహచారములు బాగుండలేదని చెప్పిన మాటలను దీక్షితుల వారికి చెప్పగా గురు గ్రహముపై 'బృహస్పతే' అను కృతి "అఠాణ"రాగమున, శని గ్రహముపై "దివాకరతనూజం" అను కృతి "యదుకులకాంభోజి" రాగమున రచించి అతనికినేర్పి, ప్రతినిత్యము ఆ కృతులను గానము చేయుమనిరి. అతడు అప్రకారము చేయగా శూలనొప్పి పోయి ఆరోగ్యవంతుడైన ఐతిహ్యమొకటి వినవచ్చుచున్నది. తరువాత శ్రీ దీక్షితులవారు మిగిలిన గ్రహములపై కృతులను రచించిరి. ఈనవగ్రహ కృతులలో మొదటి ఏడును సప్తతాళములలో రచించిరి. సప్తస్వరములవలె కర్ణాటక సంగీతము నందు సప్తతాళములు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకొన్నవి. ధృవ, మఠ్య, రూపక, ఝంపె, త్రిపుట, అట, ఏక తాళములకు సప్తతాళములని, శూలాది తాళములనిపేరు. ఈకీర్తనల పల్లవిలో గ్రహముద్ర యున్నది.

1. సూర్యగ్రహమును గురించిన - కీర్తన -
   'సూర్యమూర్తే' - సౌరాష్ట్రరాగము - ధృవతాళము.
2. చంద్ర గ్రహమును గురించిన - కీర్తన -
   'చంద్రంభజ' - అసావేరిరాగము - మఠ్యతాళము
3. కుజగ్రహమును గురించిన కీర్తన -
   'అంగారకం' - సురటి రాగము - రూపకతాళము
4. బుధ గ్రహమున గురించిన - కీర్తన-
   'బుధ మాశ్రయామి' - నాటకురంజి రాగమున - ఝంపె తాళము
5. గురు గ్రహమున గురించిన కీర్తన -
   'బృహస్పతే' - అఠాణరాగమున - త్రిపుటతాళము

6. శుక్ర గ్రహమును గురించిన కీర్తన -

'శ్రీ శుక్ర భగవంతం' - ఫరజూరాగమున - అటతాళము

7. శని గ్రహమును గురించిన కీర్తన -

'దివాకరతనూజం' - యదుకుల కాంభోజిరాగమున - ఏకతాళము

8. రాహుగ్రహమును గురించిన కీర్తన

'స్మరామ్యహం' - రామమనోహరి రాగమున - రూపకతాళము

9. కేతు గ్రహమును గురించిన కీర్తన -

'మహాసూరం' - చామర రాగమున - రూపకతాళము.

ముత్తుస్వామి దీక్షితులవారు తిరువారూరులో నివసించుచున్న కాలంలోనే దక్షిణ భారత దేశమున శ్రీ సుబ్రహ్మణ్యస్వామి యొక్క ముఖ్యమైన ఆరుక్షేత్రములలో ఒకటైన స్వామి మలై క్షేత్రము దర్శించి పెక్కుకృతులను రచించిరి. ఆ కృతులలో ''స్వామినాథ'' అను నాటరాగములోని కృతియు, ''బిలహరి'' రాగమున ''శ్రీబాలసుబ్రహ్మణ్య'' అను కృతియు ప్రసిద్ధి చెందిన కృతులు. తిరువారూరు నందున్న కాలములోనే దీక్షితుల వారు మన్నారుగుడి, నాగపట్టణము, తిరుచునాపల్లి మొదలగు క్షేత్రములకు తీర్థయాత్రలుచేసి అక్కడ ఉన్న దేవతామూర్తులపై అనేక కృతులను రచించి గానముచేసిరి.

మన్నారుగుడిలో ప్రసిద్ధమైన శ్రీకృష్ణదేవాలయము కలదు. ఆస్వామి రాజగోపాలుడు ఆయన శ్రీవిద్యారాజగోపాలునిగ ప్రసిద్ధుడు. తాంత్రికముగా శ్రీదేవి అర్చనా విధానమైన శ్రీవిద్యరాజగోపాలునికి సమన్వయించుట ప్రత్యేకమైన విషయము. ఆస్వామిపై దీక్షితులవారు అనేక కృతులు రచించిరి. వానిలో ''సావేరి'' రాగమున 'శ్రీరాజగోపాల' అనుకృతి ''జగన్మోహిని'' రాగమున ''శ్రీవిద్యారాజగోపాల'' అనుకృతులు ప్రచారములో ఉన్నవి.

తిరుచునాపల్లిలో జంబుకేశ్వరము పంచలింగ క్షేత్రములలో ఒకటి. అక్కడనున్న లింగం అపోలింగము. ఆ స్వామిని స్తుతించుచు ''జంబూపతే''అను కృతిని

4

'యమునాకల్యాణి రాగమున రచించి గానము చేసిరి. అమ్మవారిపై బేగడ రాగమున "శ్రీమాతశ్శివే" అను కృతిని రచించిరి. శ్రీ మాతృభూతేశ్వరునిపై "కన్నడ" రాగములో "శ్రీమాతృభూతం" అను కృతిని రచించిరి. శ్రీరంగమును సందర్శించి అచటనున్న శ్రీరంగనాథ, శ్రీరంగనాయికి దేవతలపై రచించిన కృతులలో "నాయకి" రాగమున " రంగనాయకం" అను కృతియు, మంగళకైశికి రాగమున "శ్రీభార్గవి" అను కృతులు ముఖ్యమైనవి. దీక్షితులవారు కావేరీ తీర్థక్షేత్రములను దర్శించి ఆయాదేవతలపై అనేక కృతులు రచించిరి. అందు విశేష ప్రచారమున్నకీర్తనలు - "ముఖారి" రాగమున "పాహిమాం రత్నాచలనాయక" అనుకృతియు, "కేదారగౌళ" రాగమున "నీలకంఠంభజే' ' అనునవి.

తిరువారూరు సమీపమునగల కేవళూరు క్షేత్రముననున్న అక్షయలింగ స్వామిని దర్శించుటకు దీక్షితులవారు వెడలిరి. దీక్షితులవారు ఆలయము చేరుసరికి నిత్యపూజ పూర్తియై అర్చకులు గుడి తలుపులుమూసి వెళ్లుచుండిరి. శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారు పూజారితో "అయ్యా! తిరువారూరు నుండి స్వామి దర్శనార్థియై వచ్చితిని, దయచేసి తలుపుతెరచి నాకు స్వామి దర్శనము లభింపచేయుము" అని కోరగా అర్చకుడు "స్వామి ఎక్కడకు పోడు రేపు దర్శనము చేయవచ్చును" అని చెప్పగా దీక్షితులవారు ముఖమంటపమునందు కూర్చొని "అక్షయలింగవిభో... స్వయంభో" అను కృతిని శంకరాభరణ రాగమున ఆశువుగా రచించి గానము చేసిరి. కృతిపాడుట పూర్తికాగానే అందరూ చూచుచుండగా ఆలయ తలుపులు తెఱచుకొని స్వామిదర్శనమైనది. అర్చకుడు పశ్చాత్తప్తుడై క్షమాపణ వేడెను. దీక్షితులవారు పూజారిని మన్నించి స్వామి దర్శనమును తృప్తిగా చేసికొని స్వగ్రామమునకు తిరిగివచ్చిరి.

తిరువారూరు సమీపమున గల కుళిక్కరై గ్రామ మిరాశిదారుడైన వైద్యలింగ మొదలియార్ దీక్షితుల వారి ప్రతిభాపాటవములను విని తమ గ్రామమునకు ఆహ్వానించిరి. దీక్షితులవారు అచటనున్న కాశీవిశ్వేశ్వర, విశాలాక్షి, అన్నపూర్ణ కాలభైరవులపై కృతులు రచించి గానము చేసిరి. అవి విని మొదలియార్ దీక్షితులవారికి కనకాభిషేకము చేసి

తనపై ఒక కృతిని రచింపుమనిరి. మానవులను కీర్తించుటకు ఇష్టపడని దీక్షితులవారు పదునాలుగు రాగములతో ''శ్రీవిశ్వనాథం" అను మాలికను కూర్చి మొదలియార్ తృప్తికై "వైద్యలింగ భూపాల రక్షక" అని కూర్చి గానము చేసిరి. క్రీ.శ 1827లో శ్రీముత్తుస్వామి దీక్షితులవారి తల్లిదండ్రులు స్వర్గస్థులైరి. తన సోదరులైన చిన్నస్వామి, బాలస్వాములను కొందరి పెద్దల కోరికపై మధురలో నివసించుటకు పంపిరి. తంజావూరు సోదరులు మరల ప్రార్థింపగా వారి కోరికపై దీక్షితులవారు తంజావూరులో నివాసముండిరి.

తంజావూరు నందున్న కాలములో దీక్షితులవారు తఱచు శ్యామశాస్త్రివారిని కలుసుకొను చుండిరి. వారి ఇరువురకు ధృడమైన స్నేహమేర్పడినది. శ్రీ శ్యామశాస్త్రివారి కుమారుడు శ్రీ సుబ్బరాయశాస్త్రి దీక్షితులవారి శిష్యుడై సంగీతమునభ్యసించిరి. తండ్రియైన శ్రీరామస్వామి దీక్షితులవారు రచించిన 'శ్రీరంజని' రాగములో ''స్వామి నిన్నుకోరి" అను చౌకవర్ణము యొక్క చరణము నశించగా దాని ద్వితీయావృత్తము శ్యామశాస్త్రియు, తృతీయా వృత్తమును దీక్షితులు, చతుర్థమును చిన్నస్వామి రచించిరని ప్రతీతి. తంజావూరునందు వేంచేసియున్న బృహధీశ్వర, బృహన్నాయాకిపై సుమారు ఇరవై(20) కీర్తనలు రచించి గానము చేసిరి. దీక్షితులవారు "శ్రీసూక్త" భావముతో 'లలిత' రాగమున ''హిరణ్మయీం లక్ష్మీసదాభజామి. హీనమానవాశ్రయంత్యజామి, స్థిరతరసంపత్ప్రదామ్" అను కీర్తనతో లక్ష్మీ దేవిని స్తుతించిరి. ఆరాత్రి శ్రీమహలక్ష్మి సకలాభరణ భూషితురాలై శ్రీదీక్షితులవారి చిన్న భార్యకు స్వప్న దర్శనమిచ్చి అనుగ్రహించెనట.

ఆమె దీక్షితులవారికి స్వప్నవృత్తాంతము వివరింపగా దీక్షితులవారు కృతజ్ఞతతో మరల లక్ష్మీదేవిపై ''మంగళదేవతయా త్వయా బహుమానిన్యోహమ్" అని, ''ధన్యాసి' ' రాగమున, ''మహాలక్ష్మి కరుణారసలహరి" అని ''మాధవమనోహరి" రాగమున కృతులు రచించి ధ్యానము చేసిరి.

శ్రీ దీక్షితుల వారు తంజావూరులో ఉండగా సమీపమున గల తిరువయ్యూరు వెళ్ళి శ్రీధర్మసంవర్ధనీ దేవిని దర్శించి ''మధ్యమావతి" రాగమున 'ధర్మసంవర్ధని' అను కృతి గానము చేయుచుండగా శ్రీ త్యాగరాజు శిష్యులు విని అయనను తమ గురువు

గృహమునకు ఆహ్వానించిరి. ఆదినమున శ్రీత్యాగరాజు గారింట "రామయణ పారాయణము పరిసమాప్తి యగుట వలన విశేషపూజలు సలిపి శ్రీరామునికి పట్టాభిషేకము జరుపుచుండిరి. దీక్షితుల వారిని చూచి త్యాగరాజు ఆనందముతో ఆహ్వానించి గౌరవించిరి. ఆసందర్భమున శ్రీ త్యాగరాజు ఆయన శిష్యులు 'భైరవి' రాగములో "కొలువైయున్నాడే" అను కృతిని గానము చేసిరి. శ్రీ త్యాగరాజు కోరగా శ్రీ దీక్షితులవారు 'మామవ పట్టాభిరామ' అను కృతిని 'మణిరంగు' రాగములో రచించి గానము చేసిరి.

తిరువయ్యూరును పంచనద క్షేత్రమందురు. కావేరీ తీరమునగల పంచనదీశ్వరుని దర్శించి కృతులు రచించిరి. వానిలో 1) నాటరాగమున గల "పరమేశ్వర జగదీశ్వరి" యని మధ్యమావతి రాగమున, "ధర్మాసంవర్థిని దనుజసమ్మర్థిని" యని నాయకి రాగమున "ప్రణతార్తి హరంనమామి" అను కృతులు ప్రసిద్ధి పొందినవి. శ్రీత్యాగరాజుల వారి ఇంట సంతర్పణానంతరము దీక్షితులవారు తిరిగి తంజావూరు వెళ్లిరి.

మధురలో సోదరుడైన చిన్నస్వామి దీక్షితులు స్వర్గస్థుడైయ్యేనని తెలిసి కనిష్ఠ సోదరుడైన బాలస్వామి దీక్షితులను చూచుటకు "దేవూరు సుబ్రహ్మణ్య" మను శిష్యునితో మధురకు బయలుదేరిరి. మార్గమధ్యమున వేగవతీ నదీతీరమునగల విఘ్నేశ్వరుని దర్శించి 'బిలహరి' రాగమున "ఏకదంతం భజేహం" అను కృతిని రచించి గానము చేసి మధుర చేరిరి. మీనాక్షి ఆలయముచేరి "మామవ మీనాక్షి" అను కృతి 'వరాళి' రాగమున గానము చేసిరి. ఆలయ అర్చకుల వలన తమ్ముడైన బాలస్వామి రామేశ్వరము వెడలినట్లు తెలుసుకొని కొన్ని దినములు మధురలో గడిపిరి. మధుర మీనాక్షీ దేవిపై అనేక కృతులను రచించిరి. వానిలో "గమకక్రియ" రాగమున "మీనాక్షి మేముదందేహి" అను కృతియు, 'వరాళి' రాగమున "మామవ మీనాక్షి" అను కృతియు, "గౌళ" రాగమున "శ్రీమీనాక్షి గౌరి" కృతులును ప్రసిద్ధమైనవి. మీనాక్షి దేవిపై ఎనిమిది విభక్తులలోను కీర్తనలు రచించిరి. "దేవక్రియ" రాగమున మధురాంబా సంరక్షతు" అనుకృతియ 'అఠాణ' రాగమున, "మధురాంబాయ" అనుకృతియు "దేవగాంధారి" రాగమున "శ్రీమీనాంబికాయాః" మొదలగు కృతులు ప్రసిద్ధమైనవి. శ్రీసుందరేశ్వరునిపై రచించిన కృతులలో "పాలయమాం పార్వతీశ" అను

"కన్నడ" రాగములోని కృతి "సోమసుందరేశ్వరం" అను "శుద్ధ వసంత" రాగమున కృతియు ప్రచారములోనున్నవి. వీనిలో "శుద్ధవసంత" రాగము అపూర్వ రాగము. మధుర సమీపమున గల పుష్పవనీశ్వరునిపై 'సౌవీర' రాగమున 'సారససౌవీర' అను కృతి ప్రసిద్ధమైనది. ఇది కూడా అపూర్వ రాగములలో ఒకటి.

దీక్షితులవారు మధుర నుండి రామేశ్వరయాత్రకు బయలుదేరిరి. మార్గమధ్యమున గల అషగర్ కోవెల్ క్షేత్రమున నున్న శ్రీసుందర రాజస్వామిపై "శ్రీ సుందర రాజం" అను కృతిని "రామక్రియ" (కామవర్ధిని) రాగమున గానము చేసిరి. రామేశ్వరమున "రామనాథంభజేऽహం" అను "రామ క్రియ" రాగమున కృతియు అపూర్వమైన "నారాయణ గౌళ" రాగమున "శ్రీరామం రవికులాబ్ధిసోమం" అను కృతులును గానము చేసిరి.

రామేశ్వరమున బాలస్వామి దీక్షితులకు ఎట్టియాపురము మహరాజుతో పరిచయము ఏర్పడి వారి ఆహ్వానముపై ఆస్థాన విద్వాంసునిగా ఎట్టియాపురము వెళ్ళినట్లు దీక్షితులవారికి తెలిసినది. దీక్షితులవారు ఎట్టియాపురము బయలుదేరిరి. దారిలో 'పాత్తూరు' లోని వేంకటేశ్వరుని దర్శించి 'మేఘరంజని' రాగమున "శ్రీవేంకటేశ్వర యాదవ భూపతిం ఆశ్రయేऽహం" అను కృతిని రచించి గానము చేసిరి. ఎట్టియా పురము వెళ్ళుచుండగా త్రోవలో వర్షములేక, పంటలు, త్రాగునీరు లేక కరువుతో బాధపడుచున్న ప్రజలను గాంచి దీక్షితులవారు "అమృత వర్షిణి" రాగమున "ఆనందామృత వర్షిణి అమృత వర్షిణి హరాది పూజితే భవాని సలిలం వర్షయ వర్షయ" అని గానము చేసిన వెంటనే ఆకాశము మేఘావృత్తమై వర్షము కురిసెనట. ఎట్టయాపురము చేరిన దీక్షితులవారు తమ్ముడైన బాలస్వామిని కలిసికొనిరి. ఆసమయముననే బాలస్వామికి వివాహము జరిగినది. మహారాజు ప్రార్థనను మన్నించి దీక్షితులవారు అచట నివసించుటకంగీకరించిరి. ఆకాలంలోనే తిరుచుందూరు వెళ్ళి శ్రీసుబ్రహ్మణ్య స్వామిని దర్శించి "మయూరాధిరూఢం" అను ప్రసిద్ధ శ్లోకమును గానముచేసిరి. ఆస్వామిపై రచించిన కృతులలో 'శుద్ధధన్యాసి' రాగమున "శ్రీసుబ్రహ్మణ్యేన సంరక్షితోऽహం" అను కంకశైల సుబ్రహ్మణ్యస్వామిపై రచించిన కృతులు

ప్రసిద్ధమైనవి. తిరునల్వేలిలోని శాలివాహనేశ్వరునిపై, 'దేవగాంధారి' రాగమున ''శాలివాటీశ్వరం'' అను కృతియు కాంతిమతీ దేవిపై 'దేశి సింహరవం' అను రాగమున ''శ్రీకాంతి మతిం'' అనుకృతియు రచించిరి. కల్లడ కురిచ్చిలోని శ్రీవరాహ లక్ష్మిస్వామిపై వేరొక కృతిని రచించిరి. 'శబరిమలై' కొండపై నున్న అయ్యప్ప స్వామిని దర్శించి 'వసంత' రాగమున ''హరి హరపుత్ర'' అను కృతిని గానము చేసిరి. గురువాయూరు వెళ్ళి శ్రీకృష్ణునిపై తోడిరాగమున ''శ్రీకృష్ణంభజమానస'' అను కృతిని గానము చేసిరి. దీక్షితులవారు తాను దర్శించిన పుణ్యక్షేత్రములలోని దేవతలపై పెక్కు కృతులను రచించి తాను తరించుట యే కాక సంగీతలోకమును కూడ తరింప చేసిరి. ఆసేతు హిమాచలము పర్యటించి అనేక సంప్రదాయములను గమనించి శిష్యులకు విద్యాదానమొనర్చిరి.

క్రీ.శ 1835వ సంవత్సరము, ఆశ్వీయుజ బహుళచతుర్దశి (నరకచతుర్దశి) నాడు దీక్షితులవారు నిద్రలేచి ప్రాతఃకాల సంధ్యాదులను నిర్వర్తించి అనుష్ఠానము ప్రారంభింపబోవు చుండగా ఎట్టియాపురము మహారాజు భయాదోంళిత మనస్కుడై దీక్షితుల వారి దర్శనము కోరిరి. దీక్షితులవారు కారణమడుగగా ''గాంగేయుడను భద్రగజము ఉన్మాదియై గజశాల నుండి కట్లు తెంచుకుని శ్మశానవాటికకు వెడలి ఘీంకరించుచున్నది. ఎవరిని దరికి రానీయుటలేదు. ఇది అశుభసూచకముగా భయపడుచున్నాను'' అని రాజు విన్నవించెను. శ్రీముత్తుస్వామి దీక్షితులవారు క్షణకాలమాలోచించి కనులుతెఱచి ''రాజా! నీకుటుంబమునకు ఏమియును హాని జరుగదు''. అని చెప్పి రాజును పంపిరి. తాను అనుష్ఠానము ప్రారంభించుచుండగా అన్నపూర్ణాదేవి తేజోమూర్తియై దర్శనమొసంగినది. త్రికాలజ్ఞులుగనుక తమ అంత్యకాలమాసన్నమైనదని గ్రహించి-

శ్లో: భిద్యంతే హృదయగ్రంథిః చిద్యంతే పాపరాశయః
క్షీయంతే చాస్మకర్మాణి తస్మాన్ దృష్టేపరాపరా"

అను శ్లోకమును పఠించిరి. శ్రీ చక్రార్చన మొనర్చి 'పున్నాగవరాళి' రాగమున ''ఏహి అన్నపూర్ణే సన్నిదేహి సదాపూర్ణే సువర్ణే చిదానంద విలాసిని'' అను కృతిని గానముచేసిరి. ఇదియే వారు రచించిన చివరి కృతి. దీక్షితులవారు శిష్యులను పిలచి ''మీనాక్షి

మేముదందేహి" అను 'గమక క్రియ' రాగమున కృతిగానము చేయమని పలికిరి. తానుకూడా గానమొనర్చుచు అనుపల్లవిలోని ''మీనలోచని పాశమోచని" అను పదములు రాగా ఆయన చేతులుజోడించి, కనులుమూసుకుని 'శివేపాహి' అనుచున్నప్పుడు శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారి బ్రహ్మకపాలము భేదింపబడి జీవాత్మ పరమాత్మయందైక్యమయ్యెను. తరువాత గాంగేయం భద్రగజము శాంతించి తానంతట తానే గజశాలకు తిరిగివచ్చినది.


''నిషాదం బృంహతేగజః" అను దానిని బట్టి సప్తస్వరములలో నిషాదము ఏనుగు ఘీంకారము వలె నుండును. సప్తస్వరములలో నిషాదము ఏడవది. షట్చక్రములపై ఏడవ చక్రము సహస్రారము ఆ ఘీంకారమునకు గుర్తు. మహాత్ముడైన సిద్ధుడు సహస్రారమును భేదించుకొని వెడలు సమయము ఆసన్నమైనదని రాబోవు విషాదమును నిషాదధ్వనితో సూచించినది. అది గమనించిన దీక్షితులవారు కృతిని ఆలాపించుచు భవపాశములను త్రెంచికొని పరాశక్తిలో లీనమయిరి.

దీక్షితుల వారి మరణమునకు ఎట్టియాపురము మహారాజు కడుదుఃఖించి సకలరాజ మర్యాదలతో వారి కళేబరమునకు దహనసంస్కారములు చేయించిరి. ఆ దహనసంస్కారములు జరిగిన చోట బృందావనము నిర్మాణము జరిగి నేటికినీ దర్శనీయముగా ఉన్నది.

శ్రీ ముత్తు స్వామి దీక్షితులవారికి పురుష సంతానము లేదు. కుమార్తె వంశము గురించి విషయములు తెలియుటలేదు. ఆయన తమ్ముడైన బాలస్వామి తన దౌహిత్రుడైన సుబ్బరామ దీక్షితుని దత్తత చేసికొనిరి. ఆయన క్రి.శ. 1839-1906 కాలమునకు చెందినవాడు. ప్రసిద్ధ వాగ్గేయకారుడు. ఆయనకుమారుడు అంబి దీక్షితులు. ఈయన కుమారుడు బాలస్వామి దీక్షితులు నేటికి జీవించియున్న దీక్షితుల కుటుంబములోనివాడు.

దీక్షితులవారి శిష్యులలో సుప్రసిద్ధులు సోదరులైన చిన్నస్వామి, బాలస్వామి, తదితర శిష్యవర్గమున ప్రసిద్ధగాయకుడు తమిళ విద్వాంసుడైన తిరుక్కుడైయూరు భారతీ, వీణా వెంకటరామయ్య, తేవూరు సుబ్రహ్మణ్యయ్యరు, శుద్ధ మర్దళం తంబియప్ప, బిల్వవనం తంజావురుసోదరులని ప్రసిద్ధిగాంచిన పొన్నయ్య, చిన్నయ్య, శివానందం, వడివేలు, దేవదాసికమలమ్మ మొదలగువారు ముఖ్యులు.

# వంశవృక్షము (కాశ్యపస గోత్రం)



# తృతీయాధ్యాయము

# తృతీయాధ్యాయము - శివశక్తి తత్త్వము

శాక్తేయ మతానుసారము సృష్టి శివశక్తి విలసితము. దైవము, దేవత, సృష్టి, స్థితి, లయములు, కాలము, దేశము సర్వము శివశక్తి మయములు అణువణువు శివశక్తి సమ్మిళితము, క్షణక్షణము శివశక్తి స్పందము, గుణమును, రూపమును, శివశక్తిమయములు. పంచభూతములు, సూర్యచంద్రులు, అగ్ని అను అష్టమూర్తులు శివశక్తి సంయుక్తములు. 'అస్తి' అనగా ఉన్నది. శివుడు ఒక్కడే కాడు. శక్తితో కూడి ఉన్నదియే ఉండుట. 'భాతి' ప్రకాశించుచున్నది. శివశక్తి ద్వయమే కాని ఒక్కటి కాదు. అస్తి భాతి ప్రియం అయిన పరమాత్మ కంటికి కానరానిది, చెవికి వినబడనిది, మనసు తలచలేనిది. అట్టి పరబ్రహ్మము ఒంటరితనమును సహించలేక తానే రెండు రూపములు ధరించగా ఒకటి 'పుం' రూపము మరియొకటి స్త్రీ రూపము అయినది. శివశక్తి రూపములు ఒకే తత్వమును స్వభావమును, రూపమును, నామము కలవి. అయన సదాశివుడు ఆమె శివా. 'నమశ్శివాభ్యాం నవయౌవనాభ్యాం' అని శంకరుల స్తుతి. వారు నిత్య యౌవనులు. సర్వ విధ సామ్యము వారికి ఉన్నది.

పరమాత్మ అంశములు- అస్తి, భాతి, ప్రియం, నామరూప, మిత్యంశ పంచకము. అనగా మొదటి మూడు పరమాత్మ యొక్క అవ్యక్తమైన స్థితి. నామమన్నది వాగర్థ రూపమైనది. వాక్కు శక్తి రూపం - అర్థం శివరూపము. ఇది అక్షరము, సకలము, వ్యక్తము, మూర్తము కనుకనే శివశక్తులన్ను గూర్చి మనము అనగలము, వినగలము, భావించగలము. శక్తిలేనిదే శివుడు లేదు. శివుడు లేక శక్తిలేదు.

"నశివేన వినాశక్తిర్న శక్తి రహితః శివః"

ప్రకృతి అంతయు శివునిచే చైతన్యవంతమైనది. శివునకు ప్రకృతియే ఆకృతి. ప్రకృతిలో లీనమైన పరమాత్మ వలన ప్రకృతి ప్రకాశించుచున్నది. అది అజడ ప్రకృతి. జడ ప్రకృతి జీవము లేనిది కనుక ప్రకృతి దీపనమునకు శివుడే దీపము. రూపము కాలమును బట్టి స్థలమును బట్టి ఏర్పడును. రంగు ఆకారము, అవయవములు కలది రూపము.

---

1. సౌ.ల. పుట 163

ఈ రూపము శక్తి భాగము. ఈ రూపమును చైతన్యవంతము చేయునది పరమేశ్వరుడు. ఇది స్థూలముగా శివశక్తిమయమైన అంశపంచకము యొక్క లక్షణము. దీనిని మనము ప్రపంచ రూపమున, మన శరీరమునందు, మన ఉపాసనయందు భావించునపుడు - కాలము మానవ శరీరము యొక్క స్థితి, మంత్ర, తంత్రములు ఒకే విధముగా అన్వయించును.

"సకల భువనోదయ స్థితి లయమయ లీలా వినోదనోద్యుక్తః

అంతర్లీన విమర్శః పాతు మహేశః ప్రకాశమాత్ర తనుః"[1]

కామకలా విలాసములోని మూల సూత్రమునందు ప్రకాశ విమర్శ శబ్దములు రెండును సదాశివ శక్తులకు పర్యాయపదములుగా, సంకేతములుగా చెప్పబడినవి. 'ప్రకాశమాత్రతనుః' అని చెప్పుట వలన సృష్టియందు వేరొక వస్తువు నామ రూపములుగా లేనందున ఇదియే ప్రకాశ బిందువని నిర్ధేశించినారు. జ్ఞానము ప్రకాశరూపము కావున ఇదియే సంవిద్బిందువు. నామరూపములు రెండును ఏకవస్తు ధర్మములు. ఈరెండింటికి ఆశ్రయము ఒకటిగా ఉన్నది. కనుక ప్రకాశబిందువు నందు విమర్శ శక్తి అంతర్భూతముగా నున్నది.

శ్లోః "న శివేన వినా దేవీ దేవ్యాచన సదాశివః

నైత యోరంతరం నాస్తి చంద్ర చంద్రిక యోరివ"[2]

అను ఆగమ సిద్ధాంతము వలన శివశక్తులకుఅన్యోన్యభేదము లేదని తెలియుచున్నది. ప్రకాశబిందువు శివ స్వరూపము. చంద్ర మండలము. 'అ' కారముగా గ్రహింపవలెను. విమర్శ బిందువు శక్తి స్వరూపం. అగ్నిమండలము. 'హ' కారముగా గ్రహింపవలెను.


ప్రకాశవిమర్శ శక్తులు రెండు ఏకవస్తువుగా ఉన్నప్పటికిని కార్యార్థమై విభాగమును పొందినవి. విభాగకాలమున చంద్రాగ్ని రూపములు కలిగియున్నవి. వీని సంయోగము వలన మిశ్రమ (సూర్య) బిందువు జనించుచున్నది. 'అ'కార స్వరూపుడగు పరమశివుడు

---

1. కా.క.వి. మూలసూత్రము

2. కా.క.వి. పుట 11

'హ' కార స్వరూప పరాశక్తిని వీక్షించినపుడు ఈ రెండింటి వీక్షణ సంయోగము వలన జనించిన మూడవ ప్రతిబింబము 'అహం'. పరాశక్తి అర్ధము వంటిదని గ్రహింపవలెను. ఈ త్రిరేఖల మధ్యనున్న బిందువు సంవిద్బిందువు.




శ్లో:-"స్ఫుట శివశక్తి సమాగమ బీజాంకుర రూపిణీ పరాశక్తి:

అణుతర రూపానుత్తర విమర్శ లిపి లక్ష్య విగ్రహా భాతి"[1]

బీజాంకుర రూపమయిన ప్రకాశ విమర్శాత్మక శివశక్తి స్వరూప తేజోమయుమయిన 'అహ' మనే బీజద్వయమును శరీరముగా కలిగి పరాశక్తి ప్రకాశించుచున్నది. అందువలన పదములు, వాక్యములు, వేదాది సకల శాస్త్రములు, గాయత్రీ మొదలగు మంత్రములు సృష్టింపబడినవి. కావున అన్ని వర్ణములు శివశక్తిమయములే. మనయందుగల అజ్ఞానమనెడి చీకటిని పారద్రోలి జ్ఞానమను వెలుగు ప్రకాశింపచేయునవి సదాశివశక్తులు. ఇచ్ఛాశక్తి - జ్ఞానశక్తి- క్రియాశక్తి అనునవి మనోవాక్కాయ కర్మములు. ఇవి పార్వతి, సరస్వతి, లక్ష్మి అను మూర్తి త్రయములు. వేరువేరుగా పిలువబడుచున్న ఏకత్వ లక్షణముగల శక్తి మాత్రమే. ఈమూడు ఆ శక్తి రూపములు. 'శారదా తిలకము' నందు కూడ -

---

1. కా.కవి. 3వ శ్లోకం

"బిందు పుమాన్ శివః ప్రోక్తః సర్గః శక్తిర్ని శాకరః"[1]

ఏది శక్తితో కూడి యున్నదో అది సృష్టి రచనా శక్తి కలిగియున్నదని చెప్పుచున్నది.

ఈ అధోముఖముగా నున్న త్రికోణములోగల త్రిరేఖల యందు సమానముగా 16 అక్షరములు కలవు. ఒక రేఖ యందు 'అ' నుండి 'అః' వరకు గల 16 అక్షరములు మరియొక రేఖ యందు 'క' నుండి 'త' వరకు గల 16 అక్షరములు మరియొక రేఖయందు 'థ' నుండి 'స' వరకు గల 16 అక్షరములను కలిగియున్నది. పంచదశాక్షరి మంత్రమైన "కఏఈల హ్రీం - హసకహల హ్రీం - సకల హ్రీం" నకు " శ్రీం" బీజము కలిపినచో షోడశాక్షరీ మంత్రమగుచున్నది. ఈ అక్షరములన్నియు సదాశివ శక్త్యాత్మకము నుండి ఉద్భవించినవి.

ఆదినున్న పరాబిందువులోని శారదా స్వరూపము పరాపశ్యంతీ, మధ్యమా, వైఖరీ అను నాలుగవస్థలను పొందినది. పశ్యంతీ వైఖరులకు మధ్యావస్థ స్థూల మధ్యమ. అది క-చ-ట-త-ప-య-శ అను అష్టవర్గులుగా ఉత్పన్నమైనది.

మాతృకా వివేకములో-

శ్లో: శాంతాంతం శక్తి రస్యోక్తా తదంతం బీజ ముచ్యతే,

విద్యాశక్తిర్భవేద్బీజం శివ ఏవ నచాన్యథా"[2]

శ్లో: తేనాయం పరమో మంత్ర శ్శివ శక్త్యాత్మక స్మృతః"[3]

'శ,ష,స,హ' అను ఈ వర్ణక్రమమందు శవర్ణాంతమందు షకారమున్నది. షకారాంతమందున్న సకారము సారస్వత బీజముగాన శక్తిస్వరూపము. ఈ సకారాంతమందుగల హకారము అగ్నిబీజము. ఆ బీజము శివ స్వరూపముగా నున్నందున హంసమంత్రము శివశక్తుల పరముగా నున్నదనియు అందువలన ఈమంత్రము

1. సౌ.ల పుట సంఖ్య -10

2. కా.క.వి పుట 28

3. కా.క.వి. పుట 28

ఉత్కృష్టమైనదనియు పేర్కొనబడినది. ఈ హకారము అకార ఈ కారములతో కూడి 'హ్రీం' బీజాక్షరమైనది. ఈ హ్రీంకారము అనునపుడు ఝుంకార శబ్దము వినబడును. ఈ ఝుంకార శబ్దము చేయు భ్రమరము భ్రమరాంబికయై హృదయ పద్మమనెడి శివునిపై ఆసీనురాలైనది. నాదము అనగా 'న' కారము ప్రాణసొంజ్ఞ. 'ద' కారము అగ్నిసొంజ్ఞ అనియు, ప్రాణాగ్ని సంయోగము వలన నాదము ఉద్భవించుచున్నది. ఇదియే నాదమనబడును ఈ నాదము, అన్ని వర్ణములు, సకల శాస్త్రములు, వేదాది విద్యలు, సకల మంత్రములు అన్నియు శివశక్తిమయములు. ఈనాదములో 2 రకములు గలవు 1. ఆహతనాదము 2. అనాహత నాదము.

1. ఆహత నాదము:- భవ భవంజకమైనది యును, గానోత్పత్తి కారియై శ్రుతి, స్వర, గ్రామ, మూర్ఛనాదుల ద్వారా జనరంజకమును కలుగ చేయునది ఆహతనాదము.

2. అనాహతనాదము:- ఇది గురు ముఖముగా నుపదేశింపబడినదై, ముక్తిప్రదంబై అచంచలమనోరథముగల మునులచే ఉపాసింపబడునది అనాహతనాదము.

## శివశక్త్యాత్మకమైన శ్రీచక్రం సంగీత సమన్వయం

శివశక్త్యాత్మకమైన శ్రీచక్రములో గల బిందుస్థానము నుండియే నాదము ఉద్భవించినది.

శ్లో: పశ్యన్తీ మధ్యమాం యాతా మధ్యమా ద్వివిధా స్మృతా
స్థూల సూక్ష్మ విభేదేన సూక్ష్మా సప్తసప్త స్వరాత్మికా"[1]

అదినున్న పరాబిందువు బ్రహ్మశక్తియగు శారదా స్వరూపము. అది పరాపస్యంతీ, మధ్యామా, వైఖరీ అను నాలుగవస్థలను పొందినది. వైఖరీ రూపము మాతృకాకారమైన ప్రపంచ మందున్న నామ మాతృకమైన శబ్ద బ్రహ్మమైనది. పరాబిందు వికసనము పశ్యంతి. దీని యందు నాదము ఉత్పత్తిని పొందినది. దీనివల్ల మధ్యమ కలిగినది. పరాపశ్యంతుల మధ్యావస్థ సూక్ష్మమధ్యమ. అది సప్త స్వరములుగా వేదముల

---

1 శా.చ.స్త. తృ. శ. శ్లో. 4వ పుట 89

యందు సంగీతశాస్త్రములందు వ్యాపించియున్నవి. ఈ సప్తస్వరములు శివుని యొక్క సద్యోజాత-పశ్చిమం, ఈశానం-ఊర్ధ్వముఖము, అఘోరం- దక్షిణం, వామదేవం-ఉత్తరం, తత్పురుషం- తూర్పు అను పంచముఖముల నుండి ఉద్భవించినవని చెప్పుట కలదు.

"శ్రుతిర్మాతా లయఃపితః" అను దానిని బట్టి శివశక్తులు సంగీతమునకు తల్లిదండ్రుల వంటివారని తెలియుచున్నది. శివశక్తిమయమైన సంగీతము లోని శ్రుతి (స్వరము) లయ ల రెండింటికిని నవయోన్యాత్మకమైన శ్రీచక్రసంపుటమునకు సమన్వయము కలదు. శ్రీచక్రములోని బిందుస్థానము శ్రుతి లయలతో నిండినటువంటిది. పరాశక్తి విడిగా వ్యక్తమగు స్థితిలో అధోముఖముగా త్రికోణరూపములో గోచరమగుచున్నది. ఈ బిందువు దగ్గరనున్న త్రికోణములోని మూడు కోణములు సంగీత లయ (తాళము) లోగల తిశ్ర జాతిని సూచించును. ఊర్ధ్వ ముఖముగా నున్న శివపరమైన 4 కోణములు చతురస్ర జాతిని, అధో ముఖముగా నున్న శక్తి పరమైన ఐదు కోణములు ఖండజాతిని సూచించును. శివపరమైన నాలుగు కోణములకు శక్తి పరమైన త్రికోణములోని మూడుకోణములు కలుపగా మిశ్రజాతిని, ఊర్ధ్వముఖముగా నున్న శివపరమైన నాలుగు కోణములకు అధో ముఖముగానున్న శక్తి పరమైన ఐదు కోణములు కలుపగా నవయోన్యాత్మకమైన శ్రీ చక్రము సంకీర్ణజాతిని తెలియజేయు చున్నవి.

ఈ విధముగా పంచజాతులైన తిశ్ర, చతురస్ర, మిశ్ర, ఖండ, సంకీర్ణ జాతులతో కూడి యున్నది శ్రీచక్రము. సంగీతములోని ప్రధాన స్వరము, ప్రథమ స్వరమైన ఆధార షడ్జమమును సంకేతములో 'స' అందురు. ఈ సకారము శక్తి, దానిని పలుకునపుడు వినబడు అకారము శివుడు (సదాశివుడు). కనుక శివశక్తి సమ్మిళితమైన ఈ సకారము లేదా ఆధార షడ్జమము శ్రీ చక్రములోని బిందువుగా భావించవచ్చును. ఇది ఏకత్వ లక్షణము కలది. బిందు వికసనము వలన నవకోణాత్మకమైన శ్రీ చక్రములోని ఊర్ధ్వముఖముగా నున్న శివ పరమైన కోణములు అధోముఖముగా నున్న శక్తిపరమైన కోణములు రెండు అర్ధచక్రాకృతిలో కలవు. వీనిని ఆధార షడ్జమము పంచమములుగా భావించవచ్చును. స,పలు రెండు ప్రకృతి స్వరములు మరియు సంవాది స్వరములు.

శ్రీ చక్రములోని బిందు వికసనమున ఏర్పడిన అధోముఖముగా నున్న

త్రికోణమును పరిశీలించిన ఉదాత్త, అనుదాత్త, స్వరిత స్వరములుగను శ్రీ చక్రమునందు గల అష్టదళములు సంగీతమునందు గల సంపూర్ణ స్థాయిని సూచించుచున్నవి. క్రింది షడ్జమము నుండి పై షడ్జమము వరకు గల ఒక స్థాయిని తెలియజేయుచున్నవి. సప్తస్వరములలో సపలు గాక మిగిలిన రి-గ-మ-ద-ని స్వరముల యొక్క వికృతి భేదము వలన ఏర్పడిన పది స్వర స్థానములు శ్రీ చక్రమునందు గల అంతర్దశ, బహిర్దశారములుగా భావించవచ్చును. వాటినుండి రూపొందిన షోడశ స్వరములను షోడశ దళములుగా చెప్పవచ్చును. దాని చుట్టును ఉన్న మూడు వలయములు లేక భూపురములను మంద్ర, మధ్య, తార స్థాయిలకు సంకేతముగనెన్నవచ్చును. అంతర్దశ, బహిర్దశారములను సంగీతము నందు గల దశ విధ గమకములను, పంచదశ గమకములుగా పేర్కొనవచ్చును. శ్రీ చక్రము నందుగల అధో ముఖముగా నున్న శక్తిపరమైన ఐదు కోణములను వరుసగా అనుమంద్ర, మంద్ర, మధ్య, తార, అతి తారస్థాయిలను సూచించుచున్నవి. శ్రీచక్రమునందు మొత్తము ఇరవై ఒకటి త్రికోణములు గోచరించును. ఈ 21 త్రికోణములు బిందుస్థానముతో కలిపి 22. వీనియందు సంగీతమున ఒక స్థాయి యందు గల 22 శ్రుతులు ఇమిడి ఉన్నవని నిస్సందేహముగ చెప్పవచ్చును.

సంఖ్యావాచకము బిందువు (0) నుండి 10 అంకెల వివరణ శ్రీ చక్రము నందు కలదు. ఈసంఖ్యలన్నియు సంగీతములోని సప్తతాళముల యొక్క 35 తాళముల యొక్క, 108 తాళముల యొక్క క్రియలను, అక్షర కాలపు విలువలను, పంచజాతులను గతులను, 72 మేళకర్త రాగముల వరుస సంఖ్యలను తెలియజేయుచున్నవి. శ్రీ చక్రమునందు బిందువు తరువాత అధోముఖముగా నున్న శక్తిపరమైన త్రికోణము నందు ఒక్కొక్క రేఖయందు 16 సమాన అక్షరములను కలిగియున్నవి. ఈ పదహారు అక్షరములను షోడశ స్వరస్థానములుగ భావించిన ఈ 3 రేఖలు త్రిస్థాయిల యందు గల షోడశ స్వర స్థానములుగా పేర్కొనవచ్చును. సంగీత స్వరములన్నియు అక్షర రూపమున ఈ త్రిరేఖల యందు ఇమిడి ఉన్నవని తెలియుచున్నది. కావున సంగీతము శివశక్త్యాత్మకమైనది.

నాద వికసనము వలన స్వరములు ఏడు అయినను వాని నుండి 12 స్వర

స్థానములు, 16 (షోడశ) స్వరస్థానముల యొక్క పలువిధములైన సమ్మేళనముల వలన వేలకొలది రాగములు ఉద్భవించినవి. కావున సంగీతములోని ధాతువు స్వరము, మాతువు సాహిత్యము శివశక్త్యాత్మకమైనవని నిస్సందేహముగా చెప్పవచ్చును. కనుక సంగీతమునందుండు స్వర సాహిత్యములు రెండునూ షోడశకళాపూర్ణముగా నున్నవని తెలియుచున్నది.

శ్రుతిః "యేనవారూపం పశ్యతి యేనవా శబ్దం శృణోతి"

ఇత్యాదినా ప్రజ్ఞాన లక్షణయుక్తమ్

నేత్రశోత్రాదీంద్రియముల చేత శబ్ద రూపరసాదులనేది గ్రహించుచున్నదో అది ప్రజ్ఞానమని నిర్ణయించిరి. అటువంటి ప్రజ్ఞ కలిగినది సంగీతము.

★★★

1. శు.తి. కా.క.వి. పుట 30

# చతుర్థాధ్యాయము

# చతుర్థాధ్యాయము

## దీక్షితుల వారి కృతులలో గల శివశక్తి తత్వము

### తిరువారూరులోని త్యాగరాజస్వామిపై రచించిన 13 కృతులు

శ్రీ ముత్తుస్వామి దీక్షితులు తిరువారూరులోని త్యాగరాజ స్వామిపై అన్ని విభక్తులలో పదమూడు కృతులను రచించిరి. తిరువారూరునకు కమలాపురము, శ్రీపురము అని నామములు. స్వామిని "వీధి విడంగ త్యాగర్" అందురు. అమ్మవారు నీలోత్పలాంబ (భోగినీ రూపము) శ్రీ త్యాగరాజేశ్వరుని ఆలయము వెనుక గల వాయువ్యమూలమున శ్రీ చక్రవాసిని కమలాంబ (యోగినీ రూపము) ఆలయమున కలదు. తిరువారురు కోవెల యందు గల పంచలింగములపై ఐదు కృతులు, నీలోత్పలాంబికపై తొమ్మిది కృతులు, కమలాంబా నవావర్ణ కృతులు పదకొండు రచించిరి. తిరువారూరు పరిసర ప్రాంతములో ఏడు (7) జ్యోతిర్లింగములు కలవు. వీటిన 'సప్త విడంగర్' క్షేత్రములందురు. ఈ ఏడు త్యాగ రాజేశ్వర క్షేత్రములుగా ప్రసిద్ధి పొందినవి.

త్యాగ, యోగ, భోగ, మోక్షములనొసంగు ఈశ్వరునకు త్యాగేశ్వరుడు, యోగీశ్వరుడు, ముక్తికేశ్వరుడనే వ్యవహార నామములు ప్రసిద్ధములు. తిరువారూరులోని ఈశ్వరునకు(శివునకు) త్యాగేశ్వరుడని పేరు. వీరిపై రచించిన కృతులు 13. వీనిలో మొదటిది

### 1. త్యాగరాజో విరాజితే - మహారాజ రాజశ్రీ

1. అఠాణా రాగము　　　　త్రిశ్రజాతి ఏకతాళము

29.వ.మేళకర్త జన్యము

పల్లవి:- త్యాగరాజో విరాజితే మహారాజ రాజశ్రీ త్యాగరాజః।

అనుపల్లవి:- వాగర్థమయ భువనరాజో హరి। వాంచితార్థ ప్రదరాజో। హర।

శ్రీగురు గుహ గుణేశ రాజో। సంసేవిత రాజాధిరాజో।

మధ్యమకాల సాహిత్యము:

నాగర ఖండాఖ్య పురాణ ప్రతిపాదిత రాజో।

యోగినీ గణరాజో၊ యోగిరాజ రాజశ్రీ ॥త్యాగరాజో:॥

చరణముః- కలిరాహిత్య నగర వాసో । నీలోత్పల నాయికానహవాసో၊ అతి

లలిత హంసలా స్యోల్లాసో । నిఖిలాగమ శిరోనుత విలాసో၊ అతి

విలసిత హటకావభాసో၊ అనేక లీలా విచిత్ర వికాసో၊ రక్తో

త్పల కుసుమాది వికాసో၊ పరిపాలిత హరిహయాదిదాసో၊ ని၊

మధ్యమ కాల సాహిత్యము॥:-

ర్మల హృదయ రాజహంసో၊ మహా పరమహంసో၊ని

శ్చల తత్త్వప్రశంస శశికళావతంసః శ్రీ॥ ॥త్యాగరాజో:॥

ఈశ్వరుడు శాసించేవాడు కనుక రాజు ఆయన త్యాగరాజు. దీక్షితుల వారు ఆభగవంతుని సన్నిధిలో చేసిన విన్నపము మహారాజునకు చేసినట్లే చేసిరి. అందువలన పల్లవిలో, "త్యాగరాజో విరాజితే మహారాజరాజశ్రీ" అని కలదు.

ఈ భువనములు వాగర్థమయములు. అస్తి, భాతి, ప్రియం అని చెప్పబడు నిష్కళ పరబ్రహ్మమును సకల బ్రహ్మముగా చెప్పుట వాక్కుల యొక్క ప్రయోజనము, దానిచే తెలియ బడునవి చతుర్దశ భువనములు. ఈ చరుర్దశ భువనములు వాగర్థములచే ప్రకాశితమగుచున్నవి. కనుక ఈ భువనములకు ప్రత్యక్ష శాసనుడు ఈశ్వరుడు. అందుచేత భక్తులు కోరిన దానిని ఇచ్చువాడు హరివాంఛితార్థ ప్రదుడైన రాజు. ఆ భక్తులలో మొదటివాడు 'హరి'. హరివాంచితార్థప్రదుడైన రాజు హరుడు (శివుడు). వాగర్థములు ప్రకృతి పురుషుల వలె విడదీయరానటువంటివి. మహాకవి కాళిదాసు శ్లోకములో-

"వాగర్థావివ సంపృక్తౌ၊ వాగర్థ ప్రతిపత్తయే၊

జగతః పితరౌవందే పార్వతీ పరమేశ్వరౌ"၊

అని ఈ తత్త్వమును స్తుతించెను. జగతికి తల్లి దండ్రులైనటువంటి పార్వతీ పరమేశ్వరుల సంబంధము వాగర్థములవలె అవినాభావమని పై శ్లోకమునకర్థము. వాక్కు-శక్తి, అర్థము-భావము శివుడు. ఇవి ఒకదానిలో ఒకటి అంతర్లీనమై ఉండును.

ఈ త్యాగరాజేశ్వరుడు సుబ్రహ్మణ్యేశ్వర, వినాయకులకు రాజు. చక్రవర్తులచే

మనోజ్ఞముగాసేవింపబడిన త్యాగరాజు ప్రకాశించుచున్నాడని దీక్షితుల వారు **అనుపల్లవి** యందు చెప్పిరి.

మధ్యమకాల సాహిత్యములో స్కాందపురాణము నందు నాగర **ఖండములో** ఈ స్థలపురాణమును గురించి ప్రతిపాదింపబడిన రాజు త్యాగరాజు. చతుష్షష్టి**యోగినీ** గణములు శ్రీవిద్య యందు ప్రసిద్ధములు. శ్రీచక్రమునందు

1. ప్రథమావరణములో దశముద్రాదిదేవతలు యోగినీ రూపములు **ధరించి** ప్రకట యోగినులుగానున్నారు.

2. ద్వితీయావరణము నందు కామకర్షిణ్యాది పదియార్గురు **యోగినీ** రూపములు ధరించిరి. వీరు గుప్తయోగినులు.

3. తృతీయావరణమున అనంగకుసుమాదిఎనమండుగురు **యోగినీ** సముదాయములు గుప్తతర యోగినులు.

4. చతుర్థావరణము నందు సర్వసంక్షోభిణి మొదలగు పదు**నారుగురు** దేవకన్యలు సంప్రదాయ యోగినులు.

5. పంచమావరణము నందు సర్వసిద్ధి ప్రదా మొదలగు పది **మంది** దేవతాస్త్రీలు కులోత్తీర్ణ యోగినులు.

6. షష్టావరణము నందు సర్వజ్ఞాది దేవకన్యలు పదిమంది గర్భ**యోగినులు.**

7. సప్తమావరణమునందు వసిన్యాది వాగ్దేవతలు ఎనిమిది **మంది** రహస్యయోగినులు

8. అష్టమా వరణము నందు అతిరహస్యయోగినులు ముగ్గురు.

9. నవావరణము నందు రాజరాజేశ్వరీదేవి ప్రకాశించుచున్నది.

అనేక యోగినీ గణములకు రాజు, యోగిరాజరాజు. స్త్రీ రాజ**రాజేశ్వరి,** పురుషుడు రాజరాజేశ్వరుడు. ఈ నామైక్యము, రూపైక్యము, అవస్థైక్యము, అను**ష్ఠానైక్యము** అధిష్ఠానైక్యములను పంచవిధైక్యముల చేత ఈ త్యాగరాజు శివశక్తి రూపమైన **శ్రీవిద్యా** విలసితుడు. కొందరు యోగినీ గణములకు రాజు అని భావింతురు.

చరణము నందు దీక్షితుల వారు త్యాగరాజేశ్వరుని కలిసంచరించని నగరము నందు నివసించువాడని, నీలోత్పలాంబ నాయికని సహధర్మచారిణిగా కలిగినటు వంటి వాడనిచెప్పిరి. మిక్కిలి కోమలమైన, సుందరమైన నటరాజ రూపముతో సంతోషముగా, ఉత్సాహముగా శ్రేష్ఠమైన శివతాండవనృత్యము చేయుచున్న శివుని వర్ణించిరి. సమస్త వేదములకు శిరస్సుల వంటి ఉపనిషత్తులచే స్తుతింపబడువాడు, మిక్కిలి ప్రకాశవంతమైన బంగారుఛాయను తిరస్కరించునటువంటి కాంతి కలవాడు, ఎనలేని మహిమలచే విచిత్రముగా నుండువాడు, ఎఱ్ఱని కలువలు మొదలైన పుష్పములవలే వికాసమును కలిగినవాడు. హరిహరాదులను పాలించుటలో దాసుడైన వాడు త్యాగరాజేశ్వరుడని అనేక విధములుగా దీక్షితులవారు స్తుతించిరి.

హంస, రాజహంస, పరమహంస అనుమూడు ఖండములను సోపాన పరంపరలో క్రమముగా ఊర్ధ్వముఖముగా అధిరోహణము చేయుట దీక్షితులవారి చమత్కారము. మొదటి 'హంస'ను వట్టి 'హంస' అనలేదు. 'లలితహంస' అనిరి. ఇది సాహిత్యచమత్కారము.

లలితహంస - లాలించుహంస - సరస్వతి

రాజహంస - పోషించు హంస - లక్ష్మి

పరమ హంస - యోగించు హంస - పార్వతి

పరమపద యోగమున హంస - పరమహంస. ఇవి వరుసగా-

మూలాధార, స్వాధిష్ఠానములు - బ్రహ్మమండలము - బ్రహ్మ సరస్వతి స్థానములు.

మణిపూర, అనాహతములు - విష్ణుమండలము - విష్ణువు లక్ష్మీస్థానములు.

విశుద్ధ, ఆజ్ఞా చక్రములు - మహేశమండలము- మహేశ్వరుడు పార్వతిస్థానములు.

ఈషట్ చక్రముల యందు నాయికతో సహవాసము, ఉల్లాసము, విలాసము, అవభాసము, విచిత్రవికాసము, కుసుమాది వికాసము గల షట్ చక్ర విలసిత నిశ్చలతత్త్వ ప్రశంసచేత చంద్రకళావతంసుడైన వాడు ఈ తిరువారూరున త్యాగరాజేశ్వరుడుగా గురుగుహముద్రగల ముత్తుస్వామి దీక్షితుల వారి కీర్తనలలో నుతికెక్కినారు.

ఈ విధముగా త్యాగరాజేశ్వరుని -

**"సకలభువనోదయ స్థితిలయమయ లీలావినోదనోద్యుక్తః**

**అంతర్లీన విమర్శః పాతు మహేశః ప్రకాశమాత్రతనుః"**[1]

శ్రీవిద్యాపరముగా సమన్వయించుకొనుట ఉపాసకులకు ముచ్చట. మరియు త్యాగరాజేశ్వరుని అద్వైత మూర్తిగా, తత్త్వ మూర్తిగా దీక్షితులవారు మధ్యమకాలసాహిత్యము నందు వర్ణించిరి.

సాహిత్యపరముగా రాజరాజిత, రాజరాజ, రాజాధిరాజ ఇత్యాది యమకములు సంగీతగమకములకు సహకారి. అట్లే నగరవాస, సహవాస, ఉల్లాస, విలాస, వికాసములు సాహిత్యపరముగను, సంగీతపరముగను, దీక్షితులవారి విద్వద్గరిమ, పాండిత్య ప్రకర్షను ప్రస్ఫుటింప చేయుచున్న ప్రక్రియలు.

ఉపనిషత్ పరముగా శ్రీవిద్య శాక్తేయమని వేదవిదులకు ఒక నిర్లక్ష్యము. అది వేదము తెలియని వారి వాదము. కాని దీక్షితులవారు విద్య "నిఖిలాగమశిరోనుత" మైన అనగా వేదములకు శిరోమణులైన ఉపనిషత్తులచేత నుతింపబడిన శ్రీవిద్యమణి భూషణము అనిరి.

1.కా.క.వి. 1వ శ్లోకం పుట 13

## "2. త్యాగరాజం భజరే చిత్త తాపత్రయంత్యజరే"

యదుకులకాంభోజిరాగము మిశ్రఏకతాళము

28వ మేళకర్త జన్యము.

పల్లవి:-త్యాగరాజం భజరే। చిత్త తాపత్రయం త్యజరే

అనుపల్లవి:-యోగిరాజ హృదయాబ్జనిలయం భోగిరాజనుత చరణకిసలయం

నాగరాజ మణి వలయం రజతాగజం ముఖ కువలయం ॥త్యాగ॥

చరణము:- పౌలోమీశాది దిక్పాల పూజిత గాత్రం

నీలోత్పలాంబానుకూలతర కళత్రం

త్రైలోక్య గురుగుహ తాతం త్రినేత్రం

సాలోక్యాది కైవల్యప్రద చరిత్రం ॥త్యాగ॥

మ॥సా:- నీలకంఠమనేక ఫలదం శూలపాణిమశోక శుభదం

మూల భూత మమూల్య వరధం కాలకాలమఖండ సుఖదం ॥త్యాగ॥

తిరువారూరు నందలి త్యాగరాజ ఆలయమున ఉన్న స్వామిని, విగ్రహ రూపమున ఉన్నవైభవమును వర్ణించుచు ఆరాధనాపరముగా ఈ కీర్తనను శ్రీ దీక్షితుల వారు తన చిత్తమునకు ఉపదేశముగా సంబోధించి చెప్పినారు.

చిత్తమా! అదిభౌతికము, ఆధ్యాత్మికము, అదిదైవికమైన తాపత్రయమును గురించి చింతింపకుము. ఆ తాపత్రయములను విడువుము. తిరువారూరు నందలి త్యాగరాజ దైవమును కొలువుము. విడువవలసినది విడచి, కొలువవలసినది కొలుచుట హంస లక్షణము. యోగి చిత్తమునకు శాంతి పొందుటకు మార్గము తాపత్రయమును త్యజించుట, త్యాగరాజును భజించుట, అని దీక్షితుల వారు పల్లవిలో చెప్పిరి.

ఈ త్యాగరాజు యోగిరాజుల హృదయమునందు ఉండువాడు. భోగిరాజైన ఆదిశేషుని చేత నుతింపబడిన పాదపల్లవము కలవాడు. నాగరాజైన వాసుకిని మణివలయముగా కరచరణాదులయందు అలంకరించు కొన్నవాడు. వెండికొండయందు ఉద్భవించిన కలువవంటి ముఖముకలవాడు. ఇవి అన్నియుగుడిలోని దైవరూపమునకు

లక్షణములు, అలంకారములు అని అను పల్లవిలో పేర్కొనిరి.

శచీపతియైన ఇంద్రుడు మున్నగు దిక్పాలకులు ఈ దైవమునకు పూజలు జరుపుదురు. అక్కడ స్వామి అనుకూల తర కళత్రము నీలోత్పలాంబ. ఈ స్వామి త్రిలోకగురువైన గుహునకు అనగా కుమారస్వామికి తండ్రి, మూడుకన్నుల దైవము. సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యాది కైవల్యములు ఇచ్చువాడను చరిత్రకలవాడు. అనగా ఈ స్థానిక దైవమును కొలిచినవారు బహురూపమైన మోక్షమును పొందుదురని జనశ్రుతి. ఈయన అనేక ఫలములనిచ్చు నల్లని కంఠముచే నీలకంఠుడనగా సాక్షాత్తు శివుడే.

త్రిశూలమును ధరించినవాడు దుఃఖమును పోగొట్టి శుభమునిచ్చువాడు, సర్వమునకు మూలభూతమైనవాడు, అమూల్యవరదుడు, కాలకాలుడు అనగా మృత్యుంజయుడు. అఖండ సుఖప్రదాత, కనుక ఓచిత్తమా! త్యాగరాజును భజింపుము. ఇది విగ్రహార్చనారూపమైన తిరువారూరులోని త్యాగరాజేశ్వరుని స్తుతి.

శ్రీ దీక్షితులవారు శ్రీ విద్యోపాసకులగుటచే వారి కృతులయందు శివశక్తి సమన్వయ రూపమైన అంతరపూజా రహస్యము ఇమిడి యుండును.

"అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా"[1] అని శివ శక్త్యైక రూపిణియైన పరమేశ్వరిని గూర్చి "బాహ్యపూజానకర్తవ్యా"[2] అన్నసిద్ధాంతము ననుసరించి దీక్షితులవారి కృతులయందలి శ్రీవిద్యా రూపమైన పరమార్థమును భావించవలెను.

శివశక్తి తత్వమును స్ఫురింప చేయని కృతిని దీక్షితులవారు రచింపలేదు. మరియు ఆయన సంస్కృత పాండిత్యము, సాహిత్య రసపరిపుష్టి, సంగీతశాస్త్ర నైపుణ్యము ప్రతీ కృతియందును సప్తస్వరములతో శోభిల్లుచుండును.

ఈ కీర్తనలో త్యాగరాజు అన్న దైవము యోగిరాజ హృదయము నందే ఉండును. భోగిరాజు చేతనే నుతింపబడును. చరణ కిసలయము కలవాడగును. కిసలయము అనగా పల్లవము. చరణకిసలయము అనగా పాదపల్లవము. ఇది దైవము యొక్క

---

1. ల.స.స్తో.పా. 162

2. సౌ.ల. పుట 224

చరణమృదుత్వమునకు వర్ణనయని సాహిత్యపరముగా చెప్పికొన్నను, ఇందలి ధ్వని ఆదిశేషుని వంటి విద్యానిధిచేత నుతింపదగిన పల్లవి చరణముగల సంగీత రచనలచే ఆరాధితుడగువాడు. నాగరాజునే తన మణివలయముగా కలవాడు. తానురాజు. తానుండునది రాజహృదయము. తన నుతికి భోగిరాజు కావలెను. అలంకృతికి నాగరాజు కావలెను. ఈ రజతాగమున పుట్టిన ముఖకువలయము కల త్యాగరాజు భోగమట్టిది. నాగ రాజ మణివలయము మూలాధార చక్రము నందలి కుండలినీ మణివలయము. ఈ కుండలినీ ఉత్థాపితమై షట్చక్రభేదనమును చేసికొనుచు పోయి సహస్రారమున పడగవిప్పి బిందువున గల చివురు వంటి దైవము యొక్క చరణ బిందువును నుతింపగా అనగా స్పృశింపగా కలిగిన సుధాధారాసారము చేత డెబ్బది రెండువేల నాడులు శరీరాంతర్గత నాడీ ప్రపంచమున తడిపి ముద్దకాగా ఆనంద తన్మయుడైయున్న యోగి రాజుయొక్క హృదయమే తన నిలయముగా నుండువాడు సదాశివుడు.

ఆ సదాశివుడే ఈ విగ్రహ రూపమున గుడిలోనున్న త్యాగరాజేశ్వరాంతర్గత మహాచైతన్యము. కనుక నాగరాజ, భోగిరాజ, యోగిరాజ పదములు మూలాధారమునుండి సహస్రారము వరకు ప్రయాణించిన కుండలినీ రాజయోగమున చరితార్థుడైన యోగిరాజు. తన హృదయమున పొందిన త్యాగరాజ దర్శనమును "అంతర్బహిశ్చ తత్సర్వం త్యాగరాజః" అమనట్లు శ్రీవిద్యా రహస్యముతో సమన్వయించు కొనుటకు దీక్షితులవారు వాడిన దళములు సార్థకములు. వలయము కుండలినీ వలయము. మణి శ్రీవిద్యామణి.

"జనకోహవైదేహః సతంమణి మవిందత" [1] అన్న శ్రుతి ప్రమాణముగాగల మణి. నాగరాజు కుండలినీ స్వరూపుడు. ఆకుండలినియే మూలాధారమున వలయముగా మూడున్నర చుట్లు చుట్టుకొని యున్నది. అది మేల్కొనినపుడు తోకపై నిలచి షట్చక్ర భేదనమున పడగ విప్పినందున భోగమును విప్పిన భోగిరాజమైనది. అందుచే కలిగిన అమృత స్రావమున యోగిరాజు తన హృదయము త్యాగరాజ నిలయముగా చేసికొన్నాడు.

---

1. సౌ.ల. పుట 221

ఆ యోగిరాజు దీక్షితులవారే నన్నది శ్రీవిద్యారహస్య ప్రమాణముగా భావించవలెను. తన స్వానుభవమును కుండలినీ రూపమైన తన స్వర సంపుటితో సాహిత్య త్రిపుటితో లోకమున ప్రసరింపచేసి తన పుట్టవంటి శరీరము మట్టిలో కలసినను, తన తపోగ్నిలో లయము నొందిన తన ప్రాణము, నాదరూపమున విశ్వాంతరాళమున స్పందిపచేయుచున్న విదేహమూర్తులు శ్రీ ముత్తుస్వామి దీక్షితులు.

అందుచే తిరువారూరు నందలి నీలోత్పలాంబికకు అనుకూలతర కళత్రుడని అభివర్ణింపబడిన త్యాగరాజేశ్వరుడు దిక్పాలకులకు నిత్య అర్చనాలంబనమైనాడు. ఆత్యాగరాజేశ్వరుని మూలభూతమైన అమూల్యవరప్రసాదము నీలకంఠరూపుడై శూలము చేత బట్టి నాగరాజాది అలంకారములతో విరాజిల్లుచున్న మొదటి ఆవరణములోనున్న త్రైలోక్యస్థాన గురుగుహలోని గురుగుహని తండ్రి త్రినేత్రుడు, సాకారుడు, సగుణుడు, సుఖప్రదుడు త్యాగరాజేశ్వరుడు.

సాహిత్యము కొఱకై భాషాచమత్కారములు అలంకారములు, గుణములు, రీతులు, వృత్తులు ఎన్నెన్నో సోదాహరణముగా ఈకీర్తన నుండియే కాదు ప్రతి కీర్తనము నుండి చూపవచ్చును.

ఈ కీర్తనకు ఒక చరిత్ర యున్నది. ఆనాడు దీక్షితులవారి ఇంటిలో వంటసామగ్రి నిండుకున్నది. ఈయన భార్యలిరువురు శిష్యురాలైన దేవదాసి కమలమ్మను సహాయముకోరుట దీక్షితుల వారికి మనస్కరించలేదు. ఆ దేవదాసికి సహాయము వలదని వారు చెప్పిరి. ఇది ఎవరూ ఆర్చునదీ తీర్చునదీ కాదు. తనకు ఒక పెన్నిధానమున్నది. అది ఒక మహారాజాస్థానము. త్యాగరాజేశ్వర మహాసంస్థానము, దేవతాయతనము. ఆ రాజాస్థానము నుండే తనకు రక్షణ. ఇత్యాది భావములతో ఆనాడు దీక్షితులవారి హృదయమునకు ప్రబోధము కలిగినది.

చిత్తమా! ఈ జీవిత తాపత్రయమును త్యజింపరా త్యాగరాజును భజింపరా. 'భజరే త్యాగరాజం భజరే' అని చిత్తశుద్ధితో తాపత్రయమును త్యజించినారు.

వీలులేని కొన్ని విశేషములు ప్రతి కీర్తన యందు దీక్షితులవారు నిక్షేపించుచునే యుందురు.

## 3.త్యాగరాజేన సంరక్షిత్యోహం దయా సుధాసాగరేణ

సాళగభైరవిరాగము ఆదితాళము

22.వ.మే.జన్యము

పల్లవి:- త్యాగరాజేన సంరక్షిత్యోహం దయాసుధాసాగరేణ॥

అనుపల్లవి:- యాగశాలాది మహోత్సవేన యతివరాద్యుపాశితేన, భవేన॥ ॥త్యాగ॥

మ॥సా॥:- భోగభోగ్యప్రపంచోద్భవేన భుక్తిముక్తిప్రద పరమశివేన ॥త్యాగ॥

చరణముః- శ్రీరమణాది పూజిత చరణేన - సృష్ట్యాది పంచకృత్య కరణేన।

హార కటక మకుటాది భరణేన - హాటకక్షేత్రాది కరణేన॥

మ॥సా॥:- వీరఖడ్గఖేటాది ధరణేన - వికల్పవిరహితాంతః కరణేన।

మారకాలా త్రిపురాది హరణేన - మహాదేవ గురుగుహ స్మరణేన ॥త్యాగ॥

'త్యాగరాజేన సంరక్షిత్యోహం' అన్నది తృతీయా విభక్తితో రచింపబడినది. తృతీయావిభక్తిని కరణకారకము అందురు భుక్తి లేని తనకు భుక్తిని పుష్కళముగా సమకూర్చినాడు. అన్యము నెఱుగక తాపత్రయమున బడి కొట్టుకొని పోక త్యాగరాజే తన సర్వస్వమని అర్పించి నందున ఆత్యాగరాజు చేతనే తాను రక్షింపబడితిని అన్ననిశ్చయ జ్ఞానముతో, అనుభవముతో ఈ విధంగా కీర్తంచినారు. భక్తునకు భగవంతుడు ఉపకరణమగుట ఈ కరణ కారక వైచిత్యము. 'భక్తి'కి 'విభక్తి'కి అనుభవసారమైన అనుబంధము జ్ఞానముతో కూడియున్నది. ఉపాసనాసహితమైనది. అర్చనారూప కర్మానుష్ఠాన పరమైనది. రక్షించువాడు త్యాగరాజని ఈయన ఊరకుండడు. తాను పూజాకార్యము నిర్వర్తించును. వేదాంత తత్త్వమంతయు అనుభవములోనుండి వెల్లడించుటకే ఈ కృతిని దీక్షితులవారు తృతీయావిభక్తిని అనుసరించి రచన చేయుటలో ఉన్నది. ఆనాడు యాగశాలాది మహోత్సవమునకు పంపబడిన పాకద్రవ్యములు తన యింటికి చేర్చినది రాజ భటులుకాదు. మానవ సంకల్పముకాదు. భగవత్కృత్యము. దానిని నిర్వహించినది

తాను పూజించిన త్యాగరాజే. అయినను ఈ త్యాగరాజు మూలమున భవుడు కైలాసము లోని వాడు కాదు. తన ఉపాసనలో కుండలినీ భోగముచే భోగ్యమైన సుధాధారాసేచనము పొందిన నాడీ ప్రపంచమున గోచరించిన వాడగు సహస్రారగత బిందు స్థానోద్భవుడు. తనలో ఇతరములను స్పృశింపక స్వచ్ఛమైన ఆనంద రూపమున వెలుగొందినవాడు. అట్టి స్వామి భుక్తినీయగలడు, ముక్తినీయగలడు. సర్వతంత్ర స్వతంత్రుడు. అట్టిపరమ శివుడు తన్ను రక్షించినాడు.

భవేన - ప్రపంచోద్భవేన - పరమశివేన అన్నపదములు ఆలోచనామృతములు. త్యాగరాజేశ్వరుడు తిరువారూరు లోనివాడు. భవుడుకైలాసములోని వాడు. భోగభోగ్యప్రపంచోద్భవుడు దీక్షితుల వారియందు స్వస్వరూపాను సంధానమున ప్రతిఫలించినవాడు, సర్వాత్మకుడైన ఆస్వామి సర్వప్రకాశకుడు అయినటువంటి చతుర్భువన భవుడు చేయగలడేకాని తన ఊరివాడను కొనుచున్న పరిమిత ప్రాంతీయ ఈశ్వరుడుకాడు. తనయందు అమృతశ్రావము కలిగించిన బిందువున నున్న సదాశివ శక్తిరూపమైన పరమ శివుడు ప్రపంచ మంతటను సృష్టింపగలడు, కాపాడగలడు, లయింపగలడు. బ్రహ్మ విష్ణు మహేశ్వరుల చేత పూజింపబడిన చరణములు కలవాడు. సృష్ట్యాదిపంచ కృత్యములుచేయువాడు. అతడే తిరువారూరులోని భక్తులు సమర్పించిన హారకటక మకుటాదలను ధరించి హాటక క్షేత్రమన్న అగ్రామమున నెలవైయున్నవాడు. త్యాగరాజేశ్వరునకు - సృష్టికి ఇట్టి అనుబంధమున్నది. అనగా సగుణ నిర్గుణ రూపుడు బింద్వతీతుడు, మన్మథ మృత్యు, త్రిపురాసురులను హరించినవాడు. మహాదేవుడైన వాడు ఈ దైవము గుడిలోనివాడు కాడు. ఈమహాదేవుడు గురుగుహుని యందు స్మరింపబడినవాడు. దీక్షితులవారి అచంచల భక్తికి నిదర్శనమైన రచనలు ఇవి.

"మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవగరీయసీ
స్వస్వరూపాను సంధానం భక్తిరిత్య భిధీయతే"[1]

దీనిని బట్టి శ్రీ దీక్షితుల వారు స్వస్వరూపాను సంధానముచే త్యాగరాజును

---

1. శంకరభగవత్పాదుల "వివేక చూడామణి" లోకలదు.

తన యందు దర్శించుకొని, ఆ స్వామి విశ్వాంతర్యామియని, సర్వరక్షకుడని అట్టి వానిచే తాను రక్షింపబడినానని చెప్పినారు.

ద్వితీయావిభక్తిలోనున్న 'త్యాగరాజంభజరే' అను కీర్తనలో షట్చక్ర భేదనముచే భోగిరాజ నుతచరణ కిసలయము నుండి అమృత స్రావమును పొందిన యోగిరాజ హృదయమున నిలయుడైన త్యాగరాజు సుధా సింధు మధ్యమున బిందు స్థానమున శివశక్త్యైక్యరూపమున ఉన్నవాడు. ఇక్కడ శ్రీవిద్యానిధియైన దీక్షితులవారు తన మంత్రశాస్త్రానుభవములోని సుధాసింధువు నుండి కలిగిన అనుభూతికి ప్రత్యక్షమైన రూపము త్యాగరాజని భావింప చేయుచు శ్రీవిద్యా రహస్యస్థానమైన సుధాబిందువును 'సుధాసాగరేణ' శబ్దముచే ధ్వనింపచేసినారని అనుటలో అతిశయోక్తిలేదు. అంతేకాదు ఒక నిమిత్త కారణముగా ఉపాసనచే సిద్ధినొందినవాడు. అది "యతివరాద్యుపాసితేన భవేన" అనుటచే సూచితమైనది.

అంతకంటె ఇది శ్రీవిద్యా పరమైన భోగపరామర్శయే అనుటకు ఆధారమైన పదప్రయోగము 'ప్రపంచోద్భవేన' అన్నది. ఇది ఏ ప్రపంచము? భోగభోగ్యమైన ప్రపంచమని దీని అర్థము. భోగము చేత భోగ్యమైన ప్రపంచము నందు శివుడు ఉద్భవించు చున్నాడా? కాదే! భోగమనగా వలయము నుండి లేచిన నాగరాజు సుధాబిందు స్థానమున విప్పిన భోగము. ఆ భోగముచేత భోగ్యమైన లక్షణమును 'సౌందర్యలహరి' చెప్పుచున్నది.

"సుధాధారా సారైశ్చరణ యుగళాంత ర్విగళితైః
ప్రపంచం సించన్తీ పునరపి రసామ్నాయ మహసః" [1]

ఇత్యాది శ్లోకములో నిరూపింపబడిన

"అమృతస్య ద్వార బహుదా దోహమానం
చరణం నో లోకే సుధితాన్ దధాతు"[2]

సహస్ర కమలమున శ్రీదేవి చరణ ద్వంద్వము నుండి స్రవించు సుధాధారలు

1. సౌ.ల. శ్లోకం 10 పుట 63

2. సౌ.ల. శ్లోకం 10 పుట 67

నాడీ మండల ప్రపంచమును తడుపుచున్నట్లు చెప్పిన విషయము వేద శ్రుతి ప్రమాణముగా నిరూపించుకొనదగినది. దీక్షితుల వారు చమత్కారముగా కొన్ని దళములు, పదములు సార్థకముగా మనకు కొన్ని విషయములు స్ఫురింప చేయుటకా అన్నట్లు ప్రయోగించిరి. అట్టిపదములే ప్రతి కృతియందు చూడదగును. భోగభోగ్య, సుధాసాగర, ప్రపంచోద్భవ పదములు. ఇక్కడ ప్రపంచము 'సుధాధారాసారైః' అన్న శ్లోకములోని ప్రపంచము. సుధాసాగరము దానికి మూలమైన సుధాసింధువు. అది శ్రీవిద్యా సంప్రదాయ విదుడైన వాని రచన కనుక శ్రీవిద్యా పరమైన పదములను ప్రయోగించునపుడు వాని ప్రయోజనము తెలిసికొనుటకు సంప్రదాయ రహస్యము తెలియవలెను

దీక్షితులవారు యావద్భారతదేశములోని సకల దేవతామూర్తులను తమ కీర్తనలలో రూపకల్పన చేసి కీర్తించినను, వీరి ధ్యేయము ఒక్కటే. మూలమొక్కటే. అదే - శ్రీచక్రాంతర్గత బిందుస్థానము. మహాపద్మాటవము, సుధాసాగరము, శ్రీమేరు నగరము. ఈ వైవిధ్యమంతయు మన గుడులలో గోపురములలో మనము ధ్యానించిన రూపములతో ఉన్న దైవముల యందే వ్యక్తమగుచున్నది. ఈ ప్రపంచమంతయు నామరూపములచే అనేకము. కాని అవ్యక్తమైన స్థితిలో అది 'ఏకమేవ' ఒక్కటే. అస్తి, భాతి, ప్రియం ఈ క్రియలు ఈ తత్త్వము ఏకవచన ప్రతిపాదితములు. నామముచే అనేకత్వము. రూపముచే భిన్నత్వము.

ఈ మహావిషయము త్రైలోక్య మోహనమునందున్న దీక్షితులవారు అనేక కృతులు, అనేక నామములలో, విభిన్న రూపములతో నున్న స్త్రీ, పుం భేదములతో నున్న దృశ్యములుగా అభివర్ణించినను ఆయన భాసించిన తత్త్వము ఏకత్వము. దీక్షితుల వారి కృతులు కోశములుగా విభజించు కొనవలెను. పదములు -కోశము, భావములు -కోశము, విభక్తులు - ప్రయోగ కోశములు, పంచకోశములున్న మానవుడు ఒక్కడే. ఏకోశము ఇతర కోశములకు ప్రతిబింబము కాదు. అన్నియు శరీరములోని వివిధ కోశములు.

భిన్నత్వమునందు ఏకత్వ దర్శనమే ఋషి లక్షణము. ఋషి కానివాడు వ్రాసిన కావ్యము కావ్యము కాదు. కీర్తన కీర్తన కాదు. ఋషిది సమగ్రమైన దృష్టి. సమస్తమును

కేంద్రమున దర్శించుకొనును. తపస్వియైన దీక్షితుల వారి తపోరూపమైన ప్రాణములే ఆయన కీర్తనలు. కనుక ఆ కీర్తనలలోని జీవము ముత్తుస్వామి దీక్షితుల వారి జీవము. ఆయన విదేహుడు. దేహములేని ఆయన ప్రాణములు తపస్సుచే విదేహ స్థితిలో మనకు ప్రత్యక్షగోచరుడగుచున్నవి. ఆ ప్రాణములు నాద రూపములు. అవి తిరువారూరులోని దేవతల కేంద్ర బిందువునందు సముద్భవించి కళలై సంగీత రవళులై సాహిత్య పదచరణ పల్లవములై, నడచుచున్న చరణ యుగళములై, పలుకుచున్న పదములుగ, పాడుచున్న స్వరములుగ, ఒక ఋషియైన నరుని ఆకృతిలో ప్రత్యక్షములుగా నున్నవి. అక్షము అనగా ఇంద్రియము. ప్రత్యక్షమనగా సర్వేంద్రియములకు గోచరించు విషయము. ఇది ఇంద్రియ జ్ఞానముకల ఆలోచనా పరునకు గోచరించుట వాని అదృష్టము. అట్లు గోచరించినచో అనుభవించునది అమృతమునే.

ఈ తృతీయ విభక్తిలోని కీర్తన చరణ, కరణ, భరణ, అధికరణ, ధరణ, అంతఃకరణముల చేత ఆయా విశిష్ట లక్షణములతో విలసిల్లుచున్న త్యాగరాజేశ్వరుడుగా మారహరుడు, కాలహర, త్రిపురహర, లక్షణముల చేత మహాదేవుడైన గురుగుహుని చేత ధ్యానింపబడు హరుడుగా నిరూపింపబడినాడు. యదార్థమునకు త్రిమూర్తులచే పూజిత చరణుడు. త్రిమూర్తుల కంటే పరమైన తురీయరూపమున కతీతుడైన పరబ్రహ్మ శబ్దవాచ్యుడు. ఆయన సృష్ట్యాది పంచకృత్య కరణములచేత సర్వాదిష్ఠానమగు సగుణ నిర్గుణ పరబ్రహ్మ స్వరూపుడు. అట్టివాడు హాటక క్షేత్రమును తన అధికరణముగా అక్కడి భక్తులచే సేవింపబడుచున్నాడు. వారిచ్చిన హారకటక మకుటాది ఆభరణములను భజించుచు, వారిని స్థానిక దైవముగా బ్రోచుచున్న త్యాగరాజేశ్వరునిగా వీర ఖడ్గఖేటాది ఆయుధములు ధరించియు సంకల్పమే కాని వికల్పము లేని అంతఃకరణము కలవాడై అనగా బ్రోచుటయే కాని లయింపచేయుటగా కాక స్థితికారకులై మానవ అంతఃశత్రువుల కాదియైన మారహరణుడుగా కాలమునకు శత్రువైన దానవుని హరించు కాలహరణుడుగా దేశరూపమైన పురములకు, త్రిపురములకు చేటుకూర్చు త్రిపురాసురాది రాక్షస హరణుడుగా జ్ఞానులకు మహదేవుడైన గురుగుహుడు స్మరింపదగినవాడై యున్నాడు.

ఇది అంతయు శ్రీవిద్యాధిపుడు శివశక్త్యైక్య రూపుడైన, కామేశ్వర తత్త్వరూపుడైన పరమేశ్వరుని తిరువారూరులోని త్యాగరాజేశ్వర ప్రతిమలో ప్రాణ ప్రతిష్ఠ నొందిన పరదైవము. ఇట్టి నిర్దుష్టమైన, అనుభవైకవేద్యమైన విజ్ఞాన సంపదతో సగోచరముగను, గోప్యముగను, శ్రీ చక్ర యంత్ర, మంత్ర, తంత్ర రహస్యములను తద్దైవమునకు, గురువునకు, సాక్షాత్తు పరమేశ్వర స్వరూపమైన ఈ నాదవిద్యకు సమన్వయింపచేస్తూ రచించిన శ్రీవారి రచనలు, ఈకీర్తనలు గణనీయములు, సామాన్య మానవాళికి ప్రశంసాతీతములు. కరణము అనగా సాధనము. భగవంతుడన్న సాధనముచే మానవుడు సాధింపలేనిది లేదు. కాని కార్య సాధనకు కరణము భగవంతుడుగా తెలిసికొనిన మానవుడు కర్తవ్య పరాఙ్ముఖుడగునా? కాడు. మానవుని కర్యవ్యమేమన తను సాధింపవలసిన దానికి సాధనము తెలిసికొనుట. దానికి వివేకవంతుడైన మానవుడు అంతర్యాగ రూపమైన కృషి చేయవలెను.

## 4వకృతి త్యాగరాజాయ నమస్తే - నమస్తే

బేగడ రాగము రూపకతాళము

29వ మేళకర్త జన్యము

పల్లవి:- త్యాగరాజాయ నమస్తే నమస్తే । కా।

త్యాయనీపతే, పశుపతే, సింహాసనపతే॥

అనుపల్లవి:- వాగీశాద్యఖిల దేవ వందిత పదపంకజాయ।

యోగీశ్వర మానస సంయుక్త వదనవారి జాయ॥

మ॥సా:- భోగ మోక్ష దాన వామభాగస్థిత శైలజాయ।

యోగ గురుగుహాత్మజాయ। త్యాగధ్వజాయ, అజాయ॥ ॥త్యాగ॥

చరణము:- ముకుందాది పూజిత సోమస్కందమూర్తయే।

ముచుకుందాది భక్తజన మనోరథ పూర్తయే।

ముకురబింబ ప్రతిబింబిత ముఖ స్ఫూర్తయే।

ముని పక్షిమృగ కీటాది ముక్తిప్రద కీర్తయే।

మ॥సా:- సకలాగమ మంత్ర తంత్రసార జ్ఞానరక్తయే।

అకతాది త్రిరేఖాత్మకాధార ప్రవృత్తయే।

సకల, నిష్కళ, స్వరూప, సచ్చిత్సుఖ వ్యాప్తయే।

వికల్ప భేదయుక్తయే, విటంక రూపశక్తియే॥ ॥త్యాగ॥

త్యాగరాజేశ్వరునికి తన నమస్కారములు సమర్పించుటలో దీక్షితుల వారు చతుర్థీ విభక్తిని వినియోగించినారు. ఈ విభక్తులలో ఒక నిశ్చయ జ్ఞానముతో కూడిన ధృఢ భక్తి యుక్తితో పాటు క్రియాకారకత్వమున సమన్వయత్వముతో జ్ఞానవిజ్ఞాన మంత్ర తంత్ర రహస్య విశేష పూర్వకమైన ప్రతిపాదన యున్నది. దైవమున్నాడు. వానిని భజించుచున్నాను. వానిచే రక్షింపబడుచున్నాను. అట్టివానిచే రక్షింపబడు చున్నాను. అట్టివానికే నా నమస్కారములు. అతడు తిరువారురులో విలసిల్లిన త్యాగరాజు కనుక ముందు ఆపేరుతోనే నమస్కారము. ఇక్కడి నీలోత్పలాంబిక పతి కైలాసమున కాత్యాయనీపతి. జగత్తున

జీవరూప పశుకోటిపతి. ఇంద్రియ పశువులకు పతి. అంతఃశత్రువులైన కర్మేంద్రియములను పాలించుపతి. సింహాసనపతే - సింహాసనేశ్వరియైన ఆమె సింహాసనమున భాగస్వామి కావున ఈయన సింహాసనపతి. త్రిలోకాధిపతి, సకలలోకాధిపత్యము. శ్రీమాతా, శ్రీమహారాజ్ఞి, శ్రీమత్సింహాసనేశ్వరి అయిన ఆమె భర్తను గూర్చి అదే లక్షణములతో జన్య జనక సంబంధము, పాల్య పాలక సంబంధమును, అధిష్ఠాన సామ్య లక్షణమును సూచించుటకా అన్నట్లు కాత్యాయనీపతే, పశుపతే, సింహాసనపతే అన్న పదములతో తిరువారూరు దైవము చతుర్దశ భువనాధీశ్వరుని స్ఫురింపచేయుచున్నాడు.

ఇక్కడ ఒక సందేహము. కీర్తనలోని అన్నిపదములు చతుర్థీ విభక్తిచే క్రియాన్వయమును పొందుచున్నవి. కాగా ఈమూడు సంబోధనలు ప్రథమా విభక్తులుగా ఉన్నవి. కనుక ఇప్పుడు పతిత్వము స్వామి యందు సతీత్వము స్వామినియందు శ్రీ లక్షణము పరిపూర్ణత్వము యొక్క స్ఫూర్తి ఈపద ప్రయోగమున గోచరించుచున్నది.

వాగీశాద్యఖిల దేవతలు బ్రహ్మాదులు వాగీశ్వర విద్యాధి దేవతలచే వందిత పదపంకజ శ్రీమాత. అట్టే వాగీశాద్యఖిల దేవ పద పంకజుడు త్యాగరాజేశ్వరుడు ఏలక్షణములు పొందినట్లు చెప్పబడినవో అవే లక్షణములు స్త్రీ లింగమున ఆపదములచే చెప్పినచో అవి ఆపరమేశ్వరికి కూడ అన్వయించును. పరమేశ్వర పరమేశ్వరీ సమైక్య రూపమున ఈ వాగీశ, యోగీశ ఇత్యాది పదములచే స్ఫురింపచేయుట శివశక్త్యైక్య రూపమైన శ్రీవిద్యాతత్త్వమునకు సముచితముగా అనుపల్లవిలో నున్నవి.

భోగము లోకమున మానవ సుఖానుభవము. ఇది ఐహికము, మోక్షము పారమార్థికము. ఇవి రెండును ఇచ్చు లక్షణము శక్తి సమన్వితుడైనపుడే సాధ్యము. ఇక యోగమన్నది శ్రీవిద్యాపరమైన యోగమే. త్యాగభోగ యోగ మోక్ష ప్రదుడైన దైవము త్యాగముచే లోకమునకు మోక్షమును ప్రబోధము చేయుటకు తిరువారూరున త్యాగరాజుగా అవతరించెనని కవి హృదయము.

దీక్షితుల వారు చరణములో ముచకుంద వరదుడు ముకుందుడు. అట్టి ముకుందునిచే బ్రహ్మాదులకే సోమ స్కంద మూర్తి త్యాగరాజని చెప్పుటచే విష్ణుభక్తులకును

ఈయనయే శరణ్యుడని చెప్పినట్లైనది. క్షత్రియుడైన ముచుకుందునకు మోక్షము దుర్లభమనియు, తపస్సు చేత బ్రాహ్మణుడై ముక్తి పొందుదువని ముకుందుడు వరమిచ్చెను. దానిచే ముచకుందునకు ముక్తినిచ్చువాడు కాలరూపుడైన ఈశ్వరుడు.

"కాలాత్ముండు ఈశ్వరుడు అగ్రగణ్యుడు
జనులను కాలవశునిగా చేయును" [1]
మేమెవ్వరము విభులము గాము ఈశ్వరుడగు
హరి దక్కమోక్ష సంగతి చేయన్" [2]

కనుక విష్ణురూపుడైన శివుడు, శివరూపుడైన విష్ణువు ఒక్కడే. అందుచే ముచకుందాది భక్త జన మనోరథమూర్తి చేసినవాడుగా చెప్పబడిన ఈత్యాగరాజేశ్వరుడు సాక్షత్తు పరబ్రహ్మ స్వరూపుడైన హరితో అభిన్నుడు అనియు త్రిమూర్తులకు అతీతమైన తురీయ తత్త్వముగా ఈ త్యాగరాజస్వామిని చిత్రముగా పురాణ కథానాయకుడైన ముచకుందని ప్రసక్తితో నిరూపించినాడు.

ఇదే భావన పరమేశ్వరీ పరముగా లలిత సహస్రనామమునందు కూడా చెప్పబడినది-

"ముకుందా ముక్తి నిలయామూల విగ్రహరూపిణీ"[3]

అట్లే శ్రీవిద్యా పరముగా పరమేశ్వరుడు ప్రకాశబిందువని, పరమేశ్వరి విమర్శ బిందువు అని, ప్రకాశ బిందువు అద్దము వంటి విమర్శ బిందువున ప్రతిబింబమగుటచే మిశ్రమ బిందువు ఏర్పడుచున్నదని శ్రీ విద్యా విషయము.

శ్లో: " సకల భువనోదయ స్థితిలయమయ లీలా వినోదనోద్యుక్తః
అంతర్లీన విమర్శః పాతు మహేశః ప్రకాశమాత్ర తనుః[4]

---

1. భాగ. ప 1642 పుట 326
2. భాగ. ప 1643 పుట 326
3. ల.స. శ్లో. 157
4. కా.క.వి. శ్లో. 1

కనుక ఈ త్యాగరాజేశ్వరుడు శ్రీవిద్యలోని ప్రకాశబిందువు కనుకనే మునిపక్షి (జటాయువు) మృగ (గజేంద్రుడు) కీట(సాలెపురుగు) సర్పము మొదలగు వానికి ముక్తినిచ్చువాడు. అట్టివానికి నమస్కారము. ఇది పురాణ శాస్త్ర విషయముకాగా సకల వేదసార భూతమైన విషయమును మధ్యమ కాల సాహిత్యమున చెప్పుచున్నాడు. సకలాగమ మంత్ర తంత్రసార జ్ఞానమునందు రక్తి గలవాడు అని స్వామి పరముగా దీక్షితుల వారు చెప్పినారు. "ఛందస్సారా శాస్త్ర శారా మంత్రసారా తలోదరి"[1] అని పరమేశ్వరి పరముగా లలితా సహస్ర నామమునందు చెప్పబడినది.

"జ్ఞానీతు ఆత్మైవ మేమతమ్" అని భగవంతుని వచనము జ్ఞాని అయినవాడను నేనే. "అహంబ్రహ్మాస్మి". ఆయనకు బ్రహ్మజ్ఞానమునందు అంతప్రీతి. ఇక తాంత్రికముగా అకతాది త్రిరేఖాత్మకాధార ప్రవృత్తి కలవాడు. లోకమున శ్రీచక్ర పాసకులు శివశక్తులను త్రికోణ మూలబిందు స్థితియందు చెప్పుదురు. బిందువునకు అతీతుడైన వాడు, విడిగానున్నవారు, అవ్యక్తరూపమున నున్నవారు, బిందువున ఏకమై బిందు వికసనమున నాదరూపుడై, నాదవికసనమున అకారాది హకారాంత వర్ణమాలారూప 'సరిగమపదని' సప్త స్వర రూపకళలుగా లోకమున నామ రూపాత్మక వికసనము త్రిరేఖాత్మక, త్రికోణ మధ్యబిందు రూపులైన శివశక్త్యైక రూపులని మూల త్రికోణ సిద్ధాంతము. ఈ విషయ వివరణకై కామకలా విలాసమున గల 1నుండి 7వ సూత్రము వరకు తద్వివరణము పరిశీలింపవలెను.

శ్లో: స్ఫుట శివశక్తి సమాగమ బీజాంకుర రూపిణీ పరాశక్తి:

అణుతర రూపానుత్తర విమర్శ లిపి లక్ష్యవిగ్రహా భాతి"[2]

ప్రకాశ విమర్శాత్మక శివశక్తి స్వరూప తేజోమయమైన "అహ" మనే బీజద్వయం శరీరముగా గలిగి ప్రకాశించుచున్నదని వ్యక్తమగుచున్నది.

పరాశక్తి "అణుతర రూపానుత్తర లిపి లక్ష్యవిగ్రహా" అని చెప్పబడినది. అనగా

---

1. ల.స. శ్లో. 158

2. కా.క.వి. శ్లో. 3 పుట

అకృతిలేని ఆమెకు ఒక ఆకృతి ఏర్పడినది. ఆ ఆకృతి లిపి చేత గుర్తింపదగినది. ఎటువంటి లిపిచేతననగా అనుత్తర లిపి. ఇంతకంటె ముందు మరి వేరు లిపి లేదని చెప్పదగిన ఏవర్ణమో అది. అదియే అకారము ఇది ప్రకాశరూపమైనది. ఈప్రకాశము ప్రతిఫలించు బిందువు విమర్శ బిందువు. విమర్శ శబ్దముచే కలా రూపమైన శక్తి ద్యోతకమగుచున్నది. అది అగ్ని కలాత్మకము. ఇందువలన సర్వవర్ణ ప్రకాశమున చివరిది హకారముగా నున్నది ఈ 'అహ'మనె వర్ణ ద్వయ సంయోగము 'అహం'.

ఈ రెండు బీజముల మధ్య పంచాశద్వర్ణములు గర్భీకృతములుగా నున్నవనియు వర్ణపద మంత్ర రూపమైన సకల శబ్ద జాలమును కలాతత్త్వ భువనాత్మక సకల తత్త్వములను వస్తువులు 'అహ'మనెడి పదమునందు ఇమిడియున్నవి. అందువలన నామరూపాత్మకమైన జగత్తునకు ఇదియే కార్యకారణ రూపముగా నున్నది. ఇదే ఆత్మస్వరూపమైనందున ఆత్మ మాత్రమని సకలోపనిషత్తులందును ఉన్నందున ఇదే బ్రహ్మ వస్తువని సకలాగమ సిద్ధము. యోగవాశిష్ఠమందు -

శ్లోకంః- "అకార సర్వవర్ణాగ్రః ప్రకాశః పరమశ్శివః
హకారోఽంత్యః కలారూపో విమర్శాఖ్యః ప్రకీర్తితః
అనయోస్సామ రస్యం యత్తస్మిన్నహమితీర్యతే
అశిరస్కం హకారాంతమశేషాకార సంస్థితమ్
అజస్ర ముచ్చరంతం స్వం తమాత్మానముపాస్మహే" [1]

సర్వభూతము లందు 'అహమహమ్' అన్నదే ఆత్మ అని ఉపనిషత్తులు ఘోషించుచున్నవి. అట్టి ఈ ఆత్మ బ్రహ్మోపనిషత్ః-

శ్రుతిః "ఏష సర్వేషు భూతేషు గుఢాత్మాన ప్రకాశతే
దృశ్యతే త్వగ్ర్యయా బుధ్యా సూక్ష్మయా సూక్ష్మ దర్శిభిః"[2]

కనుక యావత్ జనకోటి శరీరము నందు చిత్కల జీవము సాక్షి, కూటస్థుడు,

---

1. కా.క.వి. పుట 16 (యోగవాశిష్ఠమందు)

2. కా.క.వి. పుట 16 (బ్రహ్మోపనిషత్ )

సూత్రాత్ర, చిత్తము, చైతన్యము, మనస్సు బుద్ధి మొదలగు వస్తువులు ఉన్నవని కామకలా విలాసేత్యాది గ్రంధముల వ్యాఖ్యానము ద్వారా తెలియుచున్నది. ఈవిషయము 'సకలాగమ మంత్ర తంత్ర సారజ్ఞానానురక్తయే' అను సమాసముచే సూచితమగుచున్నది. అది అగమజ్ఞానమైనను మంత్రజ్ఞానమైనను, తంత్ర జ్ఞానమైనను వాటియొక్క సారభూతమైన జ్ఞానమునందు రక్తికలవాడు పరమాత్మ అని దీక్షితుల వచనము. భగవద్గీత "జ్ఞానేతు ఆత్మైవమేనుతం" అని పేర్కొనుచున్నది. జ్ఞాని నేను అన్నాడు. జ్ఞానియైన వాడు నాకంటే భిన్నుడు కాడు.

అనగా జ్ఞానమే తన స్వరూపమని చెప్పుచున్నాడు. ఈజ్ఞానము ఎట్లు లభించుననగా "శ్రద్ధా వాన్ లభతే జ్ఞానం" శ్రద్ధాభక్తులు జ్ఞానమునకు మూలము. కనుక అట్టిశ్రద్ధ గలవాడు స్వామియందును రక్తుడగును అని గ్రహింపదగును. దీనికి కావలసిన విద్య ఏదనినా "సకలవిద్య". అనగా కలతో కూడినది. ఈకల ఏది? షోడశకలారూప విద్య. షోడశ కలలు ఎక్కడ ఉన్నవి. చంద్రునియందు కనుక ఇది చంద్ర కలావిద్య. ఆ చంద్రుడు ఎక్కడ ఉన్నాడు పరమశివుని జటాజూటమందు ఉన్నాడు. కనుక "కలాతు షోడశో భాగః" అని చెప్పిన విషయము ఈ షోడశ కలాపరిపూర్ణమైన విద్య. అందలి చిట్టచివరగల 'కల' కనుక లోకమునందు సమస్తము గూర్చి చెప్పవలెనన్నచో సకలము చెప్పినట్లే. కనుక సమస్తమునకు లోకమున సకలము అను పదమును మనము వ్యవహరించుచున్నాము.

ఇంతగా దీక్షితుల వారు ఆలోచించి సకల, ఆగమ పదములు వాడెనా? ఆలోచింపక పదములు వాడుట విద్యలేని వాని విషయము. కాని తాను ఇంత ఆలోచన చేసినట్లు చెప్పుటకే ఈమధ్యమకాల సాహిత్యమున రెండవ చరణమున "అకతాది త్రిరేఖాత్మకాధార ప్రవృత్తయే". అన్న పదములు ప్రయోగించెను. అకతాధి అనగానేమి? అ నుండి అః వరకు ఉన్న 16 అచ్చులు 'క' నుండి 'త' వరకు ఉన్న 16 హల్లులు 'థ' నుండి 'స' వరకు ఉన్న మరి 16 హల్లులు. ఇవి మొత్తము 3 రేఖలకు సమానమైన పరిమితిగల అక్షర రూపకలాన్యాసములు. ఇవి 3 రేఖలు. ఈ త్రిరేఖలతో ఏర్పడిన

త్రికోణము నందలి 3 సమబాహువులు కల త్రిభుజము. గణితములో సమబాహు త్రిభుజము యొక్క లక్షణముచే ఇది 3 X $60^{0}$= $180^{0}$ డిగ్రీలు భగవంతుని శరీరము యొక్క అర్థము. 'హ' రార్థం దీనిని 'సౌందర్యలహరి' నుండి సమన్వయించు కొనవలెను. అది ఆధారముగా ప్రవర్తించువాడు 'అకతాధి త్రిరేఖాత్మకాధార ప్రవృత్తయే".

సకల మంత్రములు 'అ' కారము నుండి 'హ' కారము వరకు ఉన్న పంచాశద్వర్ణ రూపమైన మాతృకలు. ఈ కలవిన్యాసముచే ఏర్పడిన త్రికోణాది రేఖా సూచిత తంత్ర మంత్రము. ఆ తంత్ర మంత్రము చేతన్యాసము చేయబడినది. దీనికి మూలమైన ఆగమము శ్రీ విద్య. ఈమంత్రతంత్రము లందు అయనకు రక్తి లేదు. వీని సారమైన ఏజ్ఞానమున్న దో దానియందు అయన రమించును. అనగా కేవలము జ్ఞానస్వరూపుడు. ఈవివరణము నంతయు మననము చేసికొనుటకు ఎక్కడెక్కడి విషయములనో ముడిపెట్టుకొనుటయని భ్రమింతు మేమో యని దీక్షితుల వారే ఓ విద్వాంసులారా త్యాగరాజేశ్వర భక్తులారా చిత్, ఆనంద స్వరూపుడని అందుచే సూక్ష్మసూక్ష్మాను శీలనము చేత శ్రీవిద్యాంతర్గతమైన సమస్తము అన్వయించుకొనుటకు ఆధారమైన వికల్ప భేద యుక్తి చేత విటంకరూప శక్తిగా తిరువారూరున విగ్రహరూపమున ప్రతిష్ఠితుడై యున్న వాడని అనుచు అట్టి త్యాగరాజాయ నమస్తే నమస్తే అనిరి.

ఈకృతిలో ఒక క్రమమున్నది. ఒకమంత్ర రహస్య లక్షణమున్నది. అది ఏమనగా ఉత్కృష్టములైన పంచదశీ షోడశీ శ్రీవిద్యా మంత్రములు పంచదశీ, షోడశీ విశిష్టములైనవి. అవి మంత్రాధీనమైన దేవతల యొక్క స్వరూపమును అక్షరరూపముగా త్రిఖండములలో నిరూపించునవి. లలిత సహస్ర నామమున-

"శ్రీమద్వాగ్భవ కూటైక స్వరూప ముఖ పంకజా." [1]

"కంఠాధః కటి పర్యంత మధ్యకూట స్వరూపిణీ

శక్తి కూటైక తాపన్న కట్యధో భాగధారిణీ" [2]

శివశక్త్యాత్మక శ్రీమాతృముఖ పంకజం కూటైక స్వరూపం. అది యోగీశ్వర

1. ల.స. 34 శ్లోకం

2. ల.స. 35 శ్లోకం

మానసముల యందు లగ్నమై యుండును. కంఠాధఃకటి పర్యంత మధ్యకూటము షట్ చక్ర విలసితము. సమస్త వర్ణమాలా మాతృకాన్యస్తము సాధనకు ఈ షట్ చక్ర భేదనమైనగాని దేవతాముఖ పంకజము మానసమున గోచరింపదు. ఈసాధనలో దేవతలు, వాగీశాద్యులు కూడా మాతృకాపాదములనే ఆశ్రయింతురు. వారు పద పద్మములను ఆశ్రయించి షట్ చక్రములందు కొందరు, అగ్నిమండలము వరకు కొందరు, సౌరమండలము వరకు మరికొందరు, చంద్రమండలమును ఆశ్రయించువారు మరికొందరు యుందురు. వీరు దేవతాపద పంకజాశ్రితులు, యోగీశ్వరులు. వీటి నధిగమించి సహస్రారమున బిందువునందు దేవతా మహత్వసంపదను హృదయమున, సుధాస్రావముననుభవింతురట. ఈరహస్యార్థము అనుపల్లవిలో "వాగీశాద్యఖిల దేవ వందిత పద పంకజాయా" అను పదసంపుటి చేత దీక్షితుల వారు ప్రస్ఫుటింపచేసిరి.

దేవతలు భోగమును పొందుదురు. యోగీశ్వరులు మోక్షమును పొందుదురు. ఏది దానము చేయవలెననినా శివుడు పరిగత శక్తిగా నుండవలెను. ఈ త్యాగరాజస్వామి వామ భాగస్థిత శైలజుడు. అదియే మధ్యమ కాల సాహిత్యములోని సూచన. భోగము నీయగలవాడు మోక్షమునీయలేడు. కాని మోక్షము నీయగలవాడు భోగమును కూడా ఇచ్చును. భక్తులలో ప్రేయస్సును కోరు మార్గము దివ్యమార్గము. వారు దివ్యౌఘమునకు చెందినవారు. శ్రేయస్సును కోరువారు యోగమార్గము ననుసరించువారు. వారు సిద్ధౌఘమునకు చెందినవారు. మానవౌఘమున నున్న వారు షట్ చక్రములయందు చక్రభేదన సాధనలో శ్రమింతురు. ఫలించినచో శ్రేయస్సును కోరినవారు దేవతాముఖ పంకజమును మానస సంయుక్తము చేసికొందురు. అదివారి సిద్ధి. ప్రేయస్సును కోరువారు పదపంకజములను ఆశ్రయించి స్వర్గాది ప్రయోజనములను పొందుదురు. వారు శక్తి కూటమును ఆశ్రయించి యుందురు. వీనిచే శ్రీ విద్యామంత్రమున ప్రథమఖండము పదపంకజముగా, శీర్షఖండము వదనవారిజముగ మధ్యఖండము సాధనాఖండముగ శ్రీ విద్యోపాసకులు మూడు ఖండములలోను తమ ఆశ్రయమును కోరుకొందురు. ఈవిద్యకు మకుటాయమానమైన షోడశీ మంత్రము ఫలించినచో వారు కైవల్యమును పొందుదురు.

శ్రీవిద్యాపరమైన ఇట్టి సమన్వయముతో చతుర్థీ విభక్తిలోని ఈకీర్తన మున్ను భావించినచో దీక్షితుల వారి యొక్క ఉద్దేశ్యము పరమార్థ ప్రతిపాదనము. సాధక మార్గ ప్రదర్శకము శ్రీ విద్యాదేవత యొక్క సన్నిధిలో దేవతల యునికి, యోగీశ్వరుల సిద్ధివ్యక్తమగును. ఇట్టి ప్రమాణభూతమైన రచన సంస్కృత భాషలో ఉండుటచే శ్రీవిద్యా రహస్యము సూక్ష్మాను శీలనము చేతగాని గోచరింపదు. దీనికి గురుప్రబోధము అవసరము.

★★★

## 5. "త్యాగరాజా దన్యంనజానే"

దర్బారురాగము ఆదితాళము

22. వ.మేళ కర్తజన్యము.

పల్లవి:- త్యాగరాజా దన్యం నజానే గురుగుహాది
సమస్త దేవతా స్వరూపిణి ॥శ్రీ॥

అ॥ప:- రాగాది వృత్తి రహిత
స్వానుభోగానంద స్ఫూర్తి విశేషాష్ట ॥శ్రీ॥

చ॥1:- భూ, గంధవాహ, వహ్ని, జల
గగనపుష్ప, వద్యేజ్యమయ మూర్తే ॥శ్రీ॥

చ॥2:- సత్త్వ రజస్తమో గుణాతీత సత్యజ్ఞానానంద రూపిణో
ద్వైత్వాది భేదవర్జన పరమాద్వైత స్వాత్మానందరూపిణో
త్రితత్వ పరిచ్ఛేదరాహిత్య త్రైపద పరమాద్వైత రూపిణో
తత్వం పదార్థ శోధన శేషిత తత్పదలక్ష్యార్థ స్వరూపిణో

మ॥సా:- తత్వ సమష్టి వ్యష్టిరూపలయ తారక బ్రహ్మరూపాత్మనో
తత్వం స్వాతిరిక్త సమాన తత్సక్తమాన రూపాత్మనః॥
॥శ్రీ త్యాగరాజా॥

ఈ కృతి త్యాగరాజేశ్వరుని కంటే భిన్నమైన వస్తువు లేదన్న జ్ఞానమునకు నిరూపణగా పంచమీ విభక్తిలో చెప్పబడినది. త్యాగరాజే బ్రహ్మము. అదియే సత్యము.

మిగిలినవి సత్యములు కావు, మిథ్య. మిద్య అన్నదియే యథార్థమన్న భ్రాంతి కలిగించుచున్నది. ఈభ్రాంతినుండి మనసు మళ్ళించుకొన్న వారికి బ్రహ్మమే సత్యముగా గోచరించును. దానికి వివేకము అవసరము. హంస నీటి నుండి పాలను వేరు చేసినట్లు ఇది కావలసినది, ఇదికాదు అన్న జ్ఞానము కలిగించుటకు పంచమీ విభక్తిలోని రచన వినియోగపడును. త్యాగరాజు కంటె అన్యమెరుగను. సమస్త దేవతలు ఆయన స్వరూపమే అట్టి త్యాగరాజు కన్న మరి అన్యదైవము లేదని దీక్షితుల వారు పల్లవిలో వివరించిరి.

అను పల్లవిలో లోక ప్రవృత్తి రాగాదులచే కలుగునది. అది అంతయు మిథ్య. సత్యము కాదు. కనుక రాగాదివృత్తి రహితమైనది. స్వానుభవము కలది. ఆనందము యొక్క స్ఫూర్తి విశేషముచే ఒప్పినది ఒకటున్నది. అది త్యాగరాజ రూపమైన దైవము. పంచభూతములు, సూర్యచంద్రులు యజ్ఞము చేయువాడు అన్న ఈ ఎనిమిది రూపములు ఆయన మూర్తులేనని భారతీయ సంప్రదాయము!

"యా సృష్టిః స్రష్టురాద్యా వహతి విధిహుతం యహవిర్యాచహోత్రీ
యేద్వే కాలం విధత్తః శ్రుతి విషయగుణా యాస్థితా వ్యాప్త విశ్వమ్।
యామా హుః సర్వ బీజ ప్రకృతిరితి యయా ప్రాణినః ప్రాణవన్తః
ప్రత్యక్షాభిః ప్రపన్న స్తను భిరవతు వస్తాభిరష్టాభిరీశః"

ఇంతకన్న ప్రపంచం లేదు. ఆయన రూపం కానిది లేదు. ఆయన రూపమైనది ఉన్నది. అనగా ఉండుట, లేక పోవుట దేని చేత తెలునన సృష్టి సంకల్పము కలిగిన పరమాత్మకు సత్త్వరజస్తమో గుణములు కానిదాని పూర్వస్థితిలో పరమాత్మ కేవలము ఆనందస్వరూపుడు. గుణాతీతుడు. గుణముల చేత సంసార లోకము సాగుచున్నది. ఇది అసత్యము దీనికి అతీతమైనది "సత్యం జ్ఞానం అనంతంబ్రహ్మ". సచ్చిదానంద రూపవతి. చిత్ అనగా జ్ఞానము. అందువలన 'సత్య జ్ఞానానంద రూపిణో' అని దీక్షితుల వారు చరణములో చెప్పిరి.

ద్విత్వము విమర్శతో ఏర్పడినది. అది ఆదిగా భేదము వర్ధనమైనది. అనగా

1. కాళిదాసు, అభిజ్ఞాన శాకున్తలం I-1

పెరిగినది. ఆ రెండవది (ద్విత్వము) పరమేశ్వరుడు తన యందు ఆరోపించుకొన్నమాయ. దానిచే లేనివన్నియు ఉన్నట్లు - ఉన్నవి లేనట్లు భ్రమించుటయైనది. అది భ్రమ. భ్రమను కలిగించునది భ్రమణము. సంసార చక్రము తిరుగుచునే యుండును. ఎప్పటికప్పుడు మొదలు పెట్టుచునే యుండును. లేనిది ఉన్నదనుకొనుట చేత భ్రమణముకాని, లేనిది తెలుసుకొని ఉన్నదానిని కనుగొన్నచో అది ప్రమాణము. ప్రమ అనగా యదార్థ జ్ఞానము.

"ప్రమాం నయతి ఇతి ప్రమాణం భ్రమం నయతి ఇతి భ్రమణం".

కనుక దీక్షితుల వారు భ్రమ నుండి ప్రమను పొందుటకు ప్రమాణమైనది త్యాగరాజ దైవమని తదన్యమును నమ్ముట భ్రమయని, అట్టి భ్రమ తనకు లేదు కనుక తనకు ప్రమాణము త్యాగరాజని అట్టి ప్రమాణ స్వరూపమైన స్వామి ద్విత్వాది భేద వర్ధనమునకు మూలమై ఈ సకలము నందు తాను అచ్ఛమైన అద్వైత భావముతో ఏక రూపుడై తన యందు తాను రమించుచున్న స్వాత్మానంద రూపుడై యున్నాడని అట్టివాని కంటె ఈ ద్విత్వ విశిష్ట జగత్తు భిన్నముగా కనిపించు చున్నను ఇది ఈయన స్వరూపమే అన్నది ద్వితీయ చరణార్థము.

ఇదే విధముగా మూడు తత్వములు సృష్టి, స్థితి, లయ తత్వ పరిచ్ఛేదములు లేని త్రితత్వ విభాగ రహితమై మూడింటికి పైనున్న త్రిపద రూపమునకు మూలమైన పరమాద్వైత రూపమున కంటే అన్యదైవము లేదన్న పరిజ్ఞానముచే 'త్యాగరాజా దన్యం నజానే' అని దీక్షితులవారు ద్వితీయ చరణములో చెప్పిరి. త్రితత్వములు:-

1. ఆత్మ తత్వము, విద్యా తత్వము, శివతత్వము
2. జ్ఞాన, జ్ఞాతృ, జ్ఞేయములు
3. మితి, మాతృ, మేయములు
4. ధ్యాన, ధ్యాతృ, ధ్యేయములు

ఈ విధమైన త్రిపుటి అంతయు ఒకటే. పరిచ్ఛేదము లేనిది. ఏకాగ్రచిత్తముతో

---

1. కా.క.లి.లో త్రితత్వములు పుట 51, 2. ల.స. శ్లో. 179

3. ల.స. శ్లో. 62, 4. ల.స. శ్లో. 62

ఆలోచించడం - ధ్యానము. ఉపాసించే సాధకుడు- ధ్యాత. ఉపాసింపదగిన దేవి - ధ్యేయము. ధ్యాత అయిన సాదకునకు ధ్యేయమైన పరాశక్తికి మధ్య ఆలోచనా రూపమైన ప్రయాణ సాధనము ధ్యానము. ఇలా ఏకాగ్ర చిత్తంతో సాధన సాగించగా కొన్నాళ్ళకు ధ్యాత ధ్యానములు ధ్యేయమైన పరాశక్తిలోనే లయమైపోవును. దానినే 'సమాధి' అందురు. అప్పుడు ధ్యాన ధ్యాతృ ధ్యేయం వేరుగాక అంతయు ఒకటిగా నుండును. ఈ మూడు కలిపి ఒక్కటి అగుటయే 'త్రయీ' పదము. ఆ త్రయీ పదము మూడు విభాగములు లేకపోవుటచే అంతము ఒకటి అగుటచే పరమము నందు అద్వైత రూపమును పొందినది. అట్టి భగవంతుడు "త్రితత్వ పరిచ్ఛేద రాహిత్య త్రైపద పరమాద్వైత స్వరూపిణః". అట్టివాడగు త్యాగరాజు దైవము కంటే అన్యము నెఱుగను. ఇది జ్ఞానియైన వాడు అనగల మాట. తన శాస్త్ర పరిజ్ఞానము చేత ఈ తత్వమును నిరూపించుటకు తగిన శాస్త్రీయ పదజాలము శ్రీ దీక్షితుల వారు ఒక మహా జ్ఞాన యజ్ఞ సామగ్రిగా వినియోగించిరి.

దీక్షితుల వారు మరియొక నిదర్శనము నిచ్చుచున్నారు. తత్,త్వం అను పదముల అర్థమును శోధింపగా తేలినది శేషితము. 'తత్' పదము దాని చేత గుర్తింపదగిన ఏ అర్థము కలదో అదియే తన స్వరూపముగా కలవాడగు త్యాగరాజు కంటే అన్యమెవరు. ఈ లోకమంతయు తత్-వాడు, త్వం-నీవు, అయం-తాను. అను పదములచే తెలియబడుచున్న ప్రథమ, మధ్యమ, ఉత్తమ పురుషల వ్యవహారముతో సాగుచున్నది. ఈ తత్, త్వం, అయంలు కలసియే తత్వమయమైనది లోకము. లోకములో తత్, త్వం, అహంగా చెప్పబడుచున్న ఎవ్వడును ఉండుట లేదు. శాశ్వతముగా ఉండువాడు కూడ ఈపదముల చేతనే చెప్పబడుచున్నాడు. వాడుండుట చేతనే లోకమున్నది. తత్, త్వం, అయం అన్న వ్యవహారము వానిచే జరుగును. అది నిత్యం. సత్యమైనది. అందరిలో అహం అన్నవాడు - వాడు. త్వం అని పిలువబడేవాడు - వాడు. తత్ అని చెప్పబడేవాడు-వాడు. వాడు సత్. వాడు అనగా తత్. సత్ అనగా ఉన్నవాడు. తత్, సత్ అన్నది యదార్థము కనుక ఓం, తత్, సత్, అని అన్నది పరమార్థము. ఈ విషయమై దీక్షితుల వారు

తత్, త్వం పధార్థ శోధనచే శేషితమైన శివ స్వరూపం తిరువారూరులోని 'త్యాగరాజాత్మకం' గా పేర్కొనిరి. లలిత సహస్రనామములో- "చితిస్తత్పద లక్ష్యార్థ చిదేక రస రూపిణీ"[1] అని కలదు. తత్ పద లక్ష్యార్థము అన్న పదమునే శ్రీ దీక్షితుల వారు ఇక్కడ త్వం పదార్థ శోధనచే శేషితమైన, తత్‌పదముచే లక్ష్యమైన అర్థమే స్వరూపముగా కలవాడైన త్యాగ రాజేశ్వరుని కంటే అన్యదైవమును ఎరుగను. లోకములో బ్రహ్మసత్యము, జగత్ మిధ్య అన్నది ఈ వాక్యార్థము.

మధ్యమకాల సాహిత్యములో దీక్షితుల వారు తత్త్వ సమష్టి వ్యష్టి రూప లయ తారక బ్రహ్మ రూపాత్మకుడైన త్యాగరాజ దైవము కంటే అన్యమెరుగననిరి. తత్త్వ సమష్టి అనగా తత్, త్వంల యొక్క సమ్మిళిత రూపము. అనగా 'తత్త్వమసి' అనునది. తత్ పరమాత్మ అని త్వం జీవాత్మ అని వ్యష్టిగా చెప్పినను తత్ పదార్థమే త్వం, త్వం పదార్థమే తత్. ఈవ్యష్టిరూపములందు అద్వైతముచే సారూప్యము, లయముచే సాయుజ్యము, తారకముచే కైవల్యము కనుక, సారూప్య సాయుజ్య, సాలోక్యాది ఐదు విధములైన ముక్తి యొక్క స్వరూపము తానే అయినవాడు. వానికంటె ఇతరులు లేరు. ఇతరుని ఎఱుగను, అనిన జ్ఞాన దృష్టి వివరణ పరమైన వాక్యము దీక్షితుల వారు ఈ చరణమున వివరించి, తత్త్వం అనునది స్వాతి రిక్తముగా సహన వహించుచు తత్ యందు సక్తమానమైన అనగా తగులుకొని యున్న దైవ రూపమే తన ఆత్మగా కలవాడు. త్యాగరాజ దైవము కంటె అన్యమెఱుగను. దీనిలో భక్తి యున్నది. తత్, త్వంలు తన కంటె అతి రిక్తములు కావు. కాని అతిరిక్తము వ్యవహారములో నున్నది. అనగా విగ్రహరూపములో నున్న త్యాగరాజునకు అర్చనా దికము జరుగుచున్నది. విగ్రహరూపములో లేని తత్ పద లక్ష్యార్థ స్వరూపుడైన వాడు వేఱు ఈవిగ్రహము వేఱు అన్నది చర్మచక్షువులకు గోచరించుచున్న వ్యావహారిక సత్యము. అట్టి విగ్రహము నందు సక్తమానమైన, కూడియున్న పరమాత్మ త్యాగరాజ విగ్రహము కంటె భిన్నము కాదు. అనగా ఇది విగ్రహము కాదు. ఇతడు అన్యదైవము కాడు. ఈ విగ్రహమునందున్న ఆత్మస్వరూపుడు ఇక్కడ స్థితి చేత త్యాగరాజేశ్వరుడన్న నామము, రూపము కలిగి ఏకాత్మనా తత్ త్వంల యందు సక్తమానమైన ఏకైక రూపము

1. ల.స.నా. 80 శ్లోకం

గల ఆత్మ పదార్థము. అట్టి త్యాగరాజేశ్వరుని కంటె అన్యమెఱుగను.

గురుగుహాది దైవములు పరమాత్మ యొక్క కుమారులుగా విభిన్న సంబంధములతో చెప్పబడినను ఈసమస్త దేవతలది వ్యష్టిగను, సమష్టిగను ఒకటే తత్వం.

ఇది అద్వైత సిద్ధాంతప్రతిపాదనలో పరిపూర్ణమైన సిద్ధాంత వివరణ. ఈశైలి విశ్లేషణాత్మకమైన శైలి. శాస్త్రీయమైన విషయములతో జటిలమైనది. సంగీతము కంటె అర్థగౌరవయుక్తమైనందువలన సాహిత్య గుణ సంపన్నమైన సంగీతమునకు బరువైనది. సాహిత్యపరముగా ఎక్కువ అలంకారిక రచనకు కొఱుకుడు పడనిది. అయినను 'గ' కార అను ప్రాస 'రూపిణః' అన్న అంత్యాను ప్రాసచే రాజమార్గము ననుసరించి దర్బారు జరిపినది. ఈ క్లిష్టమైన మార్గము శ్రుతి పరిపుష్టముగా చేయుట దీక్షితుల వారికే చెల్లినది. ఇందు 'దర్బారు' రాగ నామము కలదు.

★ ★ ★

## 6వ కృతి "శ్రీ త్యాగరాజస్య భక్తోభవామి"

రుద్రప్రియ రాగం త్రిపుటతాళము

22.వ. మేళకర్త జన్యము

పల్లవిః- శ్రీత్యాగరాజస్య భక్తో భవామి।

కించిత్ జ్ఞోప్యతోహం । సర్వజ్ఞేవాస్మి ॥శ్రీ॥

అ॥ప॥ః- కాత్యాయనీ మోహిత స్వరూపస్య ।

కామాది వృత్తి హరణ ప్రతాపస్య ।

భూత్యాభరణాలంకృత గాత్రస్య ।

బుద్ధ శుద్ధ నిత్యానంద మాత్రస్య ॥శ్రీ॥

చరణముః- అమరేశాది పూజిత సాయంకాలస్య ।

అతిశుద్ధ మర్దళాది వాద్యలీలస్య ।

నవవస్వ్యాది భక్తజన పాలస్య ।

నత సురాసుర సంయతి జాలస్య ।

కమల కల్హార మాలస్య । కాంచన మణి చేలస్య ।

కమనీయ గురుగుహ మూలస్య । కమలాపుర కృతలీలస్య ॥

మ॥సా॥- విమల రుద్రగణికానర్తన వినోద భేద మోదకస్య ।

కమల విడంబన కరస్య । శంకరస్య, పురహరస్య, హరస్య ॥శ్రీ॥

భగవంతునికి భక్తునికి ఉన్న సంబంధము నిరూపించుటలో దీక్షితుల వారు షష్ఠీ విభక్తిలో ఈ కీర్తనను రచించిరి. నేను త్యాగరాజ స్వామి యొక్క భక్తుడను. ఇక్కడ ఒక చమత్కారమున్నది. త్యాగరాజు దైవము, తాను భక్తుడు. ఇది ద్వైతము. దీని వెంటనే అద్వైతమున్నది. నేను కించిజ్ఞుడను అయిననూ సర్వజ్ఞుడనే. కించిజ్ఞుడు సర్వజ్ఞుడెట్లగును ? కాలేడు. కాని కించిజ్ఞుడైన తాను సర్వజ్ఞుడైన త్యాగరాజు యొక్క భక్తుడు. ఆ భగవంతుడు తన భక్తుని కించిజ్ఞునిగా ఉండనీయడు. కనుక తాను సర్వజ్ఞుడగుట తథ్యము. జీవుడుగా కించిజ్ఞుడు. ఆత్మబుధ్యా సర్వజ్ఞుడు. ఈ సంబంధము ఎట్టిదనిన ఆంజనేయస్వామి రామునితో అన్నట్లు-

"దేహ బుధ్యాత్తు దాస్యోహం జీవ బుధ్యాత్వదంశకః

ఆత్మ బుధ్యాత్వమే వ్యాహం ఇతినిశ్చితామే మతిః"

ఈ దృష్టితో భక్తునకు భగవంతునకు అనుబంధము ఇక్కడ మనము భావించవలెను. వేదము కాండద్వయముచే భగవంతుని ప్రతిపాదించు చున్నది. ఆ కాండద్వయములు 1. కర్మకాండ 2. జ్ఞానకాండ. ఈ రెండింటికి మధ్యనున్నది భక్తి. ఈ భక్తి అన్నది కర్మతోను, జ్ఞానముతోను కూడ కలసి యున్నది. భక్తిలేని కర్మచే భగవంతుడు తెలియబడడు. భక్తిలేని జ్ఞానము భగవంతుని చూపదు.

ఇక్కడ శ్రీ దీక్షితులవారు శ్రీ త్యాగరాజేశ్వరుని అర్చించు కర్మానుష్ఠానములోను భక్తుడే. తనకించిజ్ఞమైన లక్షణముచే భక్తితో జ్ఞానమును పొంది ఆభగవంతునిలో తాను తాదాత్మ్యమును పొందును. ఈ రీతిగా ఈ కీర్తనలో దీక్షితులవారు స్వస్వరూపాను సంధానములో భక్తియొక్క అవసరమును గుర్తించి తన అనుష్ఠానమార్గమును మనో హరముగా

1 చూ.పు.

నిరూపించుచున్నారు.

మనము ఇక్కడ భక్తి-భక్తుడు అన్నమాటలకు అద్వైతపరమైన అర్థమునే చెప్పుకొనవలెనని దీక్షితుల వారి ప్రతిపాదన. అదియే పల్లవిలోని పరమార్థము. దీనిని సమర్థించుటకు శంకరభగవత్పాదుల "వివేక చూడామణి" లోని భక్తి నిర్వచనము గమనింపదగును.

మోక్షసాధన సామగ్రిలో అన్నిటి కన్నా గొప్పది భక్తియే. భక్తి అనగా తన స్వరూపము తాను తెలిసికొనుట అని శంకరుల నిర్వచనము. దీక్షితులవారి పల్లవిలోని మొదటి పాదము నేను త్యాగరాజ భక్తుడను. ఈ భక్తిని మోక్షమునకు సాధనగా స్వీకరించెను కనుకనే తాను కించిజ్ఞుడను, అని తెలిసియు సర్వజ్ఞునియందు తనకుగల భక్తియే తన్ను సర్వజ్ఞుడైన భగవంతుని తోడి సాయుజ్యమున నిలుపునన్న ధృడ విశ్వాసముచే నేను సర్వజ్ఞుడనని చెప్పుట జరిగెను.

అనుపల్లవిలో మొదటి మూడు పాదములు సకల బ్రహ్మమును చెప్పునవి. నాలుగవ పాదమున నిష్కళ బ్రహ్మమును చెప్పును. తిరువారూరు లోని త్యాగరాజ స్వామి ఉపాసకులకు సౌకర్యార్థమై రూపకల్పనమున ప్రతిమ ప్రతీకగా నున్న బ్రహ్మము. ఈ త్యాగరాజ స్వామి ఆలంబనముగా తాను భక్తితో ఉపాసించినది నిష్కళ బ్రహ్మము. సర్వాంతర్యామిని. అట్టి సర్వాంతర్యామి శుద్ధ బుద్ధ నిత్యానంద మాత్రుడు. కాని భక్తునకు పూజించుటకు స్వామి ఒక ఆకృతిలో కనిపించవలెను.

"ఉపాసకానం సౌకర్యార్థం - బ్రహ్మణో రూపకల్పనా"

అట్టి రూపములో త్యాగరాజేశ్వరుడు కాత్యాయనీ మోహితస్వరూపుడు. కామాది వృత్తి హరణ ప్రతాపుడు, భూత్యాభరణాలంకృత గాత్రుడు. అసలు బుద్ధ శుద్ధ నిత్యానంద మాత్రుడు. ఈస్థితి ఎప్పటిది అనిన మొదటి నుండి ఉన్నదే. దక్షుని కుమార్తెను వివాహము చేసికొన్నప్పుడు తిరిగి ఈయన సకల బ్రహ్మమే. ఆమె దక్ష యజ్ఞమున యోగాగ్నికి ఆహుతి అయినది. ఆ స్థితిలో ఈయన తపోనిష్ఠుడైనాడు. ఆ తపస్సులో ఉన్న స్థితి బుద్ధ శుద్ధ నిత్యానందమైన స్థితి. అప్పుడు పరిచర్యలు చేయుచున్న కాత్యాయని మోహితయ్యై అట్టి

స్వరూపమున స్వామిని దర్శించినది. ఈమె మోహమునకు దోహదకారిగా కాముడు, ప్రవర్తిల్లినాడు. అట్టి కాముని యొక్క వ్యాపారమును హరించుట యందు తన ప్రతాపమును చూపినాడు స్వామి. అప్పుడు భస్మీభూతుడైన ఆ కాముని (మన్మథుని) అంగభస్మము తనకు ఆభరణమైనది. దానిచే తన గాత్రము వివాహసంబంధమైన అలంకారముగా సంతరించుకొన్నది. అప్పుడు పార్వతీ పరమేశ్వరుల రూపవైభవము భావితమైనచో ఆరూపమున తిరువారూరులోని ఆలయములో మనోహరమైన, కాత్యాయనీ సహితమైన, కామక్రోధాది రహితమైన భూతి విభూషితమైన త్యాగముచే రాజిల్లిన త్యాగరాజ రూపము గోచరించును. ఇది అంతయు దీక్షితులవారు ఎట్లు చెప్పినారనిన ఈ అనుపల్లవిలో ఒక క్రమమును పాటించి స్వామి స్వరూప, ప్రతాపగాత్రములను వర్ణించినారు. ఈ క్రమముచే ఈ అర్థము చెప్పికొనుట సముచితముగా నుండును.

ఈక్రమముతోనే ఎందుకు వర్ణించిరని ఆలోచించు వారికి ఇందలి రహస్యార్థములవగతము కాగలవు. ఆలోచించు వానిని బట్టి దీక్షితులవారు తన కీర్తనల రహస్యార్థమును వివరించిరనుటకు ఇది యొక తార్కాణము. వీరి పాకము నారికేళపాకము. కాని నారికేళము వినియోగించుటలో శ్రమానంతర ఫలితము అమృత ప్రాయమైన తీర్థము. సాహిత్యమున ఆలోచన నారికేళ పాకమునకు ఎంతవరకు పోవలెనో అంతవరకు పోయి చేసినచో అది పాక మాధుర్యమును అందించుననుటలో సందియుములేదు. కవితామార్గమునందు అది వ్యంగ్య మర్యాద వైశిష్ట్యము.

ఈపైన చెప్పికొన్న అర్థములు, విశేషములు స్ఫురింపచేయుటకే దీక్షితులవారు చరణములో శివుని సాయంసంధ్యానటనమును, అమరేశాదులు పూజించు సన్నివేశమును వర్ణించిరి. దానిని భావించవలెను. దేవతలందరితో దేవేంద్రుడు శివుని సంధ్యాతాండవమును సేవించుకొనుచున్నాడు. శివుడు లయకారుడు. లయకు తాళము ప్రధానము. తాళప్రధానమైన వాద్యము అతిశుద్ధముగా ఉండవలెను. శివుని వద్దనా లయ తప్పుట? కనుక అతి శుద్ధముగా మర్దళాది వాద్యములలీల ఆ తాండవమున నాదరూపుడైన, నాదలోలుడైన శివుని విలాస హేలాలీల. ఏమిటి ఈ లీల అనిన చతురశ్ర, తిశ్ర, మిశ్ర,

ఖండ, సంకీర్ణ జాతులయందు వివిధ గతుల ఆ వృత్తులలో సప్తతాళములు, తత, సుషిర, అవనద్ధ, ఘన, వాద్యములతో కూడిన శబ్ద తరంగముల మధ్య నాట్యము చేయుచున్న శివుని దర్శించినారు. నవనందాది భక్తులు సేవించుచున్న సురాసురులసమూహము కలవారు. అట్టి వాగీశుని యొక్క భక్తుడు కమలకల్హార మాలను ధరించినవాడు. కమనీయుడైన గురుగుహనకు (కుమారస్వామికి) మూలమైన వాడు, తండ్రి కమలాపురమను తిరువారూరు నందు తన లీలావతారము కలవాడు అని దీక్షితులవారు చరణములో చెప్పిరి.

మధ్యమకాల సాహిత్యములో 'విమల రుద్రగణిక వర్తన వినోద భేద మోదకస్య' అనగా అతి శుద్ధమర్దళము లెట్టివో విమల రుద్రగణికలు అట్టివి. నర్తనములో ఎన్నివిభేదములు, ఎన్ని వినోదములు ఉన్నవో అన్నింటి యొక్క ప్రదర్శనచే ఆనందించు వాడు. ఇది అంతయు లయ, తాండవము, నృత్తము. రుద్రప్రియమైన త్రిపుటి భేదనము. ఇది "కమల విడంబన కరస్య-శంకరస్య-పురహరస్య హరస్య మనోహరస్య త్యాగరాజస్య" భక్తుని దర్శనము. ఈ వరుసలో కీర్తనములు పునఃపునరానుసంధానము చేసికొన్నచో అనేక విషయములు మనకు గోచరించును. ఇట్టి రచనా విశేషము దీక్షితులవారికే చెల్లినదనిపించును. భావించుకొలది హరతాండవ విలాసము అనేక పారమార్థిక విశేషములతో భక్తి భావమున మనసును ఓలలాడించును. అది దీక్షితులవారికి ఎంత అనుభవమో భావుకులకు అంత అనుభవసిద్ధము. శ్రీ దీక్షితులవారు శ్రీవిద్యా సిద్ధాంతులు, అద్వైతనిధి. వీరికృతులు నారికేళ నివేదనము. తిరువారూరు త్యాగరాజేశ్వరునికి భక్తితో సమర్పితమైన ఫలగుచ్ఛములు.

★ ★ ★

# 7వకృతి " త్యాగరాజే కృత్యాకృత్య మర్పయామి"

సారంగరాగము　　　　　　　　　　ఝంపెతాళము

65వ. మేళకర్త జన్యము.

పల్లవి:- త్యాగరాజే కృత్యాకృత్యమర్పయామి।
విదేహ కైవల్యంయామి ॥త్యాగ॥

అ॥ప॥:- భోగ యోగాత్మకే। భుక్తిముక్త్యాత్మకే।
త్యాగరాగాత్మికే। తత్త్వం పరాత్మకే ॥త్యాగ॥

చరణము:- ప్రకృతి పురుషాత్మకే- పంచ భూతాత్మకే।
ప్రకృతి వికృతాత్మకే। పంచీకృతాత్మకే।
సుకృతి హృదయాత్మకే। సూర్యచంద్రాత్మకే।
వికృతి భేదాత్మకే। విశ్వేశ్వరాత్మకే।

మ॥సా॥:- సుకృతి పూర్ణాత్మకే। సురగురుగుహాత్మకే।
సకృద సకృదాత్మకే। సచ్చిత్సుఖాత్మకే ॥ త్యాగ॥

'సప్తమ్యాధికరణే' ఒక వస్తువునకు ఆధారమైనదని చెప్పుటకు సప్తమీ విభక్తి ప్రయుక్తమగును. అట్టి ఆధారము తనకు త్యాగరాజేశ్వరుడని దీక్షితులవారి పరిష్కారము (నిర్ణయము). కృత్యము అకృత్యము చేయదగినది చేయరానిది. తెలిసిగాని తెలియకగాని చేయు సమస్తము భగవదర్పణముగా చేయుట ఋషి సంప్రదాయము. ఇక కర్మకు ఫలము ఆశించుట బంధహేతువు. కర్మఫల పరిత్యాగము తెలివిగల వాని పని.

"కర్మణ్యే వాధి కారస్తే మాఫలేషు కదాచన" అని ఈ కర్మ ఫల పరిత్యాగమును గూర్చి యే కర్మ సన్యాసి యోగమనిరి. ఆస్థితిలో సప్తమీ విభక్తి కీర్తన దీక్షితుల వారు చిత్రముగా రచించినారు. దానిచే ఆయన వాంఛించినది విదేహకైవల్యము. దేహమునుండి ఆత్మను వేరుగా చేసి ఆత్మార్పణమును భగవదుద్దిష్టముగా చేయుట జీవన్ముక్తులు చేయునది. జీవించి యుండగా ముక్తినాశించిన దీక్షితుల వారు వివేకమునకు వివరణమే అనుపల్లవి, చరణము, మధ్యమకాల సాహిత్యములందు నిరూపితమైనది.

దీక్షితులవారు అనుపల్లవి యందు భోగము-యోగము, భుక్తి-ముక్తి, త్యాగము-రాగము ఇవి అన్నియు అస్వామియే అని చెప్పిరి. తత్ పదార్థము, త్వం పదార్థము పరమాత్మ యందే లయించునవి. భోగము లౌకికము. యోగము పారమార్థికము. భుక్తి ముక్తులు అంతే. రాగము బంధము, త్యాగము బంధ విమోచనము. కనుక త్వం పదార్థమైన జీవుడు తత్ పదార్థము నందు లక్ష్యముంచినచో ఇటు ఐహికము అటు పారమార్థికము భగవత్ప్రసాదితమగును. మనము కోరునది భగవంతుడు ఇచ్చునని కాదు కాని కోరిన వాని చిత్తశుద్ధిని బట్టి అది సిద్ధించునేమో! ఈకోరిన దానికి తగినట్లు దీక్షితుల వారు లోకమున యశశ్శరీరమును పరమార్థమున ఆత్మలయమును సాధించినారు.

ప్రకృతి పురుషులు సాంఖ్యుల సిద్ధాంతము ప్రకారము కైవల్యములకు మూల తత్త్వములు. జ్ఞానము కనుగొనవలసినది. దానిని చూచువాడు మూల పురుషుడు. పొందవలసినది పొందుటే కైవల్యము. మరి ప్రకృతి తోడి అనుబంధము ఉండదు. కనుక జన్మరాహిత్యము కొఱకు తపించుటయే జ్ఞాని లక్షణము. కనుక ప్రకృతి పురుషాత్మకుడైన భగవంతుని యందు కృత్యాకృత్యములు సమర్పించుటలో ఈ పరమార్థము ప్రకృతి తిరోధానము, పరమపురుషుని తోడి కైవల్యము. పార్థివమైన మానవ దేహము పాంచభౌతికము. ఇది దేహ త్యాగమున పంచభూతములలో లీనమగునది. పంచభూతములు భగవత్స్వరూపములు. కనుక భగవంతుడు పంచభూతాత్మకుడు, పరాత్పరుడు. ప్రకృతి అచ్చమైనది. ఒకదాని నుండి రాలేదు. అది అనాది. వికృతి ప్రకృతి నుండి వచ్చినది. ఇది ఆద్యంతములు కలది. జగద్విలసనమంతయు పంచీకృతమైన పంచభూతముల సమ్మేళనము వలననే. ప్రతి భూతము నందు సగము తానై మిగిలిన సగము ఇతర భూతముల అష్టమాంశముల కూడిక. ఇది పంచీకృత పంచభూతస్థితి. కనుక "పంచీకృతాత్మకే" అనుట చేత జగత్తు వివర్తము పొందిన పరస్వరూపము. అనగా జగత్తు నందు మిథ్య అన్న భావము బ్రహ్మమునందు సత్యజ్ఞానము లోకమున ప్రమాణ విషయము. జగత్తును బ్రహ్మస్వరూపముగా భావించుట జ్ఞాని లక్షణము.

'సుకృతి హృదయాత్మికే' సుకృతియైన వాని హృదయమే తన స్వరూపముగా కలవాడు. పుణ్యవంతులు, జ్ఞానులు అయిన వారు భగవత్స్వరూపులు. సూర్యుడు, చంద్రుడు భగవత్స్వరూపములు. వికృతిలోని భిన్న భిన్నములైన సమస్తము తానే. అణువణువు తానే, అయిన వాడు. అనగా బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులు తానే అయినవాడు. పుణ్యముల యొక్క పూర్ణరూపము తానే అయినవాడు సుకృతి పూర్ణాత్మకుడు. సుర, దేవతలు, గురుగుహకుమార స్వామి తానే అయిన వాడు. సకృత్-అసకృత్-సకృత్ అనగా ఏకము, అసకృత్ అనగా అనేకము. ఏకానేకములు తానే అయినవాడు. నిత్యానిత్యములైనది, అరుదైనది. తఱచైనది, సత్ చిత్ ఆనందము తానే అయినవాడు.

ఈ జగములన్నీ భూర్భువ, సువర్, మహర్లోకములు భూమి, అంతరిక్షము, స్వర్గము, ఇంద్రలోకము. ఇవన్నియు ఇంద్రియాధీనములు. ఇంద్రియలోలములు ఇంద్రియ విలసితములు. వీనిలో భోగరాగ త్యాగ ఇత్యాది సమస్తములన్నియు ఇంద్రలోక పర్యంతము మానవునికి పరమార్థము నందుకొనుటకు ప్రతి బంధకములే. వీనిని దాటినచో జనించునది ఆనందము. ఇంద్రలోకమున బృహస్పతి పొందు ఆనందము బ్రహ్మానందము. అది ఇంద్రునకు గురువగు వానికి లభించునది. అనగా ఇంద్రుని మించి పోవలెను. ఆ స్థితిలో చేరు లోకము జనో లోకము. అక్కడ ఆనందమునకు మూలము జ్ఞానము. జ్ఞానమనగా చిత్. ఆ జ్ఞానము దేనిని గురించి కలిగినదనిన సత్యమును గురించి కలిగినది. సత్యమనగా నిత్యముగా నుండునది. తనంట తాను ఉన్నది. అది అన్నిటికంటె పరమైనది, పరమ పదము. అదిసత్యము. "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ". కనుక అది బ్రహ్మపదార్థము. అదియే తానైన వాడు. సత్యం సుఖాత్మకము. విగ్రహ రూపమున తిరువారూరు నందు త్యాగరాజేశ్వరుడను పేరున వేంచేసి యున్నస్వామి అని దీక్షితులవారు సోపపత్తికమైన నిరూపణ. సర్వము ఆత్మ స్వరూపముగా మాటిమాటికి ఈ కీర్తనము నందు "సర్వంఖల్విదం బ్రహ్మ" అను పరమార్థము చెప్పినట్లైనది. అట్టి పరమార్థము నెఱిగి నశ్యమైనదృశ్యము నందు కాక దృక్ నందు తన దృష్టి నిలిపిన దీక్షితులవారు లోకమున పరతత్త్వమున లీనమై నాద రూపమున సంగీతమున స్థిరపడినారు.

త్యాగరాజన్న దైవమున్నాడు. "త్యాగరాజో విరాజితే" ఈ త్యాగరాజును భజింపుము, తాపత్రయమును త్యజింపుము. త్యాగరాజేన రక్షితోహమ్, త్యాగరాజాయనమః. ఈ క్రమము పరాత్పరమైన తత్త్వమునకు నిర్ణయ వాక్యపరంపరగా సాగినది. పంచమీ విభక్తిలో 'త్యాగరాజా దన్యం నజానే' అన్న నిశ్చయ జ్ఞానము. 'త్యాగరాజస్య భక్తో భవామి' అన్న అనుబంధము. కృత్యాకృత్యములను త్యాగరాజునకే సమర్పించుచుంటినను పరమార్థమున తన్మయత్వము ఈ విభక్తుల వినియోగముచే సాధితమైనది. ఇది దీక్షిత మార్గము. వారి పాండిత్య ప్రకర్షకు గీటురాయి శాస్త్రపరిజ్ఞాన విజ్ఞాన నిరూఢము (కనుక ఈ కీర్తనలో గాయకులు అర్థ పరిజ్ఞానముచే గాని తన్మయత్వము భజింపలేరు). ఈ కీర్తన అంతయు శబ్దమయము. సర్వము ఆత్మ స్వరూపముగా భావితమైనప్పుడు ప్రతి అంశము తాదాత్మ్యముతో వ్యక్తము చేయబడును. దాని భాష ఆత్మభాష. ఆత్మకేతెలిసిన భాష. సర్వాత్మకుడైన వాడే పరమాత్మ. సృష్టిలో కొన్ని కోట్ల అంశములున్నచో ఆ కోట్ల అంశములు ఆత్మస్వరూపములే.

కనుక ఇక్కడ సంఖ్యాపరముగా ఆత్మ శబ్దమును గ్రహించి పరమాత్మ యొక్క పరిధిని కుదించుట దీక్షితులవారి సంకల్పముకాదు. సర్వము ఆత్మమయమను తాత్పర్యమున తాను చెప్పిన సర్వము తదాత్మగా చెప్పినారు. ఈ ఆత్మను లెక్కించకూడదు. పూర్ణముగా చూడవలెను. అందుకే "సుకృతి పూర్ణాత్మికే" అన్న సూచన కూడా దీక్షితులవారు మధ్యమకాల సాహిత్యములో చేసినారు.

"ఈ శావాస్యం ఇదంసర్వం" 'వ్యాసము' అనగా ఉండునది. 'ఈశ' అనగా ఈశ్వరుని చేత ఉండబడునది. ఈశావాస్య ఉపనిషత్తు యొక్క సారమే ఈ కీర్తన. "ఆత్మవా అరే ద్రష్టవ్యోమంతవ్యో నిది ధ్యాసితవ్యః" కనుగొనవలసినది ఆత్మనే. మనము చేయవలసి పని ఆత్మను గూర్చియే. "ధ్యానించవలసినది, ఉపాసించవలసినది ఆత్మనే" అని "బృహదారణ్యకోపనిషద్భాషణము".

సాహిత్యపరముగా పల్లవిలో 'కృత్యం అర్పయామి' యామి అనుటలో యమకాలంకారము. భోగ-యోగ, భుక్తి-ముక్తి, త్యాగ-రాగ అంతయు అనుప్రాసే. 'ఆత్మకే'

అనునది పదానుప్రాస, యమకము. ఈ అనుప్రాస శ్రవణసుఖదమయిన అలంకారము పాడునపుడు దాని అందము అవగాహనమగును.

## 8వ కృతి "వీరవసంత త్యాగరాజ"

వీరవసంతరాగము ఆదితాళము

24.వ మేళకర్త జన్యము

పల్లవి:- వీరవసంత త్యాగరాజ మాం, తారయాశు కరుణానిధే।

అ॥ప॥:- మారజనకు పూజిత మహాదేవ।

మానితా జపానటన ప్రభావ॥ ॥వీర॥

చరణము:- దినకర, శశి, తేజోమయలోచన।

దేవరాజముని శాప విమోచన।

వనజ వదన, కమలా నగర సదన।

వల్మీకేశ్వర, భక్త జనావన॥

మ॥సా॥:- కనకరత్న సింహాసనాభరణ

గణపతి జనక, భవతరణ।

జననాత్మైకవల్యదాయక చరణ।

జననీ శ్రీ కమలాంబికాస్మరణ ॥వీర॥

ఈ కృతి సంబోధన ప్రథమా విభక్తిలోని రచన. ఇక్కడ త్యాగరాజు వీరవసంత త్యాగరాజుగా సంబోధింపబడెను. వీరుడనగా యోగసిద్ధుడు. వసంత మనగా జగద్వికసన హేతువైన ఋతుకర్త యొక్క వికసన ప్రారంభదశ. యోగసిద్ధి చేత జగద్వికసన హేతువైన ఓ త్యాగరాజా! అనగా సహస్రార కమలాంతర్గత బిందు స్థానమున శక్తియోగమున నాదోన్ముఖమైన తత్త్వమునకు ప్రతీకగా భావింప తగిన వాడగు ఓ త్యాగరాజా! నన్ను అనగా ఇట్టి ధ్యానస్థితిలో నిన్ను భావించిన నన్ను ఆశు-వెంటనే తారయ-తరింపచేయుము నీవుచేయుదువు. దయగలవాడవు అని దీక్షితుల వారు పల్లవిలో పేర్కొనిరి.

దీక్షితులవారు అనుపల్లవిలో మారజనకుడు అనగా విష్ణువు కూడా నిన్ను పూజించియే తరించినాడు. అట్టి మారజనక పూజితుడవు కనుకనే మహాదేవుడవు. మహాదేవుడనగా అజపామంత్ర రూపుడవని అర్థము. అజపా ప్రాణనియతమైనది. ప్రాణము ఆడుటకు పరమాత్ముని అజపా నటనమే ప్రభువైనది. సమర్థమైనది. సృష్టి యొక్క ప్రాణస్పందన అజపానటనే. అంతకంటె మేము ఆశించడలసినది ఏమున్నది? "మానిత అజపా నటన ప్రభావ" అన్నది మామూలు మాట కాదు. అజపా జపించుట ఎఱుగని దశలో ప్రాణికి సహజమైన జపము. దానిచేతనే ప్రాణము ఆడుట. అజపానటనము తోనే ప్రాణులకు ప్రాణములు ఆడుచున్నవి. ఈ ఆటయే పరమేశ్వరి నటన. ఇంత ఆలోచన చేయవలెనా ఒక మామూలు పదమునకు అనగా భగవంతుని గూర్చినది. మనకు తోచినదికాదు. భగవంతుని తత్త్వమునకు చెందినది. అందుకు శాస్త్రప్రమాణము కావలెను. దీనికి అజపాధ్యాన యోగమును గూర్చిన బహుగ్రంథములు దీక్షితులవారి శ్రీవిద్యకు మూలమైనవని భావించవలెను. అహం సః-అహం సః వర్ణమాలలో శ, ష, స, హ, లు ఊష్మములు, ఊదబడునవి. స,హ లు మరియు సున్నితమైన రహస్యధ్వని సహకారములు.

"తేనాయాం పరమో మంత్ర శ్శివ శక్త్యాత్మక స్స్మృతః" [1]

అజపా హంసగాయత్రి మంత్రము మన ఉచ్ఛ్వాస, నిశ్వాసములతో మనము చేయుచునే యున్నాము. ఇది అంతర్జపము. ఉచ్ఛ్వాస నిశ్వాసాత్మకమైన బిందు విసర్గల హ, స కలమైన మూడు మధ్యకూట విలసనము. 'హ' మాతృక 'స' శక్తి. ఆత్మశివ. బిందువు తల్లి, విసర్గ తండ్రి. 'హం' స్త్రీ రూపము 'సః' పుంరూపము. 'హంస' శివశక్తి స్వరూపము. ఇదిమన ఉచ్ఛ్వాస విశ్వాస సమయమున అభివ్యక్తమగు శబ్దము. ఇది జపము లేకయే జరుగుజపము. పరమేశ్వర నటన. అది లేనిచో జగము లేదు. అది జగమునకు ప్రాణము. దానిని 'ఋతము' అందురు. ఆ ఋతమును వహించువాడు ఋతంభరుడు (శివుడు). దానిని తన ధ్వజముగాకలవాడు ఋతధ్వజుడు. యోగులు శైవ వైష్ణవ శక్తి మహిమాన్వితులు. విష్ణువును ఋత ధ్వజునిగా విశ్వముగా వ్యాపనశీలిగా

---

1 కా.క.వి. పుట. 28

ధ్యానింతురు. ఋతంభరమైన ప్రజ్ఞ యోగము యొక్క పరాకాష్ఠ. ఇది అంతయు యోగీశ్వరుడైన త్యాగరాజ స్వరూపుడైన, పరమేశ్వరుని నటన ప్రభావము. ఇట్టి రూపముతోనున్న ఆ ప్రాణముగల జగచ్ఛరీరమునకు దినకర, శశి, తేజస్సు (అగ్ని)లు లోచనములు. దేవ రాజముని (బృహస్పతి) యొక్క శాపవిమోచన చేసిన రూపము. ఆ రూపమునకు ముఖము వనజవదనము. ఆకృతికి సదనము కమలానగరము. జ్యోతిర్లింగములలో ఒక లింగమునకు నెలవైన పురము. వల్మీకేశ్వర నామముతో అనగా పార్థివ లింగ స్వరూపముతో స్తుతింపబడిన స్వామి భక్తజనావనుడు. రక్షకుడు నవరత్న సంహసనాపరుడు. గణపతి జనకుడు. భవతరణుడు. జనానత్ జననము నుండి కైవల్యము ప్రసాదించు చరణములు కలవాడు అని దీక్షితుల వారు చరణము, మధ్యమకాల సాహిత్యములలో పేర్కొనిరి.

ఈకీర్తన చరణములో లోచనములు వదనము నుండి చరణముల వరకు శ్రీ కమలాంబికా స్మరణ కలదిగా నుతించబడినది. తెలిసి భగవంతుని చింతించుట సద్గురువులైన వాగ్గేయకారుల సంప్రదాయము. ఇక్కడ త్యాగరాజ స్వామి స్వరూపము శ్రీ విద్యాపరమైన అభిజ్ఞానముతో దీక్షితుల వారు చింతన చేసి సంబోధించినారు. అమృతప్రాయమైన శ్రీవిద్యా నిక్షేపమును అందించుట దీక్షితుల వారి లక్ష్యము. అట్టి భావన చేయుట మన లక్షణమైనచో మనకు లభించునది ఆనందము.

సాహిత్యపరముగా చరణములో లోచన, యోచన, వదన, జనావన అంత్యప్రాస కలదు. మధ్యమకాల సాహిత్యమున భరణ, తరణ, చరణ, స్మరణ అను అంత్యప్రాస కలదు.

★ ★ ★

# 9వకృతి "త్యాగరాజ పాలయాశుమాం"

గౌళరాగము ఆదితాళము

15.వ. మేళకర్త జన్యము

పల్లవి:- త్యాగరాజ పాలయాశుమాంశ్రీ

నిత్యానంద కంద, సోమాస్కంద, వీథీవిటంక ॥త్యాగ॥

అ॥ప॥:- నాగరాజ మణి భూషాలంకృత।

నగరాజ సుతార్థాంగ, గౌళాంగ ।

భోగాదిప్రద, శ్రీనగర స్థిత।

భూసురాదినుత, వల్మీక లింగ ।

శ్రీగురుగుహ పూజిత, వృషతురంగ।

శ్రితజన రక్షణ నిపుణాంతరంగ ॥

మ॥సా॥:- భోగియుత చరణ, కరధృత, కురంగ।

యోగి విదితా జపానటన రంగ ॥త్యాగ॥

ఈ కృతిలో స్వామికి సంబంధించి చెప్పిన అంశములు వెనుకటి కృతులలో వలనే సగుణోపాసనకు సంబంధించినవి. చిట్టచివరి మధ్యమకాల సాహిత్యములో ఒక విశేషమున్నది.

భోగియుతచరణ అనగా కుండలినితో కూడిన చరణములు కలవాడు. పామునే ఆభరణముగా చుట్టుకొనబడిన చరణములు కలవాడు. కుండలినీ సంబంధము శివశక్తిద్యోతకము. కరధృత కురంగ అనగా చేతి యందు ధరించబడిన లేడి (కురంగము) కలవాడు. ఈ కురంగము యజ్ఞము. దక్షుని యజ్ఞమును వీరభద్రుడు ధ్వంసము చేసినపుడు ఆ యజ్ఞము వీరభద్రుని ధాటికి భయపడి లేడిరూపము ధరించి పారిపోయినది. ఆ లేడిని శివుడు తన ఆధీనమున నుంచుకొనినాడు. అనగా యజ్ఞము శివుని అధీనములో ఉండును. ఈపదము ఇక్కడ ఆ ఐతిహ్యమును స్ఫురింపజేయుచు 'యోగి విదితాజపానటన రంగ' ' అను పదమునకు అనుప్రాస అయినది. "వీరవసంత త్యాగరాజా మాం" అను కృతిలో 'మానితా జపానటనప్రభావ' అని ఉండగా ఈ గౌళ రాగకృతి యందు 'విదితా జపా నటన'

అని చెప్పుట జరిగినది.

'మానిత' అన్న స్తుతి సాధనలోని మొదటి దశ. 'విదిత' అన్నది సాధనచే తెలియబడిన యోగస్థితి. యోగిగా తన ఉచ్ఛ్వాస నిశ్వాసములను అజపా నటనమునకు రంగమైన సదాశివుని సాక్షాత్కారమును పొందిన దీక్షితుల వారి అనుభవమునకు నిదర్శనముగా ఉన్నది.

అనుపల్లవిలో లలితా సహస్రనామ స్తోత్రములో ఒక క్రమమున్నది. "శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ" నుండి "శివ కామేశ్వరాంకస్థా శివా స్వాధీన వల్లభా" వరకు శివ శివాద్వైత భావన స్ఫురింపచేయు నామములున్నవి. లింగ పురాణములో -

**"యథా శివస్తథా దేవీ - యథా దేవీ తథా శివః**

**తస్మాత్ అభేద బుద్ధ్యైవ శివేతి కథయాం త్యుమాం"[1]**

శివః శివా అబేధము. ఏనామములు శివునికి వర్తించునో అవియే నామములు 'శివా' పదమునకు కూడా వర్తించును. ఆమె స్వాధీనుడైన భర్తను కలిగియున్నది. 'శివాస్వాధీన వల్లభా' సుమేరువు యొక్క మద్య శృంగమున ఉన్నది. మంత్రజపమున మేరువు యొక్క కొసలోని కొలికి పూస ఆమె. ఆయనయు అంతియే. అది 'శ్రీమన్నగరం' అదే శ్రీచక్రం. అందునాయిక శ్రీమన్నగరనాయిక, నాయకుడు శ్రీమన్నగర నాయకుడు. ఈకీర్తనలో శ్రీనగరస్థిత - స్వామి శ్రీనగరస్థితయైన పరమేశ్వరితో అభిన్నమైన రూపసామ్యము, నామసామ్యము కలవాడుగా స్తుతింపబడెను.

శ్రీచక్రము నందలి బిందువు మేరు సంజ్ఞ కలది. అందలి త్రికోణ చక్రమున తూర్పు కోణమున ఇచ్ఛాశక్తియు నైఋతి కోణమున క్రియాశక్తియు, వాయువ్యకోణమున జ్ఞాన శక్తియు ఉండగా మధ్య స్థానమున ఉండునది బిందువు. అది శివశక్తి సమ్మిళితము. ఆ శ్రీచక్రనగర నాయిక, నాయకుడు ఉమామహేశ్వరుడు. ఈ నామావళిచే రూపాది వర్ణనము జరిగి ఆమెయు, ఆస్వామియు ఉండు నగర స్థానము వారి కేంద్రము ఈ కృతిలో నిరూపింపబడినట్లు గ్రహింపవలెను. 'వృషతురంగ' అన్నది పరమేశ్వర వాహనము. వృష

---

1. ల. ర. నా. గు. దీ. పుట 52

అనగా వేదము.

"స్యాద్ధర్మ మస్త్రియాం పుణ్యం శ్రేయ శ్రీ సుకృతం వృషః"[1]

విశ్వమును దరించునది ధర్మమను అర్థమున ఈ శబ్దము నపుంసక శబ్దము. లోక విషయమున ధర్మః అనగా ఆచరింపబడునది అను అర్థములో పుంలింగ శబ్దము. అట్లే మిగిలిన శబ్దములు పుణ్యమును, శ్రేయస్సును, సుకృతమును చెప్పుచు వేదమునకు పుణ్యశ్రేయస్ కృతములకు అన్వయించునట్లు చెప్పబడినది. ఇక వృషః అనగా

"వర్షతి అభిరిషిత మితి వృషః"[2] అనగా కోరిన దానికి వర్షించునది వృషః అనగా పుణ్యము. పుణ్యమన్నది తనచేతిలో తురంగముగా కలవాడు. పుణ్యమే తన రూపమై తురంగము వలె గమ్యమును చేర్చు లక్షణము కలవాడు. అసలు వృషః అనగా వృషభము. "వర్షతి రేతః సించంతీతి వృషభః"[3] అనగా రేతస్సును విడుచునది. ఇది వృష అన్న శబ్దము ఒక సంకేతార్థమును పుణ్యపరముగా, వేదపరముగా శివపరముగా, వాహన పరముగా, జగదుత్పత్తి హేతుపరముగా చెప్పుటకు తగిన వివిధ విశేషార్థములకు ఆస్పదమైనది. ఇక్కడ 'వృషతురంగ' అన్న పదము వేదమే తన వాహనముగా కలవాడు . అనగా వేదవేద్యుడు అను సామాన్యార్థము దీక్షితుల వారి భావనకు అనుగుణమైనది. విశేషార్థములు అనేకము.

దీక్షితుల వారి సాహిత్య వైభవము వృష తురంగ, కరధృత కురంగ వంటి పదములలో నిరూఢమై ఉన్నది. దీక్షితుల వారి భావసంపదకు పద ప్రయోగ చారుత్యమునకిది నిదర్శనము.

★ ★ ★

1. ల. ర. నా. గూ. దీ. పుట. 52
2. అమరకోశము -కాలవర్గము పుట 105, శ్లోకం 25
3. అమరకోశము - కాలవర్గము పుట 525

## 10వ కృతి "త్యాగరాజం భజేఽహం సతతం"

నీలాంబరి రాగము రూపకతాళము

29.వ. మేళకర్త జన్యము

పల్లవి:- త్యాగరాజం భజేఽహం సతతం। ॥త్యాగరాజం॥

అ॥ప॥:- యోగి నారాయణాద్యుపాసితం ప్రభాసితం।

యోగ భోగ వితరణ నిపుణతరకరం దయాకరం॥

మ॥సా॥:- నాగర ఖండాఖ్య పురాణ । ప్రతిపాద్య మనాద్యం।

నామ రూపమయ చేద్యం । నారద గురుగుహ వేద్యం ॥త్యాగరాజం॥

శ్రీ దీక్షితుల వారి యోగ స్థితిని ఒక ఆకృతిలో నిరూపించి. విభజించి చెప్పిన కృతి. పల్లవిలో దీక్షితుల వారు శ్రీ త్యాగరాజేశ్వరుని ఎల్లప్పుడు భజించుచున్నానని చెప్పిరి.

అనుపల్లవిలో యోగినారాయణ - యోగీశ్వరులైన నారాయణాదుల చేత ఉపాసింపబడిన వానిని ప్రభాసితం - మిక్కిలి ప్రకాశించుచున్నవాడు. ప్రభా కాంతిచేత సితం తెల్లనైనవాడు. ప్రభయాసితం - ప్రభాసితం 'ప్ర' ప్రకృష్టముగా భాసితం ప్రకాశించుచున్నవాడు. యోగమును భోగమును ఇచ్చుట యందు నిపుణతరమైన కరము కలవాడు. దయాకరం - దయకు ఆకారమైనవాడు. దయకరం - దయను చూపువాడు. ఇక్కడ యోగమనగా తనతోడి ఐక్యమును నామరూప అదిష్ఠాన,. అవస్థాన, అనుష్ఠాన, సామ్య, యోగమును ఒసగువాడు. భోగమునందు కూడా అట్టి వైభవమునే అనగా లోకమున నామ ప్రతిష్ఠ, రూపప్రతిష్ఠ, వయః ప్రతిష్ఠ, స్థితి ప్రతిష్ఠా, ఆచరణ ప్రతిష్ఠలను ఇచ్చుటలో నిపుణతరమైన దాతృత్వ లక్షణములు తన చేతియందు కలవాడు అని దీక్షితుల వారు త్యాగరాజేశ్వరుని ఆకృతి గూర్చి వివరించిరి.

మధ్యమకాల సాహిత్యములో నాగర ఖండము అను స్కాందపురాణాంతర్గత లక్షణములచే ప్రతిపాదింపబడినవాడు. ఆదిలేనివాడు అనగా మొదలు లేనివాడని అర్థము. మొదలు లేదు కనుక తుది కూడా లేనివాడను విషయము గతార్థమగుచున్నది. అట్టి నిర్గుణ రూపుడు నామరూపమయమైన సగుణ రూపమున తిరువారూరులో విలసిల్లు చుండుట

చోద్యమైన విషయము. చోద్యమనగా విడ్డూరమని అర్థము. ఇట్టి సగుణ రూపుడైన ఆ పరమేశ్వరుడు ఏ నారదునకో గురుగుహునకో అనగా కుమార స్వామి చేతనో తెలియబడవలసిన వాడు కాని అన్యులచే తెలియబడడు.

ఇది దీక్షితుల వారి ఉపాసనలోని రహస్యము. తాను పంచవిధ సామ్యములతో అనగా నామరూపాది సామ్యములతో భగవంతుని యందు అంతరమునకు, బాహ్యమునకు ఐక్యాను సంధానము కలవాడు. ఈఐక్యానుసంధానము పార్వతికున్నది, గంగకున్నది. యోగీశ్వరుడైన నారాయణ, నారద, గురుగుహాదులకున్నది. అది దీక్షితుల వారికి కూడా సిద్ధించినదనుటకు అక్షర రూపములైన వారి కీర్తనలే సాక్షీభూతములు. ఈ అక్షరము లన్నియు స్వరములై, స్వరములన్నియు ప్రభాసితములై దీక్షితుల వారి చేత ఉపాసితములైనవి. ఆ వైభవము స్వానుభవైక వేద్యము. నారదగాన లోలమైన బ్రహ్మ ప్రణవాను సంధానురూపమైన ఒక శబ్ద జ్యోతి స్వరూపమే దీక్షితుల వారి స్వర సంపుటి.

"బ్రహ్మ ప్రణవ సంధాన నాదోజ్యోతిర్మయః శివః
స్వయ మావిర్భ వేదాత్మ మేఘాపాయే ఘ్యాంశుమానివ"

బ్రహ్మమును ప్రణవనాదముతో అనుసంధానము చేయుటయే యోగము. అట్టియోగమున కలుగు జ్యోతిర్దర్శనమే శివస్వరూపము. అట్టి శివ స్వరూపము నిత్య ప్రత్యక్షమైన విషయమైనను లౌకికములైన అవరోధముల చేత మేఘుచ్ఛాధితమైన సూర్యుని వంటిది. అనగా ఉత్తమమైన కిరణములు కలవాడు. (సూర్యుడు) దీక్షితుల వారి ప్రతి కీర్తనలో గల అక్షరములందుండు జ్యోతిర్దర్శనము శివ స్వరూపము.

ఈ కీర్తనలో గల సాహిత్య విశేషములు - యోగి, యోగ, భోగ, నాగర, గురుగుహ అను పదములలో 'గ' కార అను ప్రాస ఒక సొగసు. ఉపాసితం, ప్రభాసితం అను పదములలో పాసితం, భాసితం చక్కని అనుప్రాసలు. ఉపాసింపబడినది ఉపాసితం. ప్రకృష్టముగా భాసిల్లునది ప్రభాసితం. ఈ అర్థములు ఇట్లుండగా ప్రభాసితం అనుటలో ప్రభయాసితం అన్న విరుపు తేజస్సు చేత తెల్లని ప్రకాశము కలవాడు. అను అర్థము

శ్లేషానుప్రాణితమై పరమేశ్వరుని ప్రకృష్ట భాసమాన వైభవమును తేజస్సుచే సత్త్వ గుణో ద్దీప్తమైనసితత్వము అనగా తెల్లదనము ద్యోతకమై ఉపాసన యందు పరమేశ్వర జ్యోతి దర్శనము పొందిన కవిదీక్షిత హృదయము స్ఫురించుచున్నది.

యోగమును భోగమును వితరణ చేయుటలో, నిపుణతరకరం, దయాకరం అనుచోట 'ర' కార అను ప్రాసయున్నది. తరతరయమకము. కరంకరం అను యమకము దయాకరం అనుచోట కూడ దయకు ఆకరమైనవాడు. దయను చూపువాడు. దయాయాః -ఆకరం - దయాకరం. "దయాం కరోతి ఇతి దయాకరం" అను శ్లేషానుప్రాణితమైన అలంకార చమత్కృతి దీక్షితుల వారి వాగ్విశేష సహజ సౌందర్యమును వెల్లడించుచున్నది.

"సరస్వతీ స్వాదు తదర్థ వస్తు నిష్యంద మానామహతాం కవీనాం
అలోక సామాన్య మభివ్యనక్తి పరిస్ఫురంతం ప్రతిభా విశేషమ్" [1]

ఒక ఆశ్చర్యకరమైన విషయము. వాగ్గేయకారులు ఏఅనుభూతిని పొంది తన వాక్కును నాదమయము చేసి కొనిరో అట్టినాదము చేతనే అతని వాక్కు యొక్క పరిపూర్ణ వైభవము పరితకు, శ్రోతకు కలుగుట చేత తద్గతమైన అంతర, బాహిర, యోగ వైభవమును నేటికిని యోగ్యులైన వారికి, సంగీతజ్ఞులకు, శ్రోతలకు అభివ్యక్త మగుచున్నది. ఈ నీలాంబరి రాగకృతి యందు ఇట్టి లక్షణమున్నది. ఉపాసితం, ప్రభాసితం, నిపుణ తరకరం, దయాకరం అన్న పదముల కొసలందు భావములకు వైచిన ఆనంద గ్రంథులు. అట్టి గ్రంథులలో దీక్షితుల వారి కృతి రహస్యములు నిక్షిప్తములైయున్నవి.

★ ★ ★

1. ధ్వన్యాలోకము - ఆనంద వర్ధనుడు

## 11వ కృతి "త్యాగరాజ యోగ వైభవం"

ఆనందభైరవి రాగము రూపకతాళము

22.వ మేళకర్త జన్యము.

పల్లవి:- త్యాగరాజ యోగ వైభవం । సదాశివం । సదాశ్రయామి ॥

అ॥ప॥:- త్యాగరాజ యోగవైభవం । అగరాజ యోగవైభవం ।

రాజయోగ వైభవం । యోగ వైభవం । వైభవం, భవం, వం। ॥త్యాగ॥

చరణము:- నాగరాజ వినుత పదం । నాద బిందు కళాస్పదం ।

యోగిరాజ విదితప్రదం । యుగపద్భోగ మోక్షప్రదం ।

యోగరూఢ నామరూప విశ్వసృష్ట్యాది కరణం ।

యుగ పరివృత్యాబ్ద మాస దిన ఘటికాద్యావరణం ।

శ్రీగురుగుహ గురుం । సచ్చిదానంద భైరవీశం ।

శివశక్త్యాది సకల తత్వ స్వరూప ప్రకాశం ।

శం, ప్రకాశం, స్వరూప ప్రకాశం ।

తత్వ స్వరూప ప్రకాశం ।

సకల తత్వ స్వరూప ప్రకాశం ।

శివ శక్త్యాది సకల తత్వ స్వరూప ప్రకాశం॥ ॥త్యాగరాజ॥

మూలాధార చక్రము నందు లాస్యరూపమైన నృత్యము నందు మిక్కిలి ఆసక్తురాలై సమయ అనుపేరు గలదైన ఆనందభైరవి, శృంగారాదులగు నవరసములతో నొప్పు తాండవ నృత్యమును నటించు నటుడైన వానిని నవాత్మకుడైన ఆనందభైరవునిగా తలచెను. ఆనందభైరవుడు, ఆనందభైరవీ సంయోగమే సదాశివ యోగము. పంచభూతములు, పంచతన్మాత్ర, పంచజ్ఞానేంద్రియ, పంచ కర్మేంద్రియములు, మనస్తత్త్వము, మాయ, శుద్ధ విద్యా, మహేశ్వరుడు, సదాశివుడు. ఇవి 25 తత్త్వములు. "పంచ వింశ ఆత్మా భవతి"[1] అని తైత్తరీయ బ్రాహ్మణం (1-2-6)

---

1. సౌ.ల.పుట 78

ఈ పంచవింశతి తత్త్వము ఆత్మ. ఈ అన్ని తత్త్వములకు అతీతమైనది శివశక్తి సంపుటము. అట్టి సంపుటికి సగుణ రూపమే త్యాగరాజ దైవము. తాను భజించు త్యాగరాజుని యందు సదాశివ యోగమునందిన దీక్షితుల వారికి కలిగిన ఆనందము ఆనంద భైరవ - భైరవీ గ్రంధి రూపమైన బిందు అధిష్ఠానము నందలి అనుభూతి యొక్క వైభవమే దీక్షితుల వారు తన అనుభవము నందు పొంది అట్టి "త్యాగ రాజ యోగ వైభవం, సదాశివం, సద్కాశయామి" అను పల్లవి తన్మయుడైన భావనతో రాగతాళములతో శోభిల్లునది. ఆయనకు ఆ యోగవైభవము కలిగించిన ఆనందానుభూతి ఈ ఆనందభైరవి రాగమున పలికించిన పలుకులే ఈకృతి రూపము ధరించినవి. అ బిందువునున్న నాదము, అ నాదము నుండి కళలుగా వెల్లివిరిసినవి.

ఆ త్యాగరాజేశ్వరుడు తిరువారూరు నుండి దీక్షితులవారిని అగరాజు కడకు కొనిపోయెను. అగరాజమనగా రజతాచలము, కైలాసగిరి. తాను సగుణోపాసనములో తిరువారూరు నుండి కైలాసగిరికి చేసిన యాత్ర ఇది. అందుకనే దీక్షితుల వారు అగరాజును, సదాశివుని స్మరించినారు. అది కదా రాజయోగ వైభవము! యోగుల యందు రాజపదవిని పొందినదే రాజ యోగము. రాజసము రజోగుణ విలసితము. కేవలము శుద్ధ సత్త్వము నందు రజోగుణ విజృంభణ ఉండదు. ఈ రజోగుణమంతయు వాక్కును ఉఝ్ఝాతలూగించునది. కనుకనే అనుపల్లవి యందు త్యాగరాజ యోగ వైభవం- అగరాజ యోగ వైభవం- రాజయోగవైభవం-యోగవైభవం-వైభవం-భవం వం-అయినది. ఈ వరుసలో 'వం' కూడా పోయినచో మిగిలినది 'ం' బిందువు. ఈ బిందువు నాదమూలము. ఈ బిందువు నందు లీనమైనచో నాదము వినపడదు. వినపడిన నాదము బుద్ధిగుహలోని అనాహత నాదము. ఆ స్థితిలో గానము చేయుచున్న దీక్షితులవారి తన్మయత్వమును భావించి 'వం' నందలి అను స్వారమును పట్టి యుంచినచో అందలి ఆనందమే ఆనందము.

అట్టి స్థితిలో 'వం' తరువాత ఉన్న అక్షరములు శ ష స హ ళ. అది నాగరాజ వినుత పదం. నాగరాజు చేత అనగా కుండలినీ యోగ రూపుని చేత విశేషముగా నుతింపబడిన పదము లేకస్థానము. అదియే నాదబిందు కళాస్పదం. అది యోగిరాజైన

వాని చేత విదితమై ప్రకృష్టమైన స్థితిని ఇచ్చునది. ఈ రాజుచే విదితమై ఈయబడు పదవి అదియే. అట్టి స్థితిలో అటు యోగము ఇటు భోగము అనుభవైకవేద్యము. అది ఏక కాలము నందు జరుగును. సగుణో పాసనము నుండి నిర్గుణముకాగా అక్కడ యోగి లోకబంధము నుండి విముక్తుడై అస్తి, భాతి, ప్రియం అను అనుభవము నందు తన్మయుడై, ఆ ఆనందమున అట్లే ఉండిపోయి, ఆ స్థితి నుండి తేరుకున్నప్పుడు యోగము నుండి లోకమున రూఢమైన నామ రూపాత్మకమైన విశ్వసృష్టికి అదియే అధికరణము. మొదటి సాధనము,. మొదటి పరికరము అని అనుభవమున వ్యక్తమై యుగములు వాటి గమనము, అబ్దమును, సంవత్సరములు, మాసములు, దినములు, ఘటికలు మొదలైన కాలకళలుగా ఖండ కాలవిలసనమునకు మూలమైనదని "యుగ పరివృత్త్యాబ్ద మాసదినఘటి కాద్యావరణం" అని అనుపల్లవిలో చెప్పిరి. ఆ అస్తి, భాతి, ప్రియమైనదే అది అఖండ కాలము, అది మాహాకాలము, అని వినోదమై యోగి హృదయము ఖండకాల కళల నుండి, నామ రూప కళల నుండి అఖండ కాలమునకు లీనమై అది మహాకాలము, మహాకాళీయని, అట్టి మహాకాల, మహాకాళీ యోగము నందు ఆనందము భై-భై అని రవళింపగా అది ఆనంద భైరవ-భైరవీ నటనముగా వాగర్థ విలసనముగా ఒక కృతిగా ఆకృతిగా దాల్చి దీక్షిత కృతియైనది.

దీక్షితుల వారి ఉపాసన చిత్రమైనది. ఈయన నిష్ఠతో భగవంతుని ఉపాసించు నపుడు సంగీతము పలకలేదనిపించును. ఈ మాట ఆయన చరిత్ర అంగీకరించదు. రచనలోని ఆంతరము చూడగా అందలి తత్త్వ విషయములన్నియు యోగానుభవమును మననముచేసికొని అక్షర రూపమున సంగీతాత్మకముగా రూపుకట్టించుకొనబడినవి. ఆయన అనుభవము సదాశివ యోగము, మోక్షప్రదము. ఆ స్థితిలో ఆయన సమాధి యందు యోగవైభవమునుభవించిరి. ఆ వెంటనే యోగము నుండి వెలువడి నపుడు తన అను భవమును అక్షర రూపముగా కల్పించిరి. అది ఆయన సంగీత భోగము. 'యుగపద్భోగ మోక్షప్రదం' అన్నమాటలో ఏకకాలమున భోగమును మోక్షమును ఇచ్చుట అన్నది ఆ రీతిగా అన్వయించుకొనవలెను.

సంగీతమన్నది తన అనుభవము నుండి వచ్చినది ఒకటి, తన పాండిత్యము

నుండి వెలువడినది మఱియొకటి. అనుభవము భవముననుసరించినది. భవమనగా పుట్టినది. దానిని అనుసరించి అనుగుణముగా వచ్చునది అనుభవము. అట్టి అనుభవము చేత వెలువడునది భావము. అనుభవము నుండి సూటిగా భావము వెలువడినపుడు అది ద్రాక్షాపాకము. అనుభవము పాండిత్య సహకృతముగా వెల్లడించునపుడు వెలువడిన శబ్దము నారికేళము. శ్రోత, పఠిత నారికేళము నుండి పదార్థములు విడదీసి అవసరపదార్థము అనగా కొబ్బరి పాలు కడకుపోయిన గాని అనుభవసారము అందదు. ఇది దీక్షితుల వారి కృతులలోని నారికేళపాక వివేచనము.

శ్రీగురుగుహ గురుం సచ్చిదానంద భైరవీశం. శివ శక్త్యాది సకల తత్త్వ స్వరూప ప్రకాశం ఇత్యాది రచన అంతయు దీక్షితుల వారి అనుభవ పరామర్శ నుండి పాండిత్యము నుండి వెలువడిన విశేషములు. శివశక్త్యాది సకల తత్త్వ స్వరూప ప్రకాశమైన స్థితిని చెప్పిన శ్రీ గురుగుహాది చరణము నారికేళము. త్యాగరాజ యోగ వైభవం అన్న ప్రారంభము పల్లవి అనుభవానంతరము వెలువడిన మధురపద సంధాయకము. ఇది సహృదయ హృదయైక వేద్యము.

శ్రీ త్యాగరాజ స్వామి శ్రీకరుడైన గురుగుహునకు గురుడు. అనగా తండ్రి. గురుగుహుడు గొప్ప రాజవిద్య, రాజయోగ గుహ్య, రహస్య గుహ స్వరూపుడు. యోగీశ్వరుడు ఆ పరమేశ్వరుడు. అతడే త్యాగరాజేశ్వరునిగా తిరువారూరులో వేంచేసి యున్నాడు. దీక్షితుల వారి ఉపాసనకు ఆలంబనమైనవాడు. ఆ ప్రతిరూప ప్రతిమ సదాశివ రూప ప్రతీకుడు. అట్టి ప్రతీక ఆలంబనముగా తాను పొందిన యోగ వైభవమును, మహాకాలుని, మహాకాళిని తనకు సాక్షత్కరింపచేసినది. ఆ మహానందములో తన ముద్రా స్వరూపుడు గురుగుహుడు హృదయమున తన తండ్రియైన పరమేశ్వరునితో లీనుడై, మహానంద భైరవ భైరవీనాద తరంగితుడై, రసలోలుడై యున్నాడు. అట్టి స్థితిలో భూర్భువస్సువర్మహర్లోకములను దాటి సత్యమయ సత్స్వరూప దర్శనములో సచ్చిదానంద తన్మయత్వమున దర్శించిన ఆ ఈశుని భైరవేశుని, సచ్చిదానంద భైరవేశుని, శివ శక్త్యాది సకల తత్త్వ స్వరూప ప్రకాశకరుని, స్వరూప ప్రకాశుని తత్త్వ స్వరూపమే ప్రకాశముగా కల పదునైదు కళలు సకల తత్త్వ స్వరూపమైన షోడశీకళా ప్రకాశము కలుగుటచే శివశక్త్యాది సకల షోడశ కలాతత్త్వ స్వరూపము సర్వస్వము

ఒక పెద్ద వెలుగుగా ప్రకాశింపచేసినవాడు. స్వరూప ప్రకాశం - శం, శివం-సదాశివం-వం, శివం శంకరం నాద బిందు కళాస్పదం అని అనదగిన పదమును స్థానమును అవాఙ్మానస గోచరమైన బిందు అతీతమైన అనాహతమైన బిందువు '0' అనుస్వారమున లీనమైనాడు.

"యోవేదాదౌ స్వరప్రోక్తః వేదాంతేచ ప్రతిష్ఠితః
తస్యప్రకృతి లీనస్యయః పరః పరమేశ్వరః"

అన్న వేదమంత్రగతమైన అనుభవము స్వరమున స్వతః రంజిల్లిన స్థితిలో స్వరమే తన రూపమైన భగవంతునికి సంగీత స్వరములను ఆభరణములుగా చేసికొన్నారు. అవియే శంకరాభరణము, ఆనందభైరవి, నీలాంబరి, రుద్రప్రియ, సారంగ, బేగడ మొదలగు రాగములు.

సప్త స్వర విద్యాలోలుడు కోరు సప్తస్వర సుందరుల శింజానమణి మంజీర పదములు వినగలవాడు, అనగలవాడు దీక్షితులు. అదే దీక్షిత హృదయం, రాగ త్యాగరాజ యోగవైభవం. ఈకృతిలోని బీజాక్షరములు 'వం' 'శం' అన్నియు స్వరములై, స్వరములన్నియు ప్రాణములై, ప్రాణములన్నియు, చేతనములై-

"యాదేవి స్వరభూతేషు చేతనేత్యభిధీయతే" అని చెప్పబడిన దేవీ స్వరూపములుగా శోభిల్లుచున్నవి.

సంగీత ప్రాశస్త్యముః- ఆనందభైరవి రాగము 22వ మేళకర్త ఖరహరప్రియ జన్యము.

మూర్ఛనః- ఆరోహణ-సగరిగమపదపస

అవరోహణ-సనిదపమగరిస

ఇందు షడ్జ పంచమములుగాక చ॥రి, సా॥గా, అం॥గా, శు॥మ, శు॥దై, చ॥దై, కై॥ని, కా॥ని స్వరస్థానములు వచ్చును. దీనిలో అం॥గా, శు॥దై, కా॥ని అన్య స్వరములు. త్రి అన్యస్వర భాషాంగరాగము.

అంతర గాంధార ప్రయోగములు- మమగేరిగేమపమమా।

మగేగేమా మగేరిగేమా

శుద్ధదైవత ప్రయోగములుః- గమపదే;; గాదేప్పా,దామ్మా,పగారి మపామగారి।

కాకలి నిషాద ప్రయోగములుః- ససనిదనీ । ససనిదనీసరీసపా

విశేష ప్రయోగములుః- సగమపామ। పానిప। పదనిదానిపా

పాసానిదపా। నినిససగగమమపమగగమా।

ఈరాగమునందు వచ్చును. రి గ మ ద ని జీవస్వరములు. స గ మ ప ని స-గ్రహస్వరములు మరియు న్యాసస్వరములు. వక్రసంపూర్ణ భాషాంగరాగము.

సంగీత రచన యొక్క కాలప్రమాణమును తెలుపునది తాళము. ఈ తాళమునకు కాలము, మార్గము, క్రియ, అంగము, గ్రహము, జాతి, కళ లయ, యతి, ప్రస్తారమను దశ ప్రాణములు కలవు. వీనిలో యతి ప్రాణము ఆరు విధములు. సమయతి, విషమయతి, గోపుచ్ఛయతి, స్రోతోవహయతి, మృదంగయతి, డమరుయతి అనునవి. 'త్యాగరాజ యోగవైభవం' అని ఈ కృతిలో దీక్షితుల వారు గోపుచ్ఛయతి, స్రోతోవహయతులను పొందుపరచిరి.

అనుపల్లవి సాహిత్యమునందు గోపుచ్ఛయతిని, చరణము చివరిలో స్రోతోవహయతిని అత్యంత రమణీయముగా నిక్షేపించిరి. గోపుచ్ఛయతి అనగా ఆవుతోక వలె ముందు లావుగా నుండి చివరకు సన్నగా కొనదేరి యుండును.

అనుపల్లవిలోః-"త్యాగరాజ యోగ వైభవం

ఆగరాజ యోగ వైభవం

రాజయోగ వైభవం

యోగ వైభవం

వైభవం

భవం

వం

స్రోతోవహయతి అనగా నదివలె సన్నగా ప్రారంభమై రాను రాను విశాలమై సాగరమున కలియును. అదే విధముగా చరణము చివరలో-

శం

ప్రకాశం

స్వరూప ప్రకాశం

తత్వ స్వరూప ప్రకాశం

సకల తత్వ స్వరూప ప్రకాశం

శివశక్త్యాది సకల తత్వ స్వరూప ప్రకాశం॥

ఇది దీక్షితులవారు పొందిన రాజ యోగ వైభవమును, తాను సగుణోపాసనములో తిరువారూరు నుండి కైలాసగిరికి చేసిన యాత్రను, వారి సంగీత, సాహిత్య పాండిత్య ప్రకర్షను తెలియజేయు ఘచ్చుతునకలు.

★ ★ ★

## 12వ కృతి "త్యాగేశం భజరేరే"

రుద్రప్రియ రాగము ఆదితాళము

22.వ మేళకర్త జన్యము

పల్లవి:- త్యాగేశం భజరేరే మానస।

తాపాదిం త్యజరే రేమానస॥ ॥త్యాగేశం॥

అ॥ప॥:- యోగీశ విహితం - భోగీశ మహితం ।

శ్రీగురుగుహ విదితం । సురముదితం ।

సింహాసనపతిం । పశుపతిం ॥త్యాగేశం॥

ఇది ఒక చిన్న కీర్తన. చరణము లేని కీర్తన. పల్లవి, అనుపల్లవియే ఉన్నవి. ఇచ్చట చరణము లేకపోవుట చిత్రము. కవి యందు పల్లవించిన హృదయమే రాగమును ఒలుకుచున్నది. అనుపల్లవి ఆ రాగమునే వెదజల్లుచున్నది. ఇక వివరణములు చరణములు అవసరము లేదు. వాగ్గేయకారుని హృదయములో రాగము, తానము, పల్లవి అను మనోధర్మ సంగీత శాఖలు మనోహరముగా ఘూర్ణిల్లుచున్నవి. తపోనిష్ఠుడైన యోగి త్యాగేశునందు

లీనమై పల్లవి అనుపల్లవి ఏకతానముగా రాగమయముగా భావించుట ఈకృతి రచనలోని పరిపాకము. ఇది ఆయన పరిపక్వమైన పండిన స్థితిలోని రచన. త్యాగేశం-తాపాది ఇది ఒక తూకము. యోగీశ-భోగీశ, విహితం-మహితం, విదితం-ముదితం ఈ అనుప్రాసలు సురుచిర విదిత మనోహరములు.

సింహాసన పతి-పశుపతిం అనుటలో భావవైచిత్రి యున్నది. సింహము ఆసనముగా గల పతి. పశువులకు పతి. సింహాసనమదిష్ఠించిన స్వామి పశుపతి అనుట జీవులను తరింపచేయు లక్షణమునకు వ్యంజకము. అధికారము, స్వభావము రెండును జీవులపై స్వామి అనుగ్రహ విశేషమునకు ప్రతీక. మన మృగత్వమును, పశుత్వమున అదుపున పెట్టు అధికారి ఆ పతి.

"శ్రీ మాత శ్రీ మహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ" అను దానిలో ఆమె సింహాసనేశ్వరి ఆయన సింహాసనేశ్వరుడు.

త్యాగ యోగ భోగములు తనదైనవాడు, తనివితీరా ఇచ్చువాడు, చిటారుకొమ్మన చిట్ట చివర నున్నవాడు. వానిని అందుకొనిన తరువాత మరి వేరే యోగము భోగము లేదు. ఈ పల్లవి, అనుపల్లవి నియమితమైన చిన్ని కృతి రుద్రప్రియమైనది. చిటారు కొమ్మననగా చరణము నుండి కటి వరకు, కటి నుండి కంఠము వరకు గల శక్తి కూట మధ్యకూటములు దాటి కంఠము పైనున్న వాగ్భవ కూటమునకు చేరుట. అక్కడ సింహాసనపతికి కిరీటమే కాని చరణావశ్యకత లేదు.

"అపక్వాః పరిపక్వాశ్చ దేహినో ద్వివిధా స్మృతాః
అపక్వాయోగ హీనాస్తు పక్వా యోగేన దేహినః"

అని యోగ శిఖోపనిషత్తు పేర్కొనినది.

యోగముచేత పక్వమైనవాడు జితేంద్రియుడు. శరీరమును జయించినవాడు. అట్టివానికి యోగదేహామే దేహము కాని దేహము దేహము కాదు. ఈ యోగదేహము మహా బలమైనది. ఇది భేద బంధ వినిర్ముక్తమైన స్థితికి చెందినది. యోగీశ-భోగీశాది పదములు సామాన్యార్థ ప్రతిపాదకములు కావు. విశేషార్థప్రదములైన ఈ పదములను ఆలోచించిన

కొలది అమృతమే లభించును. అదియే దివ్యము. దివ్యానుభవము. దానికి నిదర్శనము ఈకీర్తన. దీక్షితుల వారి యోగ పరిపక్వస్థితికి ఈ కీర్తనయే నిదర్శనముగా పేర్కొనవచ్చును.

★ ★ ★

## 13వ కృతి "త్యాగరాజ మహధ్వజారోహ"

శ్రీరాగము ఆదితాళము

22.వ. మేళకర్త జన్యము.

పల్లవిః- త్యాగరాజ మహ ధ్వజారోహ తారకబ్రహ్మరూపమాశ్రయే ।
గణేశ గురుగుహ భక్త భైరవ సోమమయం ॥శ్రీ త్యాగరాజా॥

అ॥ప॥ః- ఆగమ సిద్ధాంత ప్రతిపాద్యం ।ఆనంద చంద్రశేఖర వేద్యం ।
నాగస్వర మర్దళాది వాద్యం । నామరూపాతీత మనాద్యం ॥

మ॥సా॥ః- యాగశాలాద్యుత్సవ చోద్యం । యమాద్యష్టాంగ యోగమాద్యం
భోగరాగ భేదరోగ వైద్యం । బోధామృత మహా నైవేద్యం॥ ॥శ్రీ త్యాగరాజా॥

చరణముః- సృష్టి స్వరూప వసంత వైభవ మష్టధ్వజేంద్ర విమాన భూత
సమిష్టి గజ వృషభ కైలాస వాహ । మ్మాశ్లేష మహారథ స్థితం
విశిష్టహరం, కృష్ణగంధ ధరణం । శిష్టసేవితా జపానర్తనం ।
అష్టపాశహర తీర్థ ప్రభావానుగ్రహాత్మక పాద దర్శనం ॥

మ॥సా॥ః- ఇష్టఫల ప్రద కల్యాణ సుందరేశ నావమాచార్య ప్రాభవ।
మష్టసిద్ధి దాయకాంబికోత్సవ మారూఢ చండీశ్వరం ॥శ్రీ త్యాగరాజా॥

ముందున్న రుద్రప్రియ రాగములోని కీర్తన ఎంత చిన్నదో ఈ శ్రీరాగములోని కీర్తన అంత పెద్దది. రుద్రప్రియ రాగములోని కీర్తన ఎంత అంతరమైన, సూక్ష్మ రహస్య పరమో ఈ శ్రీరాగములోని కృతి అంత బాహ్యమైన వివిధ అలంకరణములతో ఒప్పుచున్న శ్రీ త్యాగరాజేశ్వరుని కల్యాణోత్సవ కోలాహల విశాల విస్తర వైభవ వివరణ వర్ణనాపదము ఈ కృతి.

తిరువారూరున శ్రీత్యాగరాజేశ్వర స్వామి కల్యాణోత్సవము ప్రతి సంవత్సరము వసంత ఋతువులో ఫాల్గుణ బహుళంలో కృత్తికా నక్షత్రము ఉండు దినమున నేటికిని జరుగుచున్నదట. ఈ ఉత్సవములు ధ్వజారోహణముతో ప్రారంభమై ఐదు దినములు జరుగుచున్నవి. దీనిని ఒక మహా యాగశాలాది ఉత్సవ చోద్యముగా దీక్షితుల వారు భావించి ఆ వైభవమంతయు ఈ కృతిలో వర్ణించిరి. ఇది పంచాహ్నిక, నవాహ్నికాది దీక్షలతో జరుగు బ్రహ్మోత్సవములతో కూడిన కల్యాణోత్సవము.

ఈ త్యాగరాజేశ్వర స్వామి ఇక్కడ సగుణరూపమున ఉత్సవ సమయమున మహాధ్వజారోహ తారక బ్రహ్మ రూపముగా నుతింపబడుచున్నాడు. ఈ ఉత్సవ సమయమున తారకమైన బ్రహ్మరూపమే ఆరాధ్యము. బ్రహ్మమునకు రూపము లేదు. రూపములేని బ్రహ్మము వేదమంత్రముల చేత, నామముల చేత, యాగాగ్ని జ్వాలారూపము చేత నామ రూపాత్మకమైన, బ్రహ్మము ఉత్సవ సమయమున ప్రత్యక్షదర్శనముగా నిదర్శనమగును. అప్పుడు గణేశుడు, సోముడు కూడ వచ్చియుందురు. వీరి అందరి సమూహరూపమైన, సమష్టి రూపమైన, తారకబ్రహ్మ రూపము ఉత్సవములందు గోచరించునని దీక్షితుల వారు పల్లవిలో చెప్పినారు.

ఆగమ సిద్ధాంతమున ప్రతిపాదించిన ధ్వజారోహ సమయ భగవత్ లక్షణము. ఉత్సవమున తాను చూచుచున్న త్యాగ రాజేశ్వరుని తారక బ్రహ్మరూపం అదియేనని దీక్షితుల వారు దృఢముగా నిశ్చయమునకు వచ్చినారు. అట్టి రూపము ఆనంద చంద్రశేఖరునికే తెలియుననిరి. చంద్రుడు శేఖరముగా కలవాడు చంద్రశేఖరుడు. దీక్షితులవారు ఆ ఉత్సవమును తిలకించి ఆనందమును పొంది, ఆ ఆనందమే రసమని తెలిసి అట్టి రసస్వరూపుడైన చంద్రశేఖరునికే అనుభవైక వేద్యమని అనుపల్లవిలో చెప్పిరి. ఆ పరమాత్మ యొక్క దర్శనముచే యోగియైన వానికి కలుగు ఆనందానుభూతిలో 16వ కళయగు చంద్రరేఖ కనిపించును. కనుక ఆనంద చంద్రశేఖరుడు రస స్వరూపుడు. అతనికే తెలియదగినది తారక బ్రహ్మరూపము. తానే తారక బ్రహ్మము కదా. తనకు తానే తెలియుట అనగా స్వస్వరూపాను సంధానము జరుగుట. మహాధ్వజారోహ తారకబ్రహ్మరూపము సగుణము

నందు ప్రతీక సహాయమున నిర్గుణ బ్రహ్మమును గుర్తించగల వానికి తెలియు రూపమది. కాని లోకము నాగస్వర మర్ధళాది వాద్యములతో బహిర్ముఖముగా స్వామి వైభవమునకు వలసిన నాగస్వర మర్ధళాది వాద్య ఘోషలచే పులకించిపోవు ఆ స్వామి ఎప్పుడును సత్యరూపుడే. అందుచేతనే నామరూపాతీతుడైన పరమాత్మనే దర్శించును.

ఆస్థితిలో త్యాగరాజేశ్వర స్వామి యాగశాల ఉత్సవము నందు చోద్యముగా ఉన్నవాడు. దీక్షితుల వారికి ఆ స్థితినుండి సమాధి స్థితినొందుటలో మొదలు తెలియదు. మొదలు లేనివానికి మొదలు ఏమనగా తన యోగ సాధనలో మొదట కనిపించిన మూర్తి. ఆ మూర్తి ఒక వైద్యుడు. భోగములచే చెడిన వారికి వైద్యుడు. రాగములచే కలుగు రోగములకు వైద్యము చేయువాడు. భగవంతుడు వేరు తాను వేరు అన్న భేదము పోగొట్టువాడు. "భోగ రాగ భేద రోగ వైద్యం" అన్న చరణములో చెప్పబడిన 3 రోగములు ఇంద్రియములకు లోలుడై, తత్పరుడై యుండువానికి అంతు పట్టనిది. పరమేశ్వరునికి భిషక్ అని బిరుదు. "భిష జాం అపి భిషజం" వైద్యులకు వైద్యుడు. ఈ రోగములను బాపువాడు కనుకనే తనకు నిత్య ప్రత్యక్ష రూపమున బోధామృతమే ఆహారముగా కలవాడు. అదియే మహా నైవేద్యమని దీక్షితుల వారు మద్యమ కాలసాహిత్యములో చెప్పినారు.

అట్టి త్యాగ రాజేశ్వరుడు మహానుభావుడు. 'సృష్టి స్వరూప వసంత వైభవుడు' సృష్టి, అష్ట దిక్కుల యందు ధ్వజ శ్రేష్ఠములచే విమానముగా చేయబడిన సమష్టి రూపమైన గజ, వృషభ, కైలాసవాహ, మహారథ వాహనములపై ఉన్నవాడు. 'విశిష్టుడైన హరుడు' అనగా హరించువాడు అనగా లయకారుడు. కృష్ణ గంధము తమోగుణ ప్రతీకగా ధరించినవాడు. శిష్టులైన వారిచే సేవింపబడుచున్న అజపా రూపమైన గాయత్రి యందు తన నర్తనము కలవాడు. శిష్టులు కాని వారికి అజపా ప్రసక్తియే లేదు. యోగులు ఉత్సవము నందు బహిర్ముఖులు కారు. వారు అంతర్ముఖులు. మరియొక విశేషము. అష్టపాశములను హరించు తీర్థప్రభావము చేత దయ చూపుటయే లక్షణములుగా గల పాద దర్శనము ఇచ్చువాడని దీక్షితుల వారు చరణములో వివరించిరి. ఆ స్వామి కల్యాణోత్సవ వైభవము నంతను ఈ కృతిలో వర్ణించిరి.

చరణాంతమందు గల మధ్యమకాల సాహిత్యములో దీక్షితుల వారు త్యాగ రాజేశ్వరుని "ఇష్టఫల ప్రద కళ్యాణ సుందరేశ నావమా చార్య ప్రాభవ" అనిరి. అనగా ఇష్ట ఫల ప్రదుడైన కల్యాణ సుందరేశుడు నౌకవంటివాడు. కనుకనే ఆచార్య ప్రాభవము కలవాడు. ఆచార్యుడు జన్మను తరింపచేయు 'నౌక' వంటివాడు. మన జన్మమునకు ఇష్టఫలము మోక్షము. దానిని ఇచ్చుటలో కల్యాణ సుందరేశుడు సంసార సాగరమును దాటించు నౌక. 'నౌ' అనే శబ్దము ద్వితీయ విభక్తిలో నావం అయినది. ఇది ఆచార్యుడు చేయు పని. దాని చేత ఈ కల్యాణ సుందరేశ్వరుని యొక్క ప్రాభవము ఆచార్య ప్రాభవము. కాగా ఇది లోకమున అష్టసిద్ధులను కలిగించునది. ఆ సిద్ధులను కలిగించు తల్లి అంబిక. ఆమెతో కూడి ఉత్సవమున నున్నవాడు. ఆరూఢ చండేశ్వరం అనగా రథారూఢుడై యున్న కారణమున ప్రచండమైన లక్షణములతో నున్న ఈశ్వరుడు. చండీశ్వరత్వము స్వామికి పరిపూర్ణ లక్షణము. ఉత్సవమునందు భంగకారులైన భండాసురాదులున్నను వారిని చెండాడు చండి ఆమె. బిడ్డలకు అష్టసిద్ధులు ఇచ్చుటలో అంబిక. అంతర్బహిశ్శత్రు నిర్మధనంలో ఆమెయే చండి. ఈ అంబిక నీలోత్పల. కనుకనే నీలోత్పలాంబిక. పరబ్రహ్మము ఒక్కడే. "ఏకమేవ అద్వితీయం బ్రహ్మ" అట్టివాడు ఏకాకిగా రమించలేక తన్ను రెండుగా విభజించుకున్నాడు. సృష్ట్యాది పుం, స్త్రీ మిథునము ప్రాణి కోటి ఉద్భవించుటకు హేతువు. ప్రకాశ, విమర్శ బిందు మిశ్రమమే మిశ్రమ బిందువు. అదే సృష్టి లక్షణము. దీనికి మూలమైనవాడు కల్యాణ సుందరేశుడు. భవసాగరమును తరింపచేయు నావ. దీనిలో ఆయనకు సహకారి అంబిక. ఆ అంబిక ఎంత చండియైననూ ఆమెపై ఈశ్వరత్వము కలవాడు కనుక రూఢిగా వాంఛిత ఫలములను ఇచ్చుటకు సమర్థుడు. వీరి ఇద్దరియందు ఫలప్రదాయకత్వము సమానమే అయినను తండ్రి పరమార్థమును, తల్లి లౌకికార్థములను ఇచ్చువారు. అష్టసిద్ధులు ఇహమున వైభవ కారకములు. పరమునందు ఇష్టఫలము మోక్షమును ఇచ్చువాడు కల్యాణ సుందరేశుడు.

"రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే"

ఈ దంపతులు ఒకరికొకరు తీసిపోరు. ఇహపరముల రెండింటిని భక్తులకు

సమృద్ధిగా సమకూర్చువారు. తుల్యశీలము, తుల్య వైభవము కలవారని దీక్షితులవారు కల్యాణోత్సవ వైభవమును వర్ణించిరి.

ఈ త్యాగరాజేశ్వరుని కృతులు ప్రథమా విభక్తితో ప్రారంభమై సంబోధన ప్రథమా విభక్తితో ఒక వరుసన ఎనిమిది కృతులు కలవు. ఆ తరువాత ఈ విభక్తులు వరుసగా రాకున్నను వాటి ప్రయోజనము మొదటి ఎనిమిదింటిలోను చెప్పబడినట్లే యున్నది.

1. త్యాగరాజో విరాజితే - తిరువారూరులో త్యాగరాజు ఉన్నాడు - ఇది ప్రథమా విభక్తి.

2. 'త్యాగరాజం భజరే' - ఆయనను భజింపవలెను - ఇది ద్వితీయ విభక్తి.

3. 'త్యాగరాజేన సంరక్షితోఽహం' - ఆయనచే సంరక్షింపబడితిని - ఇది తృతీయ విభక్తి.

4. 'త్యాగరాజాయ నమస్తే' - అట్టి త్యాగరాజునకు నమస్కారము - ఇది చతుర్థీ విభక్తి.

5. 'త్యాగరాజా దన్యం నజానే' - త్యాగరాజున కంటే అన్యదైవమెఱుగను - ఇది పంచమీ విభక్తి.

6. 'శ్రీత్యాగరాజస్య భక్తో భవామి' - త్యాగరాజు యొక్క భక్తుడనగుదును - షష్ఠీ విభక్తి.

7. త్యాగరాజే కృత్యాకృత్య మర్పయామి-త్యాగరాజునందు కృత్యాకృత్యములను అర్పించుచున్నాను - సప్తమీ విభక్తి.

8. 'వీర వసంత త్యాగరాజ మాం తారయాశు' - త్యాగరాజు నందే విదేహ కైవల్యమును పొందుదును. ఓ వీర వసంత త్యాగరాజా నన్ను తరింపజేయుము - ఇది సంబోధనా ప్రథమావిభక్తి.

ఇది సర్వ క్రియాకారకత్వములకు ఆలంబనమైన త్యాగరాజును సర్వాత్మనా ధ్యానించుట దీక్షితుల వారి కీర్తనా రూపమైన అర్చనా విధానము.

★ ★ ★

# పంచమాధ్యాయము

# పంచమాధ్యాయము

## నవావరణ కృతులు - వాని విశిష్టత

పరమార్థ సాధనకై ఉపాసించు విద్యలలో అంబికా విద్య ఒకటి. దీనినే శాక్తేయ సంప్రదాయము అందురు. ఈ ఉపాసనా విధానములో దక్షిణ, వామ, సమయ, కౌల అను నాలుగు శాఖలు గలవు. వీనిలో శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు దక్షిణాచారము ననుసరించిరి. దక్షిణాచారమనగా సాధకుడు సద్గురువును ఆశ్రయించి దీక్షపొంది ఉపాసన ప్రారంభించును. దీక్షితుల వారు శ్రీ చిదంబరనాథయోగి అను యతీంద్రుని వద్ద మంత్రోపదేశమును పొంది ఉపాసించిరి. పరాశక్తిని యంత్రము నందు గాని, విగ్రహమునందు గాని, పంచాయతనమందు గాని అర్చన చేయుట ఆచారము. అది విగ్రహమైనను, యంత్రమైననూ, పంచాయతనమైనను పరమేశ్వరీ రూపమే. ఆ దీక్ష పొందిన వారే దీక్షితులు. వారే అర్చనకు అర్హులు.

శ్రీదేవిని యంత్రము నందు ఆరాధించుట లోక సంప్రదాయము. 'శ్రీ' చక్రము నవావరణములను కలిగియుండును. నవావరణములను వివరించుచు త్రిపురతాపినీ ఉపనిషత్ యందు సాంప్రదాయిక శ్లోకము కలదు.

"బిందు త్రికోణ సమకోణ దశార యుగ్మ
మన్వస్ర నాగదళ షోడశ పత్ర యుక్తం ।
వృత్త త్రయంచ ధరణీ సదన త్రయంచ
శ్రీ చక్రరాజ ఉదితః పరదేవతాయః ॥[1]

పరదేవత యొక్క శ్రీ చక్రరాజము బిందువు, త్రికోణము, అష్టకోణము, దశారయుగ్మము, చతుర్దశారము, అష్టదళము, షోడశపత్ర యుక్తము, వృత్త త్రయము, భూపుర త్రయములతో ఏర్పడినదని భావము. దీనికి పాఠాంతరమున్నది. కాని దానివలన అర్థ ప్రతీతికి భంగము కలుగుట లేదు.

ఈ వివరములనే "శ్రీ సుభగోదయ" స్తోత్రమున శ్రీ గౌడపాదాచార్యుల వారు వర్ణించిరి.

---

1. శ్రీ. భ. వి. పుట 7

"త్రికోణై రష్టారం త్రిభిరపి దశారం సముద్ర భూ
ద్దశారం భూవేశ్మాదపిచ భువనాత్రం సమ భవత్ ।
తత్ఃభూన్నాగారం నృపతి దళమస్మాత్రి వలయం
చతుర్ద్వాః ప్రాకార త్రితయ మిదమేవాంబ శరణమ్॥[1]

శ్రీ శంకర భగవత్పాదాచార్యులు 'సౌందర్యలహరి'లో శ్రీ చక్రమును ఇట్లు వర్ణించిరి. -

"చతురిః శ్రీకంఠైః శివ యువతిభిః పంచభిరపి
ప్రభిన్నాభిః శంభోర్నవభి రపి మూల ప్రకృతిబిః
త్రయశ్చ త్వారింశ ద్వసుదళ కళాశ్ర త్రివలయ
త్రిరేఖాభిః సార్థం తవ శరణ కోణాః పరిణతాః ॥[2]

పరదేవతకు నిలయమైన శ్రీ చక్రము నందు గల త్రికోణములు ఒకదానిలో ఒకటిగా నుండి నవకోణములతో వలయాకారముగా నున్నది. కేంద్రమున బిందువు గలదు. నవయోన్యాత్మకమైన శ్రీ చక్రము నందు గల అధోముఖములైన త్రికోణములైదును శక్తికి, ఊర్ధ్వముఖములైన నాలుగు త్రికోణములు శివునకు చిహ్నములు.

ఆగమ రహస్యార్థ వివరణమును బట్టి నవయోని సహితమైన శ్రీ చక్రము నందు శివశబ్దము చేత చతుర్యోన్యాత్మకమగు అర్థచక్రము సూచితమగుచున్నది. శక్తి శబ్దము చేత పంచయోన్యాత్మకమగు అర్థచక్రము సూచితమగుచున్నది. శివశక్తి కలయిక వలన రెండు అర్థ చక్రములను కూడిన నవయోన్యాత్మకమగు శ్రీ చక్రము రూపు కట్టుచున్నది. ఈ చక్రము విశ్వోత్పత్తి, స్థితిలయములకు స్వరూపము. ఇట్టి నవయోన్యాత్మకమగు శ్రీ చక్రము శివాశివుల స్వరూపమై యున్నదని గ్రహింపవలెను. అందువలననే -

శ్లో॥ చతర్భిః శివచక్రైశ్చ శక్తి చక్రైశ్చ పంచభిః
శివశక్త్యాత్మకం జ్ఞేయం శ్రీ చక్రం శివ యోర్వపుః"[3]

---

1. కా. క. వి. పుట 179
2. సౌ. ల. శ్లో 11 పుట 72
3. సౌ .ల. పుట. 4

అందురు. పరమేశ్వర పరమేశ్వరీ రూపమైన యంత్రమునే తాంత్రిక పరిభాషలో శ్రీ చక్రము అందురు. ఈ విద్య శ్రీ విద్య. ఉపాసకుడు శ్రీ విద్యోపాసకుడు. బాల, పంచదశాక్షరీ, షోడశాక్షరీ మంత్రములకు శ్రీ విద్యనామమున్నది. 'శ్రీ' బీజ ప్రధానమైన విద్య గనుక శ్రీ విద్య యని ప్రసిద్ధి పొందినది.

శ్రీ చక్రము నందుగల బిందుస్థానము జగన్మాతయైన రాజరాజేశ్వరీ లలితా పరాభట్టారికా నిలయము. అమెయే మహాత్రిపుర సుందరి. శ్రీ విద్యా మంత్రములకు, పరదేవతకు సాంకేతికమైన చిహ్నము. అది పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ, మాతృకా రూపము. అంతర్ముఖుడైన సాధకునికి స్వస్వరూపము. శ్రీదేవీ మహత్తును శబ్దరూపమున శ్రీ విద్యా మంత్రములు వెల్లడిచేయును. శ్రీవిద్య సమస్త మంత్ర విద్యలకు మౌలిక స్థానమునందున్న బ్రహ్మవిద్య. దీనిని మించిన ఉత్తమ మంత్ర విద్యలు లేవు. శ్రీ చక్రము కన్న ఉత్తమమైన యంత్రములు లేవు.

శ్రీ చక్రమునకు (ముఖ్య) మూలకారణములైన 9 కోణములు ప్రపంచ నిర్మాణమునకు కారణములు. అందుచేత వీనికి నవయోనులని పేరు కలదు. అవియే పిండాండ నిర్మాణ హేతువులైన 9 ధాతువులు 1. త్వక్ (చర్మము) 2. అస్ృక్ (రక్తము) 3. మాంస, 4. మేధో (మెదడు) 5. అస్థి (ఎముక) ఈ 5 శక్తి సంభూతములు. 6. మజ్జ (ఎముకలలోని గుజ్జు) 7. శుక్లము (వీర్యము) 8. ప్రాణ, 9. జీవము. ఇవి 4 శివ సంభూతములు. అదే విధముగా పంచభూతములు, పంచతన్మాత్రములు. పంచజ్ఞానేంద్రియములు పంచ కర్మేంద్రియములు, మనస్సు, శక్తి సంబంధమైనవి. మాయా, శుద్ధవిద్యా, మహేశ్వర, సదాశివములు, శివసంబంధమైనవి. ఈవిధముగా పంచవింశతి తత్త్వములతో కూడిన నవకోణములే బ్రహ్మాండ, పిండాండ నిర్మాణమునకు ఆధారములు.

ఈ విశ్వ సృష్టి బిందువుగా ప్రారంభమై క్రమముగా వ్యాప్తిని పొందియున్నది. మొదట ఆకాశరూపములో ఉండి ధ్వనిని కలిగియున్నది. తరువాత వాయురూపమును పొందినది. దీనికి ధ్వని స్పర్శ కూడా ఉన్నవి. తరువాత అగ్ని రూపమును పొందినది. అప్పుడు ధ్వని, స్పర్శ, రూపములను కలిగియున్నది. ఆ తరువాత జల రూపమును

పొందియున్నది. అప్పుడది శబ్ద, స్పర్శ, రూప, రసములను కలిగియున్నది. ఆ తరువాత పృథివీ రూపమును పొందినది. అచట శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను ఐదు గుణములను కలిగియున్నది. ఇవి అన్నియు జీవకోటికి మూలాధారమైనవి. తిరిగి దీనిలో నుండి సృష్టి జరుగుచున్నది. ఈవిధముగా కొన్ని యుగములైన తరువాత సంహారప్రక్రియ ప్రారంభమగును. క్రమముగా సృష్టి వినాశనమై బిందు రూపమైన పరమేశ్వర పరమేశ్వరీ రూపములో లీనమగును.

శ్రీచక్ర పూజా విధానములో రెండు పద్ధతులు కలవు. 1. బిందువునుండి భూపురము వరకు పూజచేయు విధానమును సృష్టి పూజాక్రమము అందురు. 2. భూపురము నుండి బిందువు వరకు పూజ చేయు విధానమును సంహారక్రమము అందురు. మంత్ర, తంత్ర శాస్త్రములలో నిష్ణాతులైన శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు భూపురము నుండి బిందువు వరకు శ్రీ చక్రార్చన చేయు నేమయమున అదే క్రమములో కమలాంబా నవావరణ కృతులను రచించి గానము చేసిరి. శ్రీదేవి ధ్యాన పరాయణుడైన శ్రీ దీక్షితుల వారు పరమేశ్వరి నుపాసించుచు ఆమె యందు లీనమై మోక్షము పొందుటయే ధ్యేయముగా కలవారు. కనుక భూపురము నుండి ప్రారంభించి బిందువు వరకు సంహారక్రమమున ఆ దేవిని ఉపాసించుచు కీర్తనలను రచించిరని భావించవచ్చును.

సంగీత త్రిమూర్తులలో ఒకరైన శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు తిరువారూరు క్షేత్రములో అమ్మవారైన కమలాంబ, నీలోత్పలాంబలపైనను, 'మయూరము'న గల 'అభయాంబ' పైనను నవావరణ కృతులను రచించిరి. వీనిలో కమలాంబా నవావరణ కృతులు మిక్కిలి ప్రసిద్ధమైనవి. కనుక వీని విశ్లేషణ మాత్రమే ప్రధానాంశముగా తీసుకొని మిగిలినవి విడిచితిని.

తిరువారూరును మూలాధారక్షేత్రము, శ్రీపురము అందురు. మంత్రశాస్త్రములో శ్రీపురమనగా శ్రీ చక్రము. శ్రీచక్రములోని బిందుస్థానము ఆ పరదేవత యొక్క నివాసస్థానము. దీనినే చింతామణి గృహము, మందిరము అందురు. శ్రీ చక్రమునందు గల నవావరణములలో ప్రతి చక్రమునకు చక్రాకృతి, చక్రనామము, ప్రకృతి, తత్త్వం,

పూజాక్రమము, దేవతానామము, యోగినీనామము, చక్రేశ్వరి, ముద్ర, బీజము, స్థాయీభావము, రసము కలవు. ఈ నవావరణములకు 1. సర్వానందమయ 2.సర్వసిద్ధి ప్రద ,3 సర్వరోగహర, 4. సర్వరక్షాకర, 5. సర్వార్థ సాధక, 6. సర్వ సౌభాగ్యదాయక, 7. సర్వ సంక్షోభణ, 8. సర్వాశాపరిపూరక, 9. త్రైలోక్య మోహన చక్రములని నామములు. ఈ చక్రముల ముద్రాది దేవతలు - 1. సర్వసంక్షోభిణి, 2. సర్వవిద్రావిణి, 3. సర్వాకర్షిణి, 4. సర్వవశంకరి, 5. సర్వోన్మాదిని, 6. సర్వమహాంకుశ, 7. సర్వఖేచరి, 8.సర్వబీజము, 9.సర్వయోని, 10.సర్వత్రిఖండ. వీరు కాక యోనులు, అధి దేవతలు, ప్రత్యధి దేవతలు అంతా ఏడు కోట్ల పరివారము. ఒక్కొక్క చక్రము నారాధించు క్రమము, ఫలితములు వేరు వేరుగా నుండును.

**మూ॥ " శ్రీ గురు సర్వకారణ భూతాశక్తిః**

**తేన నవరంధ్ర భూతోదేహః"** [1]

చిద్విద్యాపూర్ణ దీక్షనొసగిన శ్రీ గురువులు శ్రీ పరాదేవి స్వరూపులు. కావున నవరంధ్రములు కలిగి యున్న సాధకుని శరీరమే (స్థూల) నవచక్రములు కలిగియున్న శ్రీచక్రముగా భావింపవలసియున్నది. గురువు తనతో వేరు చేయబడని నవ రంధ్రములు కలవాడగుటచే గురువే నవరంధ్ర స్వరూపుడనియు, నవ రంధ్రములే గురు స్వరూపమనియు శ్రీమద్భావనోపనిషత్ మూలసూత్రము నందు కలదు. శ్రీ చక్రమునకు సాధకుని శరీరమునకు సమన్వయము కలదు. శ్రీ చక్రములోని నవకోణముల వలె, నవరంధ్రములు మన పాంచ భౌతిక దేహములో నేత్రద్వయము, శ్రోత్రద్వయము, నాసికారంధ్ర ద్వయము నోరు, మల, మూత్ర విసర్జన స్థానములు. భౌతిక శరీరములో పరదేవత జీవకళగా పరిగణింపబడుచున్నది. ఈవిషయమే-

**శ్లో:- "దేహో దేవాలయః ప్రోక్తో జీవో దేవస్సనా తనః**

**త్యజేదజ్ఞాన నిర్మాల్యం సోఽహం భావేనే పూజాయేత్ "**

---

1. శ్రీ. భా. వ. నో మూలం 1 పుట 1

2. శ్రీ.చ.వి. పుట 146, 147

మూ॥ "నవచక్రరూపం శ్రీ చక్రం"[1]

నవచక్రరూపమగు శ్రీ చక్రము దేహమని శ్రీమద్భావనోపనిషత్ 3వ మూల సూత్రము నందు కలదు. ఈ ఉపనిషత్‌లో పాంచ భౌతిక శరీరములో దేవిని పూజించు విధానము కలదు.

1. హృదయ పద్మములు - ఆసనముగా
2. సహస్రారము నుండి స్రవించు అమృతము - పాద్యముగా
3. మనస్సు - అర్ఘ్యముగా
4. సహస్రారచ్యుత అమృత స్నానము - ఆచమనముగా
5. ఆకాశతత్త్వము - వస్త్రముగా
6. గంధతత్త్వము - గంధముగా
7. చిత్తము - పుష్పముగా
8. ప్రాణము - ధూపముగా
9. సహస్రారములోని సుధాంబుధి - నైవేద్యముగా
10. అనాహత పద్మములోని ధ్వని - ఘంటానాదముగా
11. వాయు తత్త్వము - చామరముగా,
12. ఇంద్రియ ధర్మములు, చాంచల్యము - నృత్యము

ఇవి గాక మాయను నిరోధము చేసి, అహంకారమును విసర్జించి, రాగాన్ని త్యజించి, మదము నణచి, మోహము బాసి, డంబాన్ని వదలి, ద్వేషమును రోసి, క్షోభపడక, మాత్సర్య రహితుడై, లోభము విడచి, అహింసా, ఇంద్రియ నిగ్రహము, దయ, క్షమ, జ్ఞానము అను పదునైదు ఉత్తమ జాతి పుష్పములతో పూజించవలెను అనగా ప్రతీ అవయవమును వశపరచుకొని పునీతుడైన వారు పరమాత్మ సన్నిధిని చేరుకొందురు.

"దేహో నవరత్న ద్వీపః"[2] నవచక్రాల్లో శక్తులు ప్రభావించి పనిచేయుచున్నవని

---

1.శ్రీ. భా. వ. నో మూ.3. పుట 8

2.భా.వ.నో మూ. 6 పుట 12.

భావనోపనిషత్ (English) నందు కలదు.

| | | |
|---|---|---|
| "మూలపధార్థము | - రత్నం, మణి | - దేవత |
| 1. మాంసం | - పుష్యరాగం | - కాలచక్రేశ్వరి |
| 2. కేశములకు | - నీలం | - ముద్రా చక్రేశ్వరి |
| 3. చర్మము | - వైడూర్యం | - మాతృకా చక్రేశ్వరి |
| 4. రక్తం | - మాణిక్యం | - రత్న చక్రేశ్వరి |
| 5. మజ్జ | - మరకతం | - గురు చక్రేశ్వరి |
| 6. శుక్లం | - ముక్తికం | - దేశా చక్రేశ్వరి |
| 7. ఎముకలకు | - వజ్రం | - తత్వ చక్రేశ్వరి |
| 8. క్రొవ్వు | - గోమేధికం | - గ్రహ చక్రేశ్వరి |
| 9. మర్మావయవములు | - పద్మరాగం | - మూర్తి చక్రేశ్వరి"[1] |

మానసిక ప్రవృత్తులపై పనిచేయు దేవతల వివరము భావనోపనిషత్ నందు కలదు

| | | |
|---|---|---|
| రసము | - దేవత | - ఫలం |
| 1. శాంతరసం | - అణిమాసిద్ధి | - అణుశక్తి (Atomicity) |
| 2. అద్భుతరసం | - లఘిమాసిద్ధి | - నిర్విచారం (Lightness) |
| 3. కరుణం | - మహిమాసిద్ధి | - సామర్ధ్యం (Mightyness) |
| 4. వీరం | - ఈశత్వ సిద్ధి | - వశీకరణ |
| 5. హాస్యం | - వసిత్వసిద్ధి | - సర్వాకర్షణ |
| 6.భీభత్సం | - ప్రాకామ్యసిద్ధి | - కామరూపం ధరించే శక్తి |
| 7. రౌద్రం | - భుక్తిసిద్ధి | - శక్తి ననుభవించడము |
| 8. భయానకం | - ఇచ్ఛాశక్తి | - అభీష్టసిద్ధి |
| 9. శృంగారం | - సర్వకామసిద్ధి | - సర్వఫల ప్రాప్తి"[2] |

---

1. భా.వ.నో.(E) పుట 44. 45

2. భా.వ.నో. (E) పుట 46

మన దేహములో గల అవయవాలను పరిపాలించు నాడులు, ఆదేవతల వివరణము భావనోపనిషత్ (E) నందు కలదు.

| | | |
|---|---|---|
| "అవయవము | - నాడి | - దేవత |
| 1. నుదుటి మధ్యభాగము | - అలంబుసనాడి | - సర్వ సంక్షోభిణి |
| 2. నుదుటి కుడి భాగము | - కుహు | - సర్వ విద్రావిణి |
| 3. కుడిబుగ్గ | - విశ్వోదర | - సర్వాకర్షిణి |
| 4. కుడి భుజము | - వారుణి | - సర్వాహ్లాదిని |
| 5. కుడిభాగము | - హస్తిజిహ్వ | - సర్వసమ్మోహిని |
| 6. కుడితొడ | - యశోవతి | - సర్వస్తంభిని |
| 7. కుడిమడమ | - పయశ్విని | - సర్వజృంభిణి |
| 8. ఎడమ మడమ | - గాంధారి | - సర్వ వశంకరి |
| 9. ఎడమతొడ | - పూస | - సర్వరంజని |
| 10. ఎడమ భాగము | - శంఖిణి | - సర్వోన్మాదిని |
| 11. ఎడమ భుజము | - సరస్వతి | - సర్వార్థసాధిని |
| 12. ఎడమబుగ్గ | - ఇడ | - సర్వసంపత్తి పూరణి |
| 13. నుదుటి ఎడమ భాగము | - పింగళ | - సర్వమంత్రమయి |
| 14. నుదుటి వెనుక భాగము | - సుషుమ్న | - సర్వద్వంద్వక్షయంకరి"[1] |

భౌతిక శరీరము అస్వస్థతకు గురి కాకుండ వలననినా ఈనాడులన్నియు సక్రమముగా పనిచేయవలెను. దేవతారాధన 3 విధములు. 1. బహిర్యాగము అనగా విగ్రహారాధన 2. అంతర్యాగము అనగా జపము, 3. భావన, త్రిపుటి యనబడు జ్ఞాన, జ్ఞాతృ, జ్ఞేయం అను ఈ మూడింటి అబేధ భావనే శ్రీ చక్రార్చన.

శ్రీ చక్రమున గల బిందువు ఈ జగత్తు యొక్క సృష్టికి కేంద్రము. అదియే శివశక్తుల సమ్మేళనము. బిందువునుండి నాదముత్పన్నమైనది. నాదము ఓంకారము.

1. భా.వ.నో. (E) పుట 48, 49

ఓంకారము బ్రహ్మ ప్రతిపాదకము. బ్రహ్మప్రణవ సంధాన నాదమే శివస్వరూపము. సప్తస్వరములు ఆ నాదము యొక్క కళలు. పంచాశత్ వర్ణములు కూడ ఆ నాదము యొక్క కళలే. పరాపశ్యంతీ మధ్యమా వైఖరీ భేదములలో నాదములున్న స్థితి సూక్ష్మ మధ్యమము. ఆరోహణ క్రమమున నాదాంత సమయమే పశ్యంతి. నాదలయమే మనోలయము. అప్పుడే బ్రహ్మానందానుభవము. అది జీవన్ముక్తావస్థ. ఇది సర్వాగమ సిద్ధమైన విషయము. ఉన్మనీ చక్రము తొమ్మిదవది. ఎనిమిదవ చక్రమునకు మనోన్మనీ స్థానమని పేరు. మనోన్మనీ స్థానము నందే మనోలయమగునని, అచట నిశాదివ భేదము లేదని అది శివశక్తి మేళన రూపమని, రుద్ర వక్త్రమని చెప్పుదురు. "మనోన్మనాయనమః" అను నామము కూడ కలదు.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు ఈ కమలాంబ నవావరణ కృతులలో మంత్ర, యంత్ర, తంత్ర శాస్త్రముల సారమును, ఒక్కొక్క చక్రమును ఆరాధించు క్రమము, ఫలితములు వేరువేరుగా ఉండునని వివరించిరి. స్వాత్మ విమర్శతో, సంకల్ప, వికల్పములతో జయించిన విశ్వ విగ్రహ రూపిణి. పరదేవతయైన ఆ కమలాంబ సత్స్వరూపిణి. ఆమెపై ధ్యానమును నిల్పుటయే మనలోగల పరదేవతను తెలిసికొనుట అను బలమైన సందేశమును ఈ నవావరణ కృతుల ద్వారా ఆరాధించి, తరించు విధముగా శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు రచించిరి. నవావరణముల యొక్క పరిజ్ఞానము, శ్రీ చక్ర దర్శన సిద్ధి దీక్షితుల వారి నవావరణ కృతులలో విశదమగును. శివశక్తుల దర్శనమునకు వలయు యాత్రాయోగము, భావనాయోగము, విజ్ఞానమును దీక్షితుల వారు ఈ కృతుల యందు నిక్షిప్తముగావించిరి. ఈ కృతులలో లలితా సహస్ర నామ స్తోత్రము, దేవిఖడ్గమాలా స్తోత్రములలోని నామములు కలవు.

# శ్రీ కమలాంబా నవా వరణ కృతులు
## ధ్యాన కీర్తన

తోడిరాగము　　　　　　　　　　　　　　　　　　రూపకతాళము

పల్లవి:- కమలాంబికే, ఆశ్రితకల్పలతికే। చండికే।
కమనీయారుణాంశుకే। కరవిధృతశుకే।
మామవ కమలాంబికే జగదంబికే॥

అ॥ప॥:- కమలాసనాది పూజిత కమలపదే। బహువరదే।
కమలాలయ తీర్థవైభవే। శివే। కరుణార్ణవే॥

చరణము:- సకలలోక నాయికే సంగీత రసికే।
సుకవిత్వ ప్రదాయికే సుందరి గతమాయికే।
వికళేబర ముక్తిదాననిపుణే। అఘహరణే।
వియదాది భూత కిరణే। వినోదచరణే। అరుణే।
సకలే గురుగుహకరణే, సదాశివాంతఃకరణే।
అకచటతపాది వర్ణే। అఖండైక రసపూర్ణే॥

దీక్షితుల వారు రచించిన కమలాంబానవావరణ కృతుల యందు ప్రథమముగా గల ధ్యానకృతి యందు ఒక ప్రత్యేకత కలదు. దీక్షితులవారు ధ్యానము చేయు పంచదశీ మంత్రమును ఈ కీర్తన యందు నిక్షేపించిరి. ఆకాశాది పంచ భూతముల యందు గల వర్ణన ద్వారా అక్షర సంఖ్యా విశిష్టమైన, మహామంత్ర రాజమైన శ్రీవిద్య పంచ దశీ స్వరూపము. పంచదశీ మంత్రము మూడు ఖండములుగా నున్నది. ఈ ధ్యాన కీర్తన కూడా పల్లవి, అనుపల్లవి, చరణములను 3 ఖండములలో నున్నది.

తిరువారూరు నందు శ్రీ చక్రవాసిని యైన కమలాంబ యోగినీ రూపముననున్నది. ఆ దేవిని ధ్యానించుటకు-

"కల్హారోత్పల మల్లికా మరువా కైః సౌవర్ణ పంకేరు హైః"

ఇత్యాది శ్లోకములలో ఎన్ని పుష్పములు చెప్పబడినను ప్రప్రథమముగా చెప్పబడిన

పుష్పము కల్హారము. ప్రధానముగా ఈ పుష్పముతో పూజింపబడు దేవత ఈ కమలాంబిక కొంచెము ఎఱుపు మిక్కిలి పరిమళము కలిగిన పుష్పరాజమిది. కే-జలే-హ్లాదతే-కల్హార మని వ్యుత్పత్తి. కే అనగా జలమందు, హ్లాదతే అనగా సంతోషించునది కల్హారము. సౌగంధికమునకు కూడా కల్హారము అనిపేరు.

"సౌగంధికంతు కల్హారం" అని అమరము. సుగంధమే ప్రయోజనముగా కలది కల్హారము. సంస్కృత భాష చిత్రమైనది. 'క' అనగా జలము. దాని సప్తమీ విభక్తి 'కే' అనగా జలము నందు. ఈ కమలాంబిక సంబోధనలో 'కే' అన్న అక్షరము అనుప్రాసగానున్నది. 'కే' హ్లాదతే అన్న కల్హారమాల పూజను స్ఫురింపజేయుచు కమలాంబికే-లతికే-చండికే-అంశుకే-శుకే-మామవ జగదంబికే అనిరి.

'క' పరబ్రహ్మ స్వరూపము కాగా 'కా' పరమేశ్వరి. పరబ్రహ్మమహిషి యొక్క ఈ సంబోధనలో ప్రతి పదము నందు అద్యంతములు 'క-కే' అన్న అక్షరములు.

"శివశ్శక్తిః కామః క్షితి రథః రవి శ్శీతకిరణః
స్మరోహంసశ్శకః తథనుచ పరా మారహరయః।
హమీ హృల్లేఖాభి స్తిసృభి రవసానేషు ఘటితాః
భజన్తే వర్ణాస్తే తవ జనని నామావయవతామ్"॥[1]

ఇత్యాది శ్లోకములోని మంత్ర విన్యాసమును తలంపింప చేయుచున్నవి.

శివుడు (కకారము), శక్తి (ఏకారము), కాముడు (ఈకారము), భూమి (లకారము) -ప్రథమ ఖండముగను. రవి (హకారము) శీత కిరణుడు (సకారము) స్మరుడు (కకారము) హంస (హకారము) ఇంద్రుడు (లకారము) - ద్వితీయ ఖండముగాను, పరాశక్తి (సకారము) మన్మథుడు (కకారము) హరి (లకారము) - తృతీయ ఖండము.

ఈమూడు ఖండముల విరామస్థానములందు లేక అవసానము నందు హ్రీంకారములు కూడినవై నీ నామధేయమగు త్రిపురసుందరీ పంచదశీ మహామంత్ర విద్యకు అవయవములుగా ప్రాప్తించుచున్నవి.

---

1. సౌ.ల. శ్లో. 32 పుట. 201

శ్రీదేవి పంచ దశాక్షరి మహామంత్రము -

"క ఏ ఈ ల హ్రీం - హ స క హ ల హ్రీం - స క ల హ్రీ ం"

ఈపంచదశీ మంత్రమునందు గల 12 వర్ణములు మూడు హ్రీంకారములతో కూడి పదునైదు వర్ణములై త్రిపురసుందరీ పంచదశీ మహామంత్రమగుచున్నది. ఈమాతృకా మంత్రము త్రిఖండాత్మకమైనది.

ప్రధమ ఖండము నందు గల నాలుగు వర్ణములు - అగ్నిమండలము.

ద్వితీయ ఖండము నందు గల ఐదు వర్ణములు - సూర్యమండలము.

తృతీయ ఖండమునందు గల మూడు వర్ణములు - చంద్ర/సోమమండలము

ఇవి వరుసగా రుద్ర, విష్ణు, బ్రహ్మగ్రంధి స్థానములు. త్రిఖండములని చెప్పుటలో మరియొక సాంకేతిక సూచన ప్రకారము ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులకు సంబంధించిన ఖండత్రయమనియు, ఇవి వరుసగా లక్ష్మి, సరస్వతి, పార్వతి, స్థానములుగా ఉన్నవి. ఈ పంచదశీ మంత్రమునకు శకార-రేఫ-ఈకారములుండి బిందువు అంతమునందు కలిగిన అనగా 'శ్రీం' బీజాక్షరము చేర్చిన అది షోడశీ మంత్రము. ఈ శ్రీం బీజమునకు శ్రీవిద్య యని నామము. శ్రీం బీజాత్మకమైనది శ్రీవిద్య. ఇట్టి శ్రీవిద్యోపాసన చేయు సమయమున దీక్షితుల వారు తన హృదయ కమలమునందు ఆ కమలాంబికను ప్రతిష్ఠించుకొనిరి. కమలము జగదుత్పత్తికి మూల ప్రతీక. అట్టి జగదాలంబన హేతువైన మామవ జగదంబిక ఆశ్రితులకు కల్పలతిక. కమలాంబిక శ్రీమాత కాగా, ఆశ్రితులకు కల్పలతిక శ్రీమహరాజ్ఞీ. ఆశ్రితులను పాలించురాణి. ఆమె భండ, చండ, ముండాది రాక్షసులను చండాడుటలో చండిక. ఆ చండిక సింహాసనేశ్వరి. ఈ మూడు సంబోధనలు లలితా సహస్రనామము స్తోత్రప్రారంభమున గల-

"శ్రీమాతా శ్రీమహరాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ" [1]

అనుదానిని తలపింపచేయుచున్నది. కమలాంబికే అనుటలో కమలమునకు తల్లియని, కమలము ఉద్భవించుటకు కారణ భూతమైనదనియు, సృష్టికర్తయైన బ్రహ్మ

---

1. ల.స. స్తోత్రం శ్లో. 1

జన్మ కారణహేతువైన తల్లి అనియు. సృష్టి అంతయు ఆమెనుండి ఉద్భవించినదనియు అనేక విధములుగా ఆ దేవిని భావించి దీక్షితుల వారు కమలాంబికే అని స్తుతించినారు.

కమనీయ అరుణాంశుకే అన్న మాటలో చిదగ్నికుండ సంభూతయైన ఆ తల్లి యొక్క సర్వారుణత్వము - అగ్ని ద్యోతకమై, కరవిధృత శుకము వాఙ్మయ రూపమై జగత్తును రక్షించును. ఇది తల్లి యొక్క శివశక్త్యైక్య రూపమును భావింప చేయుచున్నది. 'కాది' విద్యయైన పంచదశాక్షరి ఈ పదములలో జలములలో కలువల మాలవలె తొణికిసలాడుచున్నది.

పంచదశీ మంత్రములోని ప్రథమ ఖండములోని బీజాక్షరములన్నియు కీర్తన ప్రథమ ఖండమైన పల్లవి యందు దీక్షితులవారు నిక్షేపించిరి. క ఏ ఈ ల హ్రీం అను ప్రథమ ఖండమును కమలాంబికే అను దానిలో 'క, కే' లో ఉన్న ఏకారము, మామవ అనగా ఈల, హ్రీం బీజాక్షరమునకు సంకేతముగా జగదంబికే అని ఖండ మవసానము నందును పేర్కొనిరి.

అనుపల్లవిలో కూడా ఒక క్రమమున్నది. జగత్సృష్టికి ప్రతీక కమలమని చెప్పియున్నాము. అదియే "కమలపదే" అనుట. ఆ కమలము తన స్థానమైన వాడు కమలాసనుడు. ఆతనితోనే సృష్టి మొదలు. కనుక కమలాసనాధులచే పూజితయైన కమలము యొక్క పదము, స్థానము, స్థితి కలది కమలపద. మహారాజ్ఞి కనుక బహువరద. కమలాలయ తీర్థ వైభవము ఆమెను బట్టియే. ఆమె శివా, కరుణార్ణవే. ఈ కరుణార్ణవము సుధా సింధువు. ఇదియే అనుపల్లవి యొక్క అర్థము యొక్క లక్షణము.

"నానృషిః కురుతే కావ్యం" అనగా ఋషికాని వాడు కావ్యమును వ్రాయలేడు. వ్రాయుటలేదు. శ్రీవిద్యోపాసకులైన దీక్షితుల వారు తన సంకల్పమున ఏ దేవతను అర్చించిన తదంతర్గతమైన భావధార శ్రీవిద్యాపరముగానే యుండును. శ్రీవిద్యా ప్రకాశనము లేని అక్షర విన్యాసము దీక్షితులవారి కీర్తనలలో గోచరింపదు. ఈ కీర్తనలో అక్షరములు వర్ణములు తన యందు శ్రీమాతృవర్ణములను అనగా రంగును, అక్షరములను ధ్వనింపచేయు చున్నవి.

కమలాంబికే-క-లా-కలా, కల్పలతికే-కమలాలయ-లాలయ- లలతే ఇతి లలిత. లాలించు అర్థమును ఇచ్చుచున్నది. కమనీయ అరుణాంశుక, కరుణార్ణవ

అరుణాంశువులతోడి కరుణార్ణవమే కమలాలయ తీర్థవైభవము. కలకు ఇక్కడ అక్షర వ్యవధానమున్నది. సకల అన్నచో 'కల'కు అక్షరవ్యవధానము లేదు. ఇది పంచదశీ మంత్రము నందు ప్రథమఖండమున అక్షరవ్యవధానము వంటిది. ఈ కీర్తనయందు 'కల' అనురెండు అక్షరములు తరచుగ వినిపించుట ఈ కీర్తనలో గల కళ. ఈ కళచే కళకళలాడు చున్న కీర్తన యిది. కమలాంబిక గుడిలోని ఆమె జగదంబిక జగత్తు ఏలుబడిలోనిది. హ్రీం అన్న మొదటి ఖండపు విభాగములో ఈ జగదాధారస్థితిని తెలుపునది. కమలమునకు వికాసము జలము నందుండును. ఇది మూలాధారము నుండి మణిపూరము వరకు గల విభాగము. ఈ మూలాధారము నందు జగదంబికా లక్షణము సౌందర్యలహరిలోని-

"తవాధారే మూలే సహ సమయయా లాస్యపరయా
నవాత్మానం మన్యే నవరస మహాతాండవ నటమ్
ఉభాభ్యామేతాభ్యా ముదయవిధి ముద్దిశ్యదయయా
సనాథాభ్యాం జజ్ఞే జనక జననీ మజ్జగదిదమ్"[1].

అన్న శ్లోకముతో అను సంధానము చేసికొన్నచో ఈ కీర్తన పల్లవి. చివరగల జగదంబిక పద ప్రయోజనముల సార్థక్యము గోచరించును.

అను పల్లవిలోని 'కరుణార్ణవ' అన్న పదము ఇక్కడ మణిపూరైక నిలయము. ఇందు కమలాసనాది పూజిత కమలపదము సవిత్ కమలము నందలి హంస ద్వంద్వమునకు మకరందాస్పదమైన కమలము. అదియే కమలపదము. ఇట్టి స్థితియందు కరుణార్ణ మన్నది రెండవ ఖండాంత హ్రీం కారమునకు ప్రతీక. మణిపూర చక్రమున శ్యామనామకమైన మేఘము తటిత్కాంతి యొక్క స్ఫురణచే వర్షించి హరమిహర తప్తమైన అనగా శివుడు సూర్యునిచే త్రిభువనమును శాంతింపజేయుచున్నాడు. తన కరుణార్ణవము అంతటిది. కనుకనే ఆ శ్యామ మేఘమును వర్షింపచేయు లక్షణమును కరుణార్ణవమైన తటిత్కాంతి యందు నిరూపించినాడు. సౌందర్యలహరిలో ఈ కరుణార్ణవ శబ్దముచే యోగి యొక్క మణిపూర అనాహత చక్రములలోని లక్షణము స్ఫురించుచున్నది.

---

1. సౌ. ల. శ్లో. 41 పుట 275, 276.

బ్రహ్మాది దేవతలచే పూజింపబడుచున్న ఈ కమలాంబిక యొక్క పాదములు పద్మముల వంటివి. ఈమె అనేక వరముల నొసంగునది. లక్ష్మీదేవికి పద్మము నివాస స్థానము. అటువంటి పద్మముగల పుణ్యతీర్థ తటాక వైభవము గలది ఈ కమలాంబిక. దక్షిణదేశమున ప్రతి దేవాలయమునకు ముందు ఒక తటాకము ఉండును. ఆ శ్రీదేవి సహస్రారాంతర్గత మందున్న సదా శివుని పత్ని కావున ఆమెను శివే, శివా అని అందురు. శివశక్తులకభేద రూపమైన పరమేశ్వరీ రూపము గాన వీరికి ఇచట నామసామ్యము చెప్పబడినది.

పంచదశీ మంత్రమున రెండవ ఖండమున గల హ స క హ ల హ్రీం అను బీజాక్షర సంకేతములను దీక్షితులవారు ఈ అనుపల్లవిలో పొహళించిరి. 'కమలాసనాది' - లోని కమల అనగా శక్తి. హకారము శక్తి స్వరూపము. దానికి అను ప్రాసగా రెండవ వర్ణమైన 'స' వెనువెంటనే గోచరించుచున్నది. కమలపదేలోని 'క' తృతీయాక్షరరమును సూచించుచున్నది. బహువరదేలోని హకారము చతుర్థవర్ణమును, కమలాలయలోని లకారము పంచమ వర్ణముగను నిక్షేపించిరి. ఖండాంత మందున్న హ్రీం బీజాక్షర సంకేతమునకుగా కరుణార్ణవే అని పేర్కొనిరి. ఈ విధముగా ద్వితీయ ఖండములోని బీజాక్షరములన్నియు కీర్తనలోని రెండవ ఖండమైన అనుపల్లవి యందు నిగూఢముగ నున్నవి.

కీర్తనలోని తృతీయం ఖండమైన చరణములో దీక్షితుల వారు దయాసముద్రురాలైన శ్రీమాతా సకల లోక నాయిక, సంగీత రసిక, సుకవిత్వ ప్రదాయిక, సుందరి అని ప్రస్తుతించిరి. సంగీతము నాద ప్రధానము. సుకవిత్వము శబ్దమయము. శబ్దములు కళలు. సుందరి ఆ సుందరేశ్వరుని సుందరి. సకల లోకనాయిక నాయకుడు లేనిదే లేదు. వీరి సమ్మేళన కేంద్రమే బిందువు. బిందువు నాద కళామయి. కనుక ఈమె మాయిక కాదు. మాయావరణమునకు అతీత. కనుక గతమాయి. కనుకనే విదేహమునకు అంటని ఆత్మను భద్రము చేసి ఆ ఆత్మకు దేహబంధముక్తి దానము నందు నిపుణ అగుచున్నది. అట్టి స్థితి ఆమెది. అఘ - అనగా పాపములను హరించుటచే విదేహ ముక్తిప్రసాదించు నిపుణత కలది యగును. వియదాదులకు అనగా పంచభూతములకు

కిరణే - కళను కిరణమును ప్రసాదించునది. భక్తులకు అభయమును, వరములను ఇచ్చి వారి కష్టములను తీర్చునట్టి (వినోద) చరణములు కలది. ఆమె -

"కళాత్మిక కళానాథా కావ్యాలాప వినోదిని"[1]

"భయాత్రాతుం దాతుం ఫలమపి చ వాంఛా సమధికం

శరణ్యే లోకానాం తవహి చరణా వేవ నిపుణా"[2]

అను పాదములతో అనుసంధానము చేసికొన్నచో ఈ పదభావములు స్ఫురించును. ఈమె అరుణ సర్వారుణ.

సకల-సకలే అన్న పదములు పంచదశాక్షరీ మంత్రములోని తృతీయ ఖండము కాగా చంద్రకళతో కూడినది గురుగుహునకు కారణభూతమైనది. ఇచట కరణమనగా గురుగుహ ఉత్పత్తి హేతువు. అట్లే సదాశివాంతఃకరణ, అంతఃకరణము మనోబుద్ధి అహంకార చిత్తముల యొక్క మొత్తమునకు సమష్టివాచకము. ఈమె శివాంతఃకరణ కాదు. సదాశివాంతఃకరణ. ఇక అ క చ ట త పాది వర్ణములన్నియు నామాత్మకమైన జగద్విధాయకములు. ఇవి పంచాశద్వర్ణములైనను షట్త్రింషట్ శతరూపమైనది. కనుక అఖండైక రసపూర్ణ. ఇంతగా శ్రీచక్రాంతస్థిత శ్రీమాతృ స్వరూప నిరూపణతో సంబోధన చేసి ఆ శ్రీమాతని సంగీత ప్రపంచమున పిలువగలిగినది శ్రీవిద్యావేత్తయైన దీక్షితుల వారే ప్రథములని చెప్పుటలో సందేహము లేదు.

ఈచరణములో విశుద్ధి, ఆజ్ఞాచక్రముల స్థితి ధ్వనించుచున్నది. శుద్ధ సత్త్వ లక్షణము సారస్వత పదమగును. శివసమాన వ్యవస్థితయైన దేవి శ్రుతి, లయతో కూడినదియై సంగీత రసిక యగుచున్నది. షోడశదళములలో నున్న 16 కళలు స్వరములు. వానిచే సుకవిత్వ ప్రదాయిక సుందరి లక్షణము. ఇచట వికళేబర అనగా విదేహము. దేహమునకు అంటని ఆత్మజ్ఞానముచే ముక్తిని ప్రసాదించునది. ఇదియే విదేహముక్తి. "ఈశ్వరానుగ్రహత్ పుంసాం అద్వైత వాసనా"[3]

---

1. ల.స. స్తోత్రం 123

2. సౌ.ల. శ్లో. 4 - 3,4, పాదములు పుట 27

3. ము.దీ.కీ. పుటసంఖ్య 57

అనియు "జ్ఞానాదేవతకైవల్యమ్" అనియు ప్రమాణవాక్యములుండుట వలన శ్రీదేవిని ముక్తి దాన నిపుణ అని పేర్కొనబడుట ఎంతయో సమంజసముగా నున్నది. అట్టి స్థితిని కలిగించు నైపుణ్యము షోడశ కళలచే కలుగును. అవి అఘహరణములు. ఈ స్థితిలో వియదాది పంచభూతములను ప్రకాశింపచేయు కిరణములు తన చరణముల నుండి ప్రసరింప చేయు ఉదయకాల అరుణరూపిణి ఆమె. గురుగుహుని తల్లి. సదా శివుని అంతఃకరణ వల్లి. సకలమైన లక్షణముచే అ క చ ట త పాది వర్ణరూపిణియై, అవిచ్ఛిన్నానందరూపిణి ఆ మాత. 'రస' శబ్దమిచ్చట ఆనందమునకు సమానార్థకము. పరమాత్మను రస స్వరూపునిగ ఉపనిషత్తులు కీర్తించుచున్నవి. 'రసోవైసః'అట్టి అఖండైక రసపూర్ణమైన ఆ స్థితి యందు సహస్రదళ కమలమున నాదబిందు కళాతీతమై ఆ తల్లి గోచరించుచుండును.

సుధాసింధువు యొక్క మధ్యన ఉన్న తల్లి ఆఖండైక రసపూర్ణ. ఒకటి బహూరూపములతో కనిపించుట మాయ. మాయైక భిన్నరూపము ఏకరూపమునకు వచ్చినపుడు ఆమాయ గతించినది. కనుకనే గతమాయిక. పంచదశీ మంత్రములోని తృతీయ ఖండము - స క ల హ్రీం. ఈ సకల చరణ ప్రారంభమున గల స క ల-హ్రీం బీజమునకు సంకేతముగా చరణాంతమందు "రసపూర్ణే" అని పేర్కొనిరి. సకలమునకుగల సమస్తమైన అర్థములు ఆ శ్రీమాత యొక్క లక్షణములు అన్ని దీక్షితుల వారు చరణమున పొందుపఱచిరి. ప్రథమఖండములోని హ్రీం బీజమునకు సంకేతముగా 'జగదంబికే', ద్వితీయఖండములోని హ్రీం బీజమునకు సంకేతముగా 'కరుణార్ణవే' తృతీయఖండములోని హ్రీం బీజమునకు సంకేతముగా 'రసపూర్ణే' అని అనేక విధములుగా ఆ శ్రీమాతను ధ్యానించిరి. ఈకీర్తన ఇట్లు భావించుట దీక్షితుల వారి శ్రీవిద్యా ప్రభావము. 'సకలే గురుగుహకరణే' అనుదానిలో 'గురుగుహ' అను దీక్షితులవారి కృతి రచనాముద్రను పొందుపఱచిరి.

★ ★ ★

# 2వ కీర్తన ప్రథమావరణము

ఆనందభైరవి రాగము　　　　　　　　త్రిపుట తాళము

22.వ మేళకర్త జన్యము.

పల్లవిః- కమలాంబా సంరక్షతు మాం

హృత్కమల నగర నివాసినీ ॥కమల॥

అ॥ప॥ః- సుమన సారాధి తాబ్జముఖీ । సుందర మనః ప్రియకర సఖీ ।

కమలజానంద బోధసుఖీ । కాంతాతార పంజర శుఖీ ॥కమల ॥

చరణముః- త్రిపురాది చక్రేశ్వరీ । అణిమాది సిద్ధేశ్వరీ । నిత్యకామేశ్వరీ।

క్షితిపుర త్రైలోక్య మోహన చక్రవర్తినీ । ప్రకట యోగినీ ।

సురరిపు మహిషాసురాది మర్ధనీ ।నిగమ పురాణాది సంవేదినీ।

మ॥సా॥ః- త్రిపురేశీ । గురుగుహ జననీ । త్రిపుర భంజన రంజనీ ।

మదురిపు సహోదరీ । తలోదరీ త్రిపుర సుందరీ । మహేశ్వరీ ॥కమల ॥

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు ఈ నవావరణ కృతులను శ్రీచక్రములోని భూపురమునుండి బిందువు వరకు ఆరోహణ క్రమములలో అర్చన చేయు సంహారము క్రమమున "శ్రీ చక్రాంకిత బిందు మధ్యవసతీం - శ్రీమత్సభానాయికాం" అని పేర్కొనబడిన ఆ పరాశక్తి యందు లీనమైరి. ఆ ఆనందాబ్ధిలో నుండి తేరుకొని తాను నిర్వహించిన పూజాక్రమమున ఒక్కొక్క ఆవరణము యొక్క విశిష్టతను ఒక్కొక్క కృతి యందు నిక్షేపించిరి.

ఆనందభైరవి రాగములోని "కమలాంబా సంరక్షతుమాం" అను ఈ కృతి శ్రీచక్రములో ఆరోహణ క్రమమున మొదటి ఆవరణ భూపురము. ఈ భూపురము నందు మూడు విభాగములు కలవు. శుక్లవర్ణమున గల ఈ ప్రథమ భూపురమున వామ, జ్యేష్ట, రౌద్రి, అంబిక, పశ్యంతి, ఇచ్ఛా, జ్ఞాన, క్రియా, శాంతా శక్తులు నవముద్రాది ఆకారములను పొంది వరుసగా సర్వసంక్షోభిణి, సర్వ విద్రావిణీ, సర్వాకర్షిణి, సర్వవశంకరి, సర్వోన్మాదిని, సర్వమహాంకుశ, సర్వఖేచరి, సర్వబీజ, సర్వయోని దేవతలుగా వసించియున్నారు.

రక్తవర్ణముగల మధ్య లేక ద్వితీయ భూపురమున బ్రాహ్మీ, మహేశ్వరీ, కౌమారీ,

వైష్ణవి, వారాహి, మహేంద్రి, చాముండా మహాలక్ష్మి అనే మాతృకలున్నారు. శ్రీదేవి సమష్టిరూపమున ఉన్న సప్త ధాతువులే ఈమాతృకా రూపములు. పీత వర్ణము గల తృతీయ భూపురమున శ్రీవిద్యకు సంబంధింపని మంత్రములు కమనీయ రూపములతో నున్నవి. ఈ సమష్టి భూపురము చతురస్రాకృతి కలది. దీనికి త్రైలోక్య మోహన చక్రము అని పేరు. లకారము దీని ప్రకృతి. తత్త్వము పృధివీ తత్త్వము. ఇచ్చట అణిమ, లఘిమా, మహిమ, ఈశిత్వ, వశిత్వ, ప్రాకామ్య, భుక్తి, గరిమ, ప్రాప్తి, సర్వకామ అను దశసిద్ధులు దేవతామూర్తులై యున్నారు. వీరు శుక్లవర్ణము కలవారు. అంకుశ, పాశపద్మ, యుగ్మము ధరించినవారు. వీరిని ప్రకటయోగినులు అందురు. ఈ చక్రేశ్వరి త్రిపురాదేవి. ఈ చక్రము శృంగార రసప్రధానమైనది. ఇచట శాంత, వీర, అద్భుత, ఇత్యాది నవరసములును అణురూపశక్తులు. ఇవి అణిమా సిద్ధికి సంబంధించినవి. కోరిక, క్రోధము, దురాశ, శాంతి, గర్వము, ఈర్ష్య, యోగ్యత అయోగ్యతలకు బ్రాహ్మీమొదలైన దేవతలకు సంబంధించి ఆదేవత యొక్క ప్రభావమును కలిగి యుండును. త్రిలోకములను వశీకరణము చేయునది ఈ చక్రార్చన. ఒక్కొక్క ఆవరణ ఒక్కొక్క సిద్ధిని ప్రసాదించును.

త్రైలోక్య మోహన చక్రవర్తియైన కమలాంబను స్తుతించుట ఈ కీర్తనలోని పరమార్థము. ఇది ప్రథమావిభక్తిలోని కీర్తన. త్రైలోక్యమోహన చక్రవర్తియైన తల్లి ప్రకటయోగినీ మొదలగు గణములతో విలసిల్లు చున్నది. దీక్షితులవారు పల్లవిలో తిరువారూరులోని కమలాంబ నన్ను రక్షించుగాక అని ఆమె 'హృత్కమల నగర నివాసిని' అని చెప్పిరి. ఆమె హృదయము హృల్లేఖ. హృల్లేఖ అనగా హ్రీం. హ్రీం నామకనగరమున నివసించునది. మంత్రము హ్రీం. భక్తుల హృదయము కమలము వంటిది. అదియే కమలానగరముగా నివసించు తల్లి. హృత్కమలము మణిపురము. మణిపురమున లక్ష్మీస్వరూపిణియై మెరుపు తీగవలె ఘన శ్యాముని గూడి నిశ్చలమైన సౌదామినీ లక్షణముతో ఒప్పునది. లక్ష్మీనారాయణ రూపమున శక్తియు శివుడు మణిపురములో విలసిల్లుదురని శాస్త్రము. వారు లోకమును రక్షింతురు. స్థితికారకులు. కనుక హృత్కమల నగరమున నివసించు తల్లి రక్షించుటలో సందేహము లేదు. కనుక దీక్షితులవారు నిశ్చయ జ్ఞానముతో

కమలాంబ నన్ను రక్షించుగాక అని పల్లవిలో పేర్కొనిరి.

దీక్షితులవారు అనుపల్లవిలో 'సుమనసారాధితాబ్జముఖీ సుందరమనః ప్రియకరసఖీ అనిరి. అనగా దేవతలు, ఋషులు జ్ఞానులచేత ఆరాధింపబడిన అబ్జమే (కమలము) తన యొక్క ముఖముగా కలది. జగత్సృష్టికి మూలమైన కమలము తన ముఖముగా కలిగినటు వంటిది. ఈ సుమనసులు అనగా దేవతలు ఆరాధించినటు వంటి ముఖము సృష్టికి ఆధార భూతమైనది.

"అమరా నిర్జరా దేవాస్త్రిదశావిబుధాస్సురాః।
సుపర్వాణ స్సుమనసస్త్రిదివేశాదివౌకసః॥"[1]

సృష్టికర్త బ్రహ్మ అందుండియే ఉద్భవించినాడు. కనుక అమ్మవారి ముఖము జగత్ సృష్టి సంకల్పమునకు ఆధారమైనదిగా దేవతలు ఆరాధింతురు. అట్టి ఆమె ముఖమే సుందరుడైన త్యాగరాజేశ్వరుని యొక్క మనస్సునకు ప్రియకరమైనది. ఏవిధముగా ప్రియకరమైన దనిన -

"మందస్మిత ప్రభాపూరమజ్జత్కామేశ మానసా"[2]

అని చెప్పికొనవలెను. అనగా ఆ ముఖము నందలి మందహాసము యొక్క కాంతిపూరము నందు మునిగి స్నానమాడుట ఆ కామేశ్వరునకు ప్రియమైనది. కనుక ఈ తల్లి మందహాస ప్రభాపూరముతో కామేశమానసమును నిమజ్జనము చేయుచున్నది. ఇది సుందరమనః ప్రియకరసఖి అన్నచో సుందరుడు కూడా సుందరీమనః ప్రియకరసఖుడే. సుందర శబ్దముచే ఆదరింపబడుట సూచితమైనది. సుష్టుగా ఆదరింపబడునది సుందరి. ఆదరింపబడువాడు సుందరుడు. సుందరీ సుందరుల మనసు నందలి సామ్యము సఖీ, సఖాశబ్దముల యందలి సామ్యము. ఈ రీతిగా అన్యోన్య అవస్థాసామ్యము, నామసామ్యము, రూపసామ్యము, అనుష్ఠాన సామ్యము, అవస్థాన సామ్యము మనకు స్ఫురింపచేయు పాదమిది.

ఈ ఉభయగతమైన లక్షణముచే వారు జగజ్జననీ జనకులుగా జగదానంద

---

1. అమరం

2. ల. స. సో 11వ శ్లోకం.

కారకులుగా విలసిల్లుట సూచితమైనది. కమలజానంద బోధసుఖి అనిన బ్రహ్మానంద బోధసుఖము కలది. ఈమె కమలాంబిక. కమలము బ్రహ్మకుతల్లి. అట్టి కమలమునకు తల్లియైనది అనుట ఒక చమత్కారము. విష్ణు వక్షస్థలవాసిని యైన కమల కమలజానంద బోధసుఖి యగుట సహజసిద్ధము. ఈ అనుపల్లవిలో 'కాంతా తార పంజరసుఖి' అను పాదమును ఆలోచించిన కొలది అమృతమును చిందించును. 'తారా' అని దీర్ఘాంతమైన నక్షత్రము అని అర్థము. అది స్త్రీ లింగము. 'తార'యన తారస్థాయి. "తారయితి స్థానేభ్యః స్వరంయితి తారః' స్వరమును అన్ని స్థానముల వలనను తరింపచేయును. తార యున్న మంత్రము యొక్క లక్షణము తరింపచేయుట. దానినే తారకము అందురు. ఇది పుం రూపమైనచో హరి అన్నరూపములో నుండును. స్త్రీ రూపమైనచో హ్రీం రూపమున ఉండును. కాంతాతార యనగా స్త్రీ రూపమైనచో హ్రీం అను పంజరమున నుండు శుకి (చిలుక). మంత్ర బద్ధమైన సుకుమారమైన శక్తి స్వరూపిణి ప్రసిద్ధముగా "ఓంకార పంజరశుకి" అన్న ఆర్యా శ్లోకమున్నది. అందులో ఆర్యాదేవి ఓంకార పంజరము నందలి ఆడుచిలుకగా చెప్పబడినది. ఇచ్చట ఆ ఓంకారమే స్త్రీ పరముగా హ్రీంకారముగా సూచింపబడినది.

చరణములో ఈమె త్రిపురాది చక్రేశ్వరి అని దీక్షితుల వారు పేర్కొనిరి. త్రిపురములకు ఆదియైన అనిన భూపుర, శ్రీపుర, స్వఃపుర ఆదివలయములతో దళములతో ఒప్పు శ్రీవిద్యారూపమైన శ్రీచక్ర అధిష్ఠాన దైవము. కనుక త్రిపురాది చక్రేశ్వరి ఈ చక్రమునకు అధిష్ఠానదైవము. అణిమాది సిద్ధేశ్వరియన అణిమ, మహిమ, లఘిమ, గరిమ, ప్రాప్తిః, ప్రాకామ్య, ఈశ్విత, వశ్విత భుక్తి, ఇచ్ఛా అను దశసిద్ధులకు అధిష్ఠాన దైవమీమెయే. ఈశ్వర ఈశ్వరీ శబ్దములు ఒకటే తత్త్వమునకు చెందినవి. తిథి నిత్యలన్నింటిలోను చరమమైనది, స్థిరమైనది. జగన్మాతృత్వ శోభితమైనది నిత్య కామేశ్వరీ స్వరూపము. కామేశ్వర, కామేశ్వరీ మిధునము కామకలానిలయము. ఇచట ఆ లక్షణముచే త్రిజగన్మోహనమైన ప్రథమస్థితి ఈ దేవతకున్నది. జీవికి లభించు శృంగారాది రసములు -

"నియతి సహిత శృంగారాదయో నవరసా అణిమా దయః" అని భావనోపనిత్తు పేర్కొనినది.

కామ క్రోధమోహ మదమాత్సర్య పుణ్యపాపములు-

"కామ క్రోధ లోభ మోహమద మాత్సర్య పుణ్యపాప మయాబాహ్యా ద్యష్టశక్తయః"
అని భావనోపనిషత్తు పేర్కొనినది.

శ్రీ విద్యయనబడు చిద్విద్యలో పంచదశీ బీజములను కామేశ్వరీ మొదలగు పంచదశ నిత్యలుగా నున్నవని సంప్రదాయము. ఆ పంచదశ బీజవర్ణములు పరంజ్యోతి స్వరూపమైన 'కామకళ' అను నామాంతరము కల ధ్రువకల నుండి ఆవిర్భవించినవి. పంచదశీ మంత్ర స్వరూపమైన పంచదశ బీజములు పంచదశ నిత్యలై శుద్ధ పాడ్యమి మొదలు అమావాస్య వరకు తిథి రూపములుగా నున్నవి. కృష్ణపక్షము నందలి తిథులే మరల (వెనుక వరుసన) వచ్చును. పదునైదు నిత్యలు క్రమముగా కామేశ్వరి, భగమాలిని, నిత్యక్లిన్న, భేరుండ, వహ్నివాసిని, మహావజ్రేశ్వరి, శివదూతి, త్వరిత, కులసుందరీ, నిత్య, నీలపతాక, విజయ, సర్వమంగళ, జ్వాలామాలిని, చిత్రా అనునవి. భూపురమునే క్షితిపురమని దీక్షితుల వారు ప్రస్తావించిరి. ఈ భూపురమునందు సంచరించు దేవతా స్వరూపిణి ఆమె. అట్టి త్రైలోక్యమోహనమైన చక్రవర్తినీత్వము ఆమెది. ప్రతి చక్రమునకు యోగినులుందురు. ప్రథమావరణ దేవతలు జాగ్రదవస్థ యందు మనోవృద్ధి చేయు దేవతలు. అందుచే ఈ భూపుర ఆవరణదేవతలకు ప్రకటయోగినులని పేరు. అట్టి దేవతా గణములచే పరివేష్ఠింపబడు తద్దేవతా స్వరూపిణి శ్రీదేవి. దేవతలకు విరోధులైన మహిషాసుర, భండాసుర, శుంభ, నిశుంభాది రాక్షసులను సంహరించిన శ్రీదేవి.

ఈమె "భండాసుర వధోద్యుక్త శక్తి సేవాసమన్విత"[1] అని పేర్కొనబడినది. ఆమె వేద, వేదాంగ, పురాణములచే నుతింపబడునది లేదా తెలియబడునది. ఈ రీతిగా ఆ త్రిపురేశ్వరి గురుగుహుని జనని. త్రిపుర భంజనుడైన శివునికి రంజనము కలిగించునది కనుక రంజని. "మధురిపు సహోదరి తలోదరి" యనిన ఈమె విష్ణువునకు సోదరి. అనగా పద్మనాభ సోదరి. సమతలమైన ఉదరము కలది. ఈ ఉదరమునందు అతల, వితల, సుతల,... చతుర్దశ భువనములును కలిగిన జగజ్జనని.

1. ల..స, సో, 24 శ్లోకం

ఈమె "ఛందస్సారా శాస్త్ర సారా మంత్రసారా తలోదరి"[1] అని కీర్తింపబడినది. ఈ త్రిపుర సుందరి మహేశ్వరుని జాయ అని దీక్షితుల వారు అనేక విధములుగా ఆ దేవిని స్తుతించిరి. ఈమె మహాకామేశ్వరాంక నిలయ మహాకామేశ్వరి. దానిచే అమ్మ పరమశివ పర్యంకనిలయ అగుచున్నది. అనగా పరమశివునిపై అదిష్ఠానము ఆమెదే యగుచున్నది.

★ ★ ★

## 3వ కీర్తన ద్వితీయావరణము

కల్యాణి రాగము ఆదితాళము

65.వ. మేళకర్త

పల్లవిః- కమలాంబాం భజరే, రే మానస ।

కల్పిత మాయా కార్యం త్యజరే ॥కమలా॥

అ॥ప॥ః- కమల వాణీ సేవిత పార్శ్వాం ।

కంబుజయ గ్రీవాం నత దేవాం ।

కమలాపుర సదనాం మృదుగదనాం ।

కమనీయ వదనాం కమల నయనాం ॥ కమల॥

చరణముః- సర్వాశా పరిపూరక చక్రస్వామినీం । పరశివకామినీం ।

దుర్వారార్చిత గుప్త యోగినీం । దుఃఖ ధ్వంసినీం । హంసినీం ।

నిర్వాణ నిజసుఖదాయినీం । నిత్య కల్యాణీం । కాత్యాయినీం ।

శర్వాణీం మధుప విజయ వేణీం । సద్గురు గుహ జననీం నిరంజనీం ।

మ॥సా॥ః- గర్విత భండాసుర భంజనీం । కామాకర్షిణ్యాది రంజనీం ।

నిర్విశేష చైతన్య రూపిణీం । ఉర్వీ తత్వాది స్వరూపిణీం ॥ ॥కమలాంబాం॥

ఈ ద్వితీయావరణ కీర్తనను దీక్షితుల వారు ద్వితీయా విభక్తిలో రచించిరి. ఈ చక్రమునకు సర్వాశా పరిపూరక చక్రము అని పేరు. చక్రేశ్వరి సర్వాశా పరిపూరక చక్రస్వామిని. చక్రేశ్వరియైన ఈమె త్రిపురసుందరి త్రిపురేశిగా వ్యవహరింపబడుచు శ్వేత

---

1. ల.స.సో.శ్లో 158

వర్ణము కలది. చక్రాకృతి షోడశ దళము. ఇందుగల షోడశ దళముల యందు 16మంది దేవతలు నిత్యకళలుగా భాసిల్లుచున్నారు. వారు 1. కామాకర్షిణి, 2. బుద్ధ్యాకర్షిణి, 3. అహంకారాకర్షిణి, 4. శబ్దాకర్షిణి, 5. స్పర్శాకర్షిణి, 6. రూపాకర్షిణి, 7. గంధాకర్షిణి, 8. చిత్తాకర్షిణి, 9. ధైర్యాకర్షిణి, 10. స్మృత్యాకర్షిణి, 11. నామాకర్షిణి, 12. బీజాకర్షిణి, 13. ఆత్మాకర్షిణి, 14. అమృతాకర్షిణి, 15. శరీరాకర్షిణి, 16. రసకర్షిణి అనువారు. వీరు గుప్త యోగినులు. అకారాది పదునారు స్వరములుగా నున్న షోడశ దళములందు వీరు కలరు. పృధి వ్యాధి పంచభూతములు, శ్రోత్రాది పంచ జ్ఞానేంద్రియములు, వాగాది పంచ కర్మేంద్రియములు, మనస్సు కలసి ఈ పదునారును షోడశ దళపత్రాత్మకమైన సర్వాశా పరిపూరక చక్రస్థ దేవతలైన కామాకర్షిణి మొదలగువారు. ఇచటి రసము వీరరసము. ఈ రెండవ ఆవరణ స్వప్నావస్థలోని మనోవృద్ధికి సంబంధించినది. స్వప్నమునందు తృప్తి విషయము సూక్ష్మము, గుప్తము. కనుకనే ఈ ఆవరణ దేవతలకు గుప్త యోగినులని పేరు. ఈ ఆవరణ కాంతి శరచ్చంద్ర సదృశమైనది.

ఈ కీర్తన పల్లవిలో దీక్షితులవారు "ఓ మనసా కమలాంబను భజింపుము కల్పితమైన మాయకారణముగా కలిగిన సృష్టిని, జగత్తును గూర్చిన మోహమును వీడుము" అని తన మనస్సునకు ప్రబోధము చేయుచున్నారు. ఈ కీర్తన యందు సగుణ సాకారములు, సగుణ నిరాకారములు నిర్గుణాత్మకములు, శ్రీచక్ర సంబంధమైన శ్రీదేవి నామములను దీక్షితుల వారుపయోగించిరి.

అనుపల్లవిలో 'కమల వాణీ సేవిత పార్శ్వాం' అనుటలో ఆమె-
'సచామర రమావాణీ సవ్య దక్షిణ సేవితా"[1] అన్న భావమే. అనగా కమల లలితా స్వరూపిణి శివశక్తి. కైలాసము నందలి పార్వతి మాత్రము కాదు. సహస్రారమున బిందు స్థానమున శివ శక్త్యైక్య రూపిణి. ఈమెను వింజామరలను పూనిన లక్ష్మి, సరస్వతులు పార్శ్వభాగము లందు వీచుచు సేవించిరి. ఇడ - పింగళ నాడులు సరస్వతి లక్ష్ములు కాగా సుషుమ్నా నాడి సూక్ష్మతర బిస తంతు తనీయసీ. ఈలక్షణము ఆమె యొక్క మహత్వస్థానమైన, కంబుగ్రీవమునకు పైనున్న

1. ల.స.స్తో. 614వ నామము

"శ్రీమద్వాగ్భవ కూటైక స్వరూప ముఖ పంకజ"[1] మును స్ఫురింపచేయుచున్నది. ఆ ముఖ పంకజము మృదువుగా పలుకునది (మృదుగదనము). కమనీయ రదనా- అందమైన పలువరుస కలది. మరియు పద్మము వంటి కనులు గలది. కమలము వంటి ముఖమే కమలాపురము. అదియే సదనముగాగల మహత్వపూర్ణ.

కంబుజయగ్రీవము అను చోట జయ శబ్దము యొక్క అర్థము శక్తికూటము నుండి మధ్యకూటమునకు చేరిన తరువాత చేరునది వాగ్భవ కూటము. అది మహత్త్వస్థానము. కనుక ఆమహత్త్వ స్థానమునకు చేరు దశలో నున్న గ్రీవము సాధక జయమును, కొస శిఖరమును, అందుకొను జయమును కల్పించిన స్థానము. ఈ శంఖమును కార్యారంభమున పూరింతుము. అది జయప్రదముగా ముగిసిన వెంటనే విజయ సూచకముగా శంఖమును పూరింతుము. సాధకునకు అట్టి జయస్థానమున గల గ్రీవమే శంఖముగా జయమును ధ్వనించుచున్నది. మరియు కమల వాణీ సేవితయైన ఈ అంబిక సుషుమ్నా నాడిగా లక్ష్మీ సరస్వతులు ఇడా, పింగళ నాడులుగా సుషుమ్నకు ఇరువైపులా మెలికగా చుట్టుకొని ఆమె జడ యొక్క ఆకృతిగా వెలయుచున్నది.

ఈ కీర్తన అనుపల్లవిలోని కంబు జయగ్రీవాం - చరణములోని మధుప విజయ వేణీం అన్న రెండు సమాసములలో జయ శబ్దము విచిత్రముగా ప్రయోగింపబడినదనిపించును. కంబుజయగ్రీవము- శంఖము వంటి జయగ్రీవము, జయసూచకమైన గ్రీవమని, మధుప విజయవేణీ - తుమ్మెదల వంటి విజయ స్ఫోరకమైన వేణి (జడ) అని. ఈనల్లని కురులతో వెలసిన వేణి తుమ్మెదల వలె నున్నదనుట సహజమే కాని విజయవేణిగా నుండుటలో విశేషమున్నది. వేణి (జడ) యొక్క పైభాగము సహస్రారము. అంతవరకును సుషుమ్నను, ఇడా, పింగళ నాడులు సేవించుట అది సాధనలోని విషయము. సహస్రారమున బిందు స్థానమున చేరిన సుషుమ్నకు ఇరు ప్రక్కల రమావాణి సేవ ఉండును. ఇది బిందుగతమైన స్థితి విజయము. జయ అనగా ముక్తి. ఇది స్వామి యందు లయము. మధుప విజయము లయము నందు స్ఫురించును.

---

1. ల.స.స్తో 34వ

చరణములో దీక్షితుల వారు ఇది సర్వాశా పరిపూరక చక్రము అనియు ఆమె "సర్వాశా పరిపూరక చక్రస్వామినీం" అనియు పేర్కొనిరి. ఇక్కడ ఈమె పరశివకామినీం. పరదేవత చిదానంద రూపిణి. 'సోఽకామయ' అను శ్రుతి ప్రమాణము చేత ఆమె కామకలా స్వరూపిణి. ఈ చక్ర యోగినులను గుప్త యోగినులు అందురు. దుర్వాసాదులీమెను పూజించిరందురు. ఈ త్రిపురేశి సర్వ దుఃఖములను నాశనము చేయునది. పరమేశ్వర రూపము గలది లేదా అజపా మంత్రరూపిణి. ఆత్మ మంత్ర స్వరూపిణి సన్యాశాశ్రమమున 4 భేదములు కలవు. అందు 3వ ఆశ్రమమును పొందిన యతులను హంసలందురు. అట్టి హంసలకు పరాశక్తికి బేధము లేనందున హంసినీం అని చెప్పబడినది. 'అహంసః' అనునది హంసమంత్రము యొక్క వివరణమును గూర్చి త్యాగరాజేశ్వరుని కృతిలో చెప్పియుంటిని. ఆత్మ బ్రహ్మైక్యాను భవమును స్వయం ప్రకాశనము చేయునది హంసినీ. "మాలినీ హంసనీం మాతా మలయాచల నివాసినీ"[1] అని లలితా సహస్రనామ స్తోత్రమున కలదు. శ్రీమాత నిత్యానందమును ఇచ్చి మోక్షము నొసంగునది. నిర్వాణ నిజ సుఖదాయినీ - నిర్వాణము చేత నిత్యము సుఖమును ఇచ్చునది. నిజ సుఖమన నిత్య సత్య చిదాత్మకమైన ఆనందము. ఈమె నిత్య కల్యాణి. "కాత్యాయినీ" ఈ పదప్రయోగము కూడా గౌరీ పర్యాయపదము లనేకముండగా ఈ పదమే ఈ వరుసలో వాడుట సముచితముగా నున్నది. కాత్యాయనుని పుత్రిక కాత్యాయని.

"కతి అయనాని మోక్షమార్గః సంతతి విచారయ తీతి
కచ్ఛయంః తస్యగోత్రా పత్యం కాత్యాయనీమ్" [2]-

మోక్షమార్గములు ఎన్ని రకములుగా ఉన్నవని విచారించువాడు కత్సయనుడు. వాని గోత్రమున పుట్టిన కన్య కాత్యాయిని. నిర్వాణ నిజ సుఖదాయినీం - నిత్య కల్యాణీ అను వరుసలో ఈ కాత్యాయినీ పదము భావతౌల్యమునకు కవి వాడెనా అన్నంత సార్థకముగా నున్నది. శర్వుని యొక్క రాణి కనుక శర్వాణి. నిత్య కల్యాణి ఎడబాటులేని స్త్రీమూర్తి.

---

1. ల.స.స్తో. శ్లో. 95

2. అమరకోశం గు. ప్ర - పుట. 38

పార్వతీ పరమేశ్వరుల అనుబంధము, అవినాభావము ఈమెను ఆశ్రయించిన వారికి నిత్య కల్యాణ సిద్ధియే. ఎల్లప్పుడు వాసనలలో మధువును కోరునవి మధుపములు. అట్టి మధుపములకు పుష్కళముగా వాసనయు, తేనెయు లభించు పరిమళవంతమైన శిరోజములు కలది శర్వాణి. అది ఆస్వామికే తెలియును. ఆమె కేశములు నిత్య సుగంధ బంధురములు. మధుపములు ఆ కేశ బంధము నాశ్రయించగా వానికి లభించు విజయము ఈ సుమ సుగంధ మధు బంధురత. మనకు మధుప విజయ కారణము తెలియుటకు సద్గురుని ఆశ్రయించవలెను. ఆ సద్గురువైనను గుహలోనికి గొనిపోయి రహస్యమును చెప్పవలెను. అట్టి భక్తుల పాలిట సద్గురువగు కుమార స్వామిని కన్నతల్లి "సద్గురు గుహ జననీ" అని ముత్తుస్వామి దీక్షితుల వారు గురుగుహ ముద్రతో ఈ కీర్తన రచించిరి.

మధ్యమకాల సాహిత్యము నందు దీక్షితుల వారు ఆపరదేవతని "నిరంజనీం" అనిరి. నిరంజనమనగా అజ్ఞానము. ఆ అజ్ఞానమును పోగొట్టిన జ్ఞాన స్వరూపిణి సగుణ రూపము లేనిది. ఈమె తన సృష్టియందు అంతర్లీనమగుటచేత పైకి కానరాదు గాని అంతర్లీనమై యున్నది. గురుగుహుని యందు ఈ జననీ లక్షణము అంతర్లీనమైనది. ఇక ఈమె ఎప్పుడు బయటపడును అనిన గర్వితుడైన భండాసురుడు ఎదుర్కొనినచో వానిని బంధించుటకు అవతరించును. కామాకర్షిణ్యాది యోగినీ గణము అట్టి సమయమున రంజిల్లుచుందురు. ఈ కామాకర్షిణ్యాది యోగినీ గణము కామాదులచే లోకమును ఆకర్షించి ఈ భండాసురాదుల శిక్షకు కారణములగుచున్నారు. వారు శిక్షింపబడగా తాము రంజిల్లుచుందురు. రుద్రుని కోపాగ్ని వలన దహింపబడిన మన్మధుని భస్మమును చిత్రకర్మడైన విఘ్నేశ్వరుడు చిత్రాకారమైన భస్మమును చేసెను. అది చూసిన బ్రహ్మ 'భండభండ' (ఆశ్చర్యమాశ్చర్యము) అనుటచే వానికి భండుడని పేరు వచ్చెను. రుద్ర కోపాగ్నివలన పుట్టిన భండుడు రౌద్ర స్వభావము కలవాడై రాక్షసుడయ్యెను. అతని గర్వమును నశింపచేసినది శ్రీదేవి. అట్టివాని గర్వమును పోగొట్టునది జ్ఞానప్రదాయిని. ఈవిషయము శివ సూత్రములందు కలదు. భండాసురుని గురించి ప్రసక్తి గల నామములు లలితా సహస్రనామ స్తోత్రములో కలవు.

"భండాసుర వధోద్యుక్త శక్తి సేనాసమన్వితా" [1]

"భండసైన్య వధోద్యుక్త శక్తి విక్రమ హర్షితా" [2]

"భండపుత్ర వధోద్యుక్త బాలా విక్రమ నందితా" [3]

"భండాసురేంద్ర నిర్ముక్త శస్త్ర ప్రత్యస్త్ర వర్షిణీ" [4]

ఇన్ని పనులు చేయగల ఆ దేవి నిర్విశేష. పైకి విలక్షణమైన స్థితిలో గోచరించును. కానీ అంతర్లీనమైన సర్వప్రాణి కోటి చైతన్యమే ఆమె రూపము. విశేషమేమనిన గుణములేని ఉపాధి. గుణములేని, ఉపాధిలేని అభేదజ్ఞానమునకు 'నిర్విశేషచిత్' అనిపేరు. దీని స్వరూపమే నిర్విశేష చైతన్యము. ఉర్వీ, జల, తేజో, వాయు, ఆకాశాది భూత తత్త్వమంతయు ఆమె స్వరూపమే. కనుక జగత్తంతము అణువణువు ఆమెయే. ఆమె యొక్క చైతన్యము సూక్ష్మము. పృధి వ్యాధి స్థూలము. స్థూల ప్రకృతియందు ఆమె జాడ తెలియదు. సూక్ష్మము కంటికి గోచరింపనంత సూక్ష్మము. కనుక అదియును తెలియదు. కనుక ఒక ప్రాణి శరీరము కనిపించుచున్నది. కాని ఆ శరీరము శరీరముగా నుండుటకు లోపల ప్రాణముండవలెను. ఆ ప్రాణము అతి సూక్ష్మము. కంటికి కానరాదు కాని అదియే ఆ పరదేవత. ఈ శరీరము శరీరముగా నన్నుదనిన ఈ ప్రాణము చేతనే అనునది అనుభవ సిద్ధము. ఆప్రాణమే ఆమె అని తెలిసికొనుటకు జ్ఞానము కావలెను. మరియు ఉర్వీతత్త్వాది స్వరూపిణీ యన శివుని మొదలు పృథివ్యంతములైన 36 తత్త్వముల స్వరూపిణి. ఈ తత్త్వములు ఆత్మ తత్త్వ, విద్యాతత్త్వ, శివతత్త్వములుగా విభజితమైనవి.

మనస్సుచేత కల్పింపబడిన మాయ వలన కలుగు అవరోధములు మోక్షసాధనకు బంధకములుగా నుండును. వానిని విడచిపెట్టి సర్వాశా పరిపూర చక్రస్వామినిని భజనము చేయుమని దీక్షితుల వారు పేర్కొనిరి.

★ ★ ★

---

1. ల.స.సో. శ్లో 24
2. ల.స.సో. శ్లో 28
3. ల.స.సో. శ్లో. 29
4. ల.స.సో. శ్లో 31

# 4వ కీర్తన తృతీయావరణము

**శంకరాభరణము** రూపకతాళము

**29.వ. మేళకర్త**

**పల్లవి:-** శ్రీకమలాంబికయా కటాక్షితోఽ హం ।

సచ్చిదానంద పరిపూర్ణ బ్రహ్మాస్మి ॥శ్రీ కమలాంబి॥

**అ॥ప॥:-** పాకశాసనాది సకల దేవతా సేవితయా

పంకజాసనాది పంచకృత్య కృద్భావితయా

శోకహర చతురపదయా మూకముఖ్య వాక్ప్రదయా

కోకనద విజయపదయా గురుగుహ తత్త్వైక పదయా ॥ శ్రీ కమలాంబి॥

**చరణము:-** అనంగ కుసుమాద్యష్ట శక్త్యాకారయా ।

అరుణ వర్ణ సంక్షోభణ చక్రాకారయా ।

అనంతద కోట్యండ నాయక శంకర నాయికయా ।

అష్టవర్గాత్మక గుప్తతరయా పరయా ।

అనంగాద్యుపాసితయా । అష్టదళాబ్జ స్థితయా ।

ధనుర్బాణ ధర కరయా । దయాసుధా సాగరయా । ॥శ్రీ కమలాంబి॥

ముత్తుస్వామి దీక్షితుల వారు ఈ తృతీయావరణ కీర్తనను తృతీయా విభక్తిలో రచించిరి. ఈ ఆవరణ ఆకృతి అష్టదళ పద్మము. సర్వసంక్షోభిణీ చక్రము అని దీని తంత్ర వ్యవహారనామము. ఈ ఆవరణలోని యోగినులను గుప్తతర యోగినులు అందురు. కరుణ రస ప్రధానమైనది. ఈ చక్రేశ్వరి అరుణవర్ణము కలది. ఇందుగల అష్టదళ శక్తులూ ధరించు వస్త్రములు కూడా అరుణ వర్ణము కలవి. ఈ ఆవరణను అరుణ వర్ణపుష్పములతో అర్చన చేయుట శ్రేష్ఠము. ఈ అష్టదళ పద్మమునందు ఒక్కొక్క దళంలో 1. అనంగ కుసుమ, 2 అనంగ రేఖ, 3 అనంగ మదన, 4 అనంగ మదనాతుర, 5 అనంగరేఖ, 6 అనంగవేగిని, 7. అనంగాంకుశ 8. అనంగమాలిని అను దేవతలున్నారు. వీరు జపాకుసుమ సంకాశమైన దేహకాంతి కలవారు. ఈ చక్రేశ్వరి త్రిపుర సుందరి. ఈ మూడవ ఆవరణ దేవతలైన

గుప్తతర యోగినులు వచన, దాన, గమన, విసర్గ, సంభోగములు, ప్రవృత్తి, నివృత్తి, ఉపేక్ష అను కర్మేంద్రియ ధర్మములై మన శరీరములో యున్నారు. పంచాశద్వర్ణ రూపిణి, అక్షరాత్మిక అయిన శ్రీదేవిని అనంగుడు (మన్మథుడు) మొదలగు ద్వాదశ చక్రవర్తులు ఉపాసించినారు. వారు 1. మన్మథుడు, 2. స్వాయంభువ మనువు, 3. చంద్రుడు, 4. కుబేరుడు, 5. లోపాముద్ర, 6. అగస్త్యుడు, 7. అగ్ని, 8. సూర్యుడు. శ్రీదేవి అవస్థాత్రయమునకు అతీతురాలు. మూడవ ఆవరణ సుషుప్తి అవస్థా భూమిక. సుషుప్తి జీవ ప్రళయము. సుషుప్త్యవస్థయందు లౌకిక జ్ఞానముండదు. ప్రమాతమాత్రముండును. ఈ అవస్థలోని జీవునికి సుఖాకార అనుభవమున్నదనుట స్పష్టము. ఈ అనుభవ ప్రధాత చిచ్ఛక్తియే. మూడవ ఆవరణ దేవత త్రిపురేశ్వరి. జాగ్రత్, స్వప్న, సుషుప్తులను మూడు దశలును మూడు పురములు. ఈ దేవత ఈ అవస్థాత్రయమునకు అధిష్ఠాత్రి. మన శరీరములోని పదునాల్గు నాడులు 1. అలంబుస, 2. కుహూ, 3. విశోదర, 4. వారణ, 5. హస్తిజిహ్వ, 6. యశోవతి, 7. పయస్విని, 8. గాంధారి, 9. పూస, 10. శంఖిణ, 11. సరస్వతి, 12. ఇడా, 13. పింగళ, 14. సుషుమ్న సర్వ సంక్షోభిణీ చక్రదేవతల యొక్క ఆధీనముననున్నవి. ఈ ఆవరణము నందు సంవిద్రూప పరాశక్తి యొక్క అవ్యక్త మహత్తత్త్వాహంకారములు భూతతన్మాత్ర పంచకము దేవతా స్వరూపములను దర్శించినవని సంప్రదాయము.

ముత్తుస్వామి దీక్షితుల వారు పల్లవిలో తాను శ్రీకమలాంబికచే రక్షితుడనైతిని కనుకనే సచ్చిదానంద పరిపూర్ణమైన బ్రహ్మమే నేనైనాను అని పేర్కొనిరి. తానే నేనైనాను "అహం బ్రహ్మాస్మి". ఈ భావనలో పల్లవించిన హృదయమున ఆమె కటాక్షము తనపై ప్రసరించుచున్నది. అప్పుడు వారు దేహమునుండి విముక్తి పొందిన ప్రాణములు, మనస్సుచే స్వచ్ఛమైన, శుభ్రమైన బ్రహ్మానందమును పొందుచున్నారు. ఈ బ్రహ్మానంద స్థితికి తెచ్చిన ఆ శరీరము అక్కడనే యున్నది. దానిలోనికి చూచినారు. అప్పుడు తదనుగుణమైన భావనలే పెల్లుబికి వచ్చినవి.

అనుపల్లవిలో "పాకశాసనాది సకల దేవతాసేవితయా" అని దీక్షితుల వారు వాక్రుచ్చిరి. పాకశాసనుడు ఇంద్రుడు తన పరివారముతో శ్రీదేవిని సేవించుచున్నాడు.

ఇంద్రుడనగా ఇంద్రియములకు అధిపతి. ఇంద్రుని పరివారము దేవతలు. ఇప్పుడవి ఇంద్రియములుగా లేవు, దివ్యములుగా నున్నవి. మన శరీరములోని మూలాధార, స్వాధిష్ఠాన చక్రములందు బ్రహ్మ, మణిపూర, అనాహత చక్రములందు విష్ణువు విశుద్ధి ఆజ్ఞా చక్రములందు శివుడు ఆపైన మహేశ్వరుడు బిందుస్థానమున మంచమున సదాశివుడు ఈ ఐదుగురు ఆమె సేవలో ఉన్నారు. తనలో ఉన్నవారే వారు తనతో అక్కడికి చేరినారు. విశ్వము యొక్క సృష్టి, స్థితి, రక్షణ, నాశ, తిరోధాన, అను గ్రహములనెడు పంచకృత్యములను చేయువారు పంచబ్రహ్మలు. ఈ పంచబ్రహ్మలు తమ తమ కృత్యములు చేయునప్పుడు శ్రీదేవిని భావించుచుందురు.

ఏక ఏక శివస్సాక్షాత్ సత్యజ్ఞానాది లక్షణః

దికార రహితః శుద్ధః స్వశక్త్యా పంచథాస్థితః [1]

సృష్ట్యాది పంచకృత్యములలో శివుడు సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష,. ఈశానములను పంచ రూపములు శివుడే అని 'యజ్ఞవైభవ ఖండము' నందు గలదు గరుడ పురాణమునందు విష్ణువు పంచరూపములుగా ఉన్నాడని అవి వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, నారాయణములని ప్రసిద్ధి. త్రిపురా సిద్ధాంతమందు బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివులు పంచబ్రహ్మములని పేర్కొనబడినది. వీరందరు శ్రీదేవిని భావించి తమతమ కృత్యములు చేయుదురు. అక్కడ శోకము లేదు. ఎంతో చతురముగా శోకము పోయి కీర్తింపదగిన స్థానములో దీక్షితుల వారు చేరినారు. శోకము యొక్క తీవ్రత మనిషికి మాటలేక పోవుట కంటే ఏమియు ఉండదు. అట్టి మాటలేని మూగవానికి ముఖసంబంధమైన ముఖ్య-వాక్కు అనగా వైఖరి వాక్కును ప్రదానము చేసినది. ఆమె శోకమును హరించుటలో ఎంతో చతురమైన పదమునందున్నది. పద్మమునకు విజయ స్థానమైన సహస్ర దళ పద్మము తన పదముగాగల తల్లి. అట్టి తల్లిచే కటాక్షింపబడిన "నేను (దీక్షితులవారు) ఈ పరిపూర్ణ బ్రహ్మానందమును అనుభవించుచుంటి" నని దీక్షితుల వారు తెల్పిరి. ఈ ఇంద్రియ కోటి కంటె పై స్థానమున అపక్వమైన ఆత్మ పదార్థమున్నది.

1. ము.దీ.కీ. పుట. 72

ఆ ఆత్మ ఇటు దేహము వైపు చూచినపుడు అవి ఇంద్రియములుగా లేవు. పాకశాసనాది సకల దేవతలు శ్రీకమలాంబికను సేవించుటకు పరబ్రహ్మ స్థానమునకు చేరినట్లున్నవి. అక్కడనే తన దేహములో నున్న మరికొందరు దేవతలు కన్పించిరి. వారు బ్రహ్మ, విష్ణు, ఈశ్వర, మహేశ్వరులు. వారు అమ్మవారి తల్పమునకు (మంచము) 4 వైపులను స్తంభములుగా నున్నారు. ఆ సదాశివుడు శయనముగా అగుచున్నాడు. ఇక్కడ దీక్షితుల వారు చేసిన పద ప్రయోగము ఆలోచనకు వరవడి పెట్టుచున్నది. గురుగుహ తత్త్వైకపదయా -"తత్త్వమసి" అను మహావాక్యమున తత్, త్వం, అసి అను మూడు పదములున్నవి. ఈమహావాక్యము ఆత్మ బ్రహ్మైక్యతా లక్షణమును బోధించును.

చరణములో శ్రీదేవి అనంగకుసుమ మొదలగు అష్టశక్తుల స్వరూపిణి, యని దీక్షితులు వారు చెప్పిరి. అనంగ పదమునకు అనంగునితో కూడిన శరీరులని అనగా స్థూల సూక్ష్మ శరీరములు రెండును లేనివారని తెలియుచున్నది. ఈ ఆవరణమున శ్రీదేవి ఎల్లనైన సంక్షోభణ చక్రము గృహముగా గలది. ఈమె అనంత కోటి బ్రహ్మాండనాయకుడైన శంకరునికి పత్ని. పంచాశద్వర్ణములు అష్టవర్గములుగా విభజితమైనవి. అవి అ,క,చ,ట,త,ప,య,శ అనునవి వర్గాద్యక్షరములు. శ్రీదేవి మాతృకారూపిణి. కనుక ఆమె అష్టవర్గాత్మక గుప్తతర దేవతా స్వరూపిణి యగుచున్నది. ఈ పరదేవత అనంగుడు (మన్మధుడు) మొదలగు దేవతల చేత ఉపాసింపబడినది. ధనుర్బాణములను ధరించిన చేతులు కలిగిన ఆ శ్రీదేవి అష్టదళ పద్మములో నున్నది. దయామృతమునకు సాగరము వంటిది.

★★★

# 5వ కీర్తన చతుర్థావరణము

కాంభోజిరాగము — ఖండజాతి అటతాళము

28.వ.మే.జన్యం

పల్లవిః- కమలాంబికాయై, కనకాంశుకాయై ।
కర్పూర వీటికాయై, నమస్తే నమస్తే ॥ ॥కమలాంబి॥

అ॥ప॥ః- కమలాకాంతానుజాయై, కామేశ్వర్యై, అజాయై ।
హిమగిరి తనుజాయై । హ్రీంకార పూజ్యాయై ।
కమలానగర విహారిణ్యై । ఖల సమూహ సంహారిణ్యై ।
కమనీయ రత్న హారిణ్యై । కలి కల్మష పరిహారిణ్యై ॥కమలాంబి॥

చరణముః- సకల సౌభాగ్యదాయ కాంభోజ చరణాయై ।
సంక్షోభిణ్యాది శక్తియుత చతుర్థావరణాయై ।
ప్రకట చతుర్దశ భువన భరణాయై ।
ప్రబల గురుగుహ సంప్రదాయాంతః కరణాయై ।
అకలంక రూప వర్ణాయై, అపర్ణాయై, సువర్ణాయై ।
సుకర ధృత చాప బాణాయై । శోభనకర మనుకోణాయై ।
సకుంకుమాది లేపనాయై । చరాచరాది కల్పనాయై ।
చికుర విజిత నీల ఘనాయై । చిదానంద పూర్ణ ఘనాయై ॥కమలాంబి॥

ఈ కీర్తన చతుర్థీ విభక్తి యందున్నది. ఇది నాలుగవ ఆవరణ కీర్తన. ఈ ఆవరణమునకు సర్వ సౌభాగ్యదాయకమని పేరు. దీనిని చతుర్దశారము అందురు. ఈకారము దీని ప్రకృతి ఇది చతుర్దశ భువనాత్మకమైనది దాడిమీకుసుమ సహోదర వర్ణము కలది. ఈ చతుర్దశారము నందు పదునాల్గు కోణములు ఉండును. ఇందు ఒక్కొక్క కోణము నందు ఒక్కొక్క దేవత కలదు. 1. సర్వ సంక్షోభిణి, 2. సర్వ విద్రావిణి, 3. సర్వాకర్షిణి, 4. సర్వాహ్లాదిని, 5. సర్వసమ్మోహిని, 6. సర్వస్తంభిణి, 7. సర్వజృంభిణి, 8. సర్వవశంకరి, 9. సర్వరంజని, 10. సర్వోన్మాదిని, 11. సర్వార్థసాధిని, 12. సర్వసంపత్తిపూరిణి,

13. సర్వతంత్రమయి, 14. సర్వద్వంద క్షయంకరీ. వీరు మొత్తము 14మంది దేవతలు. వీరికి సంప్రదాయ యోగినులని పేరు. ఈ చక్రేశ్వరి త్రిపురవాసిని. దీని రసము భయానకము ఈ చతుర్దశ భువనాత్మకయగు మనస్సు విషయాసక్తము కాకుండ ధ్యేయమైన భగవతి యొక్క రూపముపై లగ్నం చేయించి, మనస్సులోని మాలిన్యమును హరింపచేయును. జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములు పది, మనో, బుద్ధి, చిత్త, అహంకారములు నాలుగును కలసి పదునులుగు సర్వ సంక్షోభిణ్యాది నామములను ధరించి ఈచక్రమును పాలించుచున్నారు. వీరి ప్రభావము దేహములోని పదునాల్గు నాడులపైన ఉన్నది. ఈఉపాసనా విధానమును యోగ దృష్టితో చూసి, మనకు అందించినవారు ఆది గురువు దక్షిణామూర్తి. ఈ శ్రీదేవి చతుర్బాహు సమన్వితి. కుడిచేతిలో అంకుశము, పుష్పములు ఎడమ పార్శ్వమున గల రెండు హస్తములందు ధనుస్సు, బాణములను ధరించినది. ఈవిధముగా నాలుగ భుజముల యందు నాలుగు ఆయుధములను ధరించినది. ఈ నాల్గు హస్తములు చతుర్వేదములని, సాధన చతుష్టయ సంపదయని, చతుర్విధ ముక్తులగు సాయుజ్య, సామీప్య, సారూప్య, సాలోక్యములనొసంగునవి. ఈ ధనుర్బాణములతో సంకల్ప, వికల్పాత్మకమైన, చంచలమైన మనోరూప వృక్షమును అనగా వాసనామయ ప్రపంచమును కూల్చివేయును. ఈ ఆవరణ చక్రము ఈశ్వర విచారము చేయునట్టి మనస్సునకు సంబంధంచినది. ఈ విధమైన మనస్సు యొక్క వృద్ధిని సూచించు దేవతలు ఈ ఆవరణ దేవతలు. సంప్రదాయ మూలము పరమేశ్వరుడే. సంవిద్రూప పరదేవత యొక్క ఇంద్రియ దశకము అంతఃకరణ చతుష్టయమును ఇచటి దేవతా స్వరూపములు ధరించినవి. ఈకీర్తనలో సగుణ సాకార, సగుణ నిరాకార నిర్గుణ శ్రీ చక్ర సంబంధమైన నామములు కలవు.

దీక్షితుల వారు పల్లవిలో బంగారు చేలము కట్టుకొనిన కమలాంబికకు నమస్కరించుచు ఆమెను "హిరణ్య వర్ణాం" అనిరి. శ్రీసూక్త ప్రారంభమున 'హిరణ్య వర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం" అని ఆ తల్లి వర్ణన కలదు. ఆమె హరిణి అనగా కమలాంబిక. హరిహరాదులకు అభేద ప్రతిపత్తి. "హరిం నయతి ఇతి హరిణి". ఈచతుర్థీ విభక్తిలో తాను తల్లికి చేయు సేవను గూర్చి చెప్పుచున్నారు.

ఆమె 'కర్పూర వీటికామోద సమాకర్ష దిగంతరా'. పచ్చ కర్పూరపు గుబాళింపుగల తాంబూలము యొక్క పరిమళముచే దిగంతములను ఆకర్షించును. సమస్త లోకములు, సృష్టి అంతయు ఆమె పంటి క్రింద పడి నలిగి పోవునదియే. అనగా ఆమెచే సంహారము చేయబడినది. సంహారము నందు రక్తవర్ణమున్నది. ఈమె తాంబూలపు వర్ణము ఎఱుపు. సృష్టినంతటను చర్వణము చేయుటచే రజోగుణము తన యందు విస్తరింపచేసి కొనుచుండును. దీనిచేత ఆమె యొక్క క్రియా శీలక లక్షణము వ్యక్తమగును. ఆమె కర్పూరవీటికకు నమస్కారమనగా ఆమె రజోగుణమునకు, క్రియాశీలమునకు, జగత్ సంహార లక్షణమునకు ప్రతీక. ఆ లక్షణముగల ఆమెకు నమస్కారమని దీక్షితుల వారు వాకృచ్చిరి.

అనుపల్లవిలో దీక్షితుల వారు శ్రీదేవి లక్ష్మీపతియైన మహావిష్ణువు యొక్క సోదరి అనిరి. శివశక్తి సామరస్య ఆనందామృతమయ కారణ జలమున మూడు అండములు ప్రభవించినవి. అవి మాయాకల్పితములు. త్రిగుణాత్మకములు. సత్త్వ గుణ అండమున విష్ణువు, గౌరి అవతరించిరి. కనుక వీరిరువురు సహోదరులు. రజో గుణ అండమున బ్రహ్మ, లక్ష్మి అవతరించిరి. తమోగుణ అండమున శివుడు సరస్వతి అవతరించిరి. కమలాంబికా గౌరియై విష్ణువునకు సహోదరియైనదని ప్రతిపాదింపబడినది. ఈ వివరము దేవీ భాగవతమున తొమ్మిదవ స్కందమున సృష్టిక్రమము యొక్క వర్ణనమున కలదు. కామేశ్వరి కామకల రూపవిద్యకు అధిష్ఠాన దైవము. కామేశ్వరుని జాయ (పత్ని). అందుచే కూడా ఈమె కామేశ్వరి. కామేశ్వర యుగ్మము నామరూప, అవస్థాన, అనుష్ఠానాది సామ్యములు కలది. కనుకనే అజ - 'నజాయతే ఇతి అజా' స్త్రీ లింగము. పుంలింగమైనచో అజః. మూలతత్త్వము ఒకటి యగుటచే నిర్గుణమున, సగుణమున వీరి లక్షణము సమానము. (ఆమె) సతీదేవి దక్షుని యజ్ఞమును చూచుటకు వెళ్ళి యోగాగ్నిలో తన శరీరమును దగ్ధము చేసికొనెను. శివుని జటనుండి ఆవిర్భవించిన వీరభద్రుడు (లేడి) దక్ష యజ్ఞమును ధ్వంసము చేసెను. పిమ్మట దేవతలచే ప్రార్థింపబడి తారకాసుర సంహారనిమిత్తము కుమారస్వామి జననమునకై శ్రీదేవి హిమవంతుని కుమార్తెగా అవతరించెను.

అందువలన ఈమెను దీక్షితుల వారు "హిమగిరి తనూజాయై" అనిరి. హ్రీంకారముచే పూజింపదగినది. అనగా హ్రీంకార స్వరూపమున తారామంత్రాధిష్ఠానముగా పూజనందునది. హ్రీంకారము శక్తి కూటమునకు, మధ్యకూటమునకు, వాగ్భవ కూటమునకు చెందిన ఏకైక మంత్రము. భావము భిన్నము శబ్దము ఏకము. అందుచేత హ్రీంకారముచే పూజింపబడునది. ఆ పరదేవత 'హ్రీంకారాసన గర్భితానల శిఖాం సౌః క్లీం కళాం బిభ్రతీం' అని దేవీఖడ్గమాలా స్తోత్ర ప్రారంభము హ్రీం బీజాక్షరముతో నున్నది. 'హ్రీంకార పూజ్యాయై' శ్రీదేవి యొక్క త్రిశతి నామములయందు 25వ నామము హ్రీంకారము. ఇది ఏకాక్షర భువనేశ్వరీ మంత్రము. కమలాంబికయే ఏకాక్షర మంత్ర అధిష్ఠాన దేవతయగు భువనేశ్వరి. ఈ కమలాంబ హ్రీంకార భువనేశ్వరీ మంత్రముచే పూజింపబడునదని దీక్షితుల వారు వివరించిరి. ఈపరదేవత -

"హ్రీంకారీ హ్రీమతీ హృద్యాహేయో పాదేయ వర్జితా"[1]

అని లలితా సహస్రనామ స్తోత్రము నందు స్తుతింపబడినది. శ్రీదేవి కమలాపురమున, శ్రీచక్రమున విహరించునది. దుర్మార్గులైన గుంపును సంహరించునది. అనేకమైన మంత్రరత్నములను ధరించునది. కలికల్మషములను అనగా కలిలో గల పాపములను పోగొట్టునది. అని దీక్షితుల వారు ఆ దేవత యొక్క గుణ గణములను వర్ణించిరి.

సకల సౌభాగ్యదాయకమైన పద్మముల వంటి చరణములు కలది. తన చరణ పద్మములను ఆశ్రయించిన వారకి సకల సౌభాగ్యములను ప్రసాదించుటయేగాక మోక్షమును కూడ నీయగలదు. ఉపాసకులకు అభీష్టసిద్ధి నిచ్చుట చిదగ్నికుండ సంభూతమైన ఆ పరదేవత యొక్క లక్షణము

భగవతీ పాదారవిందములను ఆశ్రయించిన వారు సంసార సాగరమునుండి విముక్తి నొంది తరింతురు. కనుకనే "నిన్ను నమ్మిన వారికి ఎన్నడూ నాశము లేదు ఈశ్వరీ" అని భక్తపోతన రుక్మిణీ కల్యాణ కథలో రచించిరి. శ్రీ శంకరులు "లలితా పంచరత్న"

1. ల.స.స్తో. 70వ పాదము

స్తోత్రములో లలితాచరణారవిందము భక్తమనో రథ సాధకము, సంసార సింధపోతము, పద్మాంకుశాది చిహ్నితమని వర్ణించిరి.

"ప్రాతర్నమామి లలితాచరణారవిందమ్
భక్తేష్టదాన నిరతం భవసింధుపోతమ్
పద్మాసనాది సురనాయక పూజనీయమ్
పద్మాంకుశ ధ్వజ సరోరుహ లాంఛనాఢ్యమ్" అని వర్ణించిరి.

ఆమె చరణముల యొక్క లక్షణమును శంకర భగవత్పాదుల వారు సౌందర్యలహరిలో-

"త్వదన్యః పాణిభ్యా మభయవరదో దైవతగణః
త్వమేకా నైవాసి ప్రకటిత వరాభీత్యభినయా
భయాత్త్రాతుం దాతుం ఫలమపి చ వాంఛా సమధికం
శరణ్యే లోకానాం తవహి చరణావేవ నిపుణౌ"[1]

సమస్తలోకములకు ఆధారభూతమైన ఓ తల్లీ! నీతో సరిసమానులు కాని ఇతర దేవతలు అభయ వరదముద్రలను తమ తమ హస్తముల ధరించి నిన్నాశ్రయించిన భక్తకోటిని ఉద్ధరించుచున్నారు. కానీ అసమాన సమానురాలైన నీవు మాత్రము ఈ అభయ, వరదముద్రల ప్రమేయమే లేకుండ కేవలము నీ పాదకమలము నాశ్రయించిన మానవాళికి సకలైశ్వర్యములను, చివరకు మోక్షమును ప్రసాదించుచున్నావు. శ్రీదేవి పాదముల నాశ్రయించిన వారికి సకల భోగములకు, మోక్షమునకు కొదువలేదు. ఇతర దేవతలకు కూడా శ్రీదేవియే శరణ్యము. శ్రీదేవియే అభీష్టప్రదాత్రి. దీక్షితుల వారు 'సకల సౌభాగ్యదాయ కాంభోజి చరణాయై' అనుచు 'కాంభోజి' రాగ నామమును నిక్షేపించిరి. సకల సౌభాగ్యదాయక చక్రమునందు చరణముల నుంచినదను మరియొక శ్లేషార్థము కలదు.

"ప్రకట చతుర్దశ భువనాభరణాయై" - లోకములు పదునాల్గని ప్రసిద్ధి. "చతుర్దశభువనాధీశ్వరీ" అని ప్రయోగము కలదు. ఇది స్థూలార్థము.

శ్లేష- సద్గురూపదిష్టమైన భగవతీ మంత్రములను నియమనిష్ఠలతో

---

1. సౌ.ల. 4వ శ్లోకం పుటసంఖ్య 27

జపించువారలు మాత్రమే ఈ చతుర్దశ భువనములను సంవిద్రూపముగ, చిన్మయ ప్రపంచముగ చూడగల్గుదురు.

"ప్రబల గురుగుహ సంప్రదాయాంతః కరణాయై"- గురువులు శబ్దబ్రహ్మయందు, పరబ్రహ్మయందు నిష్ణాతులై యుండవలెను. శబ్దబ్రహ్మమనగా శాస్త్రజ్ఞానము. పరబ్రహ్మమనగా అపరోక్షానుభూతి. ఇట్టి గురువులు ఆచార్యులై వేద శాస్త్రములయందు ప్రామాణిక బుద్ధి కలవారై యుండవలెను. అట్టి సద్గురువుల కటాక్షముతో ఈ చతుర్దశ భువనములను భగవతీ రూపముగా చూడగలరు.

"అకళంక రూపవర్ణాయై" సామాన్యముగా లోకములోని రూపములలో ఏదో ఒక కళంకము కనపడును. కానీ ఈ కమలాంబరూపము అకళంకముగా అనగా దోషరహితమైనది. సాముద్రిక శాస్త్రములో చెప్పబడిన ఉత్తమ స్త్రీ లక్షణము లన్నియు ఈమెలో ఉట్టిపడుచు తనకే విస్మయము కలిగించును. అది అప్రాకృత్యము సదసద్రూపము. జన్మ మృత్యు జరారహితమై జన్మ మృత్యు జరాతప్త జనులకు శాశ్వత సుఖమును ప్రసాదించుచున్నది. ఇట్టి నిష్కళంక శరీర సౌందర్యము గల కమలాంబకు నమస్కారమని దీక్షితుల వారు కీర్తించుచున్నారు. "ప్రకటా సర్వైరను భూయమానా ప్రబల గురుగుహ సంప్రదాయాంతః కరణాయై" మిక్కిలి బలవంతుడైన శాస్త్ర సమ్మతమైన సద్గురుగుహునిచే అనిన కుమారస్వామిచే అజ్ఞాపింపబడిన లేదా ప్రవర్తింపచేసిన శ్రీవిద్యకు అంతఃకరణమైన పరదేవత. కళంకములేని రూపవర్ణములు కలది - ఆమెయే అపర్ణ సువర్ణ నామములతో కొలువబడినది.

అపర్ణాయై- పార్వతీదేవి ఈశ్వరుని పెండ్లియాడుటకు పర్ణములు అనగా ఆకులు కూడా తినకుండా తపస్సు చేయుట వలన దేవతలు ఆమెను అపర్ణయనిరి. అప + ఋణ = అపర్ణ (గుణసంధి) ఏవిధమైన ఋణములేని వారు లోకములో నిశ్చింతగానున్నట్లు ఈ కమలాంబిక ఉన్నది. కనుక ఆమె అపర్ణ. అపర్ణ నామము గురించి భాస్కరరాయలు దేవీస్తవములో -

"ఋణ నిష్టమదద్వైత త్వన్నామ జపతో మమ

శివే కథమపర్ణేతి రూఢిః భారయ తే నతే" అని నిర్వచించినారు.

శ్లేషార్థం- అపగతమైన ఋణం కలదాని ఋణం తీర్చినవాడు నిర్విచారముగా ఉన్నట్లు ఆతల్లి ఉన్నదని అర్థము.

సుపర్ణయై- పర్ణము = ఆకు. ఇక్కడ 'పర్ణ' శబ్దమునకు అర్థం వేదవాఙ్మయము. మంచి రెక్కలు కలది అని స్థూలార్థము. కర్మకాండ, జ్ఞానమార్గమును అనుసరించువారు మాత్రమే భగవతీ కటాక్షమును పొందగలరు. అనగా ఆ రెండు మార్గములు రెండు రెక్కల వంటివి.

"ఉబాభ్యామేవ పక్ష్యాభ్యాం యదాఖి పక్షిణాం గతిః" అనగా రెండు రెక్కలతోనే పక్షులు ఆకాశమున సంచరించునట్లు, సాధకులు కర్మ, జ్ఞానములను రెండు మార్గములతో శ్రీదేవి సాయుజ్యము పొందగలరు. అట్టి కలాంకకు సమస్కారము అని దీక్షితుల వారు ఉటంకించినారు.

శోభనకరమను కోణాయై- మంగళకర, చతుర్దశార కోణాధిష్ఠాత్రి, చతుర్దశ భువనాకార, సర్వ సంక్షోభిణ్యాది శక్తి స్వరూపిణి అయిన కమలాంబిక కుంకుమతో కూడిన వస్తువులను మాత్రమే తన శరీరమునకు పూసికొనును. "సకుంకుమ విలేపనాం" అని ధ్యాన శ్లోకములో కలదు. సువర్ణయై తపోగ్నిచేత ఆమె యొక్క తేజస్సు సువర్ణఛాయను తిరస్కరించునదిగా ఉన్నది. కనుక ఆమె సువర్ణ. శ్రీదేవి నాలుగు హస్తముల యందు పాశ, అంకుశ, ఇక్షు, బాణములు కలవు. 'పద్మపాశాంకుశ లసత్కరాబ్జాయై' అని లలితాష్టోత్తర శత నామస్తోత్రమునందు గలదు. ఈ భావననే దీక్షితుల వారు సుకరధృత చాపబాణయై అని పేర్కొనిరి. ఈచక్రమున గల పదునాల్గు కోణములలో సంప్రదాయ యోగినులతో కూడి శుభములను గూర్చుచున్నది. ఈమె చరాచరములను సృష్టిచేయునది. కనుక "చరా చర జగన్నాథా చక్రరాజ నికేతనా"[1] అని లలితా సహస్ర నామ స్తోత్రమునందు కీర్తింపబడినది.

1. ల.స.స్తో 59 పాదము

చరాచరాది కల్పనాయై - చరము = కదలిక, అచరము = కదలికలేనిది. ఇట్టి చరాచర ప్రపంచమును "నామరూపేవ్యాకరవాణీతి" అను ఉపనిషత్సిద్ధాంతము ననుసరించి తన ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులతో పిపీలకాది బ్రహ్మ పర్యంతము సంకల్ప మాత్రముచే ఊర్ణనాభి అనగా సాలెపురుగు వలె సృష్టించినది ఈతల్లి. ఇంత సువిశాల ప్రపంచమును సృష్టించి తానే జగజ్జననిగా వ్యవహరింపబడుచున్నది. "అబ్రహ్మ కీట జననీ" అని లలితోపాఖ్యానం.

చిదానంద పూర్ణఘనాయై - సర్వేసర్వత్ర వ్యాపించిన తన చిద్రూపములో ఈమె ప్రకాశించుచున్నది. జీవుడు అనృత, జడ దుఃఖములతో మునిగియున్నవాడు. భగవతి సచ్చిదానంద స్వరూపిణి, "సత్యం, జ్ఞానమనంతం బ్రహ్మ" అను ఉపనిషత్ప్రతిపాద్యమైనదే భగవతీరూపము, మరియూ నిరంతరమూ పరిపూర్ణాత్మ భావముతో నుండి, సద్రూప, చిద్రూప, ఆనందరూపములతో ప్రకాశించు తల్లికి నమస్కారములని దీక్షితులు వారు పేర్కొనిరి.

శ్రీదేవి యొక్క కురులు నీలమేఘ ఛాయను జయించునటు వంటివట. లలితా పరాభట్టారికయైన కమలాంబ ఆనంద పరిపూర్ణత్వముచే ఘనత్వము కలది. అనృతాది దుఃఖములు లేని జ్ఞానానంద పరిపూర్ణ స్వరూపిణి. ఈమె సర్వార్థదాత్రి, సావిత్రి సచ్చిదానంద స్వరూపిణి. ఆనందము, విషయానుభవము, నిత్యత్వము అను ధర్మములు వేరుగా ఉన్నట్లు భ్రమింపచేయును. కాని అవి చైతన్యము కంటె వేరు కావు. ఈ విషయమును గురించి -

"ఆనందో విషయాను భవోనిత్యం చేతిసంతిధర్మా
అపృధక్త్వే చైతన్యాత్ పృథగివావ భాసంత"[1]

అని పద్మపాదాచార్యుల వారు రచించిన "పంచపాదిక" యందు చెప్పబడినది. వీరు శంకర భగవత్పాదుల వారి శిష్యులు.

ఈ చక్రము యొక్క రసము భయానకము. దీక్షితుల వారు పరమేశ్వరిని వర్ణించుటలో దుష్టశక్తులను సంహరించునపుడు ఆ దేవి యొక్క భయంకర రూపమును ఖల సమూహసంహారిణ్యై, కలి కల్మష పరిహారిణ్యై, సుకరిధృత చాపబాణయై, అని ఈ

1. శ్రీ దీ. కృ. - పుట 81

చక్రము యొక్క భయానక రసమును సూచించిరి. ఈ ఆవరణ ఈశ్వర విచారము చేయునట్టి మనస్సుకు సంబంధించినది. ఈ విధమైన మనోవృద్ధిని సూచించు దేవతలు ఈ ఆవరణ దేవతలు, సంప్రదాయ మూలము ఆ సదాశివుడు.

విశేషాంశములు - శ్రీదేవి, లక్ష్మీ, బ్రహ్మలను ఏకోదరులుగా సృష్టించి, మీరు రజోగుణ ప్రధానులుగా నర్తింపుడని చెప్పినది. అట్లే వాణి రుద్రులను తమోగుణ ప్రదానులుగాను దుర్గ విష్ణువులను ఏకోదరులుగా, సత్త్వగుణ ప్రధానులుగా సృష్టించినది. మూర్తి త్రయ రహస్యంలో ఈ మూడు జంటలను ఇట్లు వ్యవహరించుడని దేవి నిర్వచించినట్లు కలదు, మరియు "త్వదన్యః పాణిభ్యాం అభయవరదః" అని శంకర భగవత్పాదులు భగవతీ పాదార వింద సేవను గూర్చి సౌందర్య లహరి స్తోత్రమున నిర్వచించిరి. భగవతి పాదారవింద సేవే కాక, ఆ పాదధూళి కూడా సమస్త ప్రతి బంధకములను హరించును.

కర్పూర వీటికా విశేషము - విష్ణువు, ఇంద్రుడు, కుమారస్వామి మొదలైన దేవతలు త్రిపురాసుర సంహారము చేసి భగవతి సమీపమునకు రాగా ఆ తల్లి తన నోటిలోని కర్పూర వీటికను వారి నోటిలో నుంచెనట. ఈ విషయమునకు సౌందర్యలహరిలోని 65 వ శ్లోకమే ప్రమాణము-

"రణే జిత్వా దైత్యా నపహృత శిరస్త్రైః కవచభి
ర్నివృత్తై శ్చండాంశ త్రిపురహర నిర్మాల్య విముఖైః
విశాఖేన్ద్రో పేన్ద్రై శ్శశి విశద కర్పూరశకలాః
విలీయంతే మాత స్తవ వదన తాంబూల కబళాః"[1]

జగన్మాతయైన శ్రీదేవికి బిడ్డలయందున్న వాత్సల్యము ఇటువంటిదని సూచింపబడినది.

ఈ ఆవరణలోని రహస్య విషయమేమనగా మనస్సు విషయాసక్తము కాకుండ ధ్యేయమైన భగవతీ రూపమున లగ్నము చేయునది. మనస్సులోని మాలిన్యమును హరించునది. ఈమె చతుర్దశ భువన స్వరూపిణి కనుక "సర్వం ఖల్విదం బ్రహ్మ,మేఘునా నాస్తి కించన" అను ఉపనిషద్విషయము రూఢియగుచున్నది. ఇట్టి ఉపాసనా విధానమున యోగ దృష్టితో చూచి మనకు అనుగ్రహించిన వారు శ్రీ దక్షిణామూర్తుల వారు.

1. సౌ.ల. 65 శ్లో. పుట 386

# 6వ కీర్తన పంచమావరణము

భైరవిరాగము ఝుంపె తాళము

20.వ మేళకర్త

పల్లవి:6 శ్రీ కమలాంబికాయాః పరం నహిరే రేచిత్త।

క్షిత్యాది శివాంత తత్త్వ స్వరూపిణ్యా ॥ ॥శ్రీకమలా॥

అ॥ప॥:- శ్రీకంఠవిష్ణు విరించ్యాది జనయిత్ర్యాః ।

శివాత్మక విశ్వకర్త్ర్యాః । కారయిత్ర్యాః ॥

శ్రీకర బహిర్దశార చక్రస్థిత్యా ।

స్సేవిత భైరవీ భార్గవీ భారత్యాః ॥ ॥శ్రీకమలా॥

చరణము:- నాదమయ సూక్ష్మ రూప సర్వసిద్ధి

ప్రదాది దశశక్త్యారాధిత మూర్తే : ।

శ్రోత్రాది దశ కరణాత్మక కుళకౌళికాది

బహువిధో పాసిత కీర్తేః।

అభేద నిత్య శుద్ధ బుద్ధ ముక్త సచ్చిదానందమయ

పరమాద్వైత స్ఫూర్తేః ।

ఆదిమధ్యాంత రహితా ప్రమేయ గురుగుహ మోదిత ।

సర్వార్థ సాధక మూర్తేః ।

మ॥సా :- మూలాది నవాధార వ్యావృత్త దశ ధ్వని భేదజ్ఞ

యోగి బృంద సంరక్షిణ్యా : ।

అనాదిమాయా విద్యా కార్యకారణ వినోద హారణ

పటుతర కటాక్ష వీక్షణ్యాః । ॥శ్రీకమలా॥

ఈ పంచమావరణ కృతి పంచమీ విభక్తిలో నున్నది. ఐదవ ఆవరణమునకు బహిర్దశారమని పేరు. ఇది దశ కోణాకృతి కలది. దీనిని సర్వార్థ సాధక చక్రము అందురు. ఇది ఏకార ప్రకృతి కలది. దీని తత్త్వము దశావతారాత్మకము. పూజాక్రమము ప్రదక్షిణము.

సంవిద్రూప పరదేవత యొక్క జ్ఞానేంద్రియ పంచకము, కర్మేంద్రియ పంచకము కలసి పది ఈ పదియు సర్వ సిద్ధి ప్రదాది దేవతలై ఈ చక్రమున భాసించుచున్నారు. వీరు 1. సర్వసిద్ధిప్రద, 2. సర్వసంపత్ప్రద, 3. సర్వ ప్రియంకరి, 4. సర్వ మంగళకరి, 5. సర్వకామప్రద, 6. సర్వ దుఃఖవిమోచని,. 7. సర్వమృత్యుపశమని, 8. సర్వవిఘ్ననివారిణి, 9. సర్వాంగసుందరి, 10. సర్వసౌభాగ్యదాయిని. అను ఈదేవతలు కులకౌళిక, కుళోత్తీర్ణనామములతో ఆరాధింపబడుతున్న యోగినీ గణములు. ఈచక్రమునకు అధిష్ఠాత్రి - త్రిపుర. ఈ చక్రేశ్వరి సర్వోన్మాదిని ముద్రను కలిగియుండును. ఈచక్రమునందు రసము బీభత్సము. జుగుప్స దీని స్థాయీభావము. బహిర్ద శారమనగా వెలుపలగా నున్న పదికోణముల చక్రము. సకలార్థముల నీయగల ఈ చక్రమునందలి దేవతలకు నాయకయైన ఈ పరదేవతయే ఈ కీర్తనలో కీర్తింపబడిన కమలాంబిక. ఈచక్రబీజం "సః". ప్రాణములు 5 అవి ప్రాణ, అపాన, వ్యాన. ఉదాన, సమానములనునవి. ఉపప్రాణములు 5. అవి నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనుంజయములు. ఈ పది ప్రాణవాయువులకు ఈ కులోత్తీర్ణ యోగినులు అధిష్ఠాన దేవతలు.

ఈ పంచమావరణములోని ముఖ్యాంశములు-1. బహిర్దశార విషయము,2. జ్ఞానేంద్రియ పంచకము, 3. సర్వసిద్ధిప్రద కులోత్తీర్ణ చరిత్ర, 4. ప్రాణాపానాది దశ విధ స్వరూపము, 5. నిత్య శుద్ధ బుద్ధ ముక్త లక్షణములు. 6 మూలాధారాది షట్ చక్ర స్వరూపము ఆజ్ఞా చక్రమునుండి సహస్రారము వరకు గల సూక్ష్మాతిసూక్ష్మ నవచక్ర స్వరూపములు. 7. దశ విధ మండలములు. అవి 1. వియన్మండలము, 2. తమోమండలము, 3. మేఘమండలము, 4. విజుర్మండలము, 5. తారామండలము, 6. జ్యోతిర్మండలము, 7. సూర్యమండలము, 8. చంద్రమండలము, 9. వహ్నిమండలము, 10. హిరణ్మయి మండలము. ఇవికాక దశవిధ నాదములు - అవి 1. క్షిణి, 2. క్షిణిక్షిణి, 3. ఘంటానాదం, 4. శంఖానాదం, 5. వీణానాదం (తంత్రినాదము) 6, తాళశబ్దం, 7. వేణునాదం, 8. భేరీనాదం, 9. మృదంగనాదము, 10. మేఘనాదములు. యోగులు వారి నిరంతర సాధనలో ఈ దశ విధ మండలములను భేదించుకొని తురీయావస్థకు చేరు ప్రయత్నములో

దశవిధ నామములను వినగలరని ప్రసిద్ధి. ఆ తరువాత అన్నిటికి అతీతమైన నిరాకార, సాకార, సగుణ, నిర్గుణ, సాధార, నిరాధార, నిరంజన, నిష్క్రియము లయిన ఆ శ్రీవిద్యాది దేవతను లభ్యమయ్యేటట్లు చేయును. ఈచక్రం వైద్యశాస్త్రంలో ఎక్స్-రే వంటిది. ఇది స్వాంతర్గత ప్రాణఘోష. ఈ చక్రము ఆర్తిని పోగొట్టి స్మరణ మాత్రముచేత ముక్తి లభ్యమగునట్లుచేయును. ఈ చక్రము వైద్య శాస్రములో ఎక్సరే వంటిది. ఇది స్వాంతర్గత ప్రాణఘోష.

ఈ కీర్తనను దీక్షితుల వారు పంచమీ విభక్తిలో రచించినారు. వీరు తన చిత్తమును సంబోధించుచు శ్రీచక్రాంతర్గత బిందు స్థానమున గల ఆ పరదేవత యొక్క స్వరూపమే శ్రీకమలాంబిక స్వరూపముగా చెప్పినారు. ఓ చిత్తమా! కమలాంబను మించిన పరదైవము మరియొకటి లేదు. ఆ కమలాంబ కన్న అన్యదైవమెఱుగను. ఈ పరదేవత సహస్రారాంతర్గత బిందుస్థానమున ఉన్న శివశక్త్యైక స్వరూపిణియైన లలితాపరాభట్టారిక. ఈమె తిరువారూరున గుడిలో ఉత్తమోత్తమమైన విగ్రహరూపమున కమలాంబగా నున్నది. ఈమె యొక్క స్వరూపము క్షితి మొదలు శివ పర్యంతము గల సకల తత్త్వముల స్వరూపము. అంతకు మించిన ప్రపంచము నీవు పొందదగిన సాధనము మరియొకటి లేదని దీక్షితుల వారు పల్లవిలో మనస్సుకు ప్రబోధించిరి. ఈ సందర్భమున సౌందర్యలహరిలోని -

"క్షితౌషట్పంచాశ ద్విసమధిక పంచాశదుదకే
హుతాశే ద్వాషష్టి శ్చతురధిక పంచాశదనిలే
దివి ద్విష్షట్త్రింశ న్మనసిచ చతుష్షష్టిరితి యే
మయూఖాస్తేషా మప్యుపరి తవపాదాంబుజ యుగమ్"[1]

ఈ శ్లోకమును అనుసంధించు కొనవలసి యున్నది. క్షితి యందు గల 56 తత్త్వములు (షట్పంచాశత్). పృథివీ తత్త్వాత్మకమైన మూలాధార చక్రమున పృథివికి చెందిన అగ్నిజ్వాలలు 56, మణిపూరక చక్రమున ఉదక తత్త్వ జ్వాలలు 52 కలసి అగ్ని జ్వాలలు 108. ఈ అగ్ని జ్వాలలు 108, సూర్యకిరణములు 116, చంద్రకళలు 136 మొత్తం కలిసి

1. సౌ.ల.14వ శ్లో. పుట. 106

360 కళలు అగుచున్నవి. అనగా సూర్య చంద్ర అగ్నిత్రయముచే సాగుచున్న పరిపూర్ణమైన కాలము యొక్క స్వరూపమే శ్రీ కమలాంబిక. ఈ కళలు క్షితి యందు 56 పృథ్వీయందు 56 అగ్ని జ్వాలలు. మణిపూర చక్రమున ఉదక తత్త్వములోని 52, కలసి 108 అగ్ని జ్వాలలు స్వాదిష్ఠానమున అగ్ని తత్త్వమున 62 కిరణములు అనాహత చక్రమున వాయు తత్త్వాత్మిక కిరణములు 54 కలసి సూర్యకిరణములు 116 అగుచున్నవి. సూర్యకిరణములు మణిపురమును వదిలి స్వాధిష్ఠానమున ప్రవేశించుట సూర్యాగ్నులు ఒకటే యగుట వలన తటస్థించుచున్నది. అనగా అగ్నియు సూర్యుడు ఒక్కటే. సూర్యుని యందు అగ్నికి అంతర్భావము, అగ్నియందు సూర్యునికి అంతర్భావము, "దినాన్తే నిహితం తేజః సవిత్రేవహుతాశనః" అని కాళిదాసు అనిరి. జగత్తులను దహింపజేయు అగ్నిని ఉపశమింపచేయు సంవర్తమున మేఘము సూర్య కిరణముల వలన జనించి వర్ష కారణమగుచున్నది. ఇది క్షిత్యాది మణి పూరాంతమైన స్థితి.

ఇక ఆకాశ తత్త్వాత్మకమైన విశుద్ధి చక్రమున 72 కళలు, మనస్తత్త్వాత్మకమైన ఆజ్ఞా చక్రమున 64 కళలు కలసి 136 చంద్రుని కళలగుచున్నవి. ఈ రీతిగా పృథివి, అప్, తేజో, వాయు, ఆకాశ, మనస్తత్త్వములు ఆరును ఆజ్ఞాచక్రము వరకు ప్రవర్తిల్లగా ఈ మూలాధార స్వాధిష్ఠానములపై విరించిని (బ్రహ్మ) అనాహత మణిపూరమునపైన విష్ణుని, విశుద్ధి, ఆజ్ఞాచక్రములపైన శ్రీకంఠుని అనగా శివుని ఆమెయే కన్నది. వీరిని ఆ మూడు స్థానముల యందు నియమించినది అగుటచే ఆమె వీరికి తల్లిగా చెప్పబడినది. ఈమె శివాత్మకమైన విశ్వనిర్మాణ శక్తి.

కారయిత్రి అనిన తాను కర్తయై ఇతరుల చేత సృష్టి, స్థితి, లయాదులను చేయించునది. బ్రహ్మ, విష్ణు, శివుడు, శ్రీదేవిని ధ్యానము చేయుచు తమ కృత్యములైన సృష్టి, స్థితి, లయములను చేయుదురు. ఈ సూర్య, చంద్ర, అగ్నిలు కాని శ్రీకంఠ, విష్ణు, విరించ్యాదులు కాని స్వతంత్రులు కారు. వీరు ఆ పరదేవతద యొక్క సేవకులు. అందుచే వీరి భార్యలు అయిన లక్ష్మి, సరస్వతి, పార్వతులు శ్రీదేవిని సేవించుచున్నారు. అది

"వాణీ గాయిత్రి సావిత్రీ సన్నుతాయై నమః" అనుటలో సూచితమగుచున్నది. శ్రీచక్రమున వెలుపలగా నున్న పదికోణములలో గల బహిర్దశార మందు శ్రీమాత భైరవి - (పార్వతి), భార్గవీ - (లక్ష్మి), భారతీ - (సరస్వతు)లచే సేవితమగుచున్నది అని దీక్షితుల వారు ధ్యాన నిమగ్నులై యున్నపుడు వారు దర్శించి అనుభూతిని పొందిన అనేక విషయములను గూర్చి ఈ కృతిలో వివరించిరి.

ఇంకను దీక్షితుల వారు చరణములో ఈ పరాశక్తి నాదమయమైన సూక్ష్మ రూపము కలిగి సర్వసిద్ధిప్రదా, సర్వసంపత్ప్రద, సర్వప్రియంకరి, సర్వమంగళకరి, సర్వకామప్రద, సర్వదుఃఖవిమోచన, సర్వమృత్యుపశమని, సర్వవిఘ్ననివారిణీ, సర్వాంగసుందరి, సర్వసౌభాగ్య దాయిని అను దశ శక్తులచే ఆరాధింపబడిన మూర్తి కలదియగు కమలాంబిక కంటె ఇతరము లేదు ఈ శక్తులు సూక్ష్మమయ నాద స్వరూపము కలవి.

"నారాయణీ నాదరూప నామరూప వివర్జితా" [1] అని ఈ పరదేవత లలితసహస్రమున స్తోత్రము చేయబడినది. భ్రూమధ్యము నుండి సహస్రార మధ్యమము వరకు గల నవ సూక్ష్మ చక్రములందు సంచారము చేయునపుడు ఆరోహణ క్రమమున దహరాకాశమున దశ విధ మండలములు గోచరించును. ఆ దశవిధ మండలములందు ఈ దశవిధ నామములు కలవు. దశవిధ మండలముల తరువాతనే శివశక్తియుక్తమైన జీవతత్త్వము. అచటనే ఉన్మని అర్ధమాత్రక తురీయము విరజ యను నామాంతరము గల శుద్ధతత్త్వము. యోగులు ఈ దశవిధ నాదములు పరనాదమున లయింప జేయుదురు. ఆ స్థితిలో దీక్షితుల వారి మనః ప్రాణములు నాదబిందు కళలలో లయమొందినవి. ఆఅవస్థను తురీయమని ఉన్మని యని, సహజమనస్కమని చెప్పుదురు. ఈ అవస్థలో అంతఃకరణ, ప్రాణములను వివిధ విషయములు గల జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములు నశించును. ఈ దశవిధ నాదములను భేదించుకొని పురోగమించుట తెలిసిన యోగులను ఆ పరదేవత అనుగ్రహించును.

---

1. ల.స.స్తో. పా 70

శ్రోత్రాది దశ కరణాత్మక - అనిన జ్ఞానేంద్రియ పంచకము కర్మేంద్రియ పంచకము మొత్తము పది. సర్వసిద్ధి ప్రదాది దేవతలైన, కుళ, కౌళి, కాది, యోగినీ స్వరూపములు ధరించియున్న కుళోత్తీర్ణ యోగినులు. దశేంద్రియములచే బహు విధములుగా ఉపాసింపబడుచు (కీర్తి అనగా ముక్తి) ముక్తి స్వరూపిణిగా నున్న కమలాంబిక కంటె మరి పరదైవము లేదని వాకృచ్చిరి. కుళకౌళాది అని చెప్పుటచే -

"కుళామృతైకా రసికా కుళ సంకేత పాలినీ

కుళాంగనా కుళాంతస్థా కౌళినీ కుళయోగినీ"[1]

"కుశలా కోమలాకారా కురుకుల్లా కులేశ్వరీ

కుళకుండాలయ కౌళమార్గతత్పర సేవితా"[2]

ఈ కమలాంబ నిత్య శుద్ధ బుద్ధ ముక్త సచ్చిదానందమైన అభేద అద్వైత జ్ఞాన స్ఫూర్తి. ఇక ఆది మధ్యాంతరహితయై కొలతకు అందని గురుగుహునిచే ఆమోదించబడిన, ఆనందము కలిగించునట్టి సకల పురుషార్థ పరిపూర్ణ స్వరూపిణి, సర్వార్థ సాధక మూర్తియైన ఆమె కంటె అన్య దైవము లేదనిరి.

"అభేద, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, సచ్చిదానంద, పరమాద్వైత స్ఫూర్తేః"- నీ నా అనుభేద భావములేని విశాల భావములు కలవారు. దేహాత్మ బుద్ధి అనగా దేహమే ఆత్మగా భావించుట. గేహాత్మబుద్ధి - గృహ, ఆరామ, క్షేత్ర, విత్తాదుల యందు ఆత్మబుద్ధి గల్గుట. ఈరెండూ అవిద్యా వృక్ష ఫలములు. భాగవతి నిత్య శుద్ధురాలు. లోకములో శుద్ధి అనునది స్నానాదులచే కల్గును. అటుల కానిచో శరీరము మాలిన్యమగును. ఈ మాలిన్యాది దోషములు (వికారములు) ప్రాకృతశరీరమునకే. భగవతీ తత్త్వము అప్రాకృతమగుట వలన ఈ మాలిన్యాదులకు అసలు స్థానమే లేదు. ఎప్పుడును శుద్ధమై యుండును.

నిత్యశుద్ధ- బుద్ధుడనగా అఖండ జ్ఞానము కలవాడు, లౌకిక జ్ఞానము భ్రమ, ప్రమాదులతో కూడినది. నిత్యముక్త- లోకములో మానవులకు ఆత్మజ్ఞానములేని వారికి

1. ల.స.స్తో. పా.37

2. ల.స.స్తో.పా 93

తాత్కాలికముగా సంసార బాధల నుండి విముక్తి కల్గును. మనస్సు వాంచితములకు లోనై యుండుట వలన మరల బంధములలో పడిపోవును. ఇనుప గొలుసులతో కట్టి పడవేసిననూ ఆ బందముల నుండి విముక్తులు కావచ్చునేమో కానీ, భార్య, ధన, కనక, వస్తు, వాహన, రూప పాశములలో బద్ధులైన ఈ జీవులు ఎన్నడును ముక్తులు కాలేరు. ఈ బాధయన్నది విషయ తాదాత్మ్యమున్న వారికే కలుగును. భగవతి త్రిగుణాతీత, లౌకిక జ్ఞానములన్నియు త్రిగుణాత్మకములు. కమలాంబిక గుణాతీత అగుటచే ఆమె ఎల్లప్పుడు నిత్యముక్త.

శుద్ధ, బుద్ధ, ముక్త ఇవి ఆత్మ (ఈశ్వర ఆత్మ) లక్షణములు. మాలిన్య, అల్పజ్ఞత్వ, బుద్ధత్వములు జీవి లక్షణములు. భగవతి సచ్చిదానంద స్వరూపిణి. ఈ ఆ విషయమే ''సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ'' అని ఉపనిషత్తులు ప్రతిపాదించుచున్నవి. ఇట్టి సర్వావస్థల యందు అఖండ పరమాద్వైత స్ఫూర్తి గల కమలాంబిక కంటె మహోన్నతమైనది మరొకటి లేదు. ఆ తత్త్వము అవినాసి. "అవినాశైవా ఆరే ఆత్మా" అని ఉపనిషత్తు "అసంగోహ్యాయంపురుషః" అనియు వివరించుచున్నది. అక్షరాత్మిక అయిన కమలాంబ కంటే గొప్పదైన వస్తువు అన్యమేదియు లేదని దీక్షితుల వారు నొక్కి వక్కాణించుచున్నారు.

జన్మలేని, మాయ, అవిద్యల కార్యకారణములను నాశనము చేయు సామర్థ్యము గల కటాక్ష వీక్షణములుగల కమలాంబ కంటే పరతత్త్వము వేరెయ్యేదియు లేదు.

మధ్యమకాల సాహిత్యమున దీక్షితుల వారు మూలాధారము నుండి నవాధారములైన నవచక్రముల యందు ప్రవర్తిల్లిన జలధి (సముద్రము) జీమూత (మేఘము) భేరి (భేరీ వాద్యము) మర్దళ (మృదంగము) శంఖ (శంఖము) ఘంటా (ఘంటా) కాహళ (బాకా) కింకిణీ (గజ్జలు) వంశీ (వేణువు) వీణా (వీణ) భ్రమర (తుమ్మెదల) దశ ధ్వనుల యొక్క భేదము నెఱిగిన వారైన యోగి బృందములను లెస్సగా రక్షించునదియైన ఆ పరదేవత కన్నా ఇతర మెఱుగను అనిరి. ఈమె అనాదియగు ఈమాయలో మనలను పడవైచినది. ఈ మాయ నుండి విద్య చేత ఎటుల బయలు పడవలెనో అట్టి విద్యకు అనగా మాయాకల్పితమైన అజ్ఞానముచేత తాను కారణమైన ఈ జగత్తు యొక్క కార్యరూపమైన

లక్షణమును విలాసముగా హరించుట యందు సమర్థమైన కడగంటి చూపులు కలదియగు ఆమె కంటే పరదేవత లేదు చిత్తమా అని దీక్షితుల వారు పేర్కొనిరి.

వీరి కీర్తనలకు భావనోపనిషత్తు, త్రిపురోపనిషత్తు, దేవీ తత్త్వము ఎక్కువగాగల కాళిక, బ్రహ్మాండ, దేవీ భాగవత, మార్కండేయపురాణములలోని మంత్ర, తంత్ర రహస్యములను గుర్తించిన వీరు వాగ్గేయ కారకత్రయములో ద్వితీయుడైననూ అద్వితీయ కృతులను రచించి అద్వితీయ పరబ్రహ్మ పదమును పొందిన మహామేటి వాగ్గేయకారులు.

★★★

## 7వ కీర్తన షష్టావరణము

పున్నాగవరాళి రాగము　　　　　　　　　　రూపక తాళము

8.వ.మేళ కర్త జన్యము

పల్లవి :- కమలాంబికాయా స్తవ భక్తోఽహం ।
శంకర్యా శ్రీకర్యాస్సంగీత రసికాయా　　　　॥శ్రీ కమలా॥

అ॥ప॥:- సుమశరేక్షు కోదండ పాశాంకుశ పాణ్యా
అతి మధురతర వాణ్యా శర్వాణ్యాః కల్యాణ్యా ః
రమణీయ పున్నాగవరాళి విజిత వేణ్యాః॥　　　　॥శ్రీ కమలా॥

చరణముః- దశకలాత్మకవహ్ని స్వరూప ప్రకాశాంతర్దశార
సర్వరక్షాకర చక్రేశ్వర్యా ః త్రిదశాది నుత
కచవర్ణ ద్వయ మయ సర్వజ్ఞాది దశశక్తి సమేత
మాలినీ చక్రేశ్వర్యా త్రిదశ వింశద్వర్ణ గర్భిణీ కుండలిన్యా ః ।
దశముద్రా సమారాధిత కౌళిన్యా ః ।
దశరధాదినుత గురుగుహ జనక శివబోధిన్యాః ।
దశకరణా వృత్తి మరీచి నిగర్భ యోగిన్యా ః ।　　　　॥శ్రీకమలా॥

శ్రీ చక్రమున షష్టమా వరణమునకు అంతర్దశారమని పేరు. దీనకి సర్వరక్షాకర

చక్రమని నామము కలదు. దీని తత్త్వము అగ్ని. అగ్నికి దశ కళలు. ఈ ఆవరణ దేవతలు పది మంది. వారు1. సర్వజ్ఞా, 2. సర్వశక్తి, 3. సర్వైశ్వర్య ప్రదాయిని, 4. సర్వజ్ఞానమయి, 5. సర్వ వ్యాధి వినాశిని, 6. సర్వాధార స్వరూపిణి, 7. సర్వేప్సిత ఫలప్రద, 8. సర్వపాపహర, 9. సర్వానందమయి, 10. సర్వరక్షా స్వరూపిణి. ఈ దేవతలను గర్భయోగినులు అందురు. ఈచక్రేశ్వరి త్రిపురమాలిని. పరదేవత యొక్క జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ విషయవృత్తులే సర్వజ్ఞాది శక్తి రూపములు. అగ్ని యొక్క పది కళలు - "1. ధూమ్ర, 2. ఊష్మ, 3. జ్వలినీ, 4. జ్వాలినీ, 5. విస్ఫులింగినీ, 6. సుశ్రీ, 7. సురూపా, 8. కపిలా, 9. హవ్యవాహిని, 10. కవ్యవాహిని"[1]. ఈ పది అగ్నికళలు ఆవరణ దేవతలుగా ప్రకాశించుచుండిరి. ఈ చక్రేశ్వరి త్రిపురమాలిని. దీని స్థాయిభావము క్రోధము. ఈ చక్రమున రసము రౌద్రము. దీని ప్రకృతి రేఫ. పూజాక్రమము వామావర్తము. దీని బీజం 'క్రోం'. ఈ తల్లి సంగీత రసిక, బ్రహ్మనాలుగు ముఖముల నుండి ఋక్, యజుర్, సామ, అధర్వ వేదములు ఉద్భవించినవి. ఉప వేదములైన ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వవేదము, స్థాపత్యము కూడా ఈ నాలుగు ముఖముల నుండి ఉద్భవించినవి. ఈ చక్రేశ్వరియైన త్రిపుర మాలిని హస్తములో పంచ పుష్ప బాణముల 1. కమలము, 2. తెల్లకలువ, 3. నల్లకలువ, 4. ఎఱ్ఱకలువ, 5. మామిడిపువ్వులను ధరించి యుండును. దీనికి ప్రమాణము -

"కమలం, కైరవం, రక్తం కల్హార, ఇందీవరేతథా
సహకారతో మిత్యుక్తం పుష్పపంచక మీశ్వరీ"[2]

ఇది పంచ పుష్పములు పంచ తన్మాత్రములు - శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు. ఇవి పంచభూతముల సూక్ష్మ రూపములు. ఈమె చేతిలోని పాశము భక్తులకు అనురాగమును, అంకుశము భక్తులకు జ్ఞాన రూపముగను దుష్టులకు క్రోధముగను గోచరించును. మధురమైన చెఱకు విల్లు క్రియాశక్తి. ఈ పంచ పుష్పములు బాణములై

1. అగ్నికళలు 10 - శ్రీ.దీ.కృ పుట 93
2. దీ. కృ. పుట. 92

మదన, ఉన్మాదన, మోహన, దీపన, శోషణ అను కృత్యములను నిర్వర్తించును. దీక్షితుల వారు "త్రిదశ వింశద్వర్ణ గర్భిణీ కుండ లిన్యా :" అనుటలో అంతర చక్రములైన మూలాధారము నుండి సహస్రారము వరకు వర్ణమాల యొక్క పంచశత్ వర్ణముల యందు కుండలినీ శక్తి సంచరించుచున్నదని సూచించిరి.

ముత్తుస్వామి దీక్షితుల వారు తాను కమలాంబ యొక్క భక్తుడననుచు షష్టావరణ కీర్తనను షష్టీ విభక్తిలో రచించిరి. ఈమె శంకరుని పత్ని. సుఖములు కలుగజేయునది. అష్టైశ్వర్యములను ఒసంగుటయే కాక చివరకు మోక్షమును కూడ నీయగలదు. ప్రతి అక్షర స్వరూపము, నాదరూపము ఆమెయే కనుక ఈమె సంగీత రసిక. అందుచే ఈమె "నారాయణీ నాదరూపా నామరూప వివర్జితా" [1] అని స్తుతింపబడినది. 'హే సంగీత రసికే' అని శ్యామలా దండకము నందును ప్రస్తుతి నొందినది. సుఖకరుడైన శంకరుని భార్యగా నున్న శ్రీదేవి శంకరి యగుచున్నది. సుఖము గలుగ జేయువాడుగాన శంకరుడు.

శ్లోకం :- "ప్రతి సర్గాది మద్యాంత మహం శంభుం నిరాకులం ।
స్త్రీ రూపేణాను యాస్యామి పాప్య దక్షాదహం ।
తనుం తతస్తు విష్ణు మాయం మాం యోగ నిద్రాం జగన్మయీం
శాంకరీతిస్తు విష్యంతి రుద్రాణీ తిదివౌకసః" [2]

అనగా ప్రతి సృష్టి, స్థితి లయము లందు నిరాకులుడైన శంభువును నేను స్త్రీ రూపముచే దక్షుని పుత్రిక దాక్షాయిణినై అనుసరింతును. అప్పుడు దేవతలు నన్ను విష్ణుమాయ, జగన్మయి, శాంకరి, రుద్రాణి అని కీర్తింతురు. ఈ శంకరి ఇహపర సుఖప్రదాయిని. శ్రీకరి విష్ణువునకు "శ్రీధరః శ్రీకరః శ్రీమాన్" అని నామములు విష్ణు సహస్ర నామమునందు కలవు. శ్రీదేవి విష్ణు సహోదరి. కనుక ఈమె 'శ్రీకర్యాః' అని పేర్కొనబడినది. "శాంకరీ శ్రీకరీ సాధ్వీ శర్చంద్ర నిభాననా" [3] అని ఈ పరదేవత లలితా

---

1. ల.స.స్తో. శ్లో. 70
2. దీ. కృ. పుట. 91
3. ల.స.స్తో.శ్లో. 43

సహస్రనామ స్తోత్రమున స్తుతింపబడినది. ఈ విధముగా దీక్షితుల వారు పల్లవిలో తన హృదయ కమలమునందే సమారాధితయైన, సహస్రారాంతర్గత సుధాసాగరము నందుండిన శివశక్తి స్వరూపిణి యైన కమలాంబను బహు విధములుగా స్తుతించిరి.

శుభప్రదమైన, మిక్కిలి మధురమైన వాక్కుగల పరమేశ్వరి పుష్ప బాణములు చెఱకు, విల్లు, పాశము, అంకుశము ధరించి యున్న శర్వాణి. ఈమె తుమ్మెదల సమూహమును జయించిన రమణీయమైన ముంగురులు కల సౌందర్యలహరి. ఈ అనుపల్లవి యందు పున్నాగవరాళి (తుమ్మెదల సమూహము) రాగనామమును దీక్షితుల వారు నిక్షేపించిరి.

"శబ్ద స్పర్శ రూప రసగంధాః పంచతన్మాత్ర పంచపుష్పబాణాః"[1]

శ్రీదేవి హస్తమున ఐదు పుష్ప బాణములను ధరించి యున్నది. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను పంచభూత దర్మములైదును ఆ పుష్పబాణములైనవి. ఆ పుష్పములు, తామరపువ్వు, అశోకపుష్పము, మామిడి పువ్వు, మల్లె పువ్వు, నల్లకలువ.

"మనో ఇక్షుధనుః వశ్యోబాణః పాశో ద్వేషోఙ్కుశః"[2]

శ్రీదేవి చేతియందున్న చెఱకువిల్లు సాధకుని మనస్సు. వశ్యతబాణము, అనురాగము పాశము. ద్వేషము అంకుశము అని భావనోపనిషత్తు నందు పేర్కొనబడినది. శ్రీదేవి యొక్క ఇక్షుకోదండము మనోరూపమైనది. పంచపుష్ప బాణములు, పంచతన్మాత్రలు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను సూక్ష్మరూపములు. ఈ పంచతాన్మాత్రలు పుష్పబాణములై మదన, ఉన్మదన, మోహన, దీపన, శోషణ, కృత్యములును కలిగించుచున్నవి.

ఇక్షుకోదండము సంకల్ప వికల్పాత్మాకమైన క్రియారూపమైన మనస్సు. ఇది శ్రీదేవి వామ ఊర్ధ్వ హస్తమునున్నది. రాగమనగా ప్రేమ, అనురాగము, మనోవ్యాపార విశేషము, కోరిక, ఆశ, రాగమే తన యొక్క వాసనామయమైన రూపమగు పాశముగా నున్నది. క్రోధమన

1. శ్రీ.చ.వి.మూ.శ్లో. 20 పుట.156

2. శ్రీ.చ.వి.మూ.శ్లో. 21 పుట. 157

ద్వేషమను పేరుగల చిత్తవృత్తి. ఇదియును శ్రీదేవికి అంకుశ రూపమైన ఆయుధముగా నున్నది. ఈ పంచతన్మాత్రలు తంత్రరాజమను గంధమున వాసనాపటలమున, "మనస్సు చెఱకు విల్లు, ఇచ్ఛ యన కోరికయే పాశము, ద్వేషమే అంకుశము, పుష్పబాణములుగా" చెప్పబడినవి. మరియు ఈ లలితా పరా భట్టారికను స్తోత్రము చేయుచు -

"రాగస్వరూప పాశాఢ్యా క్రోధాకారాంకుశోజ్జ్వలా
మనోరూపేక్షు కోదండా పంచతన్మాత్ర సాయకా"[1] - అని నుతింపబడినది.

"సకుంకుమ విలేపనా మళికాచుమ్బి కస్తూరికాం
సమందహసితేక్షణాం సశరచాప పాశాంకుశాం
అశేష జన మోహినీ మరుణమాల్య భూషోజ్జ్వలాం
జపాకుసుమ భాసురాం జపవిధౌస్మరే దమ్బికామ్"

అను శ్రీదేవి ధ్యాన శ్లోకములలో ప్రసిద్ధమైన శ్లోకమొకటి స్ఫురణకు వచ్చును. దీక్షితుల వారు ధ్యానము చేయునపుడు మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత చక్రములను దాటి విశుద్ధిచక్రము నందు ఆ భగవతిని దర్శించినపుడు తాను పొందిన ఆనందానుభవము నంతను ఈ కీర్తన యందు పొందుపరిచిరి.

ఆరవ ఆవరణమైన అంతర్దశారమున సర్వరక్షాకర చక్రేశ్వరి అగ్ని స్వరూపమైన దశకళలతో మిక్కిలి ప్రకాశవంతమై ఉన్నది. ఈ దశ కళల నామములు ముందు పేర్కొని యుంటిని. ఈ అగ్ని యొక్క దశ కళలు యీ పది ఆవరణ దేవతలుగా ప్రకాశించుచున్నారు. ఈ అంతర్దశారము పది కోణములను కలిగియున్నది. ఈ ఆవరణ అధిష్ఠాన దేవతయైన త్రిపుర మాలిని, సర్వజ్ఞాది (పైన పేర్కొనిన) దశ శక్తులతో కూడిన గర్భయోగినీ దేవతలు ముల్లోకముల యందుండెడి దేవతల చేత నుతింపబడిరి. ఈ గర్భయోగినీ దేవతలే కవర్గము (కఖగఘఙ), చవర్గము (చఛజఝఞ) మూల స్వరూపిణులు అను విషయమును దీక్షితుల వారు "త్రిదశా దినుతకచవర్గ ద్వయ సర్వజ్ఞాది, దశశక్తి సమేత మాలినీ చక్రేశ్వరాః" అని పేర్కొనుటలో సూచితమగుచున్నది. శ్రీ చక్రము సోమసూర్యాగ్ని ఖండత్రయ యుక్తము.

1. ల.స.స్తో.శ్లో. 3

చంద్రునకు పదునారు కళలు, సూర్యునకు ఇరువది నాల్గు కళలు, అగ్నికి పది కళలు. మొత్తము ఏబడి కళలు. ఇవి పంచాశ ద్వర్ణాత్మకములు. అకారాది క్షకారాంత వర్ణరూపములు.

శ్లో:- "షోడశేందోః కళాభావేర్ద్వి ర్ద్వాదశ దశానలే ।

సాపంచాశత్కలా జ్ఞేయా మాతృకా చక్రరూపిణీ"[1]

ఈ ఏబది కళలు కలసి మాతృకా చక్రరూపిణి యగు పాదాఖ్య కళ. ఏబది కళలును ఏబది వర్ణములు. చంద్రకళలోని నిత్యాకళగాక మిగిలిన 15 కళలలో అంతర్భూతములే. ఇవియే పంచదశీ మంత్రాక్షరములు. అనగా పంచాశద్వర్ణములు. షోడశ నిత్యాంతర్భూతములు. ఈ విధముగా ఏబది కళలు శ్రీచక్రమునకు, మంత్రమునకు ఐక్యతానుసంధానము. ఇది పూర్ణోదయ మతమని చెప్పబడుచున్నది. త్రిదశాది వింశద్వర్ణ త్రిదశ - ముప్పది, వింశద్వర్ణ - ఇరువది వర్ణములు. దీనినే మాతృక అందురు. అనగా అకారాది క్షకారాంత వర్ణములు. ఈ 30+20=50 పంచాశత్ వర్ణములలో గల కుండలినీ శక్తి స్వరూపిణి సంచరించుచున్నది. కౌళినీ యనగా కుల సంబంధ పరాశక్తి. ఈ పరదేవత శ్రీవిద్య యందు ముఖ్యమైన సర్వసంక్షోభిణి, సర్వవిద్రావిణి, సర్వాకర్షిణి, సర్వవశంకరి, సర్వోన్మాదిని, సర్వమహాంకుశ, సర్వఖేచరి, సర్వబీజ, సర్వయోని, సర్వత్రిఖండి అను పదిమంది ముద్రాది దేవతలచేత ఆరాధింపబడునది. ఈ దేవత నామములన్నియు దేవీ ఖడ్గమాల యందు కలవు. దశరథాదులచే నుతింపబడిన ఈమె అజ్ఞానమును పారద్రోలి జ్ఞానమును కలుగ జేయునది. సద్గురుగుహుడైన కుమారస్వామికి శివతత్త్వమును బోధింపచేయునది. శివతత్త్వమునందు శక్తితత్త్వము అంతర్భూతముగా నుండును. స్పందశక్తియగు విమర్శన శక్తి వలన శివజ్ఞానము, బ్రహ్మజ్ఞానము, స్వస్వరూప జ్ఞానము కలుగుచున్నందున అట్టి జ్ఞానమును ప్రసాదించును.

"స్పందన లక్ష్యతే వాయుర్వహ్ని రౌష్ణ్యేన లక్ష్యతే

చిన్మాత్ర మమలం శాంతం శివ ఇత్యాది తంతుయత్,[2]

తత్స్పంద మయ శక్త్యైవ లక్ష్యతే నాన్యథాకిల"[1] అని యోగవాసిష్ఠమున కలదు.

---

1. శ్రీ శా. చ. శ్లో. 1 పుట 20
2. శ్రీ దీ. కృ. పుట. 94.

"దశకరణావృత్తి మారీచి నిగర్భయోగిన్యాః" - అనగా జ్ఞానేంద్రియ కర్మేంద్రియముల వ్యాపారమనెడి కిరణరూపముగ గర్భ యోగినులు ఆ పరదేవతను సేవించుచుండిరని దీక్షితుల వారు చరణములో ఉద్ఘాటించిరి. చరణములో 'గురుగుహ' ముద్ర కలదు.

★★★

## 8వ కీర్తన సప్తమావరణము

శహన రాగము త్రిపుటతాళము

28.వ.మేళకర్త జన్యము

పల్లవిః- శ్రీ కమలాంబికాయాం భక్తిం కరోమి

శ్రితకల్ప వాటికాయం చండికాయాం జగదంబికాయం। ॥శ్రీ కమలా॥

అ॥ప॥ః- రాకాచంద్ర వదనాయాం రాజీవ నయనాయం

పాకారి నుత చరణాయ మాకాశాది కిరణాయాం

హ్రీంకార విపిన హరిణ్యాం హ్రీంకారసు శరీరిణ్యాం

హ్రీంకార తరుమంజర్యాం హ్రీంకారేశ్వర్యాం గౌర్యాం ॥శ్రీ కమలా॥

చరణముః- శరీరత్రయ విలక్షణ సుఖతర స్వాత్మానుభోగిన్యాం

విరించి హరీశాన హరిహయ వేదితరహస్య యోగిన్యాం

పరాదివాగ్దేవతా రూప వశిన్యాదివిభాగిన్యాం

చరాత్మక సర్వరోగహర నిరామయ రాజయోగిన్యాం

కరధృత వీణావాదిన్యాం కమలానగర వినోదిన్యాం

సురవరముని జన మోదిన్యాం గురుగుహ వర ప్రసాదిన్యాం ॥శ్రీ కమలా॥

ముత్తుస్వామి దీక్షితుల వారు సప్తమావరణ కీర్తనను సప్తమీ విభక్తిలో రచించిరి. అష్టకోణాత్మకమైన ఈ చక్రమును సర్వరోగహర చక్రము అందురు. కకార ప్రకృతికము. పూజామార్గము సవ్యమార్గము. తత్త్వము ప్రకృత్యాష్టకము. స్థాయీ భావము హాసము.

రసము హాస్యరసము. అష్టవిధములైన ప్రకృతి ఆకారము కలిగి ఎనమండుగురు దేవతలు కలరు. వారు వాగ్దేవతలు. 1. వశిని, 2. కామేశ్వరి, 3. మోదిని, 4. విమల, 5. అరుణ, 6. జయిని, 7. కౌళిని, 8. సర్వేశ్వరి. వీరు సంధ్యారాగమైన అరుణ కాంతి దేహముతో రహస్యయోగినులుగా పేర్కొనబడుచున్నారు. ఈ ఎనిమిది మంది దేవతులు అ-క-చ-ట-త-ప-య-శ అను వర్గాది వర్ణ స్వరూపములు. ఈ చక్రేశ్వరి త్రిపురాసిద్ధాంబ. సంవిద్రూప పరదేవత యొక్క మనో, బుద్ధ్యహంకారములు, పంచభూతములు కలసి ఎనిమిదియు అష్టకోణ స్వరూపావస్థితములు. ఈ వసిన్యాది ఎనిమిది మంది దేవతలలో వశిని - శీతలమునకు, కామేశ్వరి - ఉష్ణమునకు, మోదిని - సుఖమునకు, విమల - దుఃఖమునకు, అరుణ - ఇచ్ఛకును, జయిని - సత్వగుణమునకు, సర్వేశ్వరి - రజోగుణమునకు, కౌళిని - తమస్సునకును అధిదేవతలు. పరదేవత స్థూల, సూక్ష్మ కారణ శరీరములకు అతీతమైన తురీయావస్థను ప్రసాదించును. పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి మొదలగు వాక్కులే ఈ వశిన్యాది దేవతలు.

"శ్రీ రూపా యాకలా నిత్యాసర్వేషాం ప్రాణ రూపిణీ
పూర్ణ పరా పరా కారా పాపాయాచ్ఛార దాప్పికా"[1]

"ఏ కళ శ్రీదేవి స్వరూపముగా నున్నదో, ఏది సకల జనుల యందు జీవ ప్రాణాది సంజ్ఞలు కలిగి యున్నదో, ఏది సర్వ పరిపూర్ణముగా అంతటనూ వ్యాపించియున్నదో అట్టి పరదేవత మమ్ము రక్షించును". అట్టి నిశ్చయజ్ఞానముతో దీక్షితుల వారు ఈ సప్తమా వరణ కీర్తనయందు శ్రీ కమలాంబిక యందు భక్తిని కలిగి యుంటినని పేర్కొనిరి. ఈ చక్రేశ్వరి యైన త్రిపుర సిద్ధాంబ షోడశకళా పరిపూర్ణతను గలిగి ఆశ్రితులకు కల్ప వక్షము వంటిది. అనగా సకల భోగ, భాగ్య, మోక్షములనొసంగునది. దుష్టశక్తులను చండాడుట యందు నిపుణతరమైన కరము కలిగిన చండికయే ఈ కమలాంబిక. జగద్విలసమునకు హేతువైన సృష్టి, స్థితి, లయ కారకులు అనగా బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వరులకు తల్లి యైనటువంటి ఈమె జగదంబిక. జగత్తునకు తల్లి. ఈమె పూర్ణ చంద్రుని వంటి మోమును.

1. శ్రీ.శా.చా.స్త.శ్లో. 1. పుట 20

పద్మదళముల వంటి నేత్రములును కలది. కనుక ఈమె నయన కిరణముల యొక్క కాంతి పూర్ణ చంద్రుని కంటె ప్రసన్నతను, చల్లదనమును కలిగియున్నవి. ఆ కిరణములను త్రిలోకముల యందు గల చరాచరాసృష్టి యందున్న సకల ప్రాణికోటి సమూహమునందు ప్రసరింపచేయు వాత్సల్యప్రదాయిని. శ్రీదేవి ఇంద్రాది దేవతలచే నుతింపబడు పాదములను గలది. మరియు ఆకాశాది పంచ భూతములు కిరణములుగా కలది. మాయా బీజమైన 'హ్రీంకారము' అను మాయా బీజాధిష్ఠాత్రి."హ్రీంకార విపిని హారిణ్యాం - హ్రీంకార సుశరీరిణ్యాం, హ్రీంకార తురుమంజర్యాం - హ్రీంకారేశ్వర్యాం గౌర్యాం" అనిన హ్రీంకారము భువనేశ్వరీ మంత్రబీజము. జగన్మాత తన్మంత్ర మహాపద్మాటవీ మధ్య లేడివలె సంచరించును. అనగా లేడి అడవిలో స్వేచ్ఛగా సంచరించునట్లు సృష్టి, స్థితి, లయ ధర్మములు గల ఈ బ్రహ్మాండమే అరణ్యమనియు అట్టి ఈ బ్రహ్మాండమున అంతర్యామిగా సంచరించునది ఈ కమలాంబ. హ్రీంకారమే ఆమె శరీరము. హ్రీంకారమునకు ఈశ్వరి. గౌరీశబ్ద వాచ్యురాలైన ఈమె కన్యాకుబ్జంలో ప్రతిష్ఠింపబడిన అమ్మవారు. "కన్యాకుబ్జే తథాగౌరీ". దక్షుని యజ్ఞశాలలో యోగాగ్నితో శరీరము త్యాగము చేసిన దాక్షాయిణి. హిమవంతునకు శంఖారావము, మల్లికాపుష్పములతో ఆవిర్భవించిన ఆమె గౌరి. హ్రీంకారమునకు ఈశ్వరి హ్రీంకారముతో శ్రీ లలితా త్రిశతీ నామములు సుమారు అరవై వరకు గలవు. ఈ హ్రీంకారము శివశక్తి సమ్మిళితమైనది. ఈ పరదేవత - లలితా త్రిశతి స్తోత్రమునందు -

"హ్రీఙ్కారవేద్యా హ్రీఙ్కార చిన్త్యా హ్రీం హ్రీం శరీరిణీ"[1]

"హ్రీఙ్కారారణ్య హరిణీ హ్రీఙ్కారావాల వల్లరీ"[2] - స్తుతింపబడినది.

శరీరత్రయ విలక్షణ సుఖతర స్వాత్మాను భోగిన్యాం ఇవి నిర్గుణ నామములు. మానవ శరీరము మూడు విధములుగా వ్యవహరింపబడుచున్నది. 1. స్థూల శరీరము-లోక వ్యవహారమును సూచించును, 2. సూక్ష్మ శరీరము -స్వప్నమున వ్యవహరించును,

1. ల.త్రి.స్తో.పా. 19

2. ల.త్రి.స్తో.పా 41

3. కారణ శరీరము సుషుప్తిలో వ్యవహరించును. స్వప్నాదులు లేని గాఢనిద్రావస్థ సుషుప్తి. ఈ స్థూల సూక్ష్మ కారణ శరీరత్రయము లన్నింటిలోను విలక్షణమైన ఆనందానుభవమును ప్రసాదించు అపరోక్షనుభూతి స్వరూపిణి. మానవునకు ఆత్మజ్ఞానము కలిగినపుడు సుఖతరమైన బ్రహ్మానందమును అనుభవించును. ఈకమలాంబిక బ్రహ్మ, విష్ణు, ఈశ్వర, ఇంద్రాదులచేత తెలుపబడిన రహస్య యోగినీ స్వరూపము కలది. ఈ సర్వరోగహర చక్రమునకు యోగిని - రహస్య యోగిని అనుదానిని చరణములో దీక్షితుల వారు 'విరించి హరిశాన హరిహయ వేదిత రహస్య యోగినీ' అని పేర్కొనిరి. ఇవి సగుణ నిరాకార నామములు. వాక్కు, పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరి అని చతుర్విధములు. వశిన్యాది అష్టదేవతలు, సప్తమావరణము నందున్న వాగ్దేవతలు. పరాపశ్యంతాది చతుర్విధ వాక్కులు అష్టవిధవశిన్యాది వాగ్దేవతారూపముననున్నవి. అనగా ఆ దేవతలు పరమేశ్వరి యొక్క భాగములే కాని వేరు కాదు. చరాచరాత్మకమైన సర్వరోగములను (సాంసారిక రోగములను) హరించే నిరామయమైన విద్యాస్వరూపిణి చిచ్ఛక్తి. శ్రీకమలాంబ రాజయోగ స్వరూపిణి. యోగములు 2 విధములు.

1. రాజయోగము - ఇదియే జ్ఞాన యోగము, ముక్తి సాధన.

2. హఠయోగము - ఇది శరీరమునకు సంబంధించిన ఫలములు గలది.

ముక్తి సాధన చేసి సుఖదుఃఖముల కతీతమైన జ్ఞానయోగమును పొంది ఆనందము పొందుటయే రాజయోగము. ఈ కమలాంబిక సర్వరోగహర చక్రవాసిని అని మరియొక భావన. శ్రీదేవి రాజశ్యామల రూపమున వీణా వాదనము చేయుచు కమలానగరము నందు వినోదముగా నున్నది. ఈ శ్యామలను ఉపాసించువారు సంగీత విద్యలో నిష్ణాతులగుదురు. మంత్రశాస్త్రమున విశిష్టస్థానమునలంకరించిన ఈ శ్యామలాంబలు ఎనమండుగురు. వీరు రాజశ్యామల, పరశ్యామల, శారికశ్యామల, లఘుశ్యామల, వీణాశ్యామల, శ్రీవేణిశ్యామల, శ్రీహంసవతీశ్యామల, మహాశ్యామల. వీరు కమలాంబకు మంత్రిణులు. ఈమె దేవతలకు, మానవులకు మునిజనులకు సంతోషమును కలిగించునది. గురుగుహుడైన కుమారస్వామికి వరముల నిచ్చు కమలాంబిక యందు

భక్తిని కలిగియుంటినని దీక్షితుల వారు సప్తమావరణ కీర్తన యందు వివరించిరి. చరణములో గల 'విరించి హరీశాన' అను పదములో 'శహన' రాగపదమున్నదని కొందఱి అభిప్రాయము. ఈ కీర్తనలో దీక్షితుల వారు శ్రీదేవికి సగుణ సాకార నామములు - 'రాకాచంద్ర వదనా' - 'రాజీవనయనా' - 'పాకారినుత చరణా' - 'కరధృత వీణా వాదినీ', - 'కమలా నగర వినోదినీ' -'సురవర మునిజన మోదినీ' - 'చండికా' - 'గౌరి'- 'జగదింబికా' - కలవు. ఇవియే కాక సగుణ నిరాకార నామములు, నిర్గుణ నామములతో శ్రీచక్ర సంబంధ మంత్రశాస్త్ర విషయములను సూచించు పెక్కు నామములను ఇందు నిక్షేపించిరి.

★★★

## 9వ కీర్తన అష్టమావరణము

ఘంటా రాగము — ఆదితాళము


8.వ మేళకర్త జన్యం

పల్లవిః- శ్రీకమలాంబికే అవావ శివే । కరధృత శుకశారికే । ॥శ్రీ కమలా॥

అ॥ప॥ః- లోకపాలిని, కపాలిని, శూలిని, లోకజనని, భగమాలిని ।
సకృదాలోకయ, మాం, సర్వసిద్ధి ప్రదాయికే ।
త్రిపురాంబికే బాలాంబికే । ॥శ్రీ కమలా॥

చరణముః- సంతప్త హేమసన్నిభ దేహే । సదా అఖండైక రసప్రభావే ।
సంతాప హరత్రికోణ గేహే । సకామేశ్వరీ శక్తి సమూహే ।
సంతతం ముక్తి ఘంటామణి । ఘోషాయ మాన కవాటద్వారే ।
అనంత గురుగుహ విదితే । కరాంగుళి నఖోదయ ।
విష్ణు దశావతారే అంతఃకరణేక్షుకార్ముక ।
శబ్దాది పంచతన్మాత్ర విశిఖాత్యంత।
రాగపాశద్వేషాంకుశ ధరకరే ।
అతి రహస్య యోగినీ పరే। ॥శ్రీకమలా॥

ఇది ఎనిమిదవ ఆవరణకు సంబంధించిన కీర్తన. ఈ కీర్తనను సప్తమీ విభక్తి తరువాత చెప్పబడు సంబోధన ప్రథమావిభక్తి యందు దీక్షితుల వారు రచించిరి. శ్రీచక్రమున అష్టమావరణమునకు త్రికోణ చక్రమని పేరు. దీని యొక్క మూడు కోణముల యందును మూడు బిందువులు కలవు. దీని ఆకారము త్రికోణాకారము. త్రికోణముల మధ్యలో నొక బిందువుండును. దానిని సంవిద్బిందువు అందురు




ఆ ప్రథమ బిందువు ఓడ్యాణ పీఠము. అందు కామేశ్వరీ కామేశ్వరులు విహరింతురు. ఆది ద్వంద్వము. సృష్ట్యాదిని విలాసార్థముగా సత్వాది గుణ భేదములను అనుసరించి మూడు ద్వంద్వములుగా త్రికోణ బిందువు లందు ప్రకాశించుచున్నది. ఉత్తరకోణస్థ బిందువు జాలంధర పీఠము (ఐం) ఇచట నున్న తత్త్వము మహా కామేశ్వరి, శ్రీమదూర్ధ్వనాథుడు. వీరు సోమరాజు బీజాధిపతులైన ఉమామహేశ్వరులు, 2. దక్షిణ కోణస్థ బిందువు పూర్ణగిరి పీఠము (క్లీం) ఆ ద్వంద్వము మహావజ్రేశ్వరి, షష్ఠీశ దేవనాదాత్మకము. వీరు కామరాజ బీజాధిష్ఠాతులైన లక్ష్మీనారాయణులు, 3. స్వాగ్ర కోణస్థ బిందువు కామగిరి పీఠము (సౌః) వీరు వాగ్భవ పీఠాధిపతులైన వాణీ హిరణ్య గర్భులు. ఈ ద్వంద్వము భగమాలినీ మిత్రేశ దేవనాథాత్మకము.

"సితశోణ బిందు యుగళం వివిక్త శివశక్తి సంకుచ ప్రసరమ్,

వాగర్థ సృష్టి హేతుః పరస్పరాను ప్రవిష్ఠ విస్పష్టః"[1]

బిందుత్రయమును గూర్చి అన్యోన్య విహార స్వభావము గల శివశక్తి స్వరూపము ముకుళీభూతమైన అంకురము కలదియు, నామరూపముల సృష్టిహేతువైనదియు, పరస్పర

1. కా.క.వి.సూ.6 పుట 22

అన్యోన్య సమ్మేళనముచే పృథగ్భూతమైన రక్త శుక్ల సమ్మేళన సంపుటము సర్వోత్కర్షముగా వర్తించుచున్నది. త్రిపుట్యావిర్భావము బీజత్రయోత్పత్తిని గూర్చి -

"వాగర్థౌ నిత్యయుతౌ పరస్పరం శక్తి శివ మయావేతౌ,

సృష్టిస్థితిలయ భేదౌ త్రిధా విభక్తౌ త్రిబీజ రూపేణ"[1]

రక్త శుక్ల బిందువులు మూడు విభాగములుగా విభజింపబడినవి. ఇవి వాగ్భవ కామరాజ శక్తి బీజ రూపము చేతను సృష్టి స్థితి లయములను భేదము కలవై, వాగర్థ రూపములై పరస్పరము సర్వదా మేళన స్వరూపములు గలవి అగుచున్నవి. ప్రకాశ విమర్శాత్మకమైన అన్యోన్య మేళన రూపమగు వేదాది ద్వంద్వము చేతనే మూడు విధములుగా భేదమును పొందెనని రహస్యార్థము.

త్రికోణాకృతిలో నుండు ఈ చక్రమునకు సర్వసిద్ధి ప్రదచక్రమని నామము. ఇది నాద ప్రకృతిని కల్గి బ్రహ్మత్వమును ఎఱుగుటకు జీవబ్రహ్మైక్యాను సంధానమును సంపాదించుటకు సాధకమైనది. మహా కామేశ్వరి, మహా వజ్రేశ్వరి, భగమాలిని ఈ త్రికోణ దేవతలు. తత్త్వం గుణత్రయము. పూజాక్రమం ప్రాదక్షిణ్య చక్రేశ్వరి త్రిపురాంబ. ఈ ఆవరణ దేవతలే అతి రహస్య యోగినులు. ఈ దేవత ముద్ర సర్వబీజము. ముద్రాబీజము హ్సౌః స్థాయీభావము విస్మయము. రసము అద్భుతము. చక్రదేవతా నామము కామేశ్వరాదులు. శ్రీ పరాదేవి శారీరక విరాట్టునందు అవ్యక్త మహత్తత్త్వాహంకారములే ద్వంద్వత్రయము. ఇక్కడ వామవర్తముగా ఐం, క్లీం, సౌః బీజన్యాసము.

"ఓడ్యాణ పీఠ నిలయా బిందు మణ్డల వాసినీ"[2] యైన ఈ పరాశక్తి త్రికోణమే గృహముగా చేసికొని మానవుని ఆది భౌతిక, ఆది దైవిక, ఆధ్యాత్మిక తాపత్రయములను పోగొట్టును. ఈమె మోక్షమునకై తపించు యోగులకు గణ గణ మని మ్రోగుచున్న గంటల యొక్క మోక్ష కవాట ద్వారమున నిలచి స్వాగతము పలుకును. అనగా ఘంటానాదము చేయుచు "ఓ మానవులారా! ఈ సంసార తాపత్రయము త్యజించి అంతర్ముఖులు కావలె"నని

1. కా.క.వి.సూ. 12 పుట. 69

2. ల.స.స్తో.పా. 83

సూచించును. దీక్షితుల వారు యోగ నిమగ్నులై శ్రీ చక్రము నందు గల సప్తావరణములను అర్చించి అష్టమావరణము నందుండు ఈ ఘంటానాదమును విని ఆయాదేవతా సమూహమును దర్శించి, ఈ ఆవరణ యొక్క విశిష్టతను ఘంటారాగమున రచించుటకు కారణమై యుండును.

"హినస్తి దైత్య తేజాంసి స్వనేనా పూర్య్వయా జగత్

సౌ ఘంటాపాతునో దేవీ పాసేభ్యోనః సుతానన"[1]

ఓ తల్లీ! ఏ గంటలైతే గణ గణమని మ్రోగి దైత్యులను హతమార్చినదో ఆ గంటే మమ్ము కన్నతల్లి తన బిడ్డలను రక్షించినట్లు రక్షించుగాక అని దుర్గాసప్తశతిలో కలదు.

దీక్షితుల వారు ఈ కీర్తనను ఏకాక్షర బీజమైన 'శ్రీం' బీజముతో ప్రారంభించి "కమలాంబికే", "అవానశివే", "కరధృత శుకశారికే" అని పల్లవిలో పేర్కొనిరి. 'క' అన్న అక్షరము బ్రహ్మమునకు అనగా సదాశివునకు, 'కా' అన్న అక్షరము శక్తికి, మాయకు ప్రతీక. బ్రహ్మము 'క', 'కః' అనగా బ్రహ్మ ప్రథమా విభక్తి అకారాంతము. 'క' అన్నచో 'క' శబ్దము యొక్క సంబోధన. 'క' అనగా ఓ! బ్రహ్మమా అని. 'కే' అన్నది 'క' అన్న అకారాంత స్త్రీలింగము యొక్క సంబోధనాప్రథమా విభక్తి రూపము. ఆమె 'కే' అని అగుచున్నది. అమ్మవారిని సంబోధించుటకు ఈరీతిగా 'క'కారమునకు 'కే'కార అనుప్రాస అమ్మవారి సంబోధనము లోని పరిపూర్ణత్వమును స్ఫురింపజేయుచున్నది. దీనికి ఆధారమేమనగా శ్రీవిద్యాభావము. శివే అనుటలో అమ్మవారి సంబోధనలోని అద్వైతమును చెప్పుచున్నది. శివే-శివా-వశము, కాంతి శివుడు. కాంతియన ఇచ్ఛ. పరమశివుని ఇచ్ఛారూపము దేవి. ఇచ్ఛారూపమైన శక్తికి శివుడే ఆధారము. శివునితో భేదము లేనిది శివా. అన్నియు ఆమె యందు విశ్రాంతి పొందు చున్నవి కనుక 'శివా'. ఈమె యందు మంగళకరగుణములు గలవు గాన శివా. 'జైనేంద్ర' వ్యాకరణమున 'శివాదదుశ్చ' అనుసూత్రమునకు సకల భూతములకు మేలుచేయునది శివా అని సభూతిచంద్రుడు వ్యాఖ్యానించెను. ఇచట దీక్షితులవారు అవాన శివే అని శివశక్తులకు అబేధము లేదని నామ సామ్యమును చెప్పిరి.

---

1. దుర్గా సప్తసతి

శివ స్వరూపము ప్రకాశ విమర్శాత్మకము. జ్ఞానాత్మకము. మాయాతీతమైన చిద్రూపము. శివే-ఓ శివా! ఈ పరదేవత చేతి యందు శుకము-చిలుకను ధరించినది. శారికమును మరియొక చేతియందు ధరించు దేవి. శ్యామలా మూర్తి అష్టవిధములు. మంత్ర శాస్త్రమున "శ్యామల" ప్రసిద్ధము. ఈమె మంత్రిణ్యంబయని తాంత్రజ్ఞులు చెప్పుదురు

1. శ్రీలఘుశ్యామలాంబ, 2. శ్రీవేణుశ్యామలాంబ, 3. శ్రీవీణాశ్యామలాంబ 4. శ్రీశారికాశ్యామలాంబ 5. శ్రీశుకశ్యామలాంబ, 6. శ్రీరాజశ్యామలాంబ, 7. హసంతిశ్యామలాంబ, 8. మహాశ్యామలాంబ-వీరు అష్టవిధశ్యామలాంబ మూర్తులు.

అనుపల్లవి యందు దీక్షితులవారు శ్రీవిద్యాస్వరూపిణియైన ఆ పరదేవతను బాలాంబికే, త్రిపురాంబికే అనుటలో ఆ దేవి త్రిపురములకు తల్లియని ఈ చక్రేశ్వరి త్రిపురాంబ అని పేర్కొనిరి. మరియు బాలాంబికే అనుట బాలామంత్రబీజములు మూడును ఈ అష్టమావరణ త్రికోణమునందున్నదని సూచించిరి. అవి వాగ్భవబీజము, మన్మధ బీజము, సోమరాజ బీజములు. అందువలన సమష్టి ఆవరణ త్రికోణ చక్రము బాలాంబరూపమే.

ఈ బాలమంత్రము "ఐం-క్లీం-సౌః" అనే మూడు బీజములు కలది. 'ఐం' అనే ప్రథమ బీజము నందు "అ-ఈ-అం" అను మూడు బీజములు గలవు. ఇవి క్రమముగా ఋగ్యజుస్సామ వేదత్రయమును తెలుపుచున్నవి. సమష్టి బీజము. వేదత్రయరూపము - వాణీహిరణ్యగర్భ శివశక్తి స్వరూపముగా నున్నది. 'క్లీం' అను రెండవ బీజము నందు క-ల-ఈ- బిందువులున్నవి. కకారబిందువులు రెండు పుంరూపములు కనుక విష్ణుస్వరూపములు. లకార ఈకారములు స్త్రీరూపములుగాన లక్ష్మీస్వరూపములు. ఇది సర్వసమష్టిబీజము. లక్ష్మీనారాయణాత్మకము. 'సౌః' అను మూడవ బీజమునందు స-ఔ-విసర్గలున్నవి. కనుక శివశక్త్యాత్మకముగా ఉన్నది. ఈ మంత్రము ఉత్పత్తి మూడు బీజములైనను అనులోమ విలోమముగా ఆరు బీజములుగా ఉపాసన చేయుట శిష్టాచారము. నేను బ్రహ్మస్వరూపమునైతిని. బ్రహ్మమే నేనైతిని అని సమష్టి మంత్ర తాత్పర్యము. దీనిని దీక్షితులవారు తన ఉపాసనలో గ్రహించి ఆ బాలాంబికను దర్శించి ఆమెను లోకపాలిని, కపాలిని, శూలిని, లోక జనని అని ఆ తల్లిని స్తుతించిరి.

ఈమె త్రిలోకములకు తల్లి కనుక లోక జనని. ఈ లోకములను పాలించునది కనుక ఆమె లోకపాలిని. శివశక్తులకు అభేదము లేదు కనుక చేతి యందు కపాలమును శూలమును ధరించినది. శివనామములే శక్తికినివాడి నామసామ్యమును చూపిరి. ఈ భగమాలిని-పదునైదు తిథులు పదునైదు నిత్య రూపములను ధరించి శ్రీచక్రమున వసించియున్న శ్రీదేవిని సేవించుచున్నది. అందు భగమాలిని శుక్లపక్షమున ద్వితీయ, కృష్ణ పక్షమున చతుర్దశి నామసామ్యమును చూపిరి. దీక్షితులవారు వాడిన ప్రతిదళమునందు శివశక్తితత్త్వము ప్రస్ఫుటముగా గోచరించును. దీక్షితులవారు సర్వసిద్ధుల నిచ్చుటయందు నిపుణతను కలిగిన ఆ పరాశక్తిని 'సకృదాలోకయ మాం' అనుటలో ఒక పర్యాయము తనను చూడుమని ప్రార్థించిరి.

చరణములో దీక్షితులవారు త్రిపురాంబ శుద్ధిచేయబడిన బంగారముతో సమానమైన దేహచ్ఛాయ కలది అని ఎల్లప్పుడు అఖండైకరస పూర్ణానంద స్థితిలో ఉండునదని పేర్కొనిరి. అనగా విభజించుటకు వీలులేనటువంటి ఏకైక ఆనంద ప్రవాహము కలిగినటువంటిది. ఈ ఆనందము స్వానుభవైకవేద్యము.

సకల గుణ, ధన, వివేక, విద్యా, యౌవన సంపన్నుడైన చక్రవర్తి ఆనందమును మనుష్యానందమందురు.

ఆ మనుష్యానందమునకు వంద రెట్లు - మనుష్య గంధర్వానందము

ఆ మనుష్య గంధర్వానందమునకు వంద రెట్లు - దేవగంధర్వానందము

ఆ దేవగంధర్వానందమునకు వంద రెట్లు - పితృదేవతానందము

ఆ పితృదేవతానందమునకు వంద రెట్లు - అజానజా దేవానందము

ఆ అజానజా దేవనందమునకు వంద రెట్లు - కర్మదేవతానందము

ఆ కర్మదేవతానందమునకు వంద రెట్లు - దేవానందము

ఆ దేవానందమునకు వంద రెట్లు - దేవేంద్రుని ఆనందము

ఆ దేవేంద్రుని ఆనందమునకు వంద రెట్లు - బృహస్పతి ఆనందము

ఆ బృహస్పతి ఆనందమునకు వంద రెట్లు - ప్రజాపత్యానందము

ఆ ప్రజాపత్యానందమునకు వంద రెట్లు - బ్రహ్మానందము

బ్రహ్మ-పరబ్రహ్మ వేరు వేరు స్వరూపములు. ఆ బ్రహ్మానందమును అంతవరకే ఉపనిషత్తులు పేర్కొనినవి. అంతకు మించిన పరమేశ్వరీ ఆనందము భావించుటకు వీలుకానిది. అందువలన ఆమె అఖండైక రసపూర్ణత్వము కలిగినది. అందువలన దీక్షితులవారు ఆమెని 'సదా అఖండైక రసప్రభావే' అని స్తుతించిరి. అంతేకాక 'సంతాపహార త్రికోణ గేహే, సకామేశ్వరీ శక్తిసమూహే' అనుటలో ఆధిదైవిక, ఆదిభౌతిక, ఆధ్యాత్మికములనే తాపత్రయత్రయములను త్యజంచుటకై లేక శాంతింపజేయుటకై శాంతి పదము మూడు పర్యాయములు ఉచ్చరించవలెనని ఉపనిషత్ శాంతిపాఠమున కలదు. తాపత్రయముశాంతించినపుడే వాసనాక్షయము, మనోనాశనము, జరిగి తత్త్వజ్ఞానము లభించును. సకామేశ్వరీ శక్తి సమూహ-అనిన చక్రేశ్వరియైన, మహాభగమాలిని అను అష్టమావరణ దేవతలైన శక్తుల సమూహమును కలిగియున్నది. అంతియేకాక ఈ పరదేవత ఘంటాఘోషములు గల మోక్ష కవాట ద్వారమును తెఱచి యోగులకు స్వాగతము ఇచ్చును. అనగా ఎల్లప్పుడు ముక్తి ఘంట యొక్క ధ్వనులచే మారుమ్రోగుచున్న కవాటముకలది. దేవాలయములలో దేవుని ముందర ఘంట ఉండును. దాని యొక్క ధ్వని దైవసాన్నిధ్యము చేరుటకు మార్గదర్శకము. అదే విధముగా పరమేశ్వరి వద్దనున్న ముక్తి ఘంటారావము మార్గ దర్శకము కాగా భక్తులు నీదరికి చేరుకుందురను భావమును శ్రీ దీక్షితుల వారు 'సంతతం ముక్తి ఘంటామణి ఘోషాయమాన కవాటద్వారే' అను పదములలో నిక్షేపించిరి. ఈ కమలాంబిక అనంతమైనటువంటి గురుగుహుడైన కుమారస్వామిచే గుర్తెఱిగినది.

"కరాంగుళీనఖోత్పన్న నారాయణ దశాకృతిః"[1]

అని లలితా సహస్రనామ స్తోత్రములో చెప్పబడిన విషయమును దీక్షితులవారు 'కరాంగుళి నఖో దయ విష్ణు దశావతార' యని పేర్కొనిరి. శ్రీదేవి భండాసుర సంహార సమయంలో తన చేతిగోటి వేళ్ళలో విష్ణువు యొక్క దశావతారములు మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, దశరథరామ, బలరామ, కృష్ణ, కల్కి (బుద్ధ), లను సృష్టింపజేసినది. ఎందువలననిన భండాసురుడు శ్రీదేవితో యుద్ధము చేయునప్పుడు

1. ల.స.స్తో.పా. 32

సర్వఅసురాస్త్రములను ప్రయోగించెను. దాని నుండి సోమక, రావణాసుర, కుంభకర్ణ, బలి, హిరణ్యాక్ష, హిరణ్యకశిప, నముచి, పల్వల, ఇలోల, వాతాపి అను రాక్షసులు పది మంది జన్మించిరి. ఈ దైత్యులను పది మందిని విష్ణువు యొక్క దశావతారములతో సంహరించెనని బ్రహ్మాండ పురాణమున కలదు.

జీవసంబంధమైన జాగ్రత్స్వప్న సుషుప్త్యాది పంచావస్థలు ఈశ్వర సంబంధమైన పంచకృత్యములు. అవి పది శ్రీదేవి యొక్క నఖముల నుండి అనాయాసముగా పుట్టినవి. నారాయణ శబ్దము జీవేశ్వర సూచకము. దశా శబ్దము అవస్థను తెలియజేయును. కృతి శబ్దము కృత్యపరముగా, భావింపవలెను. జీవేశుల దశవిధావస్థలు కృత్యములు మోక్షహేతువులు కావు. శ్రీదేవి సృష్టించిన మాయా కృత్యములు. ఈ దశావస్థలను అంబారాధన చేసి, ఆత్మజ్ఞానముచే వీనిని జయించి, మాయాతీతముగ పెరిగి, ఆనందానుభూతిని పొంది, మోక్షద్వారము లోనికి ప్రవేశించవలెను. ఇంకను చరణములో దీక్షితుల వారు పరాశక్తి యొక్క అంతఃకరణనే (మనస్సునే) చెఱకు విల్లుగా ధరించినదనియు తెల్పిరి. అనగా ఆ పరమేశ్వరి యొక్క మనస్సు మధురమైన చెఱకువలే బ్రహ్మానందముగా ఉండును. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను పంచ భూత గుణముల పంచతన్మాత్రలుగా చెప్పబడినవి. ఈ తన్మాత్రములే దేవి యొక్క చేతిలోని బాణములు. ఈ దేవి హృదయమందుండు రాగద్వేషములను అంకుశముగా ధరించినది. ఇవి శ్రీదేవి ధరించు ఆయుధములు. వీనిని గూర్చిన వివరణ ముందు కీర్తనలలో కలదు. ఈ అష్టమావరణ దేవతలు అతిరహస్య యోగినులు. ఇచటి రసము అద్భుతము.

ముత్తుస్వామి దీక్షితులవారు ఈ ఎనిమిదవ ఆవరణ కీర్తనయందు ఆ కమలాంబికను లోకపాలిని, కపాలిని, శూలిని, భగమాలిని, లోకజనని, త్రిపురాంబిక, బాలాంబిక అనుచు వివిధ నామములతో స్తుతించిరి. చరణములో 'త్రికోణదేహే' అనుటలో ఆ చక్రస్వరూపము త్రికోణమని సూచించిరి. ఈ ఆవరణ కాంతి బంధూక కుసుమము. అనగా మంకెనపువ్వు యొక్క కాంతి కలది. చరణములో 'ముక్తి ఘంటామణి' అను చోట రాగనామమును, "అనంత గురుగుహ విదితే" అనుటలో గురుగుహ ముద్రను దీక్షితులవారు

నిక్షేపించిరి. త్రికోణములో నివసించు పరమేశ్వరిని ధ్యానించుట వలన సకలదుఃఖములు హరింపబడి సర్వసిద్ధులు కలుగునని ఫలశ్రుతిలో చెప్పబడినది.

★★★

## 10వ కీర్తన తొమ్మిదవ ఆవరణము

ఆహిరిరాగము — త్రిశ్ర ఏకతాళము

20.వ మేళకర్తజన్యము - (దీక్షితులవారి సంప్రదాయమున)

(8.వ మేళకర్త జన్యము - పూర్వసంప్రదాయమున)

పల్లవి:- శ్రీకమలాంబా జయతి అంబా జగదంబా శ్రీకమలాంబా జయతి।
శృంగారరసకదంబామదంబా చిద్బింబ ప్రతిబింబేందు బింబా।
శ్రీపుర బిందు మధ్యస్థ చింతామణి మందిరస్థ ।
శివాకార మంచస్థిత శివకామేశాంకస్థా। ॥శ్రీ కమలా॥

అ॥ప॥:- సూకరాననాద్యర్చిత మహాత్రిపురసుందరీం రాజరాజేశ్వరీం
శ్రీకర సర్వానందమయ చక్రవాసినీం సువాసినీం చింతయేఽహం
దివాకర శీత కిరణ పావకాది వికాస కరయా
భీకర తాపత్రయాది భేదన ధురీణ తరయా
పాకారిపు ప్రముఖాది ప్రార్థిత సుకళేబరయా
ప్రాకట్య పరాపరయా పాలితో దయాకరయా॥ ॥శ్రీకమలా॥

చరణము:- శ్రీమాత్రే నమస్తే చిన్మాత్రే సేవిత రమాహరీశ విధాత్రే।
వామాది శక్తి పూజిత పరదేవతాయాః
సకలం జాతం కామాది ద్వాదశభిరుపాసిత
కాదిహాది సాది మంత్ర రూపిణ్యాః।
ప్రేమాస్పద శివ గురుగుహ జనన్యాం ప్రీతియుక్త మచ్చిత్తం
విలయతు బ్రహ్మమయప్రకాశిని। నామ రూప విమర్శినీ।
కామకళా ప్రదర్శినీ సామరస్య నిదర్శినీ ॥ శ్రీకమలా॥

ఈ తొమ్మిదవ ఆవరణ త్రికోణ మధ్యమున బిందు రూపములో ఉండును. ఈ చక్రేశ్వరి త్రిపుర సుందరీదేవి. దీనికి సర్వానందమయ చక్రమని పేరు. దీని తత్త్వము పంచ బ్రహ్మాత్మకము. పూజాక్రమము - క్రమము. ఈ దేవత నామము శ్రీరాజ రాజేశ్వరి. శాంతరసము కలది. దీని స్థాయీ భావము శమ. బీజము 'ఐం'. ఈ చక్రేశ్వరి యైన త్రిపురసుందరి సర్వయోనిముద్రను కలిగి యుండును. ఈ ఆవరణ దేవతలు పరాపరరహస్య యోగినులు. శ్రీమాతను అర్చించిన సూర్యుడు- ప్రభ అనుశక్తిని, చంద్రుడు-చంద్రికారూప శక్తిని, అగ్ని-స్వాహ అను శక్తిని పొందిరి. శ్రీదేవి కటాక్షము లేనిచో త్రిమూర్తులు కూడా అశక్తులగుదురు. ఈ తల్లి లక్ష్మి, సరస్వతి, రుద్రాంబలకు కూడ మూలపుటమ్మ. చతుర్ముఖ బ్రహ్మకు వేదములను ఈ తల్లే అనుగ్రహించినది శ్రీపురమనగా శ్రీ చక్రము. ఈ చక్రమధ్య బిందువు నందు చింతామణి గృహములో విరాజమానమైన శ్రీ రాజరాజేశ్వరి, పరాభట్టారికాదేవి ఏడు కోట్ల పరివారంతో శుద్ధచైతన్యరూపిణి, చిత్స్వరూపిణి, సర్వానందమయమై తన్నాశ్రయించిన వారికి కైవల్యమును ప్రసాదించును. ఇక్కడకి చేరునప్పటికి పరిపూర్ణ చిదానందం కలుగును.

నాదబిందు స్వరూపము-బిందువనగా మూలాధారము మొదలుకొని ఆజ్ఞా చక్రము వరకు గల షట్చక్రసంపుటి. సృష్టి స్థితి లయకర్తయగు శివశక్తి విశేషమే బిందువు.

"తదేనైకో బిందుర్భవతి జగదుత్పత్తి కృదయమ్"[1].

అది సహస్రార కమలము నందున్నది శక్తి తత్త్వము. ఆ శక్తితత్త్వమునకు మధ్యనున్న శివతత్త్వమునకు నాదమని పేరు. ఈ నాదము చరుర్విధములు. శివశక్తులు శబ్దార్థరూపులు. వారికి కళాత్మకత్వం ఉభయ సాధారణమైనది. వాటి మేళనము నాద బిందు కళాతీతమైనది. ఇది సమయమతరహస్యము అని 'శ్రీచక్రవిలసనము' పేర్కొనుచున్నది.

దీక్షితుల వారు ఆహిరి రాగములో తొమ్మిదవ ఆవరణ కీర్తనను సార్వవిభక్తికముగ రచించిరి. దీక్షితులవారు ఉదాహరణ కావ్యములందున్న విధముగా ఎనిమిది విభక్తులందు

---

1. శ్రీ చ.వి. పుట. 117

రచనలు గావించి చివరకు సార్వవిభక్తికమైన రచన గావించిరి. వారు ఈ కీర్తన పల్లవిలో "శ్రీపుర బిందు మధ్యస్థా" అనిరి. శ్రీచక్రము మధ్యలో గల బిందుస్థానమున నున్న ఆ శ్రీదేవిని "శ్రీమాతా శ్రీమహరాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ"ని ఒక చక్రవర్తినిగా భావించుచూ, పరమేశ్వరి యొక్క నగరము సుధాసాగర మధ్యస్థా- అనిన మేరు శృంగమధ్యమందు శ్రీపుర ముండుటను వర్ణించిరి. శ్రీపుర మధ్యబిందువునందు చింతామణి మందిరమున శివాకార మంచస్థితుడైన శివకామేశుని వామాంకమందు శ్రీకమలాంబ సర్వోత్కర్షగా ప్రకాశించుచున్నదని పేర్కొనిరి. ఈమె చింతామణి మందిరములో నివసించునది, భక్తుల చించితార్థములను ప్రసాదించు చింతామణి మంత్రాధిదేవత. భక్తచింతామణుల గృహమందు నివసించున్నదనియు పేర్కొనుచూ -

"శ్రీపుర బిందు మధ్యస్థ చింతామణిమందిరస్థ
శివాకార మంచ స్థిత శివకామేశాంకస్థా"-

అని దీక్షితులవారు పల్లవిలో చెప్పిన దానికి ప్రమాణముగా సౌందర్యలహరిలోని శ్లోకమును అన్వయించు కొనవలెను.

"సుధాసింధోర్మధ్యే సురవిటపి వాటీపరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చింతామణి గృహే
శివాకారే మంచే పరమశివ పర్యంక నిలయామ్
భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానంద లహరీమ్"॥[1]

ఈ పరదేవత అమృతపు కడలి యొక్క నడిమి ప్రదేశమునందున్న కల్పవృక్షముల యొక్క వరుసలచేత చుట్టుకొని మణిమయమైన దీవియందు కదంబవృక్షముల పూదోటలో, చింతామణులచేత నిర్మింపబడిన గృహమున శక్తి స్వరూపిణియై, త్రికోణాకృతి గల మంచము నందు పరమశివుడున్న శయ్య (మంచము) పైన ప్రకాశించుచున్నది. "జ్ఞాన స్వరూపమై నిరతిశయ సుఖప్రదాయినివిగానున్న నిన్ను కొందరు ధన్యులు సేవించుచున్నారు" అను భావమును ఈ కీర్తన యందు దీక్షితుల వారు పోహళించిరి.

---

1. సౌ. ల. శ్లో 8 పుట. 46.

"చిద్బింబా ప్రతిబింబేందు బింబా శ్రీకమలాంబా జయతి" - అని చెప్పుటలో దీక్షితులవారు ఆదినున్న బిందువగు ప్రకాశ బిందువును కామేశ్వర స్వరూపముగాను, అందు అంతర్లీనమైన విమర్శశక్తిని విమర్శ బిందువుగాను, ఆ విమర్శశక్తియే సహస్రారాంతర్గత బిందు స్థానమున నున్న ఈ పరాశక్తి, ఈమెయే తిరువారూన విగ్రహరూపంలోనున్న శ్రీకమలాంబగా నిరూపించిరి. చిద్బింబా అనునది ప్రకాశ బిందువు. ఇది సృష్ట్యాది వస్తువుగాను, సర్వకారణముగాను చెప్పబడినది. ప్రతిబింబేందు బింబా అనునది విమర్శబిందువు. ఇది భావి సృష్టికి కారణముగ నున్నదని చెప్పబడినది. ఈ ప్రకాశ విమర్శ బిందువులు శివశక్తి స్వరూపములు కావున ఈ బిందుద్వయము కామేశ్వర కామేశ్వరీ స్వరూపములు. ఈ శివశక్తుల మేళనతత్త్వము ఒకటిగానున్నందున ఆ తత్త్వమునకు జగత్కారణము సిద్ధించుచున్నది. ఈ విషయము -

"సా జయతి శక్తిరాద్యా నిజసుఖమయనిత్యనిరుపమాకారా
భావిచరాచర బీజం శివరూప విమర్శ నిర్మలాదర్శః"[1]

కామకలా విలాసములోని శ్లోకమునకు సమన్వయమగును. ఈ కమలాంబ అంబిక, జగత్తునకు తల్లి, లోకమాత. సర్వానందమయ చక్రవాసినియైన మహా త్రిపుర సుందరి శృంగార రస గుచ్ఛమును ధరించినది. ఈ తల్లి శృంగార రసస్వరూపిణి. ఈ పరదేవత "శృంగార రససంపూర్ణా జయా జాలంధర స్థితా
ఓడ్యాణపీఠ నిలయా బిందుమండల వాసినీ"[2]

అని కమలాంబను ధ్యానించుచు దీక్షితుల వారు బిందు స్థానమునగల ఆ శివశక్తి స్వరూప, స్థానములను దర్శించి ఈ కీర్తన పల్లవి యందు నిక్షేపించిరి.

శుభప్రదమైన సర్వానందమయ చక్రమునందు అనగా బిందుస్థానమున నివసించు చక్రేశ్వరియైన మహా త్రిపురసుందరి సర్వదా సువాసిని అనగా ఎల్లప్పుడు భర్తతో కలసి యుండునది. ఈమెయే రాజరాజేశ్వరి. సూకరసనా యనగా వారాహి. ఈమె దండినీదేవి.

---

1. కా.క. వి.శ్లో. 2

2. ల.స.స్తో. పా. 82

"వారాహానంద నాథస్య ప్రసన్నాత్మా మహేశ్వరీ

వారాహీతి ప్రసిద్ధేయం వరహ వదనే నవేతి" [1]

ఈ పరదేవత బ్రాహ్మీ, మహేశ్వరీ, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, మహేంద్రీ, చాముండీ, మహాలక్ష్మీ మొదలగు దేవతలచే అర్చింపబడినది. యజ్ఞవరాహ మూర్తిచేత అర్చింపబడినదని కూడ చెప్పవచ్చును. ఈమెయే మహాకామేశమహిషీ మహాత్రిపుర సుందరిగా భావింపబడినది.

'దివాకర శీతకరణ పావకాది వికాసకరయా' అని దీక్షితుల వారనుటలో సర్వమంత్ర స్వరూపిణి యైన శ్రీరాజరాజేశ్వరి సూర్యుడు, చంద్రుడు, అగ్నులకు ప్రకాశము నొసంగునది. 'తస్య భాసాసర్వమిదం విభాతి' అను ప్రమాణము చేత చిద్శక్తియగు పరదేవత స్వయం ప్రకాశము కలది. ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మికమను తాపత్రయత్రయమును భేదించుట యందు అత్యంత నిపుణత గలది. ఇంద్రాది ప్రముఖులచే ప్రార్థింపబడిన దివ్య శరీరము గలది. దేవతలచే ప్రార్థింపబడి వారి కార్యములను తీర్చుటకై శ్రీదేవి మూర్తిత్వమును స్వీకరించినది. ఆమె ఇంద్రాదులను కాపాడుటకు దేవకార్య సముద్యతయై, చిదగ్ని కుండ సంభూతయై దేవతల శత్రువులను వధించినది. తొమ్మిది ఆవరణ దేవతలకు యోగినులని పేరు. మొదటి ఆవరణము నందున్న దేవతలు ప్రకట యోగినులు. తొమ్మిదవ ఆవరణ దేవత పరాపర యోగిని. దీక్షితుల వారు 'ప్రాకట్య పరాపరయా పాలితో దయాకరయా' అనుటలో ప్రథమావరణము నుండి నవమావరణము వరకు గల యోగినీ దేవతల సమూహముచే ఆరాధింపబడునటువంటి పరమేశ్వరీ దయకు నిలయమైనటువంటిది. ఈ పరదేవతచే పాలింపబడుచుంటినని దీక్షితుల వారు అనుపల్లవిలో వాక్రుచ్చిరి.

లక్ష్మీ నారాయణులు, బ్రహ్మరుద్రులు సేవించు శ్రీమాత అఖండానందైక రసానుభవ యోగ్యమైన పరబ్రహ్మ పదప్రాప్తిని ప్రసాదించునది. కనుక శ్రీమాత అను సార్థక నామమును కలిగి యున్నది. ఈమె వామా, జ్యేష్ఠా, రౌద్రీ, మొదలగు శక్తుల చేత పూజనందిన పరదేవత. ఈమె నుండియే సమస్తమైన భువనములు ఉద్భవించినవి.

---

1. ము. దీ. కృ. పుట 111

'కామాది ద్వాదశభి రుపాసిత కాదిహాది సాది మంత్ర స్వరూపిణ్యాః' - పంచదశీ మంత్రమును మను, చంద్ర, కుబేర, లోపాముద్రా, మన్మథ, అగస్త్య, అగ్ని, సూర్య, ఇంద్ర, షణ్ముఖ, ఈశ్వర, దుర్వాస ఋషులు శ్రీదేవి ఉపాసకులు. ఈ పన్నెండుగురు ప్రత్యేకముగా పంచదశీ మంత్రమును ఏర్పఱచిరి. కావున పంచదశీ మంత్రము ద్వాదశ విధములైనది. ఇందుకాది విద్య శివనిర్మితము. హాది విద్య, సాది విద్య, భిన్న సంపుటి భేదములుగా ప్రసిద్ధమైనవి.

ఈ మంత్రమును గూర్చి కొంతవరకు వివరణ ధ్యాన కృతిలో ప్రస్తావితమైనది. 'క ఏ ఈ ల హ్రీం - హ స క హ ల హ్రీం -స క ల హ్రీం' అను పంచదశీ మంత్రము నందు మూడు కూటములు లేక త్రిఖండములుగా నున్నదని ప్రథమ ఖండమునకు ఆయా స్వరూపమయిన పరదేవతే బ్రహ్మ విషయకమయిన, అష్టపాశాత్మకమైన బ్రహ్మజ్ఞానమును గూర్చి తనకు గల అజ్ఞానమును నివర్తింపజేయునని ద్వితీయ ఖండమునకు బ్రహ్మ యొక్క గ్రాహక శక్తిని ప్రకాశింప జేయును అని, తృతీయ ఖండమునకు బ్రహ్మజ్ఞానమును గురించి నాకు గల సకల విధమైన అజ్ఞానమును పోగొట్టుమని, పంచదశీ మంత్ర తాత్పర్యమును కామకలా విలాసము చెప్పుచున్నది. దీనిని దీక్షితుల వారు ఈ కృతి యందు నిక్షేపించిరనుటకు నిదర్శనముగా 'కాది హాది సాది మంత్ర రూపిణ్యాః' అని పేర్కొనిరి. నాలోని అజ్ఞానాంధకారమును నిర్మూలించి బ్రహ్మజ్ఞానమును నాకు ప్రసాదింపుమనిరి. ఈ మంత్రమున గల మూడు కూటములలో మొదటిది వాగ్భవ కూటము - సకల విద్యాప్రదము. రెండవది కామరాజకూటము - ఇది సకలార్థ కామదమైన మహాభోగ సాధనము. మూడవది పరాకూటము మోక్షప్రదము. ఇంకను "ప్రేమాస్పదుడైన కుమారస్వామికి తల్లివైన నీయందు నా చిత్తము భక్తితో లయము పొందుగాక" అనిరి. అస్థి, భాతి, ప్రియం, నామ, రూప, అంశ పంచకములలో నామరూపములు శక్తిపరమైనవి. నామమును, రూపమును విమర్శ చేయు బ్రహ్మమయమగు ప్రకాశస్వరూపము కలదీ పరదేవత. ఇక్కడ పరమేశ్వరి నామరూపములకు అభేదము ప్రతిపాద్యమైనది. ఏనామముతో పరమేశ్వరిని ధ్యానించెదరో, ఏ రూపముతో ఆమెను కొలిచెదరో, ఏమంత్రముతో ఆమెను ఉపాసించెదరో వానికి పరమేశ్వరునికి బేధము లేదు. అన్నియు సమానమను సామరస్యమునకు

నిదర్శనముగా 'కామకళా ప్రదర్శిని సామరస్య నిదర్శినీ' అనిరి.

కామకళా ప్రదర్శిని అనుటలో కామకళా సారాంశమును దీక్షితుల వారు ఇందు పొందుపఱచిరి. ఈ కీర్తన యందు 'శ్రీ' అనునది అనేక పర్యాయములు వాడుటలో ఒక ప్రత్యేకత కలదు. 'శ్రీం' అనునది కామకళా ఏకాక్షరీ మంత్రము. ఈ మంత్ర బీజము నందు 'శ-ర-ఈ-ం-' నాలుగు బీజములు కలవు. దీని వలన ఆగమ శాస్త్ర సంకేతములచే అనేకార్థములు ఉన్నవి. ఈ 'శ్రీం' బీజమునందు గల నాల్గు బీజములు 1. ప్రకాశ, విమర్శ - మిశ్రమ - సంవిద్బిందుమయమనియు, 2. కామకళాంగన యొక్క ముఖ - స్తన - కటి ప్రదేశములనే అవయవములుగాను, 3. షోడశకళాత్మకముగాను, 4. ఆత్మతత్త్వ - విద్యాతత్త్వ -శివతత్త్వ - బ్రహ్మస్వరూపము గాను, 5. ప్రకాశాంశులగు అవ్యక్తాది తత్త్వ సముదాయమును విమర్శాంశులగు వర్ణ కదంబము గాను, 6. జాగ్రదాద్యవస్థాచతుష్టయ - విశ్వ - తైజస-ప్రాజ్ఞ సాక్షులు గాను, పరాపశ్యంతీ మద్యమ వైఖరీలుగాను, 7. సచ్చిదానంద స్వరూపము గాను, 8. జీవాత్మ - పరమాత్మల ఐక్యమును తెలుపుచున్నవి.

కనుక ఈ 'శ్రీం' బీజరాజము సర్వోత్తమముగా నున్నది. ఇదియే కామకలాబీజము. ఇదియే ధ్రువకల, షోడశీ కళగా ఉన్నది అని కామకలా సారాంశము కామకలా విలాసము నందు చెప్పబడినది. దీక్షితుల వారు ఈ చక్రనామమును అనుపల్లవిలో 'సర్వానందమయ చక్రవాసినీ' అనుటలోను గురుగుహ ముద్రను చరణములో 'శివగురుగుహ జన్యానాం' అనుటలో ఇమిడ్చిరి. బిందువు నుండి సృష్టి క్రమమున ఉద్భవించిన దీక్షితుల వారు సంహార క్రమమున అనగా భూపురము నుండి బిందువు వరకు గల నవావరణములలో ఆదేవిని పంచదశీ, బాలా, షోడశీ మంత్రములతో ధ్యానించుచు నవావరణ కీర్తనలను రచించి తుదకు బిందువునందు గల ఆ పరమేశ్వరి యందు లయము పొందిరనుటలో అతిశయోక్తి లేదు.

కామకలా ప్రదర్శిని - శివశక్తి సంపుటముగా నుండి సకల తత్త్వ సముదాయమునకు, సకల వర్ణ కదంబమునకు, శబ్దజాలమునకు జన్మస్థానమై సర్వకారణముగా నున్నది కామకల. సమమైన రసముగల శివశక్తుల భావమే సామరస్యము.

కాళిదాసు "భోక్తృ భోగ్య కరణోస్మి సంక్షయే సామరస్యదోహినీ శివా" అని చెప్పినారు. అనగా "భోక్తృ భోగ్యములను అలలు నశింపగా శ్రీదేవి సామరస్యరసమును పితుకును" అని భావము. ఈ భావము దీక్షితుల వారు 'సామరస్య నిదర్శిని' అనుటలో వ్యక్తమగుచున్నది. సామరస్య నిదర్శిని అను దానికి సామ, వేద, గాన నిదర్శనీ యని కూడ కలదు.

ఈ తొమ్మిది ఆవరణ కీర్తనల యందు పరదేవత యొక్క సగుణ సాకార, సగుణ నిరాకార, నిర్గుణ, శ్రీచక్ర సంబంధ నామములు పెక్కు గలవు. ఈ కీర్తన యందు ఉపయోగింపబడినవి ఎనిమిది విభక్తులు.

1. శ్రీకమలాంబ జయతి - ప్రథమావిభక్తి
2. మహా త్రిపుర సుందరీం చింతయేఽ హం - ద్వితీయా విభక్తి
   ఆ మహాత్రిపుర సుందరిని ధ్యానించుచున్నాను.
3. దివాకర శీతకిరణ, ప్రాకట్య పరాపరయా, దయాపరయా పాలిత్యోహం - తృతీయా విభక్తి.
4. శ్రీమాతే చిన్మాత్రే .. నమస్తే - చతుర్థీ విభక్తి.
5. పరదేవతయాః సకలంజాతం - పంచమీ విభక్తి.
6. కాది హాది సాది మంత్ర స్వరూపిణ్యాః - షష్ఠీ విభక్తి.
7. శివ గురుగుహ జనప్రీతియుక్త మచ్చిత్తం విలయతు - సప్తమీ విభక్తి.
8. బ్రహ్మమయ ప్రకాశిని, కామరూప విమర్శిని, కామకలా ప్రదర్శిని, సామరస్య నిదర్శిని - సంబోధన ప్రథమావిభక్తి.

ఇది సర్వక్రియా కారకత్వములకు ఆలంబనమై సర్వాత్మనా ఆ కమలాంబను నవావరణ కీర్తనా యుక్తముగా ధ్యానించుట దీక్షితుల వారి అర్చనా విధానములోని విశిష్టత. చరణములో 'సేవిత రమాహరికా విధాత్రే' అనుటలో రాగనామమైన ఆహిరి సూచింపబడినది.

★★★

# 11వ కీర్తన మంగళాశాసనము

శ్రీరాగము ఖండజాతి ఏకతాళము

22.వ. మేళకర్త జన్యము.

పల్లవిః- శ్రీ కమలాంబికే శివే పాహిమాం లలితే,
శ్రీపతే వినుతే సితాసితే శివసహితే॥ ॥శ్రీ కమలా॥

అ॥ప॥ః- రాకా చంద్రముఖి రక్షితకోలముఖి ।
రమావాణీ సఖి, రాజయోగ సుఖి ॥

మ॥సా॥ ః- శాకాంబరి శాతోదరి చంద్రకళాధరి, శంకరి ।
శంకర గురుగుహ భక్తవశంకరి ।
ఏకాక్షరి, భువనేశ్వరి, ఈశప్రియకరి ।
శ్రీ కర సుఖకరి శ్రీమహా త్రిపురసుందరి ॥ ॥శ్రీకమలా॥

దీక్షితులవారు మంగళా శాసన కీర్తనను మంగళ కరమైన శ్రీరాగములో రచించిరి. ఇది సంబోధన ప్రథమా విభక్తిలో కలదు. ఈ నవావరణకృతులు బీజాక్షరములతో సంపుటీకరణము చేసినవి. కనుక ఉచ్చారణ దోషములు, గాయక దోషములవల్ల విపరీత పరిణామములు కలుగకుండా తద్దోష నివారణార్థము శ్రీరాగములో ఆ పరదేవతకు మంగళా శాసనమును అర్పించిరి. శ్రీరాగము మంగళకరమైన రాగము.

బిందు స్థానమున గల సదాశివశక్తులతో లయము పొందిన వానికి చరణమేల అనునట్లుగా బిందు స్థానమునందు లయమును పొందిన దీక్షితులవారి పల్లవించిన హృదయమే రాగ భూయిష్ఠమైన సుధాసాగరము. అనుపల్లవిలోని రాగసుధాఝురులు మధ్యమ కాల సాహిత్యమున పరవళ్లు త్రొక్కుచు పొంగిపొరలినవి. ఇక వివరణలు, చరణముల అవసరము లేదు. దీనిని దీక్షితుల వారు పరిపూర్ణ బ్రహ్మానందమును పొందిన స్థితిలో కామకలా స్వరూపిణియైన శ్రీ కమలాంబను బహువిధనామములతో సంబోధించి తన్ను రక్షింపుమని విన్నవించు కొన్నట్లున్నది ఈ మంగళ కీర్తన.

దీక్షితుల వారు నవావరణ కీర్తనలకు ప్రారంభ రచనయైన ధ్యానకీర్తన యందు పంచదశీమంత్రమును నిక్షిప్తము గావించి, ఈ మంగళాశాసన కీర్తన యందు 'శ్రీం' అనే కామకలా ఏకాక్షరీ మంత్ర బీజముతో ఈ కీర్తన ప్రారంభించుటలో ఒక విశిష్టత కలదు. 'శ్రీం' బీజాక్షరము గల రాగము నందు రచించుట మఱియొక విశేషము. పంచదశీ మంత్రమునకు 'శ్రీం' బీజాక్షరము చేర్చినచో అది షోడశాక్షరీ మంత్రమగును. పంచదశీ మంత్రముతో ఆ పరాశక్తిని ధ్యానించి చివరకు షోడశకళాత్మకమైన బిందుస్థానముగల పరాభట్టారిక శ్రీరాజ రాజేశ్వరి మహా త్రిపురసుందరితో ఐక్యానుసంధానమును పొంది షోడశాక్షరీ మంత్రమును పునశ్చరణ చేసినట్లుగా నున్నది ఈ కీర్తన.

అట్టి స్థితిలో దీక్షితులవారు శ్రీ కమలాంబికను శివే, శంకరి, లలితే మొదలగు నామములతో సంబోధించిరి. శివ శబ్దము (శివశివా) శివశక్తుల ఉభయ వాచకమగుట వలన భువనేశ్వరి బీజఘటితమని కలదు. అద్వితీయమై మూర్తీభవించుచున్న శోభలతో, విలాస గాంభీర్య, మాధుర్య, స్థైర్యములతోను, అతిలాలిత్య, తేజస్సులతోను, సౌకుమార్య, ఔదార్యములతో ఉట్టిపడుచున్న ఈ మూర్తియే లలితాంబిక. ఈ పరదేవత దుర్గా, చండిక మొదలగు రూపములతో ఆవిర్భవించి దుర్జనులను, నిగ్రహించి, సజ్జన రక్షణ గావించిన గాథలెన్నియో కలవు. శ్రీ మహావిష్ణువు శ్రీదేవి ఉపాసకులలో ఒకడు. అందుచే శ్రీమన్నారాయణునిచే నుతినొందినది. శ్రీహరి పరదేవతను ఉపాసించి నందు వలననే విష్ణుపదవిని పొంది యున్నాడని సౌందర్యలహరి యందు - "హరిస్త్వామారాధ్య" అన్న శ్లోకమునందు శ్రీ శంకర భగవత్పాదుల వారు చెప్పిరి.

" హరిస్త్వా మారాధ్య ప్రణత జన సౌభాగ్యజననీం
పురానారీ భూత్వాపురరిపు మపి క్షోభ మనయత్
స్మరో2 పి త్వాం నత్వా రతినయన లేహ్యేన వపుషా
మునీనా మప్యంతః ప్రభవతి హి మోహాయ మహతామ్॥"[1]

---

1. సౌ.ల.శ్లో. 5. పుట 31.

పూర్వము విష్ణువు సౌభాగ్య ప్రదురాలైనట్టి ఈమెను ఆరాధించి స్త్రీరూపముపొంది, త్రిపురాసుర సంహారకుడైన ఈశ్వరుని మనస్సు నందు కామ వికారమైన కలతను పొందించెను. ఈ తల్లి అనుగ్రహ ప్రసాదగరిమ లోకాద్భుతము. నారాయణుడు స్త్రీ రూపధారియై కనకస్వామి యను వానిని ప్రలోభపెట్టి వానిని వధించెను. క్షీరసాగర మథనానంతరము అమృతమును జగన్మోహినియై దేవతలకు పంచిపెట్టెను. అట్టి జగన్మోహనమైన స్త్రీ రూపము తనకు చూపుమని శంభుడు కోరగా అట్టి స్త్రీరూపమును ధరించి శంభుని వ్యామోహపఱచెనను ఐతిహ్యము ఇచట అనుసంధేయము. విష్ణువు శ్రీదేవి యొక్క కామకళా రూపమగు తురీయ వర్ణమగు 'ఈం' బీజము జపింపగా ఆయనకు దేవీ రూపమే లభించెనని ఆ రూపముతో శివుని నాకర్షించెనని కొందఱి భావము. దీనిని బట్టి విష్ణువు ఉపాసన చేత సారూప్యము చెందెనని తెలియుచున్నది. ఈ భావమును దీక్షితుల వారు 'శ్రీపతి వినుతే సితాసితే శివసహితే' అని పల్లవి యందు నిక్షిప్తము గావించిరి. సితాసితే అనగా తెలుపు, నలుపు వర్ణము కలది అనుటలో ఈమె జ్ఞాన స్వరూపిణీ మాయా స్వరూపిణీ అని సూచించిరి.

అనుపల్లవిలో పూర్ణచంద్రుని వంటి ముఖము కలది. అనగా షోడశ కళా పరిపూర్ణమైన ముఖము కలిగిన శ్రీదేవి వారాహీ, వైష్ణవీ, కౌమారీ, బ్రాహ్మీ, మహేశ్వరీ, మహేంద్రీ, చాముండీ, మహాలక్ష్మి దేవతలచే పరిరక్షింపబడునది. వారాహి సేనా నాయకురాలు. లక్ష్మీ సరస్వతుల సేవలను పొందు ఈ పరదేవత రాజ యోగమునందు సమాధి సుఖప్రదాయిని.

మధ్యమకాల సాహిత్యము నందు "శాకంబరి మంత్ర స్వరూప శక్తిమూర్తి" అనిరి. శాకంబరి అవతార చరిత్ర దేవీ భాగవతములో "నూరు సంవత్సరములు దుర్భిక్షమేర్పడగా ఈ తల్లి అమృతవర్షిణి రాగము గానము చేసి సస్యానుకూల వర్షమును కురిపించి దేశమును సస్యశ్యామలము చేసిన అవతారమే శాకంభరి" అని కలదు. ఈమె సౌందర్య లక్షణమును శాతోదరి అను పదముతో సూచించిరి. అనగా సన్నని నడుము కలది ఈమె చంద్రకళను ధరించినది. శంకరుని పత్ని కనుక శంకరి. ఇచట నామసామ్యము

చెప్పబడినది. ఈ కమలాంబ భక్తులకు శుభఫలముల నిచ్చునది. నిర్మల హృదయనివాసిని. గురుగుహుడైన కుమారస్వామికి తల్లి. ఈ పరదేవత 'హ్రీం' కారమను ఏకాక్షరీ మంత్ర స్వరూపిణి. ఈమె త్రిభువనములకు ఈశ్వరి కనుక భువనేశ్వరి. ఈశ్వరునికి ప్రేమాస్పదురాలు. శ్రీ మహాత్రిపుర సుందరి శుభఫలములను, అష్టైశ్వర్యములను ఇచ్చుటయే గాక చివరకు మోక్షము నొసంగునని దీక్షితుల వారు ఆ కమలాంబిక తత్త్వమును వివరించిరి. 'శ్రీకరి' అను పదములో శ్రీరాగ నామమును సూచించిరి.

ఈ విధముగా దీక్షితుల వారు నవావరణ కీర్తనల యందు వేద, వేదాంగ, మంత్ర, తంత్రములను, పురాణములను బీజాక్షరములను వాటి విశిష్టతను సంపుటీకరణము చేసి సంగీత లోకమునకు అందించిన మహామనీషి. సంగీత త్రిమూర్తులలో గాని వీరి పూర్వులలో గాని ఈ విధముగ నవావరణార్చనా విధానములో కీర్తనలను రచించినది దీక్షితుల వారేనని, వారికి సాటి మరెవ్వరును లేరనుటలో అతిశయోక్తి లేదు. కనుక సంగీత వాగ్గేయకారులలో ఈ నవావరణ కీర్తనలను రచించిన వారిలో దీక్షితుల వారు ప్రప్రథములని చెప్పక తప్పదు.

సంగీత మూర్తిత్రయములో ద్వితీయులైన శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు మంత్ర, తంత్ర, యంత్ర, పురాణేతిహాసములను, వ్యాకరణ, ఛందోబద్ధముగను, ఆగమశాస్త్ర విధిగను కమలాంబ, అభయంబా, నీలోత్పలాంబ, గురుగుహాష్టక కీర్తనలు, పంచలింగస్థల, నవగ్రహ కీర్తనలు తిరువారూరు త్యాగరాజ స్వామి కీర్తనల వంటి గుచ్ఛ కీర్తనలే గాక ఎన్నో క్షేత్ర కీర్తనలు రచించి సంగీత ప్రపంచములో అద్వితీయ స్థానమును అలంకరించిన మహనీయ మూర్తి. దీక్షితుల వారు అద్వితీయమైన శివశక్తి తత్త్వమును, శ్రీచక్ర వివరణతో నవావరణ కీర్తనల రూపములో ప్రపంచమునకు అందించిన మహా వాగ్గేయకారులు.

★★★

# షష్ఠాధ్యాయము

# షష్ఠాధ్యాయము

## పంచభూత లింగ స్థల కృతులు

శివశక్తి తత్త్వములైన పంచవింశతి తత్త్వములు క్రమముగా పంచభూతములు, పంచతన్మాత్రలు, పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, మనస్తత్త్వము, మాయా, శుద్ధవిద్య, మహేశ్వరుడు, సదాశివుడు. వీనిలో పంచభూతములు 1. పృథివి (భూమి), 2. ఆపస్సు (జలము), 3. తేజస్సు ( అగ్ని), 4. వాయువు (గాలి) 5. ఆకాశము. వీని యొక్క గుణములను పంచతన్మాత్రములు అందురు:

| పంచభూతములు | - వాని గుణములు |
|---|---|
| 1. పృథివి (భూమి) | - గంధము |
| 2. ఆపస్సు (జలము) | - రసము |
| 3. తేజస్సు (అగ్ని) | - రూపము |
| 4. వాయువు (గాలి) | - స్పర్శ |
| 5. ఆకాశము | - శబ్దము |

పంచవింశతి తత్త్వములలో కొన్ని కొన్నింటియందు అంతర్భూతములు. పంచ భూతముల యందు 1.త్వక్ (చర్మం), 2.అస్ఋక్ (రక్తం) 3.మాంస, 4.మేదో (మెదడు) 5.అస్థి (ఎముక) 6.మజ్జ (ఎముకలలోనిగుజ్జు) 7. శుక్లము (వీర్యము) అను సప్తధాతువులు అంతర్భూతములు. వాయువునందు 1. ప్రాణ 2.అపాన 3.వ్యాన 4.ఉదాన 5.సమానములు అను పంచప్రాణములు అంతర్భూతములు. శివుడు పంచభూతములకు పతి కావున భూతపతి అని నామము కలదు.

"ఈశావాస్య మిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్

తేన త్యక్తేన భుఞ్జీథామాగృధః కస్యస్విద్ ధనమ్॥" [1]

అని ఈశావాస్యోపనిషత్ ప్రారంభ శ్లోకమున కలదు. ఈ ప్రపంచ మంతయు శివమయము. శివమనగా ప్రాణమున్నది, మంగళకరమైనది. ప్రాణం లేనిది శవము. కనుక ప్రాణ స్వరూపమే శివము.

---

1 ఉ. క. త. పుట 15

"వాయుః ప్రాణః" వాయువే ప్రాణము. గావున శివతత్త్వమును వాయురూపముగా పేర్కొనవచ్చును. అందుకు ప్రమాణముగా -

"వాయుభూతం ప్రాణరూపం శబ్ద స్పర్శ గుణాన్వితమ్

రుద్రంహరం మహాదేవం పూజయామి సదాశివమ్"[1]

పరమేశ్వరుడు పంచ భూతముల యందు లింగ స్వరూపమున ఉండునని శ్రుతి ప్రమాణము. అట్టి పరమేశ్వరుడు దక్షిణ భారతదేశమున పంచక్షేత్రములందు వెలసెను. అవి చిదంబరము, శ్రీకాళహస్తి, అరుణాచలము, జంబుకేశ్వరము, కంచి క్షేత్రములు. వీనిని పంచభూతలింగ క్షేత్రములని అందురు.

1. చిదంబరములో - ఆకాశలింగరూపమున
2. శ్రీకాళహస్తిలో - వాయులింగరూపమున
3. అరుణాచలంలో - తేజోలింగ రూపమున
4. జంబుకేశ్వరమున - జలలింగరూపమున
5. కంచిక్షేత్రమున - పృథివీ లింగ రూపమున కలవు.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు ఈ పంచ మహాక్షేత్రములను దర్శించి యచటగల లింగరూపధారుడైన శివుని దర్శించి ఆనందానుభూతిలో కృతులను రచించి గానము చేసిరి. ఇవి పంచభూత లింగస్థల కృతులుగా ప్రసిద్ధి చెందినవి. వీనిలో పంచ భూత తత్త్వములను విభిన్న, విలక్షణ, విశేషములతో దీక్షితుల వారు అభివర్ణించినారు. ఆకాశమునకు పృథివికి మధ్యనున్నది అప్ తేజో వాయు సహకృతమైన జగత్తు. ఈ జగత్తు మిధ్య. సత్యము ఆకాశము. అది ఆనందస్వరూపము. ఆనందమురసము. రసమనగా పరమాత్మ.

"రసోవైసః రసగ్గ్ హ్యేవాయం లబ్ధ్వానందీ భవతి"[2] -

ఇత్యాది శ్రుతి ప్రమాణములు. దీక్షితులవారు ఈ శాస్త్ర రహస్యమును తమ

---

1. వా.ర. శ్రీ.ము.దీ. పుట 120

2. తైత్తరీయ. ఉ. ఆనందవల్లి

పంచభూత లింగకృతుల యందు నిక్షేపంచియున్నారు. శంకరభగవత్పాదుల వారు సౌందర్యలహరిలో

శ్లో॥ "మహీం మూలాధారే కమపి మణీపూరే హుతవహం
స్థితం స్వాధిష్ఠానే హృది మరుత మాకాశముపరి
మనోఽపి భ్రూమధ్యే సకలమపి భిత్వా కులపథం
సహస్రారే పద్మే సహ రహసి పత్యా విహరసే॥" [1]

పంచభూతాత్మకమైన మూలాధారాది షట్చక్రముల భేదనమును గూర్చి నిరూపించిన వర్ణనమిది. మూలాధార చక్రమున, పృథివీ తత్త్వమును, మణిపూర చక్రమున జలతత్త్వమును, స్వాధిష్ఠానము చక్రమున అగ్ని తత్త్వమును, అనాహత చక్రమున వాయు తత్త్వమును, విశుద్ధి చక్రమున ఆకాశతత్త్వమును, ఆజ్ఞా చక్రమున మనస్తత్త్వమును సుషుమ్నా మార్గమున భేదించి, (అధిగమించి) సహస్రార పద్మమున పతియగు సదాశివునితో కలసి విహరించుచున్నదని కుండలినీ మార్గమును నిర్దేశించుటలో భగవత్పాదులు మన శరీరమున గల మూలాధారాది షట్చక్రములు పృథివ్యాది పంచ భూతములుగా చెప్పినారు.

ఈ పంచభూతలింగ కృతులలో కూడ పృథివి నుండి ఆకాశమునకు పోవు క్రమము సూచింపబడినది. సమస్తభూతములకు మూలమైనది ఆకాశము. ఆకాశమునకు ఆకారములేదు. ఇచట శబ్దమే గుణము. ఇది వేదము. వేదముచే వేద్యమగు అనంద లక్షణము గలది ఆకాశము. అట్టి పరమేశ్వరుని దహరాకాశమున దర్శించుట యోగికి మాత్రమే సాధ్యమైన విషయము. అందుకు తార్కాణమైన అనుభూతిని దీక్షితులవారు ఈ పంచభూత లింగస్థల కృతులలో నిక్షేపంచిరి. ఆ స్థితి నుండి వాఙ్మనక్రియా రూపమైన అభివ్యక్తితో అనుభవసారమును అందించిన వారు శ్రీ దీక్షితుల వారు.

"సుధాధారా సారైశ్చరణ యుగళాంతర్విగళితైః
ప్రపంచం సించన్తీ పునరపి రసామ్నాయ మహసా (మహసః)

---

1. సౌ.ల. శ్లో. 9 పుట 53

అవాప్యస్వాం భూమిం భుజగనిభ మధ్యుష్ఠ వలయం

స్వమాత్మానం కృత్వా స్వపిషి కులకుండే కుహరిణి॥"[1]

ఈ శ్లోకము నందు సహస్రారము నుండి మనోకాశముల ద్వారా మూలాధారమైన పృథివికి చేరుట వర్ణింపబడినది. ఇది సృష్టిక్రమము. అనగా ప్రకృతి మార్గము. మూలాధారము నుండి సహస్రారమునకు పోవుట నివృత్తి మార్గము.

దీక్షితుల వారు పంచభూత లింగ స్థల కృతులలో ఆకాశము నుండి భూమికి క్రమముగా చేరిన విధమును వర్ణించిరి. కనుక వారు సృష్టి క్రమమును, ప్రవృత్తి మార్గమును అనుసరించిరి. ఇవి భుక్తి ముక్తి ప్రదమైన ఉపాసనా లక్షణముతో చేయబడిన రచనలు.

★★★

## 1. ఆకాశలింగము

కేదార రాగం — మిశ్రజాతి ఏకతాళము

29.వ మేళకర్త జన్యము

పల్లవిః- ఆనంద నటన ప్రకాశం చిత్సభేశం।
ఆశ్రయామి శివకామ వల్లీశం॥ ॥ఆనంద॥

అ॥ప॥ః- భానుకోటి సంకాశం। భుక్తి ముక్తి ప్రద దహరాకాశం।
దీనజన సంరక్షణచణం। దివ్యపతంజలి -
వ్యాఘ్రపాద దర్శిత కుంచితాబ్జ చరణం॥ ॥ఆనంద॥

చరణముః- శీతాంశు గంగాధరం నీలకంధరం
శ్రీ కేదారాది క్షేత్రాధారం
భూతేశం శార్దూలచర్మాంబరం చిదంబరం
భూసుర త్రిసహస్ర మునీశ్వరం విశ్వేశ్వరం
నవనీత హృదయం, సదయ గురుగుహ
తాతమాద్యం వేదవేద్యం

1. సౌ.ల. శ్లో. 10 పుట 63

మ॥సా॥:- వీత రాగిణ మప్రమేయాద్వైత ప్రతిపాద్యం।

సంగీత వాద్య వినోద తాండవజాత బహుతర భేదచోద్యమ్॥ ।అనంద।

శ్రీ దీక్షితుల వారు పంచ మహాక్షేత్రములను దర్శించి ఒక్కొక్క క్షేత్రమున గల విలక్షణ స్వరూపుడు, శక్తియుక్తుడైన పరమేశ్వరుని కీర్తించిరి. ఈ క్షేత్రములు పంచభూతములకు ప్రతిరూపములు. ఒక్కొక్క క్షేత్రము ఆకాశమునుండి భూమివరకు గల పంచభూతముల స్వరూపమే అయాక్షేత్రములలో లింగరూపముగా ప్రసిద్ధికెక్కినది. **"ఆకాశః తల్లింగాత్"**[1] అని బ్రహ్మ సూత్రముల యందు ఒకటవ అధ్యాయము, ఒకటవ పాదము, 22వ సూత్రము.

**"అస్యలోకస్యకా గతిః ఇత్యాకాశ ఇతిహోవాచ**

**సర్వాణి హవా ఇమాని భూతాని ఆకాశాదేవ సముత్పద్యంత**

**ఆకాశం ప్రత్యస్తం యన్త్యా కాశో హ్యేవైభ్యో**

**జాయానాకాశః పరాయణమ్"**[2] -

అని ఛాందోగ్యోపనిషత్ యందు 1వ అధ్యాయము, 9వ పాదము, 1వ సూత్రమునందు కలదు.

పంచభూతములకు పరాయణమైనది ఆకాశము. ఈ ఆకాశ శబ్దముచే బ్రహ్మము చెప్పబడుచున్నది. ఈ ఆకాశ శబ్దముచే ఆకాశమను భూతము కూడ లోకవ్యవహారమున తెలియుచున్నది. ఈ ఆకాశాది భూతములకు మూలమైనది ఆకాశ శబ్ద వాచ్యమైన పరబ్రహ్మ స్వరూపము.

దీక్షితుల వారు బ్రహ్మసూత్రాంతర్గతమైన ఈ మహా విషయమును సుస్పష్టముగా తమ కృతుల యందు నిక్షేపించిరి. ఇంకను దీక్షితుల వారు ఆకాశరూప బ్రహ్మముచే అంతరమున గల ఆకాశభూత రూపమైన లింగము యొక్క నామ రూప క్రియా వైభవమును తమ కృతులయందు అభివర్ణించిరి.

---

1. బ్రహ్మసూత్ర శంకర భాష్యం పుట 134

2. బ్రహ్మసూత్ర శంకర భాష్యం పుట 134

చిత్ అంబరముగా నుండి చిదంబరమైనది. దీక్షితుల వారు కేదార రాగములో చిదంబరము నందలి ఆకాశలింగ స్వరూపుడైన స్వామిని ఆనంద నటన ప్రకాశునిగా స్తుతించుచు, ఆ స్వామిని ఆశ్రయించునపుడు కలిగిన భావమే 'ఆనంద నటన ప్రకాశం చిత్సభేశం' అను కృతిలో ఇమిడ్చిరి. ఆనందము పరమేశ్వర లక్షణము. **"ఆసమంతాత్ నందం ఆనందమ్"**. ఇది వ్యాకరణ పరిభాష. ఈ ఆనందము అనంతమైనది. ఆకాశమెట్టిదో ఆనందమట్టిది. అంతటా నందము కలది ఆనందము. అంతటాకాశము కలది ఆకాశము. కాశమనగా - వెలుగు. చీకటి లేనిది. ఆకాశమంతా ఆనందమే కాని దుఃఖము లేదు. ఆకాశము నందు నటనము నృత్య నృత్త నాట్యమయమైన, పద భావ రసాత్మకమైన నటనము చేయువాడు ఆ సదాశివుడు. ఆనంద నటనముచే ప్రకృష్టమైన పరిపూర్ణమైన కాశమును అనగా వెలుగును ప్రసరింప చేయువాడు. అట్టి వెలుగులో చిత్ సభాభవనమున తానే ఆశీనుడై ఉండువాడు. చిత్సభేశం జ్ఞానస్వరూపిణియైన మాతృక. ఆమెయే సకలమైన భాసము కలది. సభా అట్టి సకల ప్రభారూపమైన జ్ఞాన స్వరూపిణికి ఈశ్వరుడు సత్ స్వరూపుడు పరమాత్మ. ఆ మహానుభావుడు శివశక్తి స్వరూపుడు. కామవల్లి - కామకల, కామకోటి. శివునితో కూడిన కామకోటి స్వరూపమైన ఈశ్వరుడు శివకామ వల్లీశుడు. అట్టి శివకామ వల్లీశుని ఆశ్రయించుచున్నాను అని దీక్షితుల వారు పల్లవిలో వాక్రుచ్చిరి.

శివకామ వల్లీశ అను పదములో శ్రీ విద్యామంత్ర బీజాక్షర సంపుటి. భావిత మగుచున్నది. ధ్యాన సమాధి నిష్ఠులైన దీక్షితుల వారు తన ప్రాణములన్నింటినీ మనసున లగ్నము చేసి ధ్యానమున నుండగా ఆ తన్మయ స్థితిలో ఈ పల్లవి పల్లవించి ఆనందము చివురు తొడిగినట్లున్నది.

చిదంబరమునకు పుదియూర్, వ్యాఘ్రపురము, పొన్నంబళం అను నామములు కలవు. పోణ్ అనగా బంగారము. చిదంబరములోగల సభామండపము బంగారముతో నిర్మింపబడినది కలదు. శివుడు అచట ఆనంద తాండవము చేసెనని ప్రసిద్ధి. తాండవము ఏడు రకములని చెప్పుదురు. 1. ఆనంద, 2. సంధ్య, 3. ఊర్ధ్వ, 4. గౌరి,

5. కౌలిక, 6. త్రిపుర, 7. సంహార తాండవములు. వీనిలో ఆనంద తాండవము శ్రేష్ఠమైనదని చెప్పుదురు. ఈ ఆనంద తాండవము సృష్టి, స్థితి, లయములతో కూడినదని స్థల పురాణము నందు కలదు.

అనుపల్లవిలో దీక్షితుల వారు "భాను కోటి కోటి సంకాశం" అనిరి. భానుడు (సూర్యుడు) భాను ప్రకాశమే ఇచ్చును. అంతకు కోటిరెట్లు భానుడు దీపించినచో ఆ వెలుగు ఎట్లుండునో అట్టి వెలుగు తన అనుభవములో చూచి అది భక్తి ముక్తి ప్రదమైన దహరాకాశముగా కనుగొనినారు దీక్షితుల వారు.

అనగా ఆకాశమంతటి పరమాత్మ తన చిన్న హృదయాకాశము నందు తనలోనే ఇమిడి ఉండుటచే తనవంటి దీనజనులను సంరక్షించుటలో ఎంతటి సమర్థుడో తెలియుచున్నదనిరి. పరమాత్మ తన భక్తుల కొఱకై తన్ను తాను సంకుచించుకొను స్వభావము ఎన్నడునూ ఉన్నదియే. దివ్యరూపులైన పతంజలి వ్యాఘ్రపాద మహర్షులు తన్ను దర్శించుకొనగా కుంచితములైన పద్మముల వంటి చరణములు కలవాడైనవాడు ఆస్వామి. ఎక్కడనో, ఎంతగనో ఉన్న స్వామి ఇంతగా అణువుగా ఉండు లక్షణముచే భక్తులకు అందుబాటులో నున్నాడని దీక్షితులవారు అనుపల్లవిలో పేర్కొనిరి.

ఇచట దీక్షితుల వారు పతంజలి, వ్యాఘ్రపాద మహాఋషులను పేర్కొనుటలో ఒక విశేషము కలదు. పూర్వం దారుకావనములో పెక్కుమంది ఋషులు విద్యాగర్వముతో ఉండెడివారట. ఒక దినమున శివుడు మోహనరూపముతో, విష్ణువు మోహినీ రూపము ధరించి ఆ వనములో విహరించు చుండిరి. శివుని జూచి ఋషిపత్నులు, మోహినిని జూచి ఋషులు ముగ్ధులై చపలచిత్తులైరి. వారి భార్యలు శివుని వెంట పడుట చూచి ఋషులు వారి తపోబలముతో ఒక వ్యాఘ్రమును సృష్టించి వానిని సంహరించుటకు వదలివేసిరి. శివుడా పులి చర్మమును ఒలిచి వస్త్రముగా ధరించెను. తరువాత వారు సర్పమును పంపగా శివుడు దానిని హారముగా ధరించెను. ఆ తరువాత ఋషులు 'మూయలకుడు' అనే రాక్షసుని పంపగా శివుడు అతనిని సంహరించెను. అంత ఋషులు ఓటమిని అంగీకరించిరి. అప్పుడు శివుడు దేవతల ముందు ఋషుల ముందు నృత్యము

చేయుట ప్రారంభించినాడు. ఈ నృత్యమును తిలకించవలెనని ఆదిశేషుడు విష్ణువును కోరెను. విష్ణువు ఆదిశేషునితో తపస్సు చేసి శివుని యొక్క అనుమతిని పొందుమని చెప్పెను. ఈ ఆదిశేషుడు భూలోకములో పతంజలిగా జన్మించి చిదంబరములోని శివుని తాండవము చూచుటకు తిలైవనమునకు వచ్చినట్లు స్థలపురాణ కథనము.

'వ్యాఘ్రపాదుడు' అనే ఋషి 'మధ్యందిన' అను ఋషి కుమారుడు. తండ్రి ఆదేశముపై స్వయంభూలింగమునకు పూజ చేయుటకు తిలైవనమునకు వచ్చెను. అచట ఒక వృక్షము క్రింద స్వయంభూలింగమును గాంచెను. ఆ శివునకు తుమ్మెదలు ఆఘ్రాణించని పుష్పములతో పూజింపవలెనని ఆతని కోరిక. దానికొఱకై శివుని గూర్చి తపమాచరింపగా శివుడు అతనికి వ్యాఘ్రపు పాదములను ప్రసాదించెనట. వాటి వలన ప్రాతఃకాల సంధ్యాసమయమునకు ముందే చెట్లు ఎక్కి పుష్పములు కోసి శివునకు అర్చన చేసెడివాడట. అందువలన అతనికి వ్యాఘ్రపాదుడని పేరు వచ్చినట్లు ప్రసిద్ధి.

శివుడు పతంజలి, వ్యాఘ్రపాదులకు తననాట్యము చూడవలెననెడి కోరికను తీర్చవలెనని అనుకొనగా అక్కడి దేవతయైన కాళిక అభ్యంతరము తెలుపగా వారిద్దరు కలసి నృత్యము చేయుట ప్రారంభించిరి. ఆ సమయములో శివుని కుండలము జారిపడగా ఎవ్వరునూ గుర్తించకుండా నృత్యము చేయుచు ఆ కుండలములను తీసి తిరిగి ధరించెను. అంత కాళిక తన ఓటమిని అంగీకరించెను. శివుడు నటరాజరూపము ధరించి నృత్యము చేసెను. దానిని ఆనందనటనము అందురు. ఈ ఆనందనటనమును పతంజలి, వ్యాఘ్రపాదుడు, శివకామవల్లీ, ఇంద్రాది దేవతలు తిలకించి ఎప్పటికి చిదంబరములో ఈ నృత్యము చేయవలెనని శివుని కోరిరి. ఆ మండపమే నేటి పున్నంబళముగా పిలువబడు చున్నట్లు స్థలపురాణము చెప్పుచున్నది.

చిదంబరములోని దేవాలయములో మధ్య నటరాజమూర్తి ఒక ప్రక్కన శివకామవల్లీ, మరి యొక్క ప్రక్కన ఆకాశలింగము ఉండును. ఆకాశము శూన్యము కనుక మనకి అక్కడ లింగము గోచరింపదు. కాని మకరతోరణము, ముందు త్రిశూలము గోచరించును. ఈ గర్భగుడిని చిత్సభ అందురు. ఈ సభకు ఈశుడు కనుక ఆ పరమేశ్వరుడు

చిత్సభేశుడు. ఈ చిత్సభ (గర్భగుడి)లో ప్రవేశించుటకు గల ఐదు మెట్లను శివపంచాక్షరి మంత్రము 'నమశ్శివాయ' గా చెప్పుదురు. శివుని హస్తములోని ఢమరుకము భావిప్రపంచమునకు గుర్తుగా నున్నది. ఆ ఢమరకశబ్దము నుండి ఓంకారము పుట్టినదని అందుకు శివుడు ఆ ఢమరుకమును పదునాల్గు సార్లు వాయించెనట. అది పాణినికి పదునాల్గు సంస్కృత సూత్రములుగా వినిపించినదని, వానినే మహేశ్వర సూత్రములనియందురు. అవియే సంస్కృత వ్యాకరణము మూలసూత్రములని స్థలపురాణగాథ.

శ్రీ దీక్షితుల వారు చరణములో 'శీతాంశుగంగాధరం నీలకంధరం' అనిరి. శివుని శీతాంశుని అనగా చంద్రుని, గంగను, ధరియించినవాడని, శ్రీ క్షేత్రము, కేదారము మొదలగు క్షేత్రములకు ఆధారమైనవాడు. శివుడు పంచ భూతములకు, సర్వప్రాణులకు ప్రభువగుటచే భూతేశునిగా దీక్షితులవారు పేర్కొనిరి. శార్దూల చర్మమును ధరించియు చిత్తునే అంబరముగా ఆవరణగా చేసికొన్నవాడు. చిదంబరమున భూసురులైన త్రిసహస్ర సంఖ్యలో నున్న మునులకు, అర్చక స్వాములకు ఈశ్వరుడు. అతడే విశ్వమునకంతకు ఈశ్వరుడు. ఈ శివుడు వెన్నవలె కరగి పోవు హృదయము కలవాడు, మొదటివేల్పు అయిన వాడు, వేదములకు వేద్యుడైనవాడు. అట్టి శివకామవల్లీశుని ఆశ్రయించుచున్నానని దీక్షితుల వారు చరణములో పేర్కొనిరి.

దీక్షితులవారు మధ్యమకాలసాహిత్యములో శివుడు అర్ధనారీశ్వరుడయ్యు రాగము లేనివాడనిరి. అనగా సంసార బంధములు విడనాడిన వాడు, కొలతకు అందనివాడు. ద్వంద్వములకు అతీతుడైనవాడు. అద్వైతమునకు ప్రతి పాద్యుడైనవాడు అనిరి. అట్టి ఏకైక స్వరూపుడయ్యు సంగీత వాద్య వినోద తాండవము కలిగిన స్వర, వర్ణ, పద, వాక్య, రాగ, యోగ, త్యాగ, భోగ, వివిధ భేదములచే అచ్చెరువుగొల్పువాడు. ఏకరూపుడై బహువిధముల, బహుగతుల, బహుగమకములచే జగత్తును భ్రమింపచేయు వాడని దీక్షితులవారు ఆ సదాశివుని స్తుతించిరి.

'ఆనందనటన ప్రకాశం చిత్సభేశం ఆశ్రయామి శివకామవల్లీశమ్' అని ధ్యాన నిమగ్నుడైన దీక్షితుల వారు ఆకాశమంత ఆనందమయుని తన హృదయాకాశము నందు కనుగొని, ఆ ఆనందమున తన ప్రాణములను అక్షరమయమైన కీర్తనగా అవతరింప చేసినారు.

ఇచట సౌందర్యలహరిలో శంకర భగవత్పాదుల వారు చెప్పిన శ్లోకమును అనుసంధానము చేసికొనవలెను.

శ్లో॥ మనస్త్వం వ్యోమ త్వం మరుదసి మరుత్సారథి రసి
త్వ మాప స్త్వం భూమి స్త్వయి పరిణతాయాం నహి పరం
త్వమేవ స్వాత్మానం పరిణమయితుం విశ్వవపుషా
చిదానందాకారం శివయువతి భావేన బిభృషే॥[1]

పరమేశ్వరుని చిదానందాకారమును శివయువతి భావముచే తన స్వరూపము విశ్వాకారముగా పరిణమింప చేసికొను లక్షణము శంకర భగతత్పాదులు వర్ణించిరి. ఓదేవి! శివయువతీ ఆజ్ఞాచక్రము నందున్న ఆకాశతత్త్వము నీవే. అనాహత చక్రమునందున్న వాయుతత్త్వము నీవే. స్వాధిష్ఠాన చక్రము నందలి అగ్నితత్త్వము నీవే. మణిపూర చక్రమునందలి జలతత్త్వము నీవే. నీకంటే వేరైనది మరేదియు లేదు. నీవే స్వస్వరూపమును ప్రపంచరూపముగా తాదాత్మ్యముతో పరిణమింప చేయుటకు గాను చిదానందాకార శివతత్త్వమైన బ్రహ్మస్వరూపమును ఆనంద భైరవుని స్వరూపమును ధరించుచున్నావు.

ఇది ఆకాశమునందలి ఆనంద భైరవీ లయ రూపమైన తత్త్వము. దీనిలో శకార ప్రాస కలదు. 'వః' అను అనుప్రాస 'ఈశం' అను యమకము, ప్రకాశం, సంకాశం, ఆకాశం, అను ఉపసర్గ పూర్వక కాశధాతువు, వివిధార్థగతి స్ఫురణముచే సాహిత్య సౌరభమును ప్రకాశింపచేసినది. హృదయం - తాతమాద్యం - వేదవేద్యం - ప్రతిపాద్యం, ఇవి ఈ కీర్తనలోని అనుప్రాసల అందచందములు.

---

1. సౌ.ల. శ్లో. 35. పుట 249

మూలాధారమున లాస్యపరమైన ఆనందభైరవి యందు మహానట భైరవుడు తాదాత్మ్యము చెందుట జగత్ సృష్టికి మూలమైనది ఈ ఇరువురి చేతను జగత్తు జనకజననీ వంతమగుచున్నది. అనగా పరమేశ్వరుడు సృష్టి స్థితి, లయమయ లీలా వినోదనోద్యుక్తుడు విమర్శరూపిణియైన ఆనందభైరవి యందు అంతర్లీనమై యున్నాడు. అప్పుడు సృష్టి ఇది మూలాధారమునందలి స్థితి మనస్తత్త్వమైన ఆజ్ఞాచక్రము నందు ఆకాశ స్వరూపుడైన పరమేశ్వరుని యందు మహాభైరవీ లీనమగుట మనోలయము.

ఆకాశలింగమునందు మహాభైరవి ఆనందభైరవ రూపమున ఏకమై యున్నది. ఇదతి మలోలయమునకు ఆధారభూతము. దీని తరువాత స్థితి సహస్రార బిందువున చంద్రికాశ్రావము.

★★★

## 2. వాయులింగము

హంసేనిరాగము ఝంపెతాళము

22.వ మేళకర్త జన్యము

పల్లవిః- శ్రీకాళహస్తీశ శ్రితజనావన ।
సమీరాకార మాంపాహి రాజమౌళే ఏహి॥ ॥శ్రీకాళహస్తీశ॥

అ॥పః- పాకారి, విధి, హరి ప్రాణమయకోశా
నిరాకాశ భూమి సలిలాగ్ని ప్రకాశ శివ॥ ॥శ్రీకాళహస్తీశ॥

చరణముః- జ్ఞానప్రసూనాంబికాపతే
భక్తాభిమాన దక్షిణ కైలాసవాసాఽ
భీష్ట దాన చతురకరాబ్జ దీన కరుణానిదే
సూనశర సూదనే జ్ఞానభవ పశుపతే ।
జ్ఞాన గురుగుహ సచ్చిదానందమయమూర్తే
హీనజాతి కిరాతేన పూజిత కీర్తే ॥ ॥శ్రీకాళహస్తీశ॥

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు వాయులింగ రూపమున ఉన్న శ్రీకాళహస్తిలోని ఈశ్వరుని స్తుతించుచు సంబోధన ప్రధమావిభక్తిలో కృతిని రచించిరి.

" నమస్తే వాయో త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి

త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మ వరిష్యామి"

అని వేద ఋషులు స్తుతించిన రీతిగా దీక్షితుల వారు ప్రత్యక్ష బ్రహ్మములై వాయు రూపమున నున్న శ్రీ కాళహస్తి క్షేత్ర స్వామిని స్తుతించిరి. పల్లవిలో శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆశ్రితులను రక్షించువాడనిరి. వాయువే తన ఆకారముగా కలిగినవాడు అనుటను 'సమీరాకార' అనుదానిలో సూచించిరి. చంద్రుని తలపై ధరించిన ప్రభూ! రమ్ము నన్ను పాలింపుము అని ప్రార్థించిరి. సమీరాకారుడైన స్వామి గురించి ఏమి చెప్పవలయుననినా గాలికి ఆకారము లేదు. వాయువును జగత్తు యొక్క ప్రాణము అందురు.సమస్త జీవ రాసుల యందు వాయువనగా ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములను పేర్లతో వాయు పంచకస్థితి కలదు. అవియే ప్రపంచ ప్రాణములు. ఈ పంచప్రాణములు తానైనవాడు ఆస్వామి. ఇది వివరముగా దీక్షితుల వారు అనుపల్లవిలో మరియొక రీతిగా సూచించుచున్నారు.

దీక్షితుల వారు అనుపల్లవిలో 'పాకారివిధి హరిప్రాణమయ కోశ' అనుటలో ఇంద్రుని యొక్కయు, బ్రహ్మయొక్కయు, విష్ణువు యొక్కయు, ప్రాణమయకోశ - అనిన పంచప్రాణములతో నిండిన కోశమే తన ప్రాణమయ కోశముగా నున్నవాడు. అనగా ఇంద్రాది దేవతలందరు తన ప్రాణములుగా వారే తానుగా తానేవారుగా నున్నవాడు శ్రీకాళహస్తీశ్వరుడనిరి. నిరాకాశ - ఆకాశము లేని అనగా వాయువే సర్వము. అచట ఆకాశము వాయు రూపమున విలీనమైయున్నది. అట్టిస్థితిలో భూమికి సన్నిహితుడై సలిలమున నిమగ్నుడై, అగ్నిప్రకాశము కలిగినవాడై శివుడై యున్న ఓకాళహస్తీశ్వరా నన్ను పాలింపుమనిరి దీక్షితులవారు.

భూమి, సలిల అగ్నులను దాటిన తరువాత వాయువు. ఈ వాయువు సర్వప్రాణుల యొక్క ప్రాణము. ఆప్రాణమే శివ స్వరూపము. అట్టి శివస్వరూపమైన వాయువునకు ఆకాశమున విలీనమగుట అనగా ఆకాశమున వ్యాపించినచో ప్రాణమయ

రూపమున సకల ప్రాణి కోటియందు కుంభింపబడియుండుటకు అవకాశము లేదు. అదియే నిరాకాశపదముచే సూచితమైనది. అట్టి సర్వజగత్ ప్రాణము భూమిని, జలమును, అగ్నిని ప్రాణవంతము చేయుచున్నది. అదియే వాటి ప్రకాశము. భూమి సలిలాగ్నులను తేజోవంతము చేయు శివా। శ్రీకాళహస్తీశ అని ప్రాణాయామ నిష్ఠుడైయున్న దీక్షితులవారు యోగ సాధనలో వాయులింగమును తన ఆత్మలింగముగా భావించుట ఈ కీర్తన యందు స్పష్టమగుచున్నది.

శ్రీకాళహస్తి క్షేత్రమున వలయాకారముగా పర్వతములు పఱచుకొని యుండగా మధ్యన పానవట్టమునందు లింగముగా నొక కొండయున్నది. ఆ కొండయే శివలింగము. దేవతలందరు వాయు మార్గమున వచ్చి తమ సమాధి నిష్ఠచే పరమేశ్వరుని అభిషేకింతురని, అచటనే శ్రీకాళహస్తీశ్వరుడు వెలసియున్నాడని ఒక ప్రతీక. అట్టి పర్వతము ఇప్పటి గుడికి ఆరుకోశముల దూరమున ఉన్నది. దేవతలు వచ్చి ఇప్పటికిని అచటస్వామికి అభిషేకము నిర్వహించి పోవుచుందుదురని దానిని దర్శించుటయే యాత్ర పరమార్థమని ప్రసిద్ధము. దీనిని దీక్షితుల వారు జ్ఞాననేత్రముచే దర్శించి, అనుభవించి చెప్పినట్లుగా నున్నది ఈ అనుపల్లవి.

చరణములోని 'జ్ఞానప్రసూనాంబికాపతి' అనగా జ్ఞానమే ప్రసూనము. ఆ జ్ఞాన ప్రసూనమే తన స్వరూపముగా గల తల్లి అంబిక. జగదంబిక. ఈ అంబిక తెలియని సంసార సాగరమున కొట్టుమిట్టాడునట్టు చేసెడి తల్లి. యావత్ మానవాళిని ఉద్ధరించు జగజ్జనని. ఎన్ని జన్మలెత్తినను తానే తల్లి కాని జన్మజన్మలలో ఎందరెందరో తల్లులు ఆ తల్లులకు తల్లి జగత్తునకు తల్లి ఈ అంబిక. మరి ఆమె తన మాయకు లోబడనివానిని, తన మాయ తెలిసిన వానిని జ్ఞానమార్గమున బ్రహ్మమయునిగా, ఆనందవల్లీ ప్రసూనముగా పరమాత్మ తోడి సాయుజ్యమున్న పరిమళింప చేయును. ఈ రెండు అనుభవములకు మానవునిగా దీక్షితుల వారే సాక్షీభూతులు, మేటి అనుభవజ్ఞులు. కీర్తన కొఱకు కొన్ని పదములు కూర్చి పలికిన పాండిత్యవంతులు కారు దీక్షితులవారు. ఈయన అనుభవమున పండిన పండితుడు. పల్లవి, అనుపల్లవులలో చెప్పిన మహావిషయము వెంటనే చరణమున

'జ్ఞాన ప్రసూనాంబికా పతే' అని అనినారనిన ఆ జ్ఞాన ప్రసూనపు వాసనను పసిగట్టి మనము అర్ధము చేసికొని భావించినచో లభించునది అమృతమే.

ఆ జ్ఞానప్రసూనాంబికాపతి ఉత్తర కైలాసమున నున్నచో భక్తులు తన్ను చేరుకొనగలరా? కనుక తాను భస్మధారియై విరాగియైనను భక్తులపై అభిమానముతో తాను ఉత్తర దిశ కైలాసము వీడి దక్షిణ కైలాసమున భక్తాభీష్టసిద్ధికై ఇచ్చట వేంచేసి స్థిరనివాసియైనాడు. కాపురమే అభీష్టమైనదిగా చేసికొన్నాడు. నత్కీరునివంటి శాపగ్రస్తులు కైలాసమనగా దక్షిణ కైలాసము కూడా కైలాసమేనని సేవించి శాపవిముక్తులై తరించినారు. అట్టి కరుణామయుడు, మోక్షప్రదుడు చతురమైన కరపద్మము కలవాడు. తన్ను దర్శనము చేసికొనువారికి మోక్షమునే దక్షిణగా నిచ్చు 'దీన చతుర కరాబ్జుడు'. దీనులపాలిటి పెన్నిధి. కామమను సూన శరములచే ప్రకోపింపచేయు మన్మధుని భస్మము చేసినవాడు. అనగా తన భక్తులను కామక్రోధాది అరిషడ్వర్గముల నుండి కాపాడునట్టి కరుణానిధి. అందుచే జ్ఞానము కలిగిన పశువులకు తానుపతియై తన పశుపతిత్వమును సార్ధకము చేసికొన్నవాడు. అట్టి ఆ పశుపతి జ్ఞానమే గురుగుహునిగా సచ్చిదానందమైన మూర్తితో వెలుగొందుచున్నవాడు కేవలము అతి నిష్ఠాగరిష్ఠులనే కాక తిన్నడువంటి నిమ్నజాతి వారిని కూడ ఉద్ధరించి పునీతులను, మోక్షప్రదులను చేసిన కీర్తి ఈస్వామికే దక్కినది.'' అట్టి రాజమౌళీ! నీవు నన్ను రక్షింపుము'' అని దీక్షితుల వారు వాయు భూతలింగ రూపధారుడైన శ్రీకాళహస్తీశ్వరుని అనేక విధాములుగా స్తుతించిరి.

సాహిత్యము, వేదాంతము, శ్రీవిద్య కాదు పండిన తన అనుభవమే ఒక పూలతీగ వలె సాగినది. అదియే ఆనందమైనట్టి ఆనంద వల్లిగా తన తనువును భూమి నుండి ఆకాశమువరకు గొనిపోయి ఎచట ఏ అనుభవముండునో అచట ఆ అనుభవమును విస్తరింపచేసికొనిరి. జ్ఞానప్రసూనమును పూయించుకొన్నవాని ఆత్మావిష్కార రూపమైన అక్షర సముదాయమే, స్వర రస సంపుటియే, భావరాగ, యోగమే శ్రీదీక్షితుల వారి భోగము.

ఈ క్షేత్రమును గూర్చి 'ధూర్జటి మహాకవి, శంకరాచార్యులవారు మహోన్నతముగా కొనియాడిరి. ఈకృతిలోని చరణము చివరగల ''హీనజాతి కిరాతేన పూజిత కీర్తే'' అనునది

భక్తకన్నప్ప చరిత్రను స్ఫురణకు తెచ్చును. ఈ క్షేత్రమును గురించి ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకమును రచించిరి. ఈ కృతిలోని దీక్షితుల వారి భావము ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకములోని -

" ఏవేదంబు పఠించెలూత భుజగంబే శాస్త్రముల్ జూచెదా
నే విద్యాభ్యసనం బొనర్చె కరి చెంచేమంత్ర మూహించె బో
ధావిర్భావ నిదానముల్ చదువులయ్యా గావు నీపాద సం
సేవా సక్తియే గాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా॥

అనుశార్దూల పద్యమునందు ద్యోతకమగుచున్నది.

★★★

## 3. తేజోమయలింగం

సారంగరాగము రూపకతాళము

29.వ.మే.జన్యము

పల్లవిః- అరుణాచలనాథం స్మరామి అనిశం
అపీత కుచంబా సమేతం ॥ ॥అరుణా॥

అ॥ప॥ః- స్మరణాత్కైవల్యప్రద చరణారవిందం ।
తరుణాదిత్య కోటిసంకాశ చిదానందం ॥

మ॥సా॥ః- కరుణారసాదికందం - శరణాగత సురబృందం ॥ ॥అరుణా॥

చరణముః- అప్రాకృత తేజోమయ లింగం । అత్యద్భుత కరధృత సారంగం।
అప్రమేయమపర్ణాబ్జ భృంగం । ఆరూఢోత్తుంగ వృషతురంగం।
విప్రోత్తమ విశేషాంతరంగం । వీర గురుగుహ తార ప్రసంగం ।
స్వప్రదీప మౌళివిధృతగంగం । స్వప్రకాశజిత సోమాగ్నిపతంగం॥అరుణా॥

శ్రీ దీక్షితుల వారు అరుణాచల క్షేత్రమున తేజోమయ లింగరూపమున నున్న పరమేశ్వరుని స్తుతించుచు ద్వితీయా విభక్తిలో ఈ కృతిని రచించిరి. పల్లవి ప్రారంభమున అరుణాచలనాథం అనుచు ఆ క్షేత్రనామమును నిక్షేపించుట విశేషము. తేజోమయ లింగ

స్వరూపుడు అరుణాచల నాథుడు. ఆ స్వామి అపీత కుచాంబా సమేతుడు. ఆమె జగమంతయు బిడ్డలను కన్న మొట్టమొదటి తల్లి. ఆమె తన చూపులతోనే బిడ్డలను పోషించగలది. వారు ఆది దంపతులు. వారికి మన పార్థివ రూపములుండవు వారివి తేజోరూపములు. అరుణాచలమున స్వామి తేజోరూపుడు. ఆయన అర్ధాంగియు తేజోవతి. ఆమె శరీరము శివుని శరీరము. ఆమె వక్షోరుహము సూర్యచంద్రులు. 'శంకర భగవత్పాదుల' వారు సౌంద్యలహరిలో -

"శరీరం త్వం శంభోః శశి మిహిర వక్షోరుహ యుగం" [1]

అని చెప్పినారు. ఆమె కుచయుగ్మము చంద్రుడు సూర్యుడు కాగా ఆ సూర్యచంద్రులు జగత్తునకు పోషకులు. కనుక ఈ అరుణాచల నాథుడు ఎల్లప్పుడు తేజోమయుడు. ఆ అపీత కుచాంబ తేజోవతి. వీరి తేజస్సులందు స్త్రీ, పుం విభాగము కేవలము శివ అర్ధ నారీశ్వర భవ నిష్టయే కాని దేహ నిష్టము కాదు అని దీక్షితుల వారు పల్లవిలో వాకృచ్చిరి.

అనుపల్లవిలో దీక్షితుల వారు "స్మరణాత్కైవల్య ప్రద చరణారవిందం" అనిరి. స్మరణ మాత్రమున కైవల్యము నిచ్చు చరణ అరవిందము కలవాడు. అనగా ఆస్వామి పాదపద్మములు సేవించనక్కరలేదు, స్మరించినంతమాత్రమున కైవల్యమును ఇచ్చువాడు. తరుణ ఆదిత్యుడు. కొన్ని కోట్లసూర్యుల కాంతిపుంజము వంటి తేజస్సు గల చిదానందుడు అనిరి. ఇంత చండ ప్రచండుడైన ఆ స్వామి కరుణారసమునకు మూలము. శరణజొచ్చిన సురబృందము కలవాడు.

ఇది ప్రకృతిలో గోచరించునది కాని తేజోమయ లింగము అత్యంత ఆశ్చర్యకరముగా లేడి రూపమును ధరించిన యజ్ఞమును తన చేతపట్టుకొనినాడు. దక్షుని అపరాధముచే యజ్ఞమును ధ్వంసము చేయ పూనుకొనిన శివదూతయైన వీరభద్రుని నుండి పారిపోవుటకు యజ్ఞము లేడి రూపమును ధరించెను. అట్టి ఆ లేడిని తన చేత పట్టుకొనిన వాడు ఈ తేజోమయమైన దైవము. అప్రమేయము - కొలత వేసి చెప్పుటకు అలవికాని ఒక భృంగమైన లింగము తేజోమయలింగము. అపర్ణయను అబ్జముపై వ్రాలిన భృంగము.

1. సౌ.ల.శ్లో. 34 పుట 239

లింగరూపమున నున్న స్వామి మిక్కిలి ఎత్తైన వృషభరాజమునే వాహనముగా చేసికొని దానిపై ఎక్కి విహరించువాడు. ఆ వృషభము -

**"చత్వారి శృంగాః త్రయశ్యపాదాః త్రిధా బద్ధో రోరవీతి"** ఇత్యాదిగా చెప్పబడిన వేదరూపమైనది. అనగా వేదముపై నున్నవాడు వేద వైద్యుడు. విప్రోత్తములలో విశేషముగా గుర్తింపబడువారు జ్ఞానులు. వారి అంతరంగమే తన నివాస రంగము. అనగా జ్ఞానియే తానైనవాడు. దీక్షితుల వారు 'వీర గురుగుహ తార ప్రసంగం' అనుటలో మంత్ర వీరుడైన గురుగుహుని యొక్క తారారూపమైనవాడు. అనగా తారకరూపమైనవాడు. మంత్రమునందే ప్రకృష్టముగా కలయిక కలవాడు. ఈ శివుడు స్వయం ప్రభాభాసమానమైన తన మౌళి యందు ధరింపబడిన గంగను కలవాడని దీక్షితుల వారు పేర్కొనిరి. ఆ శివుని ప్రకాశము తరుణాదిత్య కోటి సంకాశము. కనుక అట్టి తన ప్రకాశము చేత సోముని అనగా చంద్రుని, అగ్నిని, పతంగుని (సూర్యుని) మించినవాడు. వివిధ వెలుగుల కన్నింటికి అందని ఏకాకృతి వెలుగు వెలుగువాడు. ఇచట సౌందర్య లహరిలో శంకర భగవత్పాదుల వారు చెప్పిన శ్లోకము భావింపదగియున్నది.

శ్లోకంః- "తవాజ్ఞా చక్రస్థం తపన శశికోటి ద్యుతి ధరం
పరం శంభుం వందే పరిమిళిత పార్శ్వం పరచితా"[1]

నీ యొక్క (నీ సంబంధమైన) ఆజ్ఞా చక్రమునందున్న పరయగు చిచ్ఛక్తి చేత కలసిన పార్శ్వద్వయము కలవాడు, పరుడను పేరుగల శివుని గూర్చి నమస్కరించుచున్నాను. అను ఈ భావమే దీక్షితుల వారు ఈ కీర్తన యందు పోహళించిరి. ఈ అపీత కుచంబసమేత శంభువే "పరిమిళిత పార్శ్వం పరచితా పరం శంభుం వందే" అన్న శంభుడు. అరుణాచలక్షేత్రము జ్ఞానికి సహస్రారబైందవి (బిందు) స్థానము నందలి ఐందవమైన అనుభవస్థానముగా చెప్పబడినది. ఐందవము అనగా చంద్రుడు.

అరుణాచల క్షేత్రమునకు తిరువన్నామలై అను నామాంతరము కలదు. ఇచటగల తేజోమయ శివలింగమునకు కార్తీక, చైత్ర మాసములలో ఉత్సవము జరుగును.

---

1. సౌ.ల.శ్లో. 36 పుట 257

ఒకసారి బ్రహ్మ, విష్ణువులలో ఎవరు అధికులని తేల్చుకొనుటకు వాగ్యుద్ధము జరుగునపుడు ఆకాశములో జ్యోతి దర్శనమయ్యెను. దాని తుది మొదలు తెలిసికొనుటకు బ్రహ్మ హంస రూపంలో పై లోకములకు, విష్ణువు వరాహరూపములో క్రింది లోకములకు వెళ్ళిరి. కాని ఆ జ్యోతి తుది మొదలు తెలిసికొనలేక తుదకు జ్యోతి దగ్గరకు వచ్చి ప్రార్థించగా సదాశివుడు స్థావరరూపములో వెలసినాడు. అదియే అరుణాచలము అని స్థలపురాణము నందు కలదు.

ఇది కృతయుగంలో జ్యోతి రూపమున, త్రేతాయుగములో - నగలకొండగా, ద్వాపరయుగములో - బంగారముతో కూడిన కొండ, కలియుగములో మరకతముగా మారినదని పురాణ ప్రసిద్ధి. ప్రస్తుతము కొంచెము ఎరుపు డాగులతో రాగివలె గోచరించుచున్నది. కృత్తికా నక్షత్రము నాడు పార్వతికి శివుడు జ్యోతిరూపమున దర్శనమిచ్చునని స్థలపురాణము నందు కలదు.

★★★

## 4. ఆపోలింగం (జలలింగం)

యమునా కల్యాణి రాగము — త్రిశ్రజాతి ఏకతాళము

65వ. మేళకర్త జన్యము

పల్లవిః- జంబూపతే మాంపాహి

నిజానందామృత బోధం దేహి॥ ॥జంబూ॥

అ॥ప॥ః- అంబుజాసనాది సకల దేవనమన।

తుంబురునుత హృదయ తాపోఽపశమన ।

అంబుధి గంగా కావేరీ యమున।

కంబుకంర్యఖిలాండేశ్వరీ రమణ ॥జంబూ॥

చరణముః- పర్వతజా ప్రార్థితాప్సు లింగవిభో ।

పంచభూతమయ ప్రపంచ ప్రభో ।

సర్వజీవ దయాకర శంభో ।

సామజాటవీ నిలయ స్వయంభో ।

శర్వ కరుణా సుధాసింధో ।

శరణాగత వత్సలార్త బంధో ।

నిర్వచనీయ నాద బిందో।

నిత్యమౌళి విధృత గంగేందో ।

మ॥సా॥ః- నిర్వికల్పక సమాధి నిష్ఠ శివ కల్పకతరో ।

నిర్విశేష చైతన్య నిరంజన గురుగుహ గురో ॥ ॥జంబూ॥

శ్రీరంగ క్షేత్రమునకు మైలున్నర దూరమున జంబుకేశ్వర క్షేత్రము కలదు. అచటగల శివునిపై దీక్షితుల వారు ద్వితీయ విభక్తిలో కృతిని రచించిరి. జంబుకేశ్వరమున గల ఆపోలింగ స్వరూపుడవైన ఓ జంబూపతి! నన్ను రక్షింపుము. భక్తుని హృదయమే ఆనందామృత మయము. అందులోని బోధము శివజ్ఞానము. తన హృదయమునే ప్రవాహముగా చేసికొని దానిలో శివలింగమును దర్శించినచో ఎట్లుండునో అట్టి సమాధి స్థితి నిజానంద అమృత బోధము అని ఊహించుకొన్నచో పరమాత్మ పంచభూతాత్మకమైన శరీరమున లీనమై యుండుటను భావించవచ్చును. దీనిని దీక్షితుల వారు పల్లవి యందు పేర్కొనిరి.

అనుపల్లవిలో దీక్షితుల వారు ఆ స్వామిని అంబుజాసనుడు అనగా బ్రహ్మ. బ్రహ్మ మొదలైన దేవతలచే నమస్కరింపబడినవాడు. తుంబురుని చేత నుతింపబడి హృదయ తాపమును ఉపశమింప చేసినవాడు, అంబుధిని (సముద్రము) గంగను, కావేరిని, యమున మున్నగు సమస్తమైన పుంరూప, స్త్రీ రూపమైన జలరాసులను, ఆ జలరాసుల యందు పుట్టిన శంఖము ఆమె యొక్క కంఠముగా భావించినచో అట్టి లక్షణము చేత ఆ జలరాసుల వంటిదైన అఖిలాండేశ్వరి అని నామధేయము గల ఆ తల్లిని రమింపచేయువాడు అని ఆ స్వామిని దీక్షితుల వారు స్తుతించిరి.

ఈ అనుపల్లవి లో నమన, శమన, రమణ అనునవి క్రియా పదములు. మూడవ పాదమున గల 'యమున' నామవాచకము. మొదటి రెండు చరణములలో గల నమన,

శమనలకు అనుప్రాస కుదిరినది. మూడవ పాదమునగల 'యమున' అనునది ఆ రాగనామమును సూచించుచున్నది. అంబుధికి గంగా, కావేరి, యమునలు దేవేరులు. శివునకు అంబుధి, గంగా, కావేరిలతో గల అనుబంధము యమునకు శివునకు గోచరించుట లేదు. విష్ణువునకు గంగకు గల అనుబంధము జంబుకేశ్వరమున గల కావేరి జలము యందుండుటచే కావేరికి శివునకు గల సంబంధము ఈ రెండింటికిని గతియైన అంబుధికి గతియైనవాడగుటచే శివునకు అంబుధికి సంబంధము కలదు. కనుక అంబుధి గంగా కావేరులను నియమించువాడు. కంబుకంఠియైన అఖిలాండేశ్వరిని రమింపచేయువాడు ఆపరమేశ్వరుడు. ఆయన **"అనన్య కాంతా కమనీయమైన అంకము"** కలవాడని కాళిదాసు కుమార సంభవములో పేర్కొనిరి.

ఆ స్వామి యొక్క అంకముపైన ఈశ్వరికి తప్ప మరి యొకరికి స్థానము లేదు. ఆయన ఏకపత్నీవ్రతుడు. గంగను తలపై ధరించుట వివాహము చేత కాదు. ఆ గంగను ఆకాశమునుండి భూమికి అనుమతించినచో భూమి బ్రద్దలై పోవును. అందులకై తన జటాజూటమున ఆమె ప్రవాహ ఉధృతమును నియమించి నిబందించినాడు. జటాజూటము నందు ఒక పాయ సడలింపగా భగీరధుని కోరిక మీద గంగ ఒకపాయగా నేలకు ప్రాకినది. అది గంగను రమింపచేయుట కాదు. అట్లే కావేరి తనకు స్థావరముగా ఉండవలెనని నియమించినాడు. వీరిని నియమించుట అనగా అది అంబుధిని కూడా అందుకు కట్టుబడునట్లు చేయుటయే. జలము కూడ ఆ ఈశ్వరుని ఒక తనువు. కనుక తన తనురూపముగా ఈ జలరూపములను నియమించినవాడు. కనుక ఇచట యమున అనునది "యమునా కల్యాణి" రాగనామమును సూచించుచున్నదని చెప్పవచ్చును.

"పర్వతరాజ కుమార్తె అయిన పార్వతిచే ప్రార్థింపబడిన స్వామి! నీవు నీటియందు లింగరూపమున అవతరించినావు. నీవు పృథివి, అప్, తేజో, వాయువు, ఆకాశములను పంచభూతములతో ఏర్పడిన ప్రపంచమునకు ప్రభువు. ఈ పంచభూతములు కూడ నీవైయున్న స్వామీ! నీవు సర్వజీవుల యందు దయచూపించునట్టి శంభుడవు. దీక్షితుల వారు "సామజాటవీ నిలయ స్వయంభో" అనుటలో ఏనుగులు ప్రచురముగా నున్న

జంబూ ప్రాంత అటవిని నిలయముగా చేసికొని స్వయముగా అవతరించిన వాడవు" అనిరి. మరియొక భావమున సామవేదము నుండి 'జ' పుట్టిన అటవీ, స్వర, వర్ణ, పద, వాక్య రూప, వాఙ్మయ అటవియే నిలయముగా కలిగిన స్వయంభువు - అనగా సామవేద వేద్యుడైన ప్రభువు. ఈశ్వరుడు కరుణారస సముద్రుడు, ఆశ్రితజన వత్సలుడు, శరణాగత రక్షకుడు. అనిర్వచనీయమైన నాదమునకు కేంద్రమై శివశక్తి రూపమైన వాడు. నిత్యము మౌళి యందు గంగా, చంద్రులను ధరించువాడని చరణములో దీక్షితులు వారు జలలింగ రూపధారుడైన శివుని అనేక విధములుగా స్తుతించిరి.

మద్యమకాల సాహిత్యమున "నిర్వికల్పక సమాధి నిష్ఠ యందున్న శివనామధేయము గల కల్పవృక్షమా! నిర్విశేష చైతన్యము అనగా ఇతరముల చేతకాక తనంతట తాను స్వయం చైతన్య స్వరూపుడవైన, నీవు నిరంజనుడవు. గురుగుహునకు తండ్రియైన ఓ జంబూపతే! నన్ను బ్రోవు"మని దీక్షితుల వారు పేర్కొనిరి.

ఈ కీర్తనలో స్వామి జలమయమైన భూత ప్రకృతి లోని లింగ స్వరూపముగా భావింపబడినాడు. ఈ జంబుకేశ్వరమున అప్‌లింగ రూపమున కలడు. ఇక ఆనందామృతము, అంబుజాసనుడు, అంబుధి గంగా కావేరి, పర్వతజా, పంచభూత, కరుణా సింధూ, విధృత గంగేందు - అను విశేషణములన్నియు జల ప్రాచుర్యము కలవి. ఇచట దీక్షితుల వారు జలలింగరూపుడైన శివుని జలమువలే ద్రవ రూపమున నుండు వస్తు సమూహముతో కలిపి చెప్పుట ఒక చమత్కారము.

శివుడు జంబూ (నేరేడు) వృక్షము క్రింద వెలసినాడు కనుక ఆ శివునకు జంబుకేశ్వరుడని నామము ఇది పురాతనమైన దేవాలయము. ఇది శ్రీరంగమునకు అరమైలు దూరములో కలదు. ఈ గుడి ప్రాకారము విభూతి ప్రాకారమని, గోడలు విభూతి గోడలని చెప్పుదురు. శంభుముని జంబువృక్షములతో కూడిన అడవిలో తపస్సు చేయుచుండగా తెలుపురంగు జంబూఫలము ఆయన ముందర పడినదట! అది చూచి ఆ ముని ఆకర్షితుడై అపూర్వమైనదిగా మిక్కిలి మాధుర్యవంతమైనదిగా తలంచి దానిని శివునకు ఇవ్వదలచి కైలాసమున కేగెను. వెంటనే ఆ ఋషి ఉదరములో నుండి ఒక మొక్క ఉద్భవించి

క్రమముగా పెద్ద వృక్షమైనది. దానికి ఆ ఋషి చాలా సంతోషించి శివుని ప్రార్థించి తన వృక్షము క్రింద వెలువుమని కోరెను. అప్పుడు శివుడు శంభునితో మొదటి నుండి తపస్సు చేయుచున్న అడవికేగి తపస్సు చేయమని చెప్పెను. శంభుడట్లు చేయగా శివుడు ప్రత్యక్షమై శంభుని కోర్కెను తీర్చెను. అందువలన ఆ క్షేత్రమునకు జంబుకేశ్వరమని పేరు వచ్చినదని స్థల పురాణమునందు కలదు.

ఒక పర్యాయము పార్వతిదేవి తనకు కలిగిన సందేహములను నివృత్తి చేయుమని శివుని కోరెను. శివుడు ఆమెను జంబూవనమునకేగి తపమాచరింపుమని చెప్పెను. పార్వతి అచట కేగి నీటిలోని పరమాణువులతో లింగమును తయారు చేసి తపమాచరించెను శివుడామెకు దర్శన మొసంగి సందేహ నివృత్తి చేసెనట. అందువలన ఆ లింగమునకు అప్ (జల) లింగమని పేరువచ్చినదని ఒక ఉదంతము కలదు. కావేరీనది పొంగినపుడు దీనిలో నుండి జలము ఎక్కువగా వచ్చునని చెప్పుదురు. జంబుకేశ్వరములో శివుడు పార్వతి ఎదురెదురుగా నుండుటకు కారణము శివుని దగ్గరనుండి పార్వతి ఉపదేశమును పొందినదని, ఆ సమయమున ఈశ్వరుడు పడమర దిక్కును పార్వతి తూర్పుదిక్కును చూచుచున్నట్లుండుటచే ఆ విధముగా కలదని చెప్పుదురు. ఈ బాహ్య ప్రపంచములో దంపతులు ఏ విధముగా జీవించి తరించవలెనో శివుడు పార్వతికి ఉపదేశించినాడు అది వారు అవలంబించి మార్గదర్శకులుగా ఉన్నారని స్థల పురాణము నందు కలదు.

★★★

# 5. వృథివి లింగము

భైరవిరాగము　　　　　　　　　　　　　　　　　　　　　　　　　　రూపకతాళము

20.వ.మేళకర్త నరభైరవి జన్యము.

పల్లవిః- చింతయ మాకంద మూలకందం।

చేతః శ్రీసోమాస్కందం ॥　　　　　　　　　　　　॥చింతయ॥

అ॥ప॥ః- సంతతం అఖండ సచ్చిదానందం।

సామ్రాజ్యప్రద చరణారవిందం　　　　　　　　　　॥చింతయ॥

చరణముః- మంగళకర మందహాస వదనం।

మాణిక్యమయ కాంచీసదనం ।

అంగసౌందర్య విజిత మదనం ।

అంతక సూదనం, కుంద రదనం ॥

మ॥సా॥ః- ఉత్తుంగ కమనీయ వృషతురంగం

బైరవీ ప్రసంగం గురుగుహాంతరంగం

పృథివీ లింగం॥　　　　　　　　　　　　　　　　॥చింతయ॥

కాంచీపురక్షేత్రమున మామిడి చెట్టు క్రింద వెలసిన స్వామి శ్రీ ఏకామ్రేశ్వరుడు. ఆ స్వామిని ధ్యానింపుమని తన చిత్తమును ప్రబోధించుచు దీక్షితుల వారు ఈ కృతిని ద్వితీయా విభక్తిలో రచించిరి. చెట్టు భూమి నుండి పుట్టినది. ఇచట స్వామి పృథివీ లింగ స్వరూపుడు. ఏకామ్రము అనగా ఒంటి మామిడి. ఆ ఒంటి మామిడి చెట్టుయే ఈశ్వరుడు. కనుకనే అక్కడ పార్వతి పాదుచేసి ఆ పాదులో చెట్టంత స్వామిని చిట్టెడు లింగరూపముగా చేసి తాను మాకందమునకు మూలకందము ఆ లింగరూపుడైన స్వామియే అని అర్చించినది. అక్కడ మామిడి చెట్టు క్రింద ఈశ్వరుడు వెలసెనని స్థల పురాణము నందు కలదు.

ఆ స్వామి భూమి నుండి వృక్షరూపమున అవతరించి పెరిగి, పెద్ద వృక్షమైనది. తన రూపమే ఆ వృక్షముగా పుట్టినది. ఆ చెట్టునందు వృథివీ లక్షణమున్నది. అది దారుమయమైన లింగము. దారువనగా చెట్టు మ్రాను. దాని సహజ ఆవిర్భావ స్థానము

పృథివి. ఇక్కడ ఊర్ధ్వఫలమైన వృక్షము పృథివీ మూలముగా అవతరించుట చిత్రము. కనుక ఆ స్వామి నిరంతరము అఖండ సచ్చిదానంద స్వరూపుడు. పృథివిపై గల సమస్త సామ్రాజ్యమును (ప్రపంచమును) ప్రసాదింపగల చరణ పద్మము కలవాడని దీక్షితుల వారు పల్లవి, అనుపల్లవులలో పేర్కొనిరి.

చరణములో దీక్షితుల వారు ఆ స్వామి మంగళకరమైన చిరునవ్వుతోడి మోము కలవాడని, మాణిక్యములతో చేయబడిన కాంచీమేఖలచే ఆవరింపబడిన ధాత్రియే (పట్టణమే) తన సదనముగా కలవాడనిరి. ఇచట మరియొక అర్థము గోచరించుచున్నది. మణులనగా మంత్రములు. ఆ మంత్రముల వలయముచే పవిత్రమైన భూభాగమే ఆ స్వామి సదనము. అనగా శ్రీవిద్యాపరమైన మంత్రములే ఆ క్షేత్రమును చుట్టియున్నవి. అట్టి మాణిక్యమయమైన మేఖలో రూపవలయమున నుండువాడు. (మేఖల అనగా వడ్డాణము, మొలనూలు. మేఖల లక్షణము గుండ్రముగా నుండుట) దీక్షితులవారు "మాణిక్యమయ కాంచీసదనం" అనుటలో మంత్రమయ సదనము కలవాడన్న అర్థస్ఫూర్తిని గోచరింపచేసిరి. "అంగసౌందర్య విజిత మదనం" అనగా అంగసౌందర్యము చేత మన్మథుని జయించినవాడు. శివుని కంటబడిన మన్మథునకు అంగమే లేకుండా పోయినది. అట్టి అంగమే లేని వానిని అంగము కలవాడై తన అంగసౌందర్యముచే జయించుట యన్న చమత్కారమైన స్థితి కలవాడనిరి. ఇచట దీక్షితుల వారు సాహిత్యపరముగా గుణాలంకార రీతులలో చమత్కారమును ధ్వనింపచేసిరి. యముని అణచినవాడు, మొల్ల మొగ్గల వంటి (పలువరస) కలవాడని దీక్షితుల వారు ఆ స్వామి అంగ సౌందర్యమును వర్ణించిరి. ఆ స్వామి మిక్కిలి ఎత్తైన అందమైన వృషభమే వాహనముగా కలవాడు. భైరవీ అనుటలో ఆ రాగనామము (ముద్రను) పొహళించిరి. భైరవి అనగా ఆనందభైరవి తోడి సాంగత్యము కలవాడు. ఇచట ఆనందభైరవ - ఆనందభైరవీ సంయోగ సంజనితమే సకల సృష్టి. భైరవీ ప్రసంగము అనుటచే మూలాధార స్థితి చెప్పబడినది -

**శ్లోకం:- "తవాధారే మూలే సహ సమయయా లాస్యపరయా**

**నవాత్మానం మన్యే నవరస మహాతాండవ నటమ్**

ఉభాభ్యామేతాభ్యా ముదయవిధి ముద్దిశ్య దయయా

సనాథాభ్యాం జజ్ఞే జనక జననీ మజ్జగదిదమ్" [1]

లాస్యమును చేయు భైరవితో తాండవ నృత్యమున శివుడు మూలాధారమున నవరస నటనము చేయుటచే ఈ సృష్టి జనక జననీ వంతమైనదని శంకర భగవత్పాదుల వారు సౌందర్య లహరిలో చెప్పిన ఈ భావము అనుసంధానము చేసికొనవలెను. గురుగుహుని యొక్క అంతరంగములో ఉండువాడు, పృధివీ లింగ రూపమున కలవాడగు ఏకామ్రేశ్వరుని మనసా చింతింపుమని దీక్షితుల వారు వాకృచ్చిరి.

శివశక్తులు విడివడని జంట. పృధివీ లింగమున వారు భైరవులు. ఆనందభైరవీ - ఆనందభైరవుడు. ఇది వారి 1. నామసామ్యము. 2. రూపసామ్యము - మాకంద మూలకందములో కలదు. 3. ఇక వీరుభయులు మూలాధారమునందే యుండుట ఏకకాల స్థితిచేత అవస్థా సామ్యము. 4. వీరు మాణిక్యమయ సదన కాంచీపురము నందుండుట అవస్థాన సామ్యము. 5. సంతతం అఖండ సచ్చిదానంద లక్షణము ఇరువురకు సమానమే. ఇది అనుష్ఠాన సామ్యము.

ఈ పంచవిధ సామ్యములు పంచభూత లింగరూపముల యందు అన్వయించు కొనవచ్చును. ఇచట దీక్షితుల వారు శివశక్తులకు అబేధ ప్రతిపత్తిని చెప్పినారు.

★★★

1. సౌ.ల. శ్లో. 41 పుట 275

# సప్తమాధ్యాయము

# సప్తమాధ్యాయము

## శ్రీ దీక్షితులవారు సందర్శించిన ఇతర క్షేత్రములలో శివశక్తులపైగల కృతులు.

### తంజావూరు

దక్షిణ దేశమున చోళరాజులకు రాజధాని నగరమైన తంజావూరు కళలకు ప్రసిద్ధి చెందిన క్షేత్రము. శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారు తంజావూరు వెళ్ళినపుడు అచట గల బృహదీశ్వరునిపైనను, అమ్మవారు బృహదీశ్వరిపైనను సుమారు 20 కృతులు రచించిరి. ఈ ఆలయమునకు బృహదీశ్వరాలయమని పేరు. క్రీ॥శ 985 నుండి 1013 వరకు చోళరాజైన రాజరాజ చోళుడు కుష్ఠువ్యాధితో బాధపడుచుండెనట. దాని నివారణ కొఱకు నర్మదానదిలో గల శివలింగము తీసికొని వచ్చి శివాలయమును నిర్మించవలెనని చెప్పిరట. పూర్వ జన్మలో కిరాతకుడుగా నుండుటచే ఈ వ్యాధి వచ్చినదని తెలిసికొని 64 మంది వర్తకులను తీసికొనివెళ్ళి నర్మదానది నీళ్ళలో నుండి శివలింగము తీయగానే ఆ లింగము ఎదుగుట ప్రారంభమైనది. అందుచే దీనికి బృహదీశ్వరమని పేరు వచ్చినది.

ఇది దక్షిణ భారతదేశములో అతి పెద్ద శివలింగము ఈ ఆలయమును నిర్మించుటకు 12 సంవత్సరములు పట్టినదట. ఈ శివాలయములో నిర్మించిన కొలనులో రాజరాజు స్నానము చేయగా ఆయనకు కుష్ఠువ్యాధి నివారణ అయినదని ఒకటంతమొంది స్థల పురాణము నందు కలదు. ఎవరైన రోగపీడితులైనప్పుడు ఆ స్వామికి చందనము పూయుదమని మ్రొక్కు ఆచారము కలదు. దీక్షితులు వారు ఈ ఆలయమును సందర్శించి ఆ స్వామిపై రచించిన కృతులలో "బృహదీశ్వరాయ నమస్తే" అను కృతి మిగుల ప్రసిద్ధి చెందినది.

### "బృహదీశ్వరాయ నమస్తే"

శంకరాభరణ రాగము ఆదితాళము

29.వ మేళకర్త

పల్లవిః- బృహదీశ్వరాయ నమస్తే । శ్రీ బ్రహ్మానందాయ, బలేశ్వరాయ॥ ॥బృహదీ॥

అ॥ప॥ః- బృహన్నాయకే మనోల్లాసాయ।

భాసమాన చర్మాంబర ధరాయ॥ ॥బృహదీ॥

చరణముః- చారు చంద్రశేఖరాయ, వరాయ ।

చారుస్మిత సరసీ రుహ పదాయ ।

చరాచరాత్మక ప్రపంచకాయ ।

సద్గురుగుహ సహిత సదాశివాయ ।

కరుణా రస పూరితాయ కైవల్యప్రదాయ తంజాపురీశ్వరాయ।

హరిహరాద్యమర వందితాయ రక్తవర్ణ శోభితాయ ॥బృహదీ॥

ఎన్ని నామములున్నను, ఎన్ని క్షేత్రములలో నున్నను అందరు ఒకే పరమాత్మ యొక్క మాయావరణలోని వైవిధ్యముతో గోచరింతురు. కాని ఈ లోకము భిన్న భిన్నములుగా, ఖండ, ఖండములుగా ఇందరి దైవములతో నుండగా మనము చేయు స్తోత్రములు వారి పేర్లతో, వారి క్షేత్రములతో, వారి ఆకృతులతో తన్మయత్వముతో జరుపుకొనుట ఉపాసనలోని ప్రధానమైన తృప్తి. ఇట్టి తృప్తిని పొందు లక్షణమే దీక్షితుల వారి కీర్తనల రచనకు కారణము.

దీక్షితుల వారు స్తుతించిన బృహదీశ్వరునకు త్యాగరాజేశ్వరునకు బేధమేమనిన బృహత్ విషయము ఒకచోట, మరియొక చోట త్యాగ విశేషము. ఏ ఏ రూపముల, గుణముల నామములతో స్తుతింపబడినను మూలమొక్కటే. భిన్న భిన్న గుణములు చెప్పబడుచున్నను ఆ ఈశ్వరుడు ఒక్కడే. దీక్షితుల వారు 'బృహదీశ్వరుడైన నీకు నమస్కార'మనుచు చతుర్థీ విభక్తిలో ఈ కీర్తనను రచించిరి. శ్రీ రూపమైన బ్రహ్మానందాత్మకుడవైన నీకు నమస్కారము. బలరూపమైన ఈశ్వరశక్తివైన నీకు నమస్కారమని దీక్షితుల వారు పల్లవిలో పేర్కొనిరి.

అనుపల్లవిలో 'బృహన్నాయకి అను పేరుగల ఈమె నీ రాణి కాగా ఆమెకు మనోల్లాసము కలిగించునట్టి నీకు నమస్కారము. ప్రకాశమానమైన చర్మాంబరమును ధరించిన నీకు నమస్కారము' అనిరి. చరణములో చంద్రుని ధరించుట, పద్మముల వంటి పాదములు కలిగియుండుట, చరాచరాత్మకమైన ప్రపంచ స్వరూపమే తానగుట,

సద్గురుడైన గుహునితో కూడి యుండుట - ఇట్టివన్నియు సదాశివుని లక్షణములే. ఇవి ఈశ్వరుడుగా చెప్పబడు ఏకైక పరమేశ్వరుని లక్షణములే కాని కనిపించుచున్న బృహదీశ్వరుడు చంద్రశేఖరుడే కదా. కనుక ఈ కనిపించుచున్న రూపము ప్రతిక్షేత్రము నందు కనిపించు రూపమున కంటె తత్త్వమున భిన్నము కానిదైనను రూపమున పృథక్త్వమే భాసించుచుండును. కనుక ఇది ప్రత్యేకమైన స్తుతి కీర్తన.

ఈ తంజాపురిలోని బృహదీశ్వరుడు కైవల్య ప్రదుడు, కరుణారస పూరితుడు, హరిహరాదులైన దేవతలచే నమస్కరింపబడువాడు, రక్తవర్ణ శోభితుడు, రక్తశోభితము ఎట్లు కలుగుననిన నాగవల్లీ దళము, ముక్తా చూర్ణము కలసినపుడు రక్తవర్ణము కలుగును. అనగా ప్రకాశ, విమర్శ బిందువుల సంయోగము వలన మిశ్రబిందువను రక్తబిందువు మూడవది ఏర్పడినది. హరిద్రాచూర్ణము, శిలాచూర్ణము కలసినపుడు రక్తధాతువు కలుగును. ప్రకాశ బిందువునందు విమర్శ బిందువు అంతర్భూతముగా నున్నందున ఈ సత్త్వ, రజస్తమో గుణత్రయములో ప్రతి గుణమునందు ప్రకాశ విమర్శ శక్తులు ఇమిడి యున్నవి.

కనుక దీక్షితుల వారు ఆ స్వామిని "రక్తవర్ణ శోభితాయ" అని స్తుతించిరి. మరియు ఇచట స్వామికి రక్త చందనమును పూయుదురని చెప్పుదురు. వీనిచేత ఈ దైవము తంజావూరి బృహదీశ్వరాలయమునకు పరిమితమైన దైవము. అనగా ఈ నామముతో ప్రాణ ప్రతిష్ఠ జరిగిన స్వామికి ఈ లక్షణములతోనే అర్చన జరుగుట ఒక విలక్షణము. అది క్షేత్ర ప్రాముఖ్యమును బట్టి, అచటి యంత్రమును బట్టి, అచటి అనుష్ఠానము బట్టి ఆ దైవము బృహదీశ్వర మంత్రమునకు అధీనమైన దైవము. కనుక ఈ దైవము ఇచ్చు ఫలము ఈ క్షేత్రమున కొలచినప్పుడు ప్రాప్తించును. ఇది అనుష్ఠాన సామ్యముచే సిద్ధించు ఫలము.

ఇది దీక్షితుల వారు అనేక క్షేత్రములు దర్శించి భిన్న దైవములను కొలుచుటలోని రహస్యము. మన పూర్వులు క్షేత్రములన్నింటిని దర్శించవలెననుటలోని పరమార్థమిదియే.

★★★

## 2. "బృహదీశ్వరీం భజరే చిత్త"

లలితపంచమరాగము ఆదితాళము

15.వ. మేళకర్తజన్యము.

పల్లవి:- బృహదీశ్వరీం భజరే చిత్త।
బ్రహ్మేంద్రాది నుత జగజ్జననీం॥ ॥బృహదీ॥

అ॥ప॥:- బృహదీశ మనోల్లాస కారిణీం।
బ్రహ్మాండ స్వరూపాకారిణీం॥
మహాత్రిపుర సుందరీం। శ్రీకరీం॥
లలితపంచమ రాగోదయకరీం॥ ॥బృహదీ॥

చరణము:- నీరజ దళ నయనీం, మృదుచరణీం।
నిరంజనీం, తంజపుర విహారిణీం।
నిరతిశయ సుఖప్రదాయినీం।
నిత్యానంద గురుగుహ రూపిణీం॥ ॥బృహదీ॥

ఓచిత్తమా! బృహదీశ్వరిని భజింపుమని దీక్షితులవారు తన చిత్తమునకు ప్రబోధించుచుండిరి. ఈ కృతిలో ఆబృహదీశ్వరుని యొక్క గుణములను, సౌందర్యమును అనేక విధములుగా వర్ణించిరి. తంజావూరిలోని బృహదీశ్వరుని నాయిక బృహదీశ్వరి. బృహదీశ్వరుడు తండ్రి, బృహదీశ్వరీ తల్లి. దీక్షితులవారు 'నాగధ్వని' రాగ కృతిలో ఆ స్వామిని "బృహదీశ్వరం భజరే రేచిత్త" అనిరి. ఈ కృతిలో "బృహదీశ్వరీం భజరే చిత్త" అని అనుటలో రెండింటికి భేదమేమనిన ఆ స్వామి, ఈ స్వామిని ఉభయులు జనక జననీ రూపములు. బ్రహ్మేంద్రాదులు వీరి బిడ్డలు. ఆ స్వామి మనోల్లాస కారిణి ఈమె. ఈ స్వామిని మనః ప్రియకరుడు ఆ బృహదీశ్వరుడు. ఆ స్వామి విశ్వసృష్ట్యాది కారణుడు. ఈ స్వామిని బ్రహ్మాండ స్వరూపాకారిణి మహా త్రిపురసుందరి ఈమె కాగా ఆ స్వామి త్రిపురహర సుందరుడు. ఆయన శ్రీకరుడు. ఈ బృహదీశ్వరి శ్రీకరి. 'లలిత పంచమ రాగోదయకరి'అనుటలో దీక్షితులవారు ఈ రాగనామమును సూచించిరి.

బృహదీశ్వరుడు పంచభూతమయ జగద్రాగోదయకరుడు. ఈమె నీరజ దళనయన. ఆ స్వామి నీరజములను వికసింపచేయు సూర్యచంద్ర అగ్నిమయరూపములైన నేత్రములు కలవాడు. ఈమె మృదుచరణము కలది. ఆయన యోగిరాజాది అర్చితచరణుడు. యోగిరాజులచే అర్చింపబడు చరణము కంటే మృదు చరణము మరి ఏమియు ఉండదు. అనగా ఆ స్వామి మృదు చరణుడు. బృహదీశ్వరి నిరంజని. బృహదీశ్వరుడు నిరంజనుడు. ఆ స్వామి తంజపురీశ్వరుడు. స్వామిని తంజపుర విహారిణీ. ఆ స్వామి నిరతిశయ సుఖప్రదాయకమైన కైవల్యప్రదుడు. ఈమె నిరతిశయ సుఖప్రదాయిని. ఆ స్వామి సద్గురుగుహ సహితుడు. స్వామిని నిత్యానంద గురుగుహరూపిణీ.

దీక్షితుల వారు తంజపురములోని బృహదీశ్వర - బృహదీశ్వరీ నియమములను, రూపములను దశలను ఉనికిని ఆచరణను ఏకరూపమున వర్ణించుట శివశక్త్యైక రూపమున నిరూపించుట. పరబ్రహ్మ స్వరూపమునకు నామ రూపములు లేవు. ఆ బ్రహ్మము "న చ స్త్రీ నచ పుమాన్". కాని క్షేత్రములలో అవతరించిన దైవ రూపములు స్త్రీ, పుం రూపములు. వాటికి ఊరు, పేరు ఉన్నవి. వారిని తలచుట ఈ విలాసముతో తలచుట. అసలు రహస్యము అంతర్గతమైన తత్త్వము పరబ్రహ్మమని తెలియుట. అందుచేతనే ఇన్ని కృతులలో ఒక భావైక్యము ధారణ యందు ఏకాగ్రత సమాధి నిష్ఠలో పరతత్త్వ అవగాహన కలసి శ్రుతిలయల జననీ జనకులు సంయుక్తమైన మదు మధురమైన ఆనందము సంగీతము నుండి నాదమునకు, నాదము నుండి బింద్వతీతమైన, స్థితిలో మనస్సు లయను చేరుట దీక్షితకృతి మనకు చేయు సత్కృతి.

★★★

# 2 "కాశీ క్షేత్రము

## "ఏహి అన్నపూర్ణే "

పున్నాగవళిరాగము ఆదితాళము

8.వ. మేళకర్త జన్యము

పల్లవి:- ఏహి అన్నపూర్ణే, సన్నిధేహి సదాపూర్ణే, సువర్ణే। మాం॥ ॥ఏహి॥

అ॥ప॥:- పాహి పంచాశదర్వర్ణే, మాం పాహి పంచాశద్వర్ణే శ్రియం॥

దేహి రక్తవర్ణే అపర్ణే ॥ ॥ఏహి॥

చరణము :-కాశీక్షేత్ర నివాసినీ కమలలోచన విశాలినీ

విశ్వేశమనోల్లాసినీ జగదీశ గురుగుహ పాలినీ ।

విద్రుమ పాశినీ పున్నాగవరాళి ప్రకాశినీ

షట్ త్రింశత్తత్త్వవికాసినీ సువాసినీ

భక్త విశ్వాసినీ చిదానంద విలాసినీ ॥ఏహి॥

పరమేశ్వరుని యొక్క పరిపూర్ణతత్త్వము అన్నపూర్ణ. ఈమె కాశీ క్షేత్రమున విశ్వేశ్వరుని అర్థాంగి. కనుక విశ్వేశ్వరి. కావుననే విశ్వమునకంతకు కావలసిన ఆహారము పరిపూర్ణముగా ఒసంగునది. ఆ తల్లి. ఈమె జగద్గృహిణి. జగత్కుటుంబమునకు ప్రధాన పోషక పదార్థము అన్నము. తల్లి అన్నమయ కోశమునే బిడ్డల యందు పరిపూర్ణముగా పోషించు చుండును. అదియే ప్రాణము నిలుపును. దాని చేత మనస్సు యొక్క స్థితి యుండును. అట్టి మనస్సును బట్టి విజ్ఞానము, దానిని బట్టి ఆనందము లభించును. అన్నము పెట్టు తల్లి లక్షణమును బట్టి బిడ్డల ప్రాణాదికోశముల వికసనము ఉండును. ఈ తల్లి సదాపూర్ణ, సువర్ణ, పంచాశద్వర్ణ అనుటచే ఈమె యందు "పూర్ణస్య పూర్ణమాదయ"- పూర్ణత్వము ఆపాదింపబడినది. ఈమె హిరణ్యవర్ణ. ఏ వర్ణము నందైననూ సువర్ణ. సువర్ణ మనగా మంచి శోభనమైన వర్ణము. వర్ణమనగా అక్షరము, రంగు కనుక నామమును రూపమును లోకము నందు తన వర్ణములచే తీర్చు తల్లి సువర్ణ. అట్టి సువర్ణములు పంచావద్వర్ణములు. ఇవి సమస్త నామముల మూలములు, రూపములు. అనగా నామాత్మక,

రూపాత్మక, జగత్తునకు మూలమైన నిర్గుణమైన అస్తి, భాతి, ప్రియం అను త్రిపుటి తానయై ఆకాశరూపమున నున్న తల్లి.

"ఆకాశః తల్లింగాత్" అని పరమేశ్వరునకు లింగము ఆకాశము అన్నది బ్రహ్మసూత్ర సిద్ధాంతము. కనుక ఏది శివరూపమున ఆకాశతత్త్వమో అదియే శివారూపమున ఆకాశతత్త్వము. శివుడే - శివా, శివాయే - శివుడు. వీరికి పరిపూర్ణత్వము సహజసిద్ధము. అట్టి పరిపూర్ణతత్త్వము విడివడినను అదియు పూర్ణమే. పూర్ణము నుండి పూర్ణము గ్రహించగా పూర్ణమే మిగులును. ఈ రహస్యముచే ఈమె సర్వతత్త్వ సంపూర్ణ. అన్నపూర్ణ పంచశద్వర్ణాత్మకమగుటచే నామ రూపములు కల జగత్తున క్రియాశక్తి స్వరూపిణియై, రజోగుణవతియై, రక్తవర్ణయై యున్న ఈమె అపర్ణ. అనగా పర్ణ భక్షణము కూడా మానిన తపస్వి. అనగా సత్త్వ స్వరూపిణి. ఒకచోట సత్త్వము, వేరొక చేట రజస్సు, మఱియొక యెడ తమస్సు. ఇదియే ఆమె లీల.

సకల భువనోదయ స్థితి లయము నందు లీలా వినోదనోద్యుక్త పరమేశ్వరుని యందు అంతర్లీనమై యున్నది విమర్శ శక్తి. అందుచే ఆమె రక్తవర్ణ. రజోగుణము జగద్విషయము. ఇది అంతయు భావించినదే. ఈమె విశాలమైన కమలరేకులు వంటి అక్షులు కలది. కనుకనే విశ్వేశుని మనోల్లాసిని, జగదీశుడైన గురుగుహుని పాలించు తల్లి. విద్రుమపాశిని - పగడముల పాశము కలది. ఇది విశిష్టద్రువము. పున్నాగద్రుమము. అందు వర శ్రేష్ఠమైన అళి భ్రమరము. భ్రమరము ఆకాశమున ఝంకార నాదము చేయును. అట్టి ఆకాశతత్త్వ వికాసము కల తల్లి షట్త్రింశత్తత్త్వములే జగద్రూపములు. "శివ, శక్తి, సదాశివ, ఈశ్వర, శుద్ధవిద్యా, మాయా, కలా, విద్యా, రాగ, కాల, నియతి, పురుష, ప్రకృతి, అహంకార, బుద్ధి, మనస్సు, జ్ఞానేంద్రియపంచకము, కర్మేంద్రియపంచకము, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ పంచభూతములు". ఇట్టివి మరి 36 తత్త్వములు ఆ స్వామివి కూడనున్నవి. ఈ రెండు కలసినపుడు సదా పూర్ణత్వము. సదాపూర్ణత్వము నుండి సృష్టి. ఆయన విశ్వేశ్వరుడు. ఈమె అన్నపూర్ణ కాగా ఆ స్వామి విశ్వపాలకుడు. ఈ అన్నపూర్ణ అన్నప్రదాయిని.

అన్నమనునది -"అన్నేన - ప్రాణః, ప్రాణీ - ఫలం, బతేన - తపః, తపసా - శ్రద్ధ, శ్రద్ధయా - మేధ, మేధయా - మనీషా, మనీషాయా - మనః, మనసా-శాంతిః, శాంత్యా-చిత్తం, చిత్తేన-స్మృతిః, స్మృత్యా-స్మార్గ, స్మార్గేన-విజ్ఞానం, విజ్ఞానేన-ఆత్మానం, వేదయితి తస్మాత్ అన్నం తదన్ సర్వాణి యేతాని దదాతి" -అని నారాయణీయము నందు కలదు.

ఇట్టి అన్నము పరిపూర్ణముగా ఇచ్చు తల్లి అన్నపూర్ణ, సువాసిని. చక్కని గృహిణి, సుమంగళి. నాలుగు దిక్కుల యందును చంపక, అశోక, పున్నాగ, సౌగంధికములను పుష్పములను ఆకాశరూపమైన తన శరీరమున ధరించినది. సద్యోజాతాది పంచముఖములచే పంచాననయైన స్వామిచే శోభాయమానముగా లోకములను పరిమళింప చేయు సువాసిని.

"చమ్పకాశోక పున్నాగ సౌగన్ధిక లసత్కచా"[1]

అని లలితా సహ్రస నామ స్తోత్రమున పరిమళింపజేయు సువాసిని అని కలదు. కనుక జగత్తు నందు శివ శివాత్మకమైన సత్త్వరజస్తమో గుణములన్నింటిని వారివారి జన్మవాసనలను బట్టి బిడ్డలయందు ప్రకాశింపజేయును తల్లి. ఈమె అట్టిదని తెలిసిన భక్తులయందు విశ్వాసముకల తల్లి. అందుచే తాను చిదానంద విలాసిని. సర్వానందమయ సువాసినీ కాశీ విశ్వేశ మనోల్లాసిని అన్నపూర్ణ, సదాపూర్ణ కనుక తల్లి భిక్షమును గోరువాడు ప్రార్థించు విధము ఎట్టిదనిన "అన్నపూర్ణే సదాపూర్ణే, శంకరప్రాణ వల్లభే - జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహిచ పార్వతీ".

★★★

1. ల. సస్తో

## 3 "శ్రీ కాళహస్తిక్షేత్రము"

### "జ్ఞానప్రసూనాంబికే"

కల్యాణిరాగము　　　　　　　　　　　　　　　　　　　　రూపకతాళము

65.వ. మేళకర్త

పల్లవి:-　　　జ్ఞానప్రసూనాంబికే, మామవ, జగదంబికే॥

సమష్టిచరణము:-　దీనజనావని, శంకరి, దేవి త్రిపురసుందరి।

దినకర చంద్ర తేజః ప్రకాశకరి, శుభకరి।

గురుగుహజననీ కాళహస్తీశ మనోల్లాసిని॥

శ్రీ దీక్షితులవారు శ్రీకాళహస్తిలోగల జ్ఞానప్రసూనాంబికను స్తుతించుచు పల్లవి సమష్టి చరణముతో ఒక చిన్నికీర్తనను రచించిరి.

శ్రీకాళహస్తిలోని పరమేశ్వరుని రాణి జ్ఞానప్రసూనాంబిక. ఆమె జగదంబిక. త్రిపుర సుందరి, గురుగుహజనని. కాళహస్తీశునకు మనోల్లాసిని. దీనజనులను రక్షించునది. దినకరుడైన సూర్యునకు. చంద్రునకు తేజః ప్రకాశములను ఇచ్చునది. శుభకరి అనుటలో శుభములను చేయునది. శంకరి పారమార్థికముగా, శుభకరి లౌకికముగా మోక్షమును సకల సంపదలను ఇచ్చి ఇహపరముల యందు బ్రోచుతల్లీ! నన్ను రక్షింపుమని దీక్షితులవారు ఈ కీర్తన యందు పేర్కొనిరి.

భక్తునకు జ్ఞాననిష్ఠ ఎంతయున్నను, భక్తిచే తల్లియొద్ద సర్వము తీసికొని అమ్మాయని ఆర్తితో ఆలపించుట ఆర్తి లక్షణములలో నొక్కటి. అందుచేతనే నామ రూపాది సామ్యములు తెలిసి వారిద్దరు ఒక్కటేనన్న స్థిర నిశ్చయముండియు భక్తులు తమ ఉపాసనకు సౌకర్యముగా అమ్మవారిని, అయ్యవారిని వేరువేరు రూపములతో ఆరాధించుట అన్నది తృప్తికొఱకు. భక్తియొక్క స్వరూపమది. భక్తి జ్ఞాన కర్మలను విడివిడిగా కాక ఏకరూపము, ఏకతానముగా పరమేశ్వర భావనలో నిమగ్నమగుట మహాభక్తుల జ్ఞానలక్షణము, కర్మవైభవము.

★★★

# 4. "జంబుకేశ్వర క్షేత్రము"

## 'అఖిలాండేశ్వరి'

జుజావంతి రాగము ఆదితాళము

(ద్విజావంతి రాగము)

28.వ. మేళకర్త జన్యము.

పల్లవి:- అఖిలాండేశ్వరి రక్షమాం।

ఆగమ సంప్రదాయ నిపుణే శ్రీ॥ ॥అఖిలా॥

అ॥ప॥:- నిఖిల లోక నిత్యాత్మికే విమలే ।

నిర్మలే, శ్యామలే, సకల కలే॥ ॥అఖిలా॥

చరణము:- లంబోదర గురుగుహ పూజితే లంబాలకోద్భాసితే హసితే।

వాగ్దేవతా రాధితే వరదే వరశైలరాజ సుతే శారదే॥

లంబారి సంభావితే జనార్దననుతే జుజావంతి రాగనుతే

జల్లీ మర్దళ, జఝుర, వాద్య నాదముదితే। జ్ఞానప్రదే॥ ॥అఖిలా॥

ఈ కృతిలో ఆ దేవీ స్వరూపము నామము ఆధారముగా వర్ణింపబడుచున్నది. శ్రీరంగక్షేత్రమునకు సమీపమున గల జంబుకేశ్వరము నందున్న జలలింగరూపుడైన ఈశ్వరుని అర్ధాంగి అఖిలాండేశ్వరి. ఆ ప్రభువు అఖిలాండేశ్వరుడు. ఈమె బ్రహ్మాండమంతటకును ఈశ్వరి. ఈ నామము ఈమెకు ఎట్లు వచ్చియుండుననిన - బ్రహ్మదేవుడు సృష్టి ఆరంభమున నీటిలో అండమును సృష్టించెను. అదియే బ్రహ్మాండము. సకల చరాచర సృష్టియు ఆ అండవిస్ఫోటనముచే ఏర్పడినది. అట్టి సృష్టినంతటను పాలించు తల్లి కనుక ఆమె అఖిలాండేశ్వరి.

ఇక్కడ చిత్రమేమనగా కావేరీ జలముల యందు లింగస్వరూపుడైన స్వామి యున్నాడు. జలములలోని అండము ఇక్కడ దేవికి అఖిలాండేశ్వరి నామమునకు మూలమై ఉండవచ్చును. ఈమె 'ఆగమ సంప్రదాయనిపుణ' అని దీక్షితులవారు అనుటలో, ఆగమ సంప్రదాయమును స్ఫురింపచేయుచున్నారు. వీరు ఆదిదంపతులు. అందుచే బ్రహ్మకును మూలమైన వారు. ఇచట శివకేశవ భేదములకు ఆస్కారములేదు. ఈ దంపతులు

త్రిమూర్తులకు అతీతులు. శంకరభగవత్పాదులవారు అమ్మవారిని వర్ణించుచు 'ఆగమాయావరూపిణి' అనిరి. 'అఖిల వర్ణకృతమంగళ శరీరిణీం', 'అఖిల వేదకృతశాఖరాం' అని దేవిస్తుతి యందు ఆమె స్వరూపమును నిరూపించినారు. ఆగమమే ఆమెస్వరూపము. అఖిల వర్ణములు ఆమె శరీర రూపమున వెలసినవి. అనగా శ్రీవిద్యా సంప్రదాయమున షట్చక్రముల యందలి మాతృకాన్యాసముచే సగుణాకారముగా కనిపించు తల్లి ఆమెయే. అని దీక్షితుల వారు పల్లవిలో వాకృచ్చిరి.

దీక్షితులవారు అనుపల్లవిలో నిత్యలోకములయందు నిత్యరూపమైన షోడశకళాత్మక, విమలరూపము ఆమెవేననిరి. ఆ తల్లి నిర్మల, శ్యామల. ఈ శ్యామల అనుటలో మణిపూరాంతస్థిత శ్యామమేఘ సహచరియైన స్థిరసౌదామిని స్వరూపము స్ఫురించును. మణిపురము జలతత్త్వమునకు చెందినది. అచట సకల కళా పరిపూర్ణమైన అకృతిలో ఆమె యందు సాలోక్య, సగుణారాధన చెప్పబడుచున్నది.

చరణములో దీక్షితులవారు "లంబోదర గురుగుహపూజితే లంబాలకోద్భాసితే, హసితే" అనుటలో శివ కుటుంబ సంభావన కలదు. బిడ్డలను చూచి నవ్వుచున్న తల్లి, విడివిడిగా నున్న అలకచే అందమైన మోముతో ఆ స్వామిని అలరించనున్న శృంగార మంగళరూపము గోచరించుచున్నది. ఆ తల్లిదండ్రులను వినాయకుడు, కుమారస్వామి పూజించుచున్నారు. వీరు సామీప్య ముక్తి భాజనులు. లంబాలకోద్భాసితము - శివసాయుజ్య ఉద్భాసము. హసితము చిత్ చంద్రిక. వాగ్దేవత ఈమె వెంటనే యున్నది. (అనగా నాలుకపైనున్నది). ఆమె సౌందర్యము ఊహాలంబముగా సిత, హసిత సుందరముగా అనుప్రాసలతో యమకములతో, గమకములతో స్తుతించుచున్నారు దీక్షితులవారు. వరము లిచ్చుతల్లి వరశైలరాజసుతే. "వరిష్ఠుడైన శైలరాజు కుమార్తెవు కదా వరములీయవా. నీవు శరత్కాలమున ఆత్మజ్ఞాన భాసమానమైన, జ్ఞానప్రసూనా స్వరూపిణివైన శారదవు కదా". 'జంభారి సంభావితే' - అనుటలో "ఉదయ దిశాపాలకుడైన జంభారి అనగా దేవేంద్రునిచే సంభావింపబడుచుంటివి. ఉదయ లక్షణముచే దీపించుచుంటివి" అనిరి దీక్షితులవారు. "సోదరుడు జనార్దనుడు (విష్ణువు) నిన్ను నుతించుచున్నాడు. ఇంద్ర ఉపేంద్రులచే

సేవింపబడుచున్న తల్లీ ! నిన్ను జుజావంతి రాగము కూడా నా రూపమున నుతించుచున్నది". ఇచట దీక్షితులవారు రాగనామమును పోహళించిరి. ఆ రాగానుగుణమైన జల్లీ, మర్దళ, జర్ఝర నాదములతో శివైక్యమును నీయందు నిరూపించుచుండగా అనందమున ఉప్పొంగుచున్న జ్ఞానప్రదాయినివి.

సంప్రదాయ నిపుణే-"నీవు ఈ భక్తుని బ్రోచు సంప్రదాయమున నిపుణవు కదా. అందుచే నన్ను రక్షించు తల్లివని వేరే చెప్పనవసరములేదు. నీవు అఖిలాండేశ్వరివి. పిండాండ బ్రహ్మాండముల ఐక్యమున సకలవిధ సామ్యములచే నిన్ను సార్షిస్థితిలో ఆరాధించుచున్న నన్ను రక్షింపుము తల్లీ!" యని దీక్షితులవారు ప్రార్థించిరి. ఇక్కడ ఇంకొక విశేషమేమనగా సాక్షాత్తు శంకర భగవత్పాదులు శ్రీ చక్రాలనే ఆమెకు కర్ణాభరణములుగా వేసిరట.

సార్షియనగా - మణిపూర చక్రంలో అమ్మవారిని సాక్షాత్కరింప చేసికొని పూజించు దశ. సాధకుడు మూలాధారము నుండి స్వాధిష్ఠానముతో మణిపూరమునకు చేరి సహస్రారమందున్న దేవి అక్కడకు వచ్చినట్లు భావించి ఆవాహనచేసి అర్చన చేయుదురు. సమయమతములో పూజాక్రమము మణిపూరముననే ప్రారంభమగును.

★★★

## 5. "కాంచీపుర క్షేత్రము"

### 'కంజదళాయతాక్షి'

కమలమనోహరి రాగము ఆదితాళము

27.వ. మేళకర్త జన్యము.

పల్లవి:- కంజదళాయతాక్షి కామాక్షి।

కమలామనోహరి త్రిపురసుందరి॥

మ॥సా॥:- కుంజరగమనే మణిమండిత మంజులచరణే।

మామవశివ పంజర సుఖి పంకజముఖి।

గురుగుహ రంజని దురిత భంజని నిరంజని॥ ॥కంజ॥

చరణము:- రాకాశశివదనే సురదనే రక్షిత మదనే రత్నసదనే।

శ్రీకాంచన వసనే సురసనే శృంగారాశ్రయ మందహసనే॥

మ॥సా॥:- ఏకానేకాక్షరి, భువనేశ్వరి ఏకానందా2 మృతఝురి భాస్వరి।

ఏకాగ్రమనోలయకరి శ్రీకరి ఏకామ్రేశ గృహేశ్వరి శంకరి॥ ॥కంజ॥

కాంచీరముననున్న కామాక్షి పద్మరేకుల వంటి విశాలములైన నేత్రములు కలది. 'కం' అనగా నీరు. దానియందు జనించునది పద్మము. ఇందులో 'క' అన్న అక్షరము పంచదశీ మంత్రములోని ప్రథమాక్షరము. 'కం' అన్నది అనుస్వారము (బిందువు) చేత ఏకైక బీజాక్షరమగుచున్నది. ఇచట 'క'బ్రహ్మవాచకము. బ్రహ్మము నందు ధ్యానమగ్నమైయున్న స్థితి నుండి విచ్చుకొనిన కన్నులు కలది. అందువలన 'క్లీం' అను బీజాక్షరముత్పన్నమైనది. కామకోటి మంత్రమే తన కన్నులుగా కలది ఈ కంచిలో నున్న కామాక్షి. ఆయన ధ్యాన సమాధిలో మనోహరమైన 'కకార' అక్షర సంపుటిచే అనుప్రాసచే కాది విద్యామంత్రాక్షర మయమైన ఒక లక్షణము ఈ కృతియందు సమకూర్చినట్లు గోచరించుచున్నది. ఈమె అమృతాబ్ధిలో దేవతావృక్షముల మధ్యన మణిద్వీపమున కదంబవనమున, చింతామణి గృహమున శివాకారమైన మంచమున పరమశివ పర్యంకనిలయమై యుండుటచే సహస్ర కమలము నందు మనోహరియై త్రిపుర సుందరియై

భక్తులను కటాక్షించు కంజదళాయతాక్షియై, కామాక్షియై దీక్షిత ధ్యానమున పరికించు చున్నదనిపించును.

ఆమె కుంజరగమన, మదగజయాన, మణి మండిత మంజుల చరణ. ఆమె నడుచు చుండగా మణి రూపముల మంజులమైన కాంతులు కనబడుచున్నవి, ధ్వనులు వినబడుచున్నవి. తల్లీ శివా! మామవ - (మామ్, అవ(తు)) నన్ను రక్షింపుము. శివపంజర సుఖివి. శివుడు ఓంకారస్వరూపుడు. ఆ పంజరమున తాను చిలుక. పద్మము వంటి ముఖము కలది. గురుగుహుడైన కుమారస్వామిని రంజింపచేయునది. మరియు 'గురుగుహ' ముద్రను రమణీయముగా రంజింపచేయునది. దురితభంజని నిరంజని ఈ పదముల పోహళింపులో వాగ్గేయకారుని మానసమున పొంగి పొరలుచున్న భావపరంపర ఆ తల్లిని గూర్చి మనోహర భావన, రసతన్మయతను కలిగించుచున్నది.

దీక్షితుల వారు ఆ కామాక్షిదేవిని మధ్యమకాల సాహిత్యంలో 'పంకజముఖి' అని మరి వెంటనే చరణములో 'రాకాశశివదనే' అనిరి. పంకజము వికాస లక్షణము. చంద్రబింబము ప్రసన్నతా లక్షణము ఆ దేవి నవ్వుచున్నట్లున్నదని సూచించుచు 'సురదనే' మంచిపలువరుస కలదాన అనిరి. రక్షితమదన - మన్మథుని పునరుజ్జీవింప చేసిన దానివి, రత్నగృహమున ఉన్నదానివి, శ్రీకాంచనవసనే - శ్రీ విద్యయందు బంగారు చేలముచే చుట్టుకొని యున్నతల్లీ, మంచిపలుకులకు నెఱవైన వాగ్దేవి నివాసమైన శోభాయమానమైన రసన కలదానవు. శివే శృంగారార్థమైన చిరునవ్వు కలదానవు అని బహువిధముల ఆ తల్లి యొక్క సౌందర్య గుణములను కీర్తించిరి.

ఏకానేకాక్షరి-ఏకాక్షరిగా ఈమె హ్రీంకార స్వరూపిణి. అనేకాక్షరిగా పంచాశత్పీఠ స్వరూపిణి. అందుచే ఈమె సకల భువనేశ్వరి. ఏకానందామృతఝరి. ప్రదానముగా ఆనందమే అమృతప్రాయమై ఒక ప్రవాహముగా గోచరించుచున్న త్రిపురసుందరి. ఆమె సౌందర్యము ఒక ప్రవాహము. అందువలన అమృతముచే లభించునది అనన్యప్రాప్తమైన ఆనందము. అట్టి ఆనంద ప్రవాహముచే భాస్వరి ప్రకాశమానమై యున్నది. ఏకాగ్రమైన మనస్సుచేత సమస్తమును లయ మొనరించుచున్నది. సాధకుడు పొందిన స్థితి

మనోలయము. ఆ మనోలయములో ఆమె శ్రీకరి. శ్రీవిద్యా నిధిగా నున్నది. దీక్షితులవారు ఏకాగ్రమైన చిత్తముతో అమృతాబ్ధిలో చింతామణి గృహము నందున్న ఆ తల్లిని భావించి ఆమె యందు లీనమై యుండిరి. అట్టి తల్లి కాంచీపురమున ఏకామ్రేశ గృహేశ్వరిగా నున్నది. ఈమె శంకరి అని దీక్షితులవారు చరణాంతమునగల మధ్యమకాల సాహిత్యము నందు వాక్రుచ్చిరి.

ఈ కీర్తనలో దీక్షితులవారు కేవల సంబోధనలలో కొన్ని చిత్రములు చేసినారు. ఆ దేవి పంకజముఖియేకాదు, రాకాశశివదన అనిరి. ఉదయమునందు పద్మమునకు వికాసము. శశికి పున్నమిరాత్రి యందు వికాసము. ఈమెయున్న లోకము భాలోకము-నిరాలోకమైనలోకము. అచట పగలు రాత్రి, ఋతువులు ఈ ఖండకాల లక్షణము లేదు. ఈ వైవిధ్యము లేదు. సార్వకాలిక సకల సౌందర్యము లోకమునందలి అన్ని ఉపమానములకు సాక్షీ భూతమైన సౌందర్యము. ఆ వదనము నందు, ఆ రదనము నందు, ఆ రసన యందు, ఆ హసనయందు ఒక ఆనందామృతఝురిగా ఏకాగ్రమైన మనసుతో దీక్షతుల వారు అనిర్వచనీయమైన తన్మయావస్థలో వెలువడిన ఒక మణిపూసయైనదీకృతి.

★★★

# 6. 'మధురక్షేత్రము'

## "మీనాక్షిముదందేహి"

గమకక్రియ రాగము ఆదితాళము

15.వ. మేళకర్తజన్యము.

పల్లవి:- మీనాక్షి ముదం దేహి మేచకాంగి, రాజమాతంగి॥

అ॥ప॥:- మానమాతృమేయేమాయే। మరకతచ్ఛాయే శివజాయే।

మీనలోచనీ పాశమోచనీ। మాననీ కదంబవనవాసిని॥ ॥మీనాక్షి॥

చరణము:- మధురాపురి నిలయే మణివలయే

మలయధ్వజ పాండ్యరాజ తనయే

వీణాగాన దశ గమకక్రియే

మధుమదమోదిత హృదయే సదయే

మహాదేవ సుందరేశ ప్రియే

మధుమురరిపు సోదరి శాతోదరి

విధి గురుగుహ వశంకరి, శంకరి ॥మీనాక్షి॥

శ్రీ దీక్షితులవారు మధురక్షేత్రమును దర్శించి అచటగల మీనాక్షి దేవిపై ఈ కృతిని రచించిరి ఈ మీనాక్షిదేవి అతి మధురమైన స్వభావము కలది. ఆమె రూపం మధురం, చూపు మధురం, మాట మధురం, హాసము మధురం. సర్వమును మధురము. మధురామృతమును వర్షించు దేవత మధురానగరాధి దేవత. ధ్యానించు మాత్రమున భక్తజన మానసమునకు మధురానందమును కూర్చునది ఆనంద స్వరూపిణి. అందుచేతనే 'ముదందేహి' ఆనందము నిమ్ము తల్లీ మీనాక్షి అని దీక్షితులవారు పేర్కొనిరి. ఈ మీనాక్షి -

"వక్త్రలక్ష్మీ పరీవాహ చలన్మీనాభలోచనా" [1]

అను పరమేశ్వరీ ముఖము కలది. లక్ష్మీ ప్రదమైన పరీవాహము అనగా ప్రవాహము. ముఖలక్ష్మీ అనగా ముఖసౌందర్యము. ముఖసౌందర్యలహరియందు

---

1 ల. స. నా. స్తో 6వ పాదము

కదలుచున్న చేపలవంటి కన్నులు కలది. చేపలు సంయోగము లేకనే అన్యోన్య వీక్షణమున సంతానము ఉత్పన్నము చేయును. అమ్మవారి కనులు చూపులతోనే భక్తులకు అభీష్టములను కలిగించు ప్రభావము కలవి. ఆమె మేచకాంగీ, రాజమాతంగి అని దీక్షితులవారు పల్లవిలో పలికిరి.

అనుపల్లవిలో దీక్షితులవారు "మానమాతృమేయే మాయే" అనిరి. ఆమె మాన మాతృమేయే అనగా శ్రీమాత - మాతృ శబ్దము మాతృమాన మేయ బోధకము. ఏ విషయము ఎఱుంగ వలెననినను - తెలియువాడు, తెలిసికొను శక్తి, తెలియదగు విషయము అను త్రిపుటి అనివార్యము. అట్టి త్రిపుటి స్వరూపము ఆమెయే. ఆమె యందు ఈ మూడు భిన్నముకాదు. "అహం బ్రహ్మాస్మి" భావనచే తెలిసికొనబడు ఈమె బ్రహ్మస్వరూపిణి. తెలిసి కొనువాడును బ్రహ్మస్వరూపుడే, ఈ తెలిసి కొనుటకు వలసిన మితి (విషయము) కూడా ఆమెయే. ఈమె సకల ప్రపంచమునకు కారణభూతురాలైన మాయా శక్తి. కనుకనే ఆమెను 'మాయే' అని సంబోధించి ప్రపంచ లయమును కోరు తనకు ఆమె 'మాయ' అని తెలియగా మాయ మాయమగును కదా. మాయ అనగా -

"శ్రుతి శత నిగమాంత శోధకానప్య హధనాద్యభి దర్శనేన సద్యః
కలుషయతి చతుష్పదాద భేదా దఘటిత ఘటనాపటీయ సేమాయా" [1]

ఎన్నిశ్రుతులు వేదాంతములను శోధించగల వారికైననూ ఇష్టవస్తు దర్శన మాత్రముచే అప్పటికప్పుడే చిత్తకాలుష్యము కల్పింప గలది మహామాయ. అట్టి మాయను తెలిసికొని 'మాయే' అనిరి దీక్షితులవారు. అనగా అమ్మా! నీ మాయ నాకు తెలియును. నన్నుమాయలో ముంచకుము. నేను నీ ముదమును కోరుచున్నాను. సచ్చిదానంద లక్షణమైన ఆ ముదమును నాకు చేకూర్చుము. నీ మాయా రూపము మరకత చ్ఛాయామయము. ఆ మరకతచ్ఛాయ నుండి నీ శివజాయా స్వరూపమునే భావించుచున్నాను. నీవు మీనలోచనవికదా నన్ను చూచి నేనేమి కోరుచున్నానో గ్రహించి దానినిచ్చుదానవు. నేను కోరునది పాశవిమోచనము. అష్టవిధ పాశముల నుండి నన్ను

1. శ్రీ. ల.వ.స. గూ. దీ పుట 169

విడిపించు దానవు. మానినీ అభిమానము కల నీవు మాప్రార్థనను మన్నించు. కదంబవనవాసిని - నేను మహాపద్మాటవి యందు పడి ఉన్నాను. ఈ పద్మాటవి ఒక కదంబ వనము. ఈ వనమందంతయు నీవే యుంటివి.

"మహాపద్మాటవీ సంస్థా కదంబ వనవాసినీ" [1]

"భక్తిమత్కల్ప లతికా పశుపాశ విమోచనీ" [2]

అని లలిత సహస్రనామములో కలదు.

నీవు మధురాపురి నిలయముగా నున్నదానవు. శ్రీ విద్యామణి వలయమును నాహృదయాంతరమున నున్న తల్లివి. మలయధ్వజుడైన పాండ్యరాజ తనయవు. ఇవి నీ సగుణ రూపములు. మణి వలయమున అనగా శ్రీ చక్రమును నీవు నిర్గుణ రూపిణివి. విదేహుడైన జనకుడు శ్రీ విద్యామణిచే జీవన్ముక్తుడైనాడు. అట్టి స్థితి మణివలయమున నిన్నుపాసించి నా జీవితమంతయు గడిపితివి. నా తనువు పోయినచో ఈ మణి వలయము నన్ను ఇహము నుండి పరమపద మొసగునది కదా. నీవదనమే చంద్రబింబముగా కలదానవు. లోకము నందలి విధుడు (చంద్రుడు) తఱుగుచు, పెరుగుచునుండును. కాని నీ ముఖ బింబము నిరంతరము షోడశకలాపరిపూర్ణము. ఎప్పుడునూ నీ మోము పున్నమి చంద్ర బింబము వంటిదే. విధు విడంబనము అనగా చంద్రుని మించి పోయిన నిరంతర అమృత పూర్ణమైన వదనము కలదానవు. అట్టి నీ దర్శనముచే ముక్తి నీయగలవు. నీది చంద్రవిద్య. చంద్రకళా స్వరూపము. ముక్తి ప్రదాయకము. ముక్తికి మరొక పేరు విజయ. నీవు - విజయారామముచే ముక్తిస్వరూపిణిగా నుందువు.

శ్లో:- కళంకః కస్తూరీ రజనికరబింబం జలమయం
కళాభిః కర్పూరైర్మరకతకరండం నిబిడితమ్
అత స్త్వద్భోగేన ప్రతిదిన మిదం రిక్తకుహరం
విధిర్భూయో భూయో నిబిడయతి నూనం తవ కృతే"[3]

---

1. ల. స. నా. 22వ పాదము

2. ల.స.నా 77వ పాదము

3. సౌ. ల. శ్లో. 94 పుట 491

ఈ శ్లోకము నందు శంకర భగవత్పాదుల వారు తల్లి యొక్క ముఖమండలము నిరంతర కళాపరిపూర్ణమను విషయమును నిగూఢముగా వర్ణించిరి. ఈ ముక్తి ప్రదమైన విజయ లక్షణముచే మనము గ్రహించవలసినది షట్ చక్ర భేదనము. దానినే 'వీణా వాదన దశగమకక్రియే' అను సంబోధనముచే దీక్షితులవారు భావించినట్లున్నారు. వీణా వాదనమున దశవిధగమకములను పలికించు క్రియాశక్తి స్వరూపిణి ఆమె. ఆ వీణ ఎక్కడి దనిన మన వెన్నుముకయే వీణాదండము. అందు మూలాధారము నుండి బిందువు దశ విధములుగా వికసితమైనది. ఆ బిందు వికసనము మూలాధారమునందలి నాలుగు దళములు స్వాధిష్ఠానము నందలి ఆరు దళములు కలసి ఏర్పడినది. ఈ బిందువే ఆజ్ఞాచక్రము వరకును ఈ పది దళముల సమన్వయముచే సిద్ధించుచున్నది. అదియే చక్రభేదనము. ఈ చక్రభేదనము గురించి సౌందర్యలహరి 99వ శ్లోకం వ్యాఖ్యానమున వివరింపబడినది. దీనినంతటిని సిద్ధుడైన దీక్షితుల వారు అనుభవముచే ఆ వీణానాద గమకములయందు బిందు వికసనమున షట్ చక్రములను భేదించుకొని చెప్పిన విషయముగా స్ఫురణ కలుగును.

ఇంకను ఆ వీణావాదన యందలి దశ విధ గమకములను చేయునది ఆ తల్లి. దశ విధ గమకములు - 1. ఆరోహణము, 2. అవరోహణము, 3.ఢాలు, 4. స్ఫురితము, 5. కంపితము, 6. ఆహతము, 7. ప్రత్యాహతము, 8. త్రిపుచ్ఛము, 9. ఆందోళనము, 10. మూర్ఛన. అట్టి గమకములను చేయునది యని 'గమక క్రియ' రాగనామమును కూర్చిరి.

దీక్షితుల వారు "మధు మద మోదిత హృదయే, సదయే" అనిరి. మధువు యొక్క ముదముచే మోదిత హృదయ అనగా మధువు చిదానందము. చిదానందమునందు లీనమైన స్థితియే మధుముదము. దానినే మోదితమైన హృదయముగా కలది. అనగా సచ్చిదానంద లక్షణమైన అనుభూతి పొందిన హృదయమున తన్మయత్వమును ఘటించు సదయ హృదయ ఆమె. అందువలననే దీక్షితుల వారు వెంటనే సదయే అనిరి. ఆమె దయ లేనిదే ఈ మధుముదము సిద్ధింపదు. ఇచట మధు శబ్దమునకు ఆ పేరుగల రాక్షసుడన్న అర్థము చెప్పికొన్నచో ఆ మధుడను రాక్షసుని యొక్క ముదముచే మోదితమైన

హృదయ ఈమె. తన శత్రువెంతటి వాడైన అంతగా తాను వీరత్వమున ఉప్పొంగు లక్షణము కలది. మహావీరునకు శత్రువు యొక్క బలమును చూచి ఉప్పొంగు లక్షణము ఆనందకరము. శత్రువులను అణుచుటచే భక్తుల యందు ఆమె అనుగ్రహము కలది. అందుచే ఆమె సదయ.

"వరదా వామనయనా వారుణీమదవిహ్వలా"[1] -

అని లలితా సహస్ర నామములో కలదు.

శరీరమున వాయువు సర్వత్రా పైకి క్రిందికి సంచరించు వాయు సంచారము గల నాడి వారుణి యనబడును. దీనిని యోగాభ్యాస పాటవమున అదుపులో ఉంచుట వలన బ్రహ్మరంధ్ర సహస్రారము నుండి అమృత స్రావమగును. దాని సేవనము వలన ఆనంద తన్మయత్వమే గాని ప్రవృత్తి జ్ఞానము ఉండదు.

"సైషా భార్గవి వారుణీ విద్యా"[2] అని శ్రుతి -

ఈవారుణీ విద్యయు, బ్రహ్మవిద్య అనబడును. ఈ అమృత్తసేవనము వలన కలుగు తన్మయత్వమే మదవిహ్వలత యగును. పరమేశ్వరి ఎల్లప్పుడు ఈ స్థితిలోనే ఉండునది అగుటచే వారుణీమద విహ్వాలా అనబడుచున్నది.

"మదుమోదిత ఆదిత్యోవైమధు"[3]

సూర్యకాంతియే మధు. శ్రుతి ప్రతిపాదితమగు మధు విద్య యందలి మంత్ర దేవతా స్వరూపురాలు. ఆనంద స్వరూపిణి తురీయాతీతావస్థ యందు పరమహంస స్వరూపిణి.

ఈమె మహాదేవుడైన సుందరేశుని యొక్క ప్రియురాలు. ఈమె పద్మనాభ సహోదరి. ఇచట మధుమురరిపు సహోదరిగా చెప్పబడినది. ఇట్లు పద్మనాభునియొక్క శత్రువుల మధుముర పేర్లు చెప్పి వారికి శత్రువైన వారి సోదరి అని మీనాక్షి దేవిని స్తుతించుట ఈమె విష్ణువునకు సహోదరియైన కథను స్ఫురింపచేయుచున్నది.

---

1. ల.స.స్తో.పా. 74
2. శ్రీ.ల.ర.స.గూ.దీ.పుట 241
3. శ్రీ.ల.ర.స.గూ.దీ.పుట 420

"పూర్వకాలమున రాక్షస సంహారణార్థము దేవతలు పరమేశ్వరీ ప్రసన్నతకై ఆమెకు ప్రీతికరమగు ఒక యజ్ఞము చేసిరి. అందు హోమ కుండము నుండి ఒక గోళకార అండము వెలువడి అందొక భాగము నుండి పరమేశ్వరియు రెండవ భాగమునుండి పద్మనాభుడును వెల్వడిరి. అందుచే పరమేశ్వరి పద్మనాభ సహోదరి అనబడుచున్నది". (శైవమత రహస్యమను గ్రంథమున) బ్రహ్మము ధర్మమనియు, ధర్మి అనియు రెండు రూపముల నొందెను. అందు ధర్మము పద్మనాభుడును, ధర్మి పరమేశ్వరియు (పార్వతి) అయిరి. కాన పరమేశ్వరి పద్మనాభ సోదరి అనబడుచున్నది. ఈమె -

"నారాయణీ నాద రూప నామరూప వివర్జితా"[1]

అని చెప్పబడినది. ఆ రీతిగా కూడా ఈమె నారాయణుని సోదరి. ఇచట పుం రూపమున పరబ్రహ్మము నారాయణుడు. స్త్రీ రూపమున పరమేశ్వరి నారాయణి నామములచే వీరికి సోదర సోదరీత్వము ధ్వనితము.

దీక్షితుల వారు ఈమెను శాతోదరి అని కీర్తించిరి. 'శాతోదరి' యనగా కృశించిన సన్నని మధ్యభాగము (నడుము) గల స్త్రీ. పరమేశ్వరి స్థూల దేహ ధ్యానమునకు సహాయకరమైన నామము ఇది. ఇందుచే 13 ఆవరణములు గల శ్రీవనదుర్గా మహామంత్రము సూచింపబడుట రహస్యము. శాతోదరి దుర్గాదేవి అనబడుననియు తెలియుచున్నది. "సహస్ర పరమాదేవీ శతమూలా శతాంకురా సర్వగుం హరుతుమే పాపం దూర్వా దుస్వప్న నాశనీ" అని స్తుతింపబడినది. ఈ శాతోదరి నామముచే ఆ తల్లి యొక్క చిదగ్నిరూపమైన లక్షణము స్ఫురించుచున్నది. దీక్షితులవారు "విధి గురుగుహ వశంకరి, శంకరి" అనిరి.

ఈమె విధి గురుగుహలను వశము చేసికొన్నది. అనగా విధి (బ్రహ్మ), సృష్టి చేసిన సమస్త పదార్థమును మృత్యువునకు ఆహారముగా వేయువాడు. కాని ఈ తల్లి తన భక్తులను మృత్యువు పాలు చేయదు. అందుచే విధిని తాను అదుపున పెట్టి భక్తులను కాపాడునది. గురుగుహని వశీకరించుట అనగా జ్ఞానమును తన అధీనము చేసికొనుట. జ్ఞాన ప్రదాతయైన గురుగుహుడు తన వశమున నున్న వాడగుటచే తన భక్తులను జ్ఞాన

1. ల.స.నా.స్తో 70వ పాదము

ప్రదానముచే రక్షించుట యను ప్రయోజనమును సాధించుచున్నది. కనుక అవిద్యా నిర్మూలనమునకు విధిని, విద్యా ప్రదానమునకు గురుగుహుని తన వశమున ఉంచుటచే 'విధి గురుగుహ వశంకరి', శంకరి అయినది. శాస్త్ర సంప్రదాయమున ఒకమాట, లేక ఒక వాక్యము పునరుక్తముగా చెప్పబడినచో అది ఆ అధ్యాయము యొక్క ముగింపును సూచించుట.

ఈ కృతిని వినుచు శ్రీ దీక్షితుల వారు తన జీవితాధ్యాయమును ముగించిరి. తన మరణకాల మాసన్నమైనదని గ్రహించి దీక్షితుల వారు ఈ కృతిని శిష్యులచే పాడించుకొని వారు పరమేశ్వర ఐక్యమును చెందుటను గూర్చి భావించినచో ఈ కృతియందు షట్ చక్ర భేదనమున జీవన్ముక్తుడుగా నున్నవాడు శరీర త్యాగ సమయమున ఈ కీర్తనమును అనుసంధానము చేసికొనుట తన జీవన్ముక్తి లక్షణమే జీవితాంతమున కూడా నిర్గుణమున ఆ ప్రాణముగా అమనస్కముగా, శుభ్రముగా నిలుచును. ఈ కృతి ఆత్మానంద స్వరూప లక్షణమును బోధించునదిగా నున్నది.

★★★

# 7. "వైద్యనాథక్షేత్రము"

## "భజరే రే చిత్త బాలాంబికాం"

శాంతకల్యాణి రాగము చాపుతాళము

65.వ. మేళకర్త

పల్లవి:- భజరే రే చిత్త బాలాంబికాం।
భజరే రే చిత్త కల్పలతికాం॥ ॥భజరే॥

అ॥ప॥:- నిజరూప దాన దక్ష చరణాం।
అరుణాం, నిత్యకల్యాణీం, శర్వాణీం॥ ॥భజరే॥

చరణము:- వాగ్భవ కూటజాత చతుర్వేద స్వరూపిణీం।
శృంగార కామరాజోద్భవ సకల విశ్వ వ్యాపినీం।
దేవీం, శక్తి బీజోద్భవ మాతృ కార్ణ శరీరిణీం।
దేవనుత భవ రోగహర వైద్యపతి హృదయ విహారిణీం॥

మ॥సా॥:- భావ రాగ తాళ మోదినీం। భక్తాభీష్ట ప్రదాయినీం।
సేవక జన పాలన గురుగుహ రూప ముద్దు కుమార జననీం॥ భజరే॥

శ్రీ రామస్వామి దీక్షితులవారు భార్యాసహితుడై వైద్యనాథక్షేత్రమును దర్శించి అచట కోవెలయందున్న వైద్యనాథస్వామిని, బాలాంబికదేవిని, ముద్దు కుమార స్వామిని సేవించి సంతానమును బడసిరి. ఈ వృతాంతమంతయు దీక్షితులవారి చరిత్రయందు పేర్కొని యుంటిని. ముత్తుస్వామి దీక్షితులవారు వైద్యనాథ క్షేత్రమును దర్శించి అచటగల బాలాంబిక దేవిపై 6 కృతులు రచించిరి. వీనిలో "భజరే రే చిత్త బాలాంబిక" అను ఆ కృతి మిగుల ప్రసిద్ధమైనది. ఈ కృతియందు దీక్షితులవారు తన జన్మ వృత్తాంతమునకు సంబంధించిన విషయమును నిక్షేపించిరి.

దీక్షితులవారు తన చిత్తమునకు ప్రబోధించుచు "ఓ చిత్తమా! బాలాంబికను భజింపుము. ఆమెను భజించుట మరువకుము. ఆమె భక్త కల్పలతిక. తన జన్మకారణమైన తల్లి బాలారూపిణి. బాల-బాలయేగాని సమస్తమునకు మూలమైన అంకురముగా నున్న

పరాశక్తి. బాలయే పరా, పరాశక్తియే-బాల". ఇది యొక బీజము వంటిది. బీజము నాటినచో మహావృక్షమగును. అట్టి బాలాంబికా అనుగ్రహమున జన్మించిన ముత్తుస్వామి దీక్షితులవారు బీజరూపమైన శక్తిగర్భితుడై, బాలారూపము తనయందు లీనమై జన్మించినారు. బాలాంబిక తన తండ్రి రామస్వామి భక్తికి మెచ్చి వరమును ప్రసాదించెను. ఆ వరప్రసాదియే ఈ ముద్దుస్వామి దీక్షితులు. ఆ బాలాంబికయే రామస్వామి దీక్షితుల వారికి బాలరూపమున ముద్దు కుమారుడుగా జన్మించినది.

ఆ పరారూపిణియైన బాల కుమారదశలోను, యౌవ్వనదశలోను, ప్రౌఢ దశ వరకు శ్రీవిద్యతోనే పెరిగి పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ రూపమైన సమస్త వాఙ్మయ చతుష్టయ రూపమును సంగీత సాహిత్య పరముగా వికసింపచేసికొనుటకు బీజమైనది. అట్టి బీజముల సమాహారమే కలలో బాలాంబిక రామస్వామి దీక్షితుల వారికి ఇచ్చిన ముత్యాల హారము. సర్వబీజాక్షర సంపుటీ సమాహారమైన ఆ హారము వలె ముత్తుస్వామి వారి వాఙ్మయము అంతయు శ్రీ విద్యామణి మనోహరమై సంగీత సాహిత్యధారా బీజమైనది. అందుచే ఆ బాలాంబికా దర్శనమున ఉప్పొంగిన ముత్తుస్వామి 'భజరే రే చిత్త' - రేచిత్త అన్న ఉద్వేగమును పొందినారు. ఈ కీర్తనలోని పల్లవి రెండు లఘువులపై రెండు గురువులను ప్రవాహపు ఒరవడిలో నడపినది.

పల్లవిలో "భజరే రే చిత్త కల్పలతికాం" అనిరి దీక్షితులవారు. ఈమె భక్తుల పాలిట కల్పవల్లి. ఏది కోరిన అది ఇచ్చు నట్టి సంకల్ప ప్రదాయిని. కోరినవాడు (రామస్వామి దీక్షితులు) అక్షరములను, స్వరములను ఉపాసించు వాడైనపుడు, వానికి కుమారుని, ముద్దుగొలుపు వానిని ప్రసాదించుట యనిన ఒక అక్షరనిధిని, స్వరముల పెన్నిధిని, రసధునిని ప్రసాదించుట. కనుక ఆ బాలాంబిక కల్పలతికే అనుటలో ఎంతో యదార్థమున్నది. ముత్తుస్వామి దీక్షితుల వారు బాల, నిరూపిణియైన 'శుద్ధవిద్యాంకురార్పణ' తనయందు చేసినది తల్లియని, గాఢమైన విశ్వాసముతో, అనుభవముతో, ఆనందముతో పలుకు తొందరలో లఘువుల ద్రుత గతిలో రేఫ ఏత్వముల ఆమ్రేడితములో తహతహతో పలుకుట. అది ఉప్పొంగిన హృదయ గుహలోని ముద్దు లక్షణము.

అనుపల్లవిలో దీక్షితుల వారు "నిజరూపదానదక్ష చరణాం" అనిరి. ఇది ఎంతో గొప్పమాట. ఆ బాలాంబిక తన నిజరూపమును దానము చేయుటలో దక్షమైన చరణములు కలది. తన రూపము తన భక్తుని యందు ముద్దుగా బాలరూపమున అవతరించుటకు నడచి వచ్చిన చరణ సరోజాత. మధురాత్మకమైన మాత. రామస్వామి దీక్షితుల వారికి వరమును దానము చేయుటకై నడచి వచ్చుటకు దక్షమైన మంత్ర మయమైన, హంసరూప చరణము కలది. పాదుకాంత దీక్షితుడైన రామస్వామి లోనికి ఆ పాదుకులపై ఉంచిన చరణములతో నడచి వచ్చిన దాక్షాయిణి. ఆ బాలారూపమే తానైనానన్న అభిజ్ఞ ముద్దు కుమారుని యందు కలిగించిన నిజరూపదాన దీక్షాచరణ. స్మరణ రూపమైన వాఙ్మయ పల్లవముగా ఈ అనుపల్లవిని పలికించినది పల్లవి. లవమంత పదము పల్లవము. అదియే ముద్దుగా చెప్పినచో పల్లవి. అట్టి పల్లవితో కూడిన అనుపల్లవి ఇది. కనుక వెంటనే "అరుణాం" అనిరి దీక్షితుల వారు.

శ్లో:- కవీంద్రాణాం చేతః కమల వన బాలతప రుచిం
భజంతే యే సంతః కతిచ దరుణా మేవ భవతేమ్।
విరించి ప్రేయస్యా స్తరల తర శృంగారలహరీ
గభీరాభి ర్వాగ్భి ర్విదధతి సతాం రంజనమమీ॥[1]

కవిశ్రేష్ఠుల యొక్క మనస్సులనెడి కమలముల యొక్క వనములకు ఉదయ అరుణ కాంతులతో వికసింపచేయు కేవల అరుణారుణమైన నిన్ను ఏ సత్పురుషులు భజంచుచున్నారో, వారే విరించి ప్రేయసియైన సరస్వతి వలె తరళతర శృంగార రసలహరీ గంభీరములైన వాగ్విలాసములతో సభాసదులను రంజింపచేయుచున్నారు. అట్టి లక్షణములచే ఆమె నిత్య కల్యాణి. అనగా అక్షరముల పరిణతిచే వైఖరి వాగ్రూపిణియైన పతివ్రత. నిత్యకల్యాణి అనగా బాలగా, కుమారిగా, యువతిగా, కవి హృదయమున పెంపొందిన అక్షరరూపిణి వైఖరీ వాక్కున కల్యాణియై తాను అర్పింపబడిన వాని యందు తన సర్వస్వమును విదిత మొనర్చును. ఆమె శర్వునకు రాణి. శర్వాణి అనగా శర్వుడు

---

1. సౌ. ల. శ్లో. 16పుట 129

అర్థ స్వరూపుడు. కాగా ఆయన వల్లభ వాగ్రూపిణి ఆమె. వారు వాగర్థముల వలె విడివడని జంట. 'శర్వాణీ' అని దీక్షితుల వారు వాడుటలో 'శబ్దజాత మఖిలం దత్తే శర్వశ్య వల్లభ' అనునది స్ఫురణకు వచ్చుచున్నది. అట్టి వైఖరీ వాక్కు స్వరూపిణి శర్వాణి. ఆ వాక్కునుండి పుట్టినవే సర్వ వేదములు, శాస్త్రములు, గాథలు.

చరణములో దీక్షితుల వారు ఆమెను వాగ్భవ కూటజాత, చతుర్వేద స్వరూపిణి అనిరి. వాగ్భవ కూటమునుండి పుట్టిన చతుర్వేదముల యొక్క స్వరూపము ఆమెదే. అనగా -

"శ్రీమద్వాగ్భవ కూటైక స్వరూప ముఖపంకజా" [1]

అని లలితా సహస్ర నామములో కలదు. ఆమె శృంగార కామరాజోద్భవ. సకల విశ్వవ్యాపిని. శృంగారమునకు ఆలంబనమైన కామరాజ బీజ పరంపర నుండి ఉద్భవించిన సకల విశ్వము నందు వ్యాపించి ఉన్నది. అనగా జగత్తు యొక్క సమష్టి చైతన్యమైన వాగర్థములను, మనస్సును, శరీరమును, వాణీ చతుర్ముఖ, లక్ష్మీనారాయణ, పార్వతీ పరమేశ్వరుల యుగ్మ మిశ్ర బిందు సంజాత. ప్రకాశ బిందువు విమర్శ బిందువు కలసి మిశ్రమ బిందువగుట కామరాజోద్భవ సృష్టి. అదియే సకల విశ్వము. దాని యందంతటను వ్యాపించి యున్న తల్లి.

"కంఠాధః కటిపర్యంత మధ్యకూట స్వరూపిణీ" [2]

అని పంచదశీ మంత్ర మధ్యకూటము యొక్క వివరణము ఈ చరణమున రెండవ అంశముగా చెప్పబడినది. శక్తిబీజోద్భవమైన మాతృక అర్థశరీరిణి. అనగా మొదటిది వాగ్భవబీజము, రెండవది కామరాజోద్భవము, మూడవది శక్తి బీజోద్భవము. అనగా సర్వ మాతృ మంత్రమయమైన తల్లి-

"శక్తి కూటైక తాపన్న కట్యథో భాగధారిణీ" [3] యైన దేవీ మాతృకార్థ శరీరిణి.

---

1. ల.స.నా. 34

2. ల.స.నా. 34

3. ల.స.నా. 35

ఈ రీతిగా త్రికూటముల యందు పంచదశీ రూపిణిగా నున్న తల్లి బిందువున వైద్యనాథ హృదయ విహారిణియై, షోడశీరూపమున నుండి దేవతలచే నుతింపబడుచున్నది. భవరోగ వైద్యపతి - భవ రోగములను అనగా జన్మమను రోగమును లేకుండా చేయుటతో రోగహరుడగుటచే వైద్యపతి, వైద్యులలో శ్రేష్ఠుడైన వైద్యనాథుని హృదయ విహారిణియై యున్నది ఆ బాలాంబిక. ఆ విధముగా తురీయ రూపమున అనగా 3 కూటములకు పైన నాల్గవది యైన సహస్రార బిందువంతరమున శివసంయుక్త శివశక్త్యైక్య రూపిణియైన ఆ తల్లిని తెలిసికొని స్మరింపుము చిత్తమా అని చెప్పిరి. అట్టి స్థితి అనగా శృంగారాది సకల వికృతి రస విలాసమైన భవము యొక్క రోగము హరించుటచే శాంతమైన స్థితిలో కల్యాణమును గూర్చు కల్యాణియైన నవ నవోన్మయమైన శాంత రస కల్యాణిని భజింపుము అని దీక్షితుల వారు పేర్కొనిరి.

అట్టి శాంత కల్యాణి రాగమున భావ రాగ తాళములతో చేయు సంగీతమును విని ఆనందించు భక్తాభీష్ట ప్రదాయినియైన బాలాంబికను భజింపుము. సేవక జనులను పాలించు గురుగుహుడు అను రూపమున ముద్దు గొలుపు కుమార జననియైన భక్త కల్పలతికను భజింపుము. ఆమె నిజరూపమును దానము చేయుటచే తన భక్తుడైన రామస్వామి దీక్షితులకు వరప్రసాదమున ముద్దు కుమారునిగా ముత్తుస్వామిని లోకమున అవతరింపచేసెను. ఆ ప్రత్యక్ష పరమేశ్వరిని, బాలా రూపిణిని సేవింపుము చిత్తమా అని ఉప్పొంగి, పొంగి తన జన్మకారణమైన తల్లిని గూర్చి దీక్షితుల వారు పలికిన షోడశీ మంత్రార్థ భావనారూపమైన ధ్యాన సమాధి సంజనితమైన కీర్తన ఇది.

స్వప్నమున తన తండ్రికి ఆ బాలాంబిక ప్రసాదించిన ముత్యాలహారమే, దేవీ మాతృకాలంబ వాగ్భవకూట, కామరాజకూట, శక్తికూట, బీజ, రూప, యుక్తకముల సమాహార రూపమైన హారము. ఆ హారము నందలి బీజాక్షర సంపుటి నంతయు జపమాల బీజ చర్వణ రూపముగా, శాంతమైన మనస్సుతో నిత్యకల్యాణీ చింతన పరమైన రాగముతో మిశ్రమమైన సమస్త బీజకోటిని ఏకతాళమున నిబంధించి, దీక్షితుల వారు ఈ కీర్తనను ప్రపంచమునకు దానము చేసియుందురని తోచుచున్నది.

బాలామంత్రము, పంచదశీ, షోడశీ, ఏకాక్షరీ, పంచాశద్వర్ణ మాతృకార్ణ, మనోహర, మంత్రమణి జాలమంతము కూర్చి తన తండ్రికి బాలాంబిక ప్రసాదించిన ముత్యాల హారము తన వాగ్రూపమున జాలువారిన రీతి నిరూపించుచు ఆ తల్లి వరప్రసాదిని అన్న విషయము అక్షర రూపమున శ్రీ దీక్షితుల వారు ఉద్ఘాటించినట్లుగా నున్నది ఈ కీర్తన.

★★★

## 8. "కీవళూరు క్షేత్రము"

### "స్వయంభూ లింగము"

శంకరాభరణ రాగము — చాపుతాళము

29.వ.మేళకర్త

పల్లవిః అక్షయ లింగవిభో స్వయంభో ।
అఖిలాండ కోటి ప్రభో పాహి శంభో ॥ ॥అక్షయ॥

అ॥ప॥ః- అక్షర స్వరూప అమిత ప్రతాప । ఆరూఢ వృషవాహ జగన్మోహ
దక్ష శిక్షణ దక్షతర సురలక్షణ విధి విలక్షణ
లక్ష్య లక్షణ బహు విచక్షణ సుధా భక్షణ గురు కటాక్ష వీక్షణ ॥అక్షయ॥

చరణముః- బదరీ వనమూల నాయికాసహిత । భద్రకాళీశ భక్తవిహిత ।
మదన జనకాది దేవ మహిత । మాయా కార్యకలనారహిత
సదయ గురుగుహ తాత గుణాతీత । సాధు జనోపేత, శంకర నవనీత ।
హృదయ విభాత, తుంబుర సంగీత ।
హ్రీంకార సంభూత, హేమగిరి నాథ ॥
సదాశ్రిత కల్పక మహీరుహ పదాంబుజయుగ
రథగజ తురగ పదాతి సంయుత చైత్రోత్సవ
సదాశివ సచ్చిదానందమయ ॥అక్షయ॥

తిరువారూరునకు సమీపమున గల కీవళూరు అను క్షేత్రము కలదు. ఇచట గల స్వయం భూలింగ రూపుడైన స్వామిని దర్శించుటకు దీక్షితుల వారు చేరుసరికి గుడి తలుపులు వేసికొని అర్చకులు వెళ్ళిపోవుచుండిరి. దీక్షితుల వారు అర్చకులను స్వామి దర్శనము లభింపచేయుడని కోరగా వారు నిరాకరించిరి. దీక్షితుల వారు ఆ ముఖ మంటపమునందాసీనులై ఆ స్వామిని "అక్షయలింగ విభో స్వయంభో" అను కృతిని గానము చేసిరి. ఈ ఉదంతమంతయు జీవిత చరిత్ర యందు వివరముగా కలదు.

భగవంతుని దర్శనమునకు కావలసినది అర్తి, వేదజ్ఞానము లేదా జిజ్ఞాస లేదా భగవద్గీతలో -

"చతర్విధా భజన్తే మాం జనాస్సు కృతి నోఽర్జున ।

ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీచ భరతర్షభ॥"[1] - అని కలదు

పరమాత్మ ఈ ప్రపంచములో నాల్గు విధములైన వారు నన్ను భజించుచుందురు అని గీతలో పేర్కొనెను. ఒకడు అర్తుడు, ఒకడు నన్ను తెలుసుకోవలెనన్న ఆరాటము కలవాడు, ఒకడు జ్ఞానియైనవాడు, ఒకడు తన కోరికలు తీరవలెనన్న గాఢమైన కాంక్ష కలవాడు.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు భగవంతుని గూర్చిన ధ్యాన నిష్ఠ కలవారు. ఆ స్థితిలో ఋషి ప్రవృత్తి కలవారు. సంసారిగా మానవ మాత్రునికి సహజమైన అవసరములు కలవారు. వానికై భగవంతుని నమ్మినవారు. అర్తితో భగవంతుని అర్చించినచో లోక విషయములను గూర్చి తాపత్రయ పడనవసరము లేదన్న నిశ్చయ జ్ఞానము కలవారు. ఉదాహరణముగా- "త్యాగరాజేన సంరక్షితోఽహం" - సాళగభైరవి రాగములోని కృతిని పేర్కొనవచ్చును. భగవంతుడు ఏ ధ్యానముచే మనకు గోచరించునో అన్న జిజ్ఞాస కలవారు. భగవంతునకు భక్తుని యందు సహజముగా ఆసక్తి యుండును.

స్వామి దర్శనమున కేగిన దీక్షితుల వారికి అర్చకులు గుడి తలుపులు తీయుటకు నిరాకరించగా, ముఖమంటపము నందు కూర్చుని "అక్షయలింగ విభో - స్వయంభో"

---

1. భా.గీ.. 7 అ. శ్లో. 16.

అని ఆర్తితో ఆ స్వామిని ఎంతగా పిలిచెనో ఈ కృతిని పరిశీలించిన స్పష్టమగును. ఆ స్వామి గుడి తలుపులు తెఱచి తానే దీక్షితుల వారికి దర్శన మొసంగెను. ఈ కృతి అంతపని చేయించెను. హృదయమెఱిగిన వానికి మనలో నున్నవాడు, బయటనున్నవాడు ఆ భగవంతుడే అన్న విశ్వాసమున్న వానికి ఆ దైవము కనిపించును. ఈ కృతిలో ఏ అక్షరము చూచినను ఆ స్వామి దర్శనము కలుగలేదన్న ప్రగాఢ వ్యధను వ్యక్తీకరింప చేయును. గాఢత్వము (వేగము) ఆరాటము, ఆర్తి ఆ అక్షరములను తఱుముకొని వచ్చినట్లుగా ఉన్నవి. ఈకృతి యందలి క్ష, భో, ధ, హ్రీం, దీక్షితుల వారి శివ సాక్షాత్కారార్తిని స్ఫురింపచేయుచున్నవి. చైత్రోత్సవము నందలి సదా శివుని దర్శనము శ్రీ దీక్షితుల వారికి అంతగా ఆర్తిని కలిగించి దర్శనమిచ్చెను.

స్వయం భూలింగమూర్తియైన ఆ స్వామిని దీక్షితుల వారు "ఓ ప్రభో ! నీవు అక్షయుడవు, అచ్యుతుడవు. నీవు సర్వాంతర్యామివి. ఈనాడు గుడితలుపులు వేసికొని యుంటివి. నా పిలుపు విన్నచో నీవు తలుపులు తెఱువకుందువా. నీదర్శనము సర్వకాల సర్వావస్థలయందు అణువణువున క్షణ క్షణమున గోచరించునదే. గుడిలో ప్రభువు తలుపులు తీసిన గాని గోచరింపడు. అప్పుడది ప్రతీక మాత్రమే కాని తన హృదయమున నున్నవాడు అక్షయుడు, స్వయంభువుడై అఖిలాండకోటుల యందును ఉన్నవాడు. కనుకనే దీక్షితుల వారు పల్లవి చివరిలో శంభో" అనిరి. శం-శుభము, భు-జనింపచేయు సర్వజగన్నాథుడు శంభువు. ఈ భావముతో ఈ కృతి యందు దీక్షితుల వారు ఆకాశమునందు అభి వ్యాప్తమగు నటుల అక్షయనాదమున స్వయం ప్రభావమైన నాదము అఖిలాండ కోటులందు వినిపించు నటుల సమస్తమైన అక్షర దీప్తిని, శబ్దశక్తిని, ధ్వని ప్రగల్భతను, సంగీత స్వరసుధా నిర్ఝరులను నింపి, శంకరునకు ఆభరణముగా ఏకమై మిశ్రమై యున్న లయకారుని సృష్టి స్థితి లయమయ లీలా వినోదమును భావ రాగ తాళమయముగ చేసి, ఒక పంచాక్షరి వలె, ఒక ఏకాక్షరివలె, ఒక మంత్రాక్షరి వలె, స్వరాక్షరి వలె ఈ కృతిని పలికిరి.

"అక్షయ లింగవిభో - స్వయంభో" అనుటలో క్షయములేని లింగ స్వరూపము గల ప్రభూ, నీవు విలక్షణమైన ప్రకాశము, విశ్వ వ్యాప్తమైన ప్రకాశము కలవాడవు అనిరి

దీక్షితుల వారు. అక్షయ అనుటలో అకారము నుండి క్షకారము వరకు ఉన్న అక్షరముల సమాహార రూపము అక్షము. అ-క్ష-ల మధ్య నున్నవి అంతస్థములు అది 'య' అన్న అక్షరమున సూచింపబడినదని అనుకొనినచో అకారము నుండి క్షకారము వరకు వ్యాపించియున్న సర్వాంతస్థమైన జగత్తునకు లింగము, గుర్తు నీవైన ఓ విశిష్ట ప్రకాశ స్వరూపుడవైన స్వామీ! నీవు లేనిది ఎక్కడ -

"అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" అన్న ప్రతీతి కలవాడవు కదా. సర్వాతంర్యామివి కదా. ఎక్కడా పుట్టుటకు ఆధారము లేనిచోట నీవు పుట్టదలచు కొన్నచో సంకల్ప మాత్రముగా, స్వయముగా పుట్టుచుందువు స్వయంభూస్వామి. ఈగుడి లోపలకాదు, వెలుపల నాకంటి ముందు నీవు స్వయంభువుడవుగా కనిపించవా అని దీక్షితుల వారు పల్లవిలో పేర్కొనిరి.

అనుపల్లవిలో దీక్షితుల వారు 'అక్షరస్వరూప' అని స్వామిని స్తుతించిరి. అక్షరములే నీ స్వరూపముగా కలవాడవు. వేదములు, వేదాంగములు పురాణాది సమస్త విద్యలు అక్షర స్వరూపమే. ప్రతీ అక్షరము నీ స్వరూపము కనుక అక్షరములను వేద అవయవములుగా, సమస్తమునకు ప్రతీకగా, అధ్యయనము చేసిన నాకు అక్షరాక్షరములలో నీ స్వరూపమే గోచరించుచున్నది. అది క్షరము కానిది. దానికి అంతము లేదు, నాశనము లేదు. అట్టి అక్షర స్వరూపుడవు నీవు. ఉద్యద్భాను సహస్రకాంతులచే అమితమైన, ప్రకృష్టమైన తేజస్సు కలవాడవు. వృషభముపై అధిష్ఠించి యున్నవాడవు నీవు. 'ఆరూఢ వృషవాహ' అనిరి దీక్షితుల వారు. వృషభము అనగా చత్వారి శృంగములతో, 3 పాదుకలతో 3 చోట్ల కట్టి వేయబడిన జగత్తునంతను త్రిప్పి తీసికొని రాగల వాహనము. ఈ వృషభము వేదము. వేదముచే వేద్యుడైన వాడు, వేదముచే లోకమునకు అందజేయబడినవాడు. అసలు వేదము యొక్క ఆదినుండి అంతము వరకు ప్రతిష్ఠితుడై ఉన్నవాడు.

"యోవేదాదౌ స్వరప్రోక్తః వేదాంతేచ ప్రతిష్ఠితః

తస్యప్రకృతి లీనస్యయః పరస్యమహేశ్వరః" - అని నారాయణీయములో కలదు. కనుక ఆరూఢ వృషవాహుడు అంతనూ కలడు. తన పరా, పశ్యంతీ, మధ్యమా,

వైఖరీ రూపమైన వాక్కే వృషభము. దానిని అధిరోహించి యున్నవాడు ఆ పరమేశ్వరుడు.

**"చత్వారి శృఙ్గాస్త్ర యోఽ_స్యపాదా ద్వేశీర్షే సప్తహస్తాసోఽ_స్య**

**త్రిధాబుద్ధో రోరవీతి మహో దేవోమర్త్యా ఆవివేశ"[1]**

"ఈ వృషభమునకు కొమ్ములు 4, పాదములు 3, శిరస్సులు 2, హస్తములు 7, కలిగి మూడు విధముల బంధింపబడినదై ధ్వని చేయుచు ఈ మహాదేవుడు మనుష్యులలో ప్రవేశించెను". ఈ వృషభమును యజ్ఞముగా 'సాయణాచార్యులు వారు (ఋగ్వేద భాష్య భూమికలో) వ్యాఖ్యానించి యున్నారు. "ఈ యజ్ఞముగా - వృషభమునకు హోత - అధ్వర్యువు, ఉద్గాత, బ్రహ్మ అను నలుగురును శృంగములు. ప్రాతఃసవనము, మాధ్యాహ్నిక సవనము, సాయంసవనము - అను 3 పాదములు, పత్ని, యజమాను లిరువురును రెండు శిరస్సులు, గాయత్ర్యాది ఛందస్సులు 7 హస్తములు. ఋగ్వేదత్రయముచే 3 విధముల బంధింప బడినది. కామములను వర్షించును గాన వృషభము. మాటి మాటికి స్తోత్రశస్త్రాది ధ్వనులు చేయును. యజ్ఞరూపుడగు ఈ ప్రౌఢుడైన దేవుడు మర్త్యులలో ప్రవేశించెను. అనగామర్త్యులే ఇందుకు అధికారులు." సంగీత పరముగా -

**"సప్తస్వరాః త్రీణిస్థానాని, చత్వారో వర్ణాః**

**ద్వివిధా కాకుః షడలంకారాః షడఙ్గాని"** [2]

అని భరతనాట్య శాస్త్రమున చెప్పిన దానిని యథాసంభవముగా శృంగాది రూపమున అన్వయించు కొనవలెను. ఆ పరమేశ్వరుడు జగత్తు నంతటను మోహమున ముంచువాడు. ఒక్కడై బహురూపములు చూపుచు లింగము లేని వాడై స్త్రీ, పుం రూపములను పొందుచు, జాతిలేనివాడై మృగ పశుపక్ష్యాది అవతారములను ఎత్తుచు మాయచే జగత్తును భ్రాంతిలో పడవైచి మోహమున ముంచువాడుగు ఆ పరమేశ్వరుడు జగన్మోహనుడు. ఇంకను దీక్షితులవారు - "దక్ష శిక్షణ దక్షతర సుర లక్షణ విధి విలక్షణ

లక్ష్యలక్షణ బహు విచక్షణ సుధాభక్షణ గురుకటాక్ష వీక్షణ" - అనుటలో

---

1. శ్రీ.రా.వి.కా.మీ పుట 18, తృతీయము - కావ్యపురుషోత్పత్తి.
2. శ్రీ.రా.వి.కా.మీ పుట 18, తృతీయము - శ్లో. 2.

అనుటలో - దక్షప్రజాపతిని శిక్షించుట యందు మిక్కిలి దక్షత కలవాడు, దక్షుని మించిన వాడు, అపరాధులను శిక్షించుట యందు మిక్కిలి దక్షత గల దైవము, తన భక్తులయెడ మిక్కిలి అపచారులైన వారిని శిక్షించుటకు వెనుకాడని వాడు అనికొనియాడిరి. మరియు దేవలోక సురులను, భూలోక సురులను (బ్రాహ్మణులను) రక్షించువాడు. విధి నిర్ణయమును విలక్షణముగా జరుపువాడు. లక్ష్యము సాధించు లక్షణ స్వరూపుడు. మిక్కిలి విచక్షణ కలవాడు. అనగా ఏది ఎప్పుడు ఎక్కడ ఎట్లు చేయవలెనో ఆ విధముగా చేయువాడు. సుధాభక్షణము - విషమును మ్రింగినవాడు. గురుకటావీక్షణము కలవాడు అనిరి. ఈ సాహిత్యములో క్షకారా వృత్తి స్పష్టమగుచున్నది.

ఇది దీక్షితులవారి ఆనాటి మానసిక సంక్షోభ, సంయమన, భగవతత్త్వ, సమన్వయ పరముగా అన్వయించు కొనవలసిన సాహిత్యము. క్ష-క్ష-క్ష-క్ష- ఏ దుర్వేళ వచ్చితిని గుడిలో దేవరదర్శనము కాలేదే అన్న చిత్త విక్షోభమునే దక్షశిక్షణ, దక్షతర, ఇత్యాదిక్షకార అనుప్రాసతో తన మనఃక్షోభను వెల్లడి చేసికొనినట్లున్నది. కాని దీక్షితులవారికి ఆ క్షోభ ఏమియు లేదు. గురుకటాక్ష వీక్షణముచే తనకు ఆస్వామి రూపము చరితము లక్షణము కనులకు కట్టినట్లున్నది. అందుచే "అక్షయలింగ విభో" అని విభుద్రవ్యమైన ఆకాశమున ఆర్తితో తన హృదయ వేదనము ఒక వేదముగా పలికినారు. ఈ ఒక్క కృతియే చాలును, దీక్షితులవారి హృదయ సంవేదన తెలియజేయుటకు.

చరణములో దీక్షితులవారు ఈశ్వరుని యొక్కపరాత్పరమైన పరబ్రహ్మ స్వరూపమును నిరూపించుచున్నారు. బదరీవనము నరనారాయణ విహార వనము. అది ఆదిఋషుల తావుగా చెప్పబడిన వనమున మూలనాయిక. అనగా మూలాధారము నందలి జగత్కారణ హేతువైన నాయికతో కూడినవాడు - భద్రకాళీ ప్రభూ, భద్రకాళి లయకారిణి. అట్టి ఈమెకు ప్రభువైన తాను కూడా లయకార స్వరూపుడే. భక్త జనులచే నియమింపబడువాడు భక్తవిహితుడు. మదన జనకుడైన విష్ణువు మున్నగు దేవతల కంటె మహితుడు. మాయా కార్యకారణారహితుడు. అనగా మాయాతీతుడు. మిధ్యా జగత్తున ఉన్న అవతారదైవము కాడు.

ఆయన సత్యలోకమున పరాత్పరయైన మాయకు తావు కానిచోట నుండువాడు. దయకలవాడు, గురుగుహుని తండ్రి. త్రిగుణములకు అతీతుడు. శంకరుడు నవనీత స్వరూపుడు. ఇచట శంకర అన్నది ఒక సంబోధనగా తీసికొన్న 'నవనీత' అన్నది మరియొక్క సంబోధన. నవనీతమనగా (వెన్న) క్రొత్తదిగా చేసికొనబడిన ఈ సృష్టిలోని సారభూతమైనది. ఎప్పటికప్పుడు ఈ జగత్తు నందలి ఋషుల తపస్సులు పండిన గుండెల యందు తేలిన నవనీత స్వరూపుడు-పరమేశ్వరుడు. అట్టి పరమేశ్వర స్వరూపము ఎప్పటికప్పుడు క్రొత్తది. అదే నవనీతము. ఆస్వామి హృదయ విధాత. అనగా హృదయమున ప్రకాశించువాడు. తుంబురుని సంగీతము నందలి హ్రీంకార నాదము నుండి సంభూతుడు హేతుగిరినాథుడు. మేరుపర్వత ప్రభువు. అట్టి మహానుభావుడు సదా ఆశ్రితులకు కల్పవృక్షమై తన పదాంబు జయగముతో నడచివచ్చు వాడై రథగజ తురగపదాతి పరివారముతో కూడిన వాడై చైత్రోత్సవ వైభవమున ఒప్పియుండు "ఓ సదాశివా! సచ్చిదానందమయా! నీవు సదా సర్వాధా శివుడవై ఎక్కడ చూచిన అక్కడే కనిపించు వాడవు. నాలోనే ఉన్న సచ్చిదానంద స్వరూపుడవు. నీవు గుడిలో ఉండి నాకు కనిపింపవా అక్షయ లింగవిభో" అని ఆర్తితో ఆ స్వామిని పిలచినారు దీక్షితులవారు.

ఈ కీర్తనలో ఒక చమత్కారము కలదు. దీక్షితులవారు అకారము నుండి సర్వ వర్ణ సమామ్నాయమును, మంత్ర వర్ణ మాతృకా రూపమును, హృల్లేఖ మంత్రమైన హ్రీంకారమును ఈ పల్లవి నుండి చివర వరకు తన హృదయ గతమైన ఆర్తితో ప్రత్యక్షరము బీజాక్షర రూపముగా, మంత్రమయము చేసిరి. బీజాక్షర సంపుటి చేత నాదమయమైన ఈ కీర్తనమున అంతర్యాగ పరముగా తాను భగవంతుని సామీప్యమున సాక్షాత్కరింప చేసికొనినట్లున్నది.

ఈ కీర్తనములోని క్ష,హ, అక్షరములు గల పదముల చేత రసస్పందన కలుగు చున్నది. దీక్షితుల వారి దృఢ నిశ్చలభక్తి కరుణ రసమయమైన స్థితి ఇందు ధ్వనించుచున్నది. క్ష-రౌద్రరసమును, హా-కరుణరసమును వ్యక్తీకరించును.

శంకరుడు నాద స్వరూపుడు కాగా ఆ స్వామికి తన సంగీతము అలంకారముగా చేసి తన స్వామితత్త్వము, తనవిద్యయు కలసి ఏకకోటికి చెందినవని స్ఫురింపచేయుట ఇందలి చమత్కారము.

★★★

## 9."కుళిక్కరై క్షేత్రము"

### "చతుర్దశ రాగమాలిక"

రాగాంగ రాగమాలిక ఆదితాళము

పల్లవి:- శ్రీ విశ్వనాథం భజేహం చతుర్దశ భువనరూప
రాగమాలికా భరణ ధరణాంతః కరణం
శ్రితజన సంసార భీత్యాపహం ఆధ్యాత్మికాది
తాపత్రయ మనోభీత్యా పహం ॥శ్రీవిశ్వనాథం॥

అ॥ప॥:- శ్రీ విశాలక్ష్మీ గౌరీశం సకల నిష్కళరూప సచ్చిదానందమయ గౌరీశం॥
చిత్ర విశ్వనాటక ప్రకాశం జగత్ప్రకాశ భాస్కర శశాంక కోటి ప్రకాశం॥
గోవిందాది వినుత గౌళాంగం క్షీరకుందేందు
కర్పూరాది విజయ భసితోద్ధూళిత గౌళాంగం॥
గురుగుహ సమ్మోహనకర లింగం పంచీకృత॥
పంచమహాభూత ప్రపంచాది మోహనకర లింగం॥
విరించి విష్ణు రుద్ర మూర్తిమయం।
విషయ పంచక రహిత మభయం॥
నిరతిశయ సుఖద నిపుణతరం।
నిగమసార మీశ్వర మమరం॥
స్మరహరం పరమశివ మతులం।
సరస సదయ హృదయ నిలయమనిశమ్ ॥శ్రీవిశ్వనాథం॥

చరణము:- సదాశివం సామగాన వినుతం ప్రకృత్యాది
సప్తరూప సామగాన వినుతం సన్మాత్రం
లలిత హృదయ విదితం కామక్రోదాది రహిత
లలిత హృదయ విదితం॥
చిదాకాశ భైరవం, పురహరం।
విధికపాల శూలధర భైరవం పురహరం॥
చిత్సభేశ్వరం సారంగధరం।
దారుకావన తపోధన కల్పిత సారంగధరం॥
సదాశ్రయామి శంకరాభరణం చింతితార్థ
వితరణ ధురీణతర మాణిక్యమయ శంకరాభరణం॥
సద్గతిదాయ కాంభోజి చరణం।
ధర్మార్థాధి నిఖిల పురుషార్థప్రద సమస్త కరాంభోజ చరణం॥
వదాన్య దేవక్రియా ఖేలనం సృష్టి స్థితి లయ।
తిరోధానానుగ్రహకరణ క్రియాఖేలనం॥
వైద్యలింగ భూపాల పాలనం।
శ్రీపుర నిర్బుతిభాగ గర్త తీర స్థితవర భూపాల పాలనం॥
గురుగణేశ సురనరేశ మనిశం।
కుజ బుధాది గ్రహగతి విహితం॥
వరద మనల రవి శశి నయనం।
వనజ చంద్ర సన్నిభ వదనం॥
పరమహంస మానంద నర్తనం।
పతిత పావన కరణం మదహరణం॥
పరతరం పరమ మనోలయ జయం
పరాది వాక్ప్రకాశానంద మయం ॥శ్రీవిశ్వనాథం॥

దీక్షితుల వారు ఈ రాగమాలికను రచించుటకు ఒక కారణము కలదు. తిరువారూరు సమీపమున గల కుళిక్కరై గ్రామ మిరాశి దారుడైన "వైద్యలింగ మొదలియర్" దీక్షితులవారి ప్రతిభాపాటవములను విని తమ గ్రామమునకు ఆహ్వానించిరి. దీక్షితులవారుఅచట నున్న కాశీవిశ్వేశ్వర, విశాలాక్షి, అన్నపూర్ణ, కాల భైరవులపై కృతులు రచించిగానము చేసిరి. 'వైద్యలింగ మొదలియార్' దీక్షితులవారికి కనకాభిషేకము చేసి తనపై ఒక కృతిని రచింపుమనిరి. మానవులను కీర్తించుటకు ఇష్టపడని దీక్షితుల వారు పదునాలుగు రాగములతో "శ్రీ విశ్వనాథం" అను మాలికను కూర్చి మొదలియార్ తృప్తికై "వైద్యలింగ భూపాలపాలనం" అని చరణములో కూర్చి గానము చేసిరి.

రాగమాలిక పల్లవి అనుపల్లవి చరణములతోగాని లేక పల్లవి చరణములతో గాని రచింపబడిన మనోహరమైన సంగీతరచన. 17, 18వ శతాబ్దములలో రాగమాలికా రచన ప్రారంభమైనదని తెలియుచున్నది. ఇందుగల పల్లవి, అనుపల్లవి, చరణములు వివిధ రాగములలో రచింపబడుట వలన దీనికి 'రాగమాలిక, రాగహారమ' ని పేరు వచ్చినది. రాగమాలికలో కనీసము 4 రాగములు ఉండవలెను. ముత్తుస్వామి దీక్షితులవారి తండ్రియైన రామస్వామి దీక్షితులవారు "నాటకాది విద్యల" అను దశ (10) రాగతాళమాలికను రచించిరి. రామస్వామి దీక్షితుల వారు రచించిన 108 రాగతాళమాలికను 'వేంకటకృష్ణుడు' అను 'చిన్న మొదలియార్' విని రామస్వామి దీక్షితులవారికి కనకాభిషేకమొనర్చెను. ఆ ప్రభావము దీక్షితుల వారిపై కూడా ఉన్నదనిపించును.

దీక్షితుల వారు రచించిన ఈ రాగమాలిక యందు ఒక విశేషముకలదు. ఈ రాగమాలిక యందు చతుర్దశభువనములకు నాథుడు విశ్వనాథుడు. చతుర్దశ భువనములచే వ్యాప్తమైనది విశ్వము. అట్టి విశ్వమునకు నాథుడైన వానిని కీర్తనలన్నింటికి మకుటాయమానముగా నుండదగు ఒక గొప్ప రాగమాలికను 14 రాగాంగ రాగముల వరుసలో రచించి, ఆ విశ్వనాథుని స్తుతించినారు. ఆరంభమున ఆరభిరాగము చివర ఇతి 'శ్రీ' అనే ముగింపు శ్రీరాగముతో చేసినారు. ఈమధ్యన ఉన్నరాగములు విశ్వనాథునికి-గౌరి, విశ్వనాటక, గౌళాంగ, సమ్మోహన, సామ, లలిత, భైరవ, సారంగధర, శంకరాభరణ, కాదివిద్యానిధియైన

'కాం' కామేశ్వరీ సంకేత రూపమైన దేవతను 'భోజి' - అనుభవించు తన లక్షణము (విశ్వనాథుని లక్షణము) గల కాంభోజి, భూపాలన రక్షిచే భూపాలరాగము, దేవక్రియచే దేవక్రియారాగము, లన్నియు శ్రీసమృద్ధములు, శ్రీమయములు, షోడశ కళాసమన్వితములు. శ్రీదములు (శ్రీనిఇచ్చునవి) శ్రీ మాతృకములు, శ్రీమహాసింహాసనములు, శ్రీ మాహారాజ్ఞీ ప్రియములు. ఇట్టి భావములతో కూడిన రాగమాలిక చతుర్దశభువనములకు ఈశ్వరి, ఈశ్వరుడైన వారి గురించి కాక మరిఎవరిని గూర్చి దీక్షితుల వారి హృదయము స్తుతించదు. ఆదిదైవమును గూర్చి ప్రస్తుతించిన ఈ రాగమాలిక తాళము కూడ ఆది తాళములో దీక్షితులవారు నిక్షేపించిరి. .భావపుష్పములను రాగముల సరళితో మాలికగా చేసి, లయకారుని ఆది తాళరూపమున భజించుచు, తన్మయుడై తన హృదయ వీణతో శ్రుతికలిపి, చేత వీణను మీటుచు దీక్షితులవారు ఈ రాగమాలికకు శ్రీకారము చుట్టియుందురేమోయని అనిపించుచున్నది.

ఈ రాగమాలిక 'శ్రీ'కారముతో ప్రారంభమగుచున్నది. దైవము యొక్క సమస్త స్వరూపము 'విశ్వనాథ' మన్న పదమున పరిపూర్ణముగా సమన్వితమగు చుండగా, భజించుటయే తన ఆనందమని, కర్తవ్యమని తలచి దీక్షితులవారు "శ్రీవిశ్వనాథం భజేహం చతుర్దశ భువనరూప రాగమాలికా భరణ ధరణాంతఃకరణం" అనిరి. భువనమనగా సృష్టింపబడునది. దీనికి కారణము రాగము. పరమేశ్వరలీల. "సకల భువనోదయ సృష్టిస్థితిలయమయ లీలా వినోదనోద్యుక్తుడు" ఆ స్వామి. రాగవతియైన విమర్శరూపిణియైన శక్తిస్వరూపిణి యొక్క అనురాగమున చతుర్దశ భువనరూపమైన రాగములు పుంఖాను పుంఖములుగా అది చతుర్దశ భువనరూప రాగమాలికగా వెలువడినది. అదియే తనకు ఆభరణమై వెలుగొందిన విశ్వనాథుని నేను భజంతును. ఇది సృష్ట్యారంభ సంకల్ప సంజాతమైన కామరాజ బీజస్ఫురితమైన జగద్విలాస విషయము.

"ధరణముచే సర్వభువన అంతఃకరణ రూపుడైయున్నవాడు ఆ స్వామి. అట్టి వానిని భజింతును. చతుర్దశ భువనములు ఒక రాగమాలికగా, ఆభరణముగా ధరించి యున్న విశ్వరూపుని యొక్క కేంద్రస్థానమైన విశ్వనాథుని భజించుచున్నాను. ఆకేంద్రము స్వామి అంతఃకరణము. ఆశ్రయించిన జనుల యొక్క సంసారభీతిని తొలగించు వాడు"

అనుటను దీక్షితులవారు 'సంసారభీత్యాపహం' అని సూచించిరి. 'సంసారభీ' అన్నచో ఆరభిసంస + ఆరభిత్యాహం. ఇట్టిపద విభజనచే ఆరభి రాగ నామము సూచితమగున్నది. ఆదిదైవిక, ఆదిభౌతిక, అధ్యాత్మికములను తాపత్రయములచే కలుగు మనోభీతిని తొలగించువాడు ఆ పరమేశ్వరుడు అని దీక్షితులవారు పల్లవిలో వాకృచ్చిరి.

అనుపల్లవిలో ఆ స్వామి "శ్రీవిశాలాక్షీ గౌరీ నామధేయముగల నాయికలకు ప్రభువైనవాడు. సగుణ నిర్గుణములందు సకల నిష్కళ రూపమైన సచ్చిదానందమయుడైన గౌరీశుని నేను భజింతును" అనిరి దీక్షితులవారు. ఇచట గౌరీశం అనుటలో 2. 'గౌరి' రాగ నామమును పొందుపఱచిరి. ఆ స్వామి చిత్రమైన విశ్వనాటకమును ప్రకాశింప చేయువాడు. అనగా కల్పితమైన జగత్తు మాయ. అట్టి మాయానాటకమును గొప్పగా వెలుగులోనికి తెచ్చువాడు. ఇచట 'విశ్వనాటక' అనుటలో 3.'నాట' రాగనామమును సూచించిరి.జగత్ప్రకాశ పరులైన భాస్కర, శశాంకుల కంటె కోటికోటి రెట్లు అధికమైన తేజస్సు కలవాడు ఆ స్వామి.

గోవిందుడు, బ్రహ్మ మున్నగు దేవతలచే నుతింపబడిన తెల్లని సత్త్వగుణసంకేతమైన శరీరము కలవాడు. పాలు, మొల్లపువ్వులు, చంద్రుడు, కర్పూరము, మున్నగు విజయ వంతమైన, శుభ్రములైన, తెల్లనివైన వన్నెలుకలవియగు వానికంటె వన్నెకల భస్మముతో మెదపిన శరీరపు పూతచే తెల్లని అంగములు కలవాడుగా గోచరించువాడు అనిరి దీక్షితులవారు. ఇచట 'గౌళాంగం' అనుటలో 4. 'గౌళ' రాగనామమును ఇమిడ్చిరి.

గురుగుహునకు సమ్మోహనకరమైన లింగము కలవాడు. పంచీకృతములైన పంచ మహాభూత ప్రపంచమున కంటె అతి మోహనకరమైన లింగస్వరూపుడు. విరించి-బ్రహ్మ విష్ణు రుద్రమూర్తులు మూడును కలసి తానే అయిన వాడు ఆ స్వామి. విషయపంచక మనగా శబ్ద, స్పర్శ, రూప, రస గంధములు. ఆ సంబంధము పోయిన అభయ మిచ్చువాడు, నిగమ సారమైనవాడు. అసు-ప్రాణములను రం-రంజిల్లు చేయువాడు ఆ స్వామి. మన్మధుని హరించినవాడు పరమ శివుడు. ఆ దైవము అతులం సాటిలేని వాడు, సరసుడు. సదయులైన వారి హృదయము నందు ఎల్లప్పుడు నిలచి యుండు వాడగు శ్రీవిశ్వనాథుని భజింతుననిరి దీక్షితుల వారు. ఇందు "సమ్మోహనకర" అనుటలో 5. మోహన రాగనామమును నిక్షేపించిరి.

ఈ అనుపల్లవిలో గౌరీశ, విశ్వనాటక, గౌళాంగ, మోహన రాగముల యొక్క రూపముగా నున్న భువనములకు ఈశ్వరుడైన వాడుశ్రీ విశ్వనాధుడని దీక్షితులవారు పేర్కొనిరి.

చరణములో సదాశివుడు సామగానముచే స్తుతిపాత్రుడని చెప్పిరి. ఆ స్వామి ప్రకృత్యాది సప్తరూపములైన సామగానముచే వినుతింపబడు వాడు అని దీక్షితులవారు వాకృచ్ఛిరి. ఇచట ఛాందోగ్యోపనిషత్ ప్రారంభమున గల శ్లోకము అనుసంధించుకొనవచ్చును.

"ఏషాం భూతానాం పృధివీ రసః

పృధివ్యా ఆపోరస అపామోషధయోరస

ఓషధీనాం పురుషోరసః

పురషస్య వాగ్రసో వాచ ఋగ్రస ఋచస్సామ

రసస్సామ్న ఉదీథోరసః"[1]

ఈ పంచ భూతముల యందు పృథివి రసవంతమైనది. పృథివిలో నీరు రసవంతమైనది. నీటిలో ఓషధులు రసవంతమైనవి. ఓషధుల కంటె పురుషుడు రసవంతమైన వాడు. పురుషునకు వాక్కు రసవంతమైనది. వాక్కులకు ఋక్కు రసవంతమైనది. ఋక్కులలో సామము రసవంతమైనదని చెప్పబడిన పృథివి, అపస్సు, ఓషధి, పురుష, వాక్కు, ఋక్, సామములపైనున్న - సప్తరూపముల కంటె పైనున్న ఉద్గీథ రూపమైన ఓంకారముచే నుతిపాత్రుడు ఆ స్వామి. ఈ ఉపనిషత్ ప్రారంభశ్లోక సారమును దీక్షితులవారు చరణములో పోహళించిరి.

సత్ మాత్రమే తానైన వాడు సన్మాత్రుడు. లలిత హృదయమునకు విదితుడగు వాడు విశ్వనాథుడు. లలిత హృదయమనగా కామక్రోధాది రహిత లలిత హృదయము. అట్టి హృదయమునకు గోచరించువాడు. ఆ స్వామి చిదాకాశము నందు భైరవుడు, పురహరుడు. విధికపాల - బ్రహ్మకపాలమును, శూలమును ధరించు భైరవుడు పురహరుడు. చిత్ సభారూపిణికి ఈశ్వరుడు. యజ్ఞరూపమైన సారంగమును (లేడిని) తన చేత ధరించువాడు. నిరంతరము శంకరుడన్న ఆభరణమును ఆశ్రయింతును అనునది,

---

1. ఉ.క. పుట 113

"సదాశ్రయామి శంకరభరణం" అనుటలో దీక్షితులవారు సూచించిరి. ఇచట 'శంకరాభరణ' రాగనామమును నిక్షేపించిరి. ఇంకను చింతితార్థములను ఇచ్చుట యందు మిక్కిలి సమర్థమైన, మాణిక్యమయ మణులతో ఏర్పడిన దైన-అనగా మంత్రమైన శంకరపరమైన, ఆభరణమును తాను భజింతుననిరి.

సద్గతి దాయకమైన అంభోజముల వంటి చరణములు కలవానిని, ధర్మార్థ కామ మోక్షములను నిఖిలపురుషార్థములను ఇచ్చునటువంటి సమస్తమును మించినది యగు పద్మమువంటి చరణము కలవానిని భజింతును. వదాన్యతలో అనగాదానము చేయుటలో దేవక్రియా ఖేలనముగా చేయు వానిని, ఆ దానము చేయుట ఏమి అనిన సృష్టిదానము, స్థితి దానము, లయదానము, తిరోధానము, అనుగ్రహ దానము చేయుట అను క్రియలతో క్రీడించువాడు ఆ స్వామి. కుళిక్కరై గ్రామములోనున్న మిరాశీ దారుడైన వైద్యలింగ భూపాలుని పాలించు పాలకుడైన వానిని ధ్యానించుచున్నానని దీక్షితులవారనిరి . ఇచ్చట నైఋతి తీరమున వైద్యలింగభూపాలుడు పాలనము చేయుదైవము అగు విశ్వనాథుని భజించుచున్నానని దీక్షితుల వారు పేర్కొనిరి.

గురు గణేస-గురుగణములకు ఈశుడైన వానిని, సురనరులకు ఈశుడైన వానిని, కుజ, బుధ, గురు, శుక్ర, శని, రవి, చంద్ర గ్రహ గతులను నియమించు వాడగు వరదుని ధ్యానింతును. అనల-అగ్ని, రవి-సూర్యుడు, శశి-చంద్రుడు, ఈమూడు తన నయనములుగా గలవాడు. పద్మము, చంద్ర బింబము వంటి ముఖము కలవాడు ఆ స్వామి. పరమహంస స్వరూపుడై ఆనందనర్తనము చేయువాడు. పతిత పావనకరుడు, మదహరణుడు, పరతరుడు పరమ మనోలయ జయస్వరూపుడు. పరా పశ్యంతీ మధ్యమా వైఖరీ రూప వాక్ప్రకాశకుడైన ఆనందమయుని భజింతునని దీక్షితులవారు చరణములో ఉటంకించిరి.

చరణములో "సామగానవినుతం" అనుటలో 'సామ' రాగ నామమును, 'లలిత హృదయ' అనుటలో 'లలిత' రాగనామమును, 'చిదాకాశ భైరవం' అనుటలో 'భైరవ' రాగనామము, సారంగధరం' అనుటలో 'సారంగ' రాగనామము 'సదాశ్రయామి శంకరాభరణం' అనుటలో 'శంకరాభరణ' రాగనామము, 'సద్గతిదాయ కాంభోజి చరణం' అనుటలో 'కాంభోజి'

రాగనామమును 'భూపాలపాలనం' అనుటలో 'భూపాల రాగనామమును, "వదాన్య దేవక్రియాఖేలనం' అనుటలో 'దేవక్రియ' రాగనామములను చివరకు "శ్రీపుర" అనుటలో 'శ్రీ' రాగనామములను మనోహరముగా దీక్షితులవారు రూపొందించిరి.

ఈ రాగమాలిక యందు దీక్షితుల వారు చతుర్దశ భువనాధీశుడైన విశ్వనాథుని యొక్క సకల స్వరూపమును, పదునాల్గు విద్యలైన - వేదములు 4, వేదాంగములు 6 - (శిక్ష, వ్యాకరణము ఛందస్సు, నిరుక్తము, జోతిష్యము, కల్పము). అంశములు 4 - (పురాణము, ధర్మశాస్త్రము, న్యాయము, మీమాంస) ఋషిప్రోక్తములు. వానిచేతను, పదునాలుగు రాగాంగరాగములచే ఆ స్వామి నిష్కళ రూపమును, తంత్రమయ రూపమును యంత్ర తంత్రాత్మికమైన రూపమును స్తుతించిరని నిర్ధుష్టముగా చెప్పుటలో అతిశయోక్తి ఏమియు లేదు.

★ ★ ★

# అష్టమాధ్యాయము

# అష్టమాధ్యాయము

## శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి కృతులలో గల సంగీత-సాహిత్య ప్రాశస్త్యము

"చైతన్యం సర్వభూతానాం వివత్తం జగదాత్మనా
నాద బ్రహ్మ తదానందమద్వితీయ ముపాస్మహే"[1]

"నాదో పాసన యాదేవా బ్రహ్మ విష్ణు మహేశ్వరా:
భవంత్యుపాసితా నూనం యస్మాదేతే తదాత్మకా: ॥"[2]

ఇత్యాది ప్రమాణములచే బ్రహ్మ విష్ణు మహేశ్వరాదులు నాద స్వరూపులని స్పష్టమగుచున్నది. వీరిని ఉపాసించి తెలిసికొనుటకు ఒక సాధనము- నాదోపాసన సాధ్యము - బ్రహ్మము. సాధనము - నాదోపాసన, సాధకుడు - ఉపాసకుడు. ఇట్టి సాధ్య, సాధన, సాధక త్రిపుటిచే తెలియునది పరబ్రహ్మ స్వరూపము. ఈ నాదము బిందు సంజాతము. బిందువు శివశక్తి సంయుక్తము. శివుడు - అర్థము, వాక్కు - శక్తి. "శ్రుతిః మాతా లయః పితా" అను ఆర్యోక్తిననుసరించి జగత్తునకు మాతాపితరులైన శివశక్తులలో శక్తి - శ్రుతి, శివుడు - లయ. నాదము అను పదము నందు నకారము ప్రాణము, దకారము అగ్నివాచకము. ప్రాణాగ్ని సంయోగము వలన నాదముత్పన్న మగుచున్నది.

"కోహ్యే వాన్యాత్క: ప్రాణాద్య దేష ఆకాశ ఆనందో నస్యాత్" -
అని తైత్తరీయ ఉపనిషత్ పేర్కొనుచున్నది.

"తామగ్ని వర్ణాం తపసాజ్వలంతీం వైరోచనీంకర్మఫలే చజుష్టాం,
దుర్గాందేవీగ్‌మ్ శరణమహం ప్రపద్యే"-అని వేదము చెప్పుచున్నది.

"గీతిగానేన యోగస్స్యాత్, యోగాదేవ శివైక్యతా
గీతిజ్ఞోయది యోగేనసయాతి పరమేశ్వరమ్"॥ -

అని సూత సంహిత యందు కలదు. భక్తితో ఒక దేవతను గూర్చి మంత్ర జపములచే ఆరాధించిన ఏ ఫలము కలుగునో, అంత కంటే అధికమగు ఫలము గానముచే ఆరాధించిన కలుగునని భావము. అదియే యోగము. దానివలన పరమాత్మైక సిద్ధి కలుగును.

---

1. సం.ర.శ్లో 1. పుట 31

2. సం.ర.శ్లో 2. పుట 31

"త్రివర్గ ఫలదా స్సర్వేదాన యజ్ఞ జపాదయః।

ఏకం సంగీత విజ్ఞానం చతుర్వర్గ ఫలప్రదమ్॥" -

అని శివ సర్వస్వము పేర్కొనుచున్నది. దాన, యజ్ఞ, జపాదులు ధర్మార్థ కామములను త్రివర్గ ఫలదములే కాని సంగీత విజ్ఞానము ఒక్కటే ఈ మూడింటిని గాక తురీయమగు మోక్షమును కూడా ఒసంగునని కలదు.

"తస్య గీతస్య మహాత్మ్యం కే ప్రశంసితు మీశతే

ధర్మార్థ కామ మోక్షణా మిదమేకైక సాధనమ్" [1]

అని శార్ఙదేవుడు సంగీత రత్నాకరము నందు పేర్కొనిరి. సంగీతము ప్రతి జీవునకు ముఖ్యమీగు ఐహికాముష్మిక ఫలమునకు సాధనమగుచున్నది. దేవతలు సామగానలోలురగుటచే వారికి ఆ ముష్మికము కరతలామలకమనుటకు సందేహము లేదు. ఇట్టి సంగీతము -

"శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః

సఏవ శంకరోవేత్తి సమగ్రం వేత్తినాపరః॥"

"సంగీతమపి సాహిత్యం సరస్వత్యాస్తనద్వయం

ఏకమాపాత మధురం అన్యదాలోచనామృతమ్॥" -

అని 'సంగీత దర్పణము' అనులక్షణ గ్రంధమున చతురదామోదరుడు పేర్కొనిరి.

"నకారం ప్రాణనామానం దకార మనలం విదుః

జాతః ప్రాణాగ్ని సంయోగాత్తేన నాదోభిధీయతే"

అని చతురదామోదరుడు పేర్కొనిరి.

నాదమును గూర్చి ఈ గ్రంధమునందు చతురదామోదరుడు -

"ఆత్మనా ప్రేరితం చిత్తం వహ్నిర్దేహంతి దేహజం

బ్రహ్మగ్రన్థి స్థితం ప్రాణం సంప్రేరయతి పావకమ్॥"

ఆత్మ బుద్ధిని ప్రేరేపించును. బుద్ధి శరీరస్థమగు అగ్నిని ప్రేరేపించును. అగ్నివాయువు (ప్రాణము)ను ఉద్బోధించును. కావున ఆత్మ, మనస్సు, అగ్ని, వాయువుల

1. సం. ర. శ్లో. 30 పుట. 6

వలన నాదము ఉద్భవించుచున్నదని పేర్కొనిరి. మరియు -

"బ్రహ్మగ్రంథి స్థితోనాదః క్రమా దూర్ధ్వపదే చరన్।
నాభిహృత్కంఠ మూర్ధాసు ఆవిర్భవతి సధ్వనిః ॥"

బ్రహ్మగ్రంధిజమగు ఈ నాదము ఊర్ధ్వముగా సంచరించి క్రమముగా నాభి, హృదయ, కంఠ, మూర్ధముల నుండి వెలువడునని కలదు.

"నాదాచ్ఛ్రుతయో జాతాస్తాభ్యాం షడ్జాదయస్స్వరాః।
తేభ్యోరాగస్సముత్పన్నో గీతం తస్మాచ్చజాయతే॥"
"అతో నాదాత్మకం గీతం వాద్యం గీతానువర్తిచ॥"

అని శార్ఙ్గదేవుడు సంగీత రత్నాకరము నందు నాదము వలన శ్రుతులు, శ్రుతుల వలన షడ్జాది స్వరములు, స్వరముల వలన రాగములు, రాగముల వలన గీతమును ఏర్పడుచున్నవని, కావున గీతము నాదస్వరూపము, వాద్యము గీతాను కరణమని పేర్కొనిరి. నాదము ఓంకారము. ఓంకారము బ్రహ్మప్రతిపాదకము. బ్రహ్మప్రణవ సంధాననాదమే జ్యోతి స్వరూపుడైన శివుడు. సప్తస్వరములు, పంచాశత్ వర్ణములు ఆ నాదము యొక్క కళలే. ఈ నాదము వర్ణాత్మకమనియు, ధ్వన్యాత్మక మనియు రెండు విధములు. వర్ణాత్మకము "ననాద ఢక్కాం నవ పంచవారమ్" అను దానిచే "అ-ఇ-ఉణ్-ఋ-ఌక్ ఇత్యాది వర్ణములు అచ్చులు, హల్లులుగ విభాగములై వెలసి సకల వాఙ్మయ ప్రపంచమునకు మూలముగ పరిణామము పొందినది. ధ్వన్యాత్మకము ద్వివిధములు. ఆహతనాదము, అనాహత నాదము. వీటిని గూర్చి తృతీయాధ్యాయమున వివరించడమైనది. ఈ సప్తస్వరములు వరుసగా ఆరోహణక్రమములలో గానము చేయుట ప్రారంభించి తుదకు తార షడ్జమమును చేరి అచట నుండి అవరోహణ క్రమములో గానము చేసి తిరిగి (మధ్యస్థాయి) ఆధార షడ్జమమునకు చేరుట అనునది సాధకుడు వరుసగా ఆరోహణ క్రమమున ఒక్కొక్క లోకమును దాటి చివరకు సహస్రారంతర్గత బిందుస్థానమున గల శివశక్తులను దర్శించి తిరిగి అవరోహణ క్రమమున యథాస్థానమునకు చేరు గమనము వంటిది. ఈ యోగసాధనలో ఉచ్ఛ్వాస నిశ్వాసముల సవ్వడి ఉన్నది. ఆ సవ్వడి శ్రుతి. ఆ క్రమము లయ. దీనికి గాయత్రీ

మంత్రమును అనుసంధానము చేసికొనిన - స్వరముల ఆరోహణ అవరోహణ క్రమము యోగసాధనతో పరమాత్మని చేరుగమనము ఒకే విధముగా గోచరించును. "ఓం భూర్భువత్సువః ఓం తత్సవితర్వరేణ్య భర్గోదేవ స్వరేమహిః ధియో యోనః ప్రచోదయాత్" - అను స్థానము

| | | | | |
|---|---|---|---|---|
| | | | తారషడ్జమము - | స |
| ఓంసత్యం - | సత్ - | సత్యలోకము- | నిషాదము - | ని |
| ఓం తపః - | చిత్ - | తపోలోకము - | దైవతము - | ద |
| ఓం జనః - | ఆనందము - | జనలోకము - | పంచమము - | ప |
| ఓం మహః - | స్వర్గనిర్గమద్వారము - | మహర్లోకము - | మధ్యమము - | మ |
| ఓం సువః - | స్వర్గప్రవేశ ద్వారము - | స్వర్గలోకము - | గాంధారము - | గ |
| ఓం భువః- | అంతరిక్షము - | భువర్లోకము - | రిషభము - | రి |
| ఓం భూః- | భూమి - | భూలోకము - | షడ్జ్యమము - | స |

మన సంగీత త్రిమూర్తులైన శ్రీ త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి ఈ సప్త స్వరముల గమనముతో షట్ చక్ర బేధన మొనర్చి సహస్రారంతర్గతనాద బిందు కళాతీతమైన పరమాత్మ స్వరూపమును దర్శించిరి.

ఇట్టి స్వరములు "స్వతోరంజయతీతి స్వరః" స్వయముగా రంజింపచేయునది స్వరమనబడును. ఇట్టివి సప్త స్వరములు. అవి షడ్జ, రిషభ, గాంధార, మధ్యమ, పంచమ, దైవత, నిషాదములు. ఇవి సంకేతాక్షరములలో సరిగమపదని అని పేర్కొనబడినవి. సంగీత నారాయణమను గ్రంథమున

శ్లో:-"మయూరశ్చా తకశ్చాగః । క్రౌంచకోకిల వాజినః ।

గజశ్చ సప్త షడ్జాదీన్ స్వరాం శ్చొచ్చార యంత్యమీ ॥"

స - మయూరము వలెను, రి - వృషభము వలెను, గ -మేకవలెను, మ-క్రౌంచపక్షివలెను, ప-కోకిల వలెను, ద-అశ్వము వలెను, ని-ఏనుగు వలెను ధ్వని చేయునని కలదు. మరియు ఈ సప్తస్వరములు -

**శ్లో:- పద్మాభః సింజరీ స్వర్ణో । వరకుంద ప్రభస్సితం।**

**పీతః కర్బూర ఇత్యేతే । స్వరాణాం వర్ణ నిర్ణయః॥"**

స-ఎఱ్ఱతామర, రి-మయూరగ్రీవము, గ-స్వర్ణము, మ-మల్లెపుష్పము, ప-పంచవర్ణము ద-పసుపు, ని-దూసర - పుష్పముల వర్ణములు కలిగి యుండునని ఉదాహరింపబడినవి. మరియు నారదుని నారదీయము నందు -

**"చూత ఖర్జూర కదళీ జంబీరా దాడిమీ తథా।**

**ద్రాక్ష పున్నాగ వృక్షాశ్చ షడ్జాదీనాం ప్రకీర్తితాః॥"**

స -మామిడి, రి-ఖర్జూర, గ-అరటి, మ-నేరేడు, ప-దానిమ్మ, ద-ద్రాక్ష, ని-పొన్న-వృక్షములు సప్తస్వరములకు వాసనలుగ నిరూపింపబడినవి.

ప్రపంచ సంగీత చరిత్రలో భారతదేశ సంగీతమే అతి పురాతనమైనది. సుమారు 4000 సం॥లకు పూర్వమే తెలియబడిన ఈ సంగీతము నేటి కాలమునకు అత్యంత విస్తృతమై ఏ దేశ సంగీతమునకు లేనంత విశిష్టతను కలిగియున్నది. ఈ సంగీతమునకు పూర్వకాలము నాటి వేదములే ఆధారములని అనేక గ్రంధములలో చెప్పబడినది. 'విద్' అనే ధాతువు నుండి 'వేద' శబ్దావిర్భావమైనది. భారతదేశములో సనాతన ధర్మము, వైదిక ధర్మము ప్రకారము వేదములు విజ్ఞానయుతమైన ధర్మమును బోధించు మొట్టమొదటి గ్రంథములు. నాద, వేద భూయిష్ఠమైన వేదాంగమే సంగీతము.

వేదములు ఐహిక సంభంధమైనవి. చతుర్వేదములలోను అత్యుత్తమమైనదిగా సామవేదమును పేర్కొనిరి. భగవద్గీత యందు శ్రీకృష్ణుడు "వేదానాం సామ వేదోస్మి" అని చెప్పినట్లు కలదు. ఉపనిషత్ కూడ సామ వేదమునకు ఒక ఘనమైన అర్థము చెప్పుచున్నది. సామము అనగా పాటలను అని అర్థము కూడ కలదు.

యాజ్ఞవల్క్యముని ఛాందోగ్యోపనిషత్‌లో సామ గానమునకు గూడార్థమును విపులీకరించుచు సా= వాక్కును, మ=ప్రాణమును సూచించు సంజ్ఞలుగా అభివర్ణించినారు.

**"యద్యేతత్ సచ అంసచ సంవాదిత్వం తత్ సామమభవత్"**

ఈ విధముగా స+అమ అనగా ప్రాణాయుత వచనములతో మాధుర్యమైనది,

రూపము, జీవము, పదము, ఛందస్సు, స్వర, లయల కలయికతో ఏర్పడినది సామవేదము. యజుర్వేదమునకు వ్యాఖ్యానము వ్రాసిన 'సాయణాచార్యుడు" సామమనగా గీతరూపములైన మంత్రములని చెప్పినారు. ఈ సందర్భములో కొన్ని సామ లేక సామములను ఉదాహరించినారు. అవిః- రథాంతర, బృహత్, వైరూప, దైవత మెదలగునవి.

ఆచార్యకర్కుడు సామనులను గూర్చి నిర్వచించినారు.

"ప్రగీతం మంత్ర వాక్యం సామ ఇత్యుచ్యతే" అనిరి.

యాజ్ఞ్యవల్క్యముని ఛాందోగ్యోపనిషత్ లో సంగీతమును గూర్చి -

**"వీణా వాదన తత్వజ్ఞః శ్రుతి జాతి విశారదః**

**తాళ జ్ఞశ్చప్రయాసేన మోక్షమార్గం నియచ్ఛతి"** అని చెప్పిరి.

సంగీతము మోక్షమార్గమునకు, యోగసాధనకు ముఖ్యమైన మార్గముగా పేర్కొనబడినది. అందువలన సంగీతము ఉపవేదమై, గాంధర్వ వేదమని ప్రసిద్ధి కెక్కినది.

యజ్ఞములలో దేవతలు సామవేదమును గానము చేయడము వలన అనుగ్రహించబడి వారు ఏఏ ఫలితములకు ఆధిపతులో ఆయా ఫలితములను అనుగ్రహింతురని శ్రుతులు పేర్కొనుచున్నవి. ఋగ్వేద శ్లోకములలో ఈ విధముగా కలదు.

ఉదా:-1. ఉమేవాచో వదతి సామగాయత - ఋగ్వేద సంహిత

2. ఉద్గాతేవ శకునే సామగానయసి - ఋగ్వేద సంహిత

తైత్తరీయ ఉపనిషత్‌లో పరబ్రహ్మ స్వరూపమును అనేక విధములుగా కనుగొనుటకు ఏకైక సాధనము ఈ నాద బ్రహ్మమని దీనిని పొందుటకు సామములను గానము చేయుటయే మార్గమని, దీనిని అనుభవ సిద్ధముగా గ్రహించిన జ్ఞానులకు మాత్రమే ఈ రహస్యార్థము విదితమగునని పేర్కొనబడినది. సామనులు అవరోహణక్రమములో పాడబడినవి. Ancient Greek scale కూడ Desending Order లోనే ఉండెడిది. F E D C B A G. ఆది కాలము నుండి వేదములలో ప్రాముఖ్యత చెందిన సామవేద గానమే సంగీత ప్రపంచమునకు ఇవ్వబడిన ఒకవరమని చెప్పుటలో అతిశయోక్తిలేదు. నాడు గానము చేయబడిన స్వరములే నేటికిని గ్రహింపబడుచున్నవి.

ఋగ్వేదకాలమునకు పూర్వము వేదమంత్రములు ఏక స్వరములో గానము చేయుపద్ధతి కలదు. దానిని ఆర్చిక గానము లేక ఆర్చికపద్ధతి అందురు. ఆ తరువాత 'గాథిక' పద్ధతి లేక ద్విస్వర గాన పద్ధతి ఏర్పడినది. తరువాత 'సామిక' పద్ధతి లేక త్రిస్వరగాన పద్ధతి ఏర్పడినది. 'పాణిని' 'అష్టాధ్యాయి గ్రంథములోను, నారదుని 'శిక్షా' అను ప్రాచీన సంగీత శాస్త్ర గ్రంథములలో "ఉదాత్తానుదాత్తశ్చ స్వరితశ్చస్వరాశ్రయః" అని చెప్పబడినది. ఒక హెచ్చు స్వరం ఉదాత్తమనీ, ఒక క్రింది స్వరము అనుదాత్తమనీ, మరియొకటి ఈరెండింటికి సంబంధమున్నది స్వరిత స్వరమనీ నిర్ణీతమైనది.ఇవియే క్రమముగా రి,ని,స స్వరములతో సంవదించును. ఈ విధముగా ఋగ్వేదగానములో ప్రారంభమైన ఏకస్వరకొలత, రి స ని అను త్రిస్వర కొలత గాను, క్రమక్రమముగా చతుస్వర, పంచమస్వర, షట్ స్వరములుగాను, తుదకు మ గ రి స ని ద ప అను సప్తస్వరములుగా వృద్ధి నొందినది. ఈ విధముగా ఏర్పడిన సంపూర్ణ కొలత యగు మ గ రి స ని ద ప లో సనిదప అను భాగమును హెచ్చుస్థాయి నుండి పాడి నపుడు అది అవరోహణక్రమంలో ఉన్న స ని ద ప మ గ రి ఏర్పడుచున్నది. దీనినే షడ్జగ్రామము అనిరి. తరువాత ఒక సంపూర్ణ స్థాయిని ఏర్పరచుటకు తారషడ్జమము (స) మధ్య స్థాయిలో ఏర్పరచిరి. ఈ విధముగా సామగాన మూర్ఛన సామసప్తకముగా పరిణమించి సంగీత చరిత్రలో ఒక అతి ముఖ్యమైన మెట్టుగా ఏర్పడినది. అప్పటి నుండి సంగీత కళ యదార్థముగా రూపు కట్టుకొనినదని చెప్పవచ్చును. ఈ విధముగా సామవేదమునకు సంబంధించి పుట్టిన త్రిస్వరములగానము క్రమముగా ఒక స్థాయిగా, మూర్ఛనలుగా, సర్వ మేళ పద్ధతిగా ఏర్పడుటకు ఆధారమైనది. ఋగ్వేదములో కూడా ఈ స్థాయిలు మూడు విధములనియు అవి ఒకదానికంటె మరియొకటి హెచ్చు స్థాయిలో పాడదగుననియు చెప్పియుండుటచే ఈ త్రిస్థాయి పద్ధతి సుమారు మూడువేల సంవత్సరముల క్రితము ఆమోదింపబడినట్లు తజ్ఞుల అంచనా.

ప్రాచీనులు గానమును రెండు రకములుగా పేర్కొనిరి. 1. లౌకిక గానము 2. ఐహిక గానము, లౌకిక గానమునకు జైమిని మునిచే కొన్ని లక్షణములు నిర్వచింపబడినవి. ఈ లౌకికగానములో స్వరములు, శ్రుతులు స్పష్టమైన, ఆహ్లాదకరమైన ధ్వనిని కలిగి

యుండుననియు, ఇవి శాస్త్రకారులచేత ప్రామాణికము చేయబడినదనియు కలదు.

ఐహికగానము దైవ సంబంధమైనది. కనుక ఇది వైదికగానమునకు సమానమైనది. వైదిక గానము అనగా సామమునందు చెప్పబడిన సప్త స్వరముల ఆధారముగా గానము చేసెడి ఋక్కులు. ఈ విధముగా సామగానము ఒక క్రమ పద్ధతిలో ఉద్భవించి ఈ నాటికి ఇంతగా అభివృద్ధి చెందినది. సామగానము మూర్ఛన నేటి ఖరహరప్రియ రాగము.

సరిగమపదని అను సప్తస్వరములు వెలసిన తొలి రోజులలో వాటిని వరుసగా ఉత్కృష్ట లేక కృష్ణ ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, మంద్ర, స్వరిత లేక అతిస్వరములుగా వ్యవహరింపబడినవి. సామవేద యుగమునకు తరువాతి యుగమును సంగీత చరిత్రలో గాంధర్వయుగము లేక మార్గయుగమనిరి. ఈ మార్గసంగీత రచనల లక్ష్య, లక్షణములు రెండునూ సంస్కృత భాషలో రచింపబడినవి.

దక్షిణ భారతదేశ చరిత్రలో 18వ శతాబ్దపు మధ్య కాలములో ప్రారంభమై సుమారు నూరు సంవత్సరముల కాలము శిష్ట సంప్రదాయ కర్ణాటక సంగీతమునకు స్వర్ణయుగముగా పేర్కొనవచ్చును. ఈ కాలములోనే అగ్రగణ్యులు, సంగీత త్రిమూర్తులైన శ్రీ త్యాగరాజు, శ్రీముత్తుస్వామి దీక్షితులు, శ్రీ శ్యామశాస్త్రి తిరువారూరు నందు జన్మించిరి.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి బాల్యములో తండ్రియైన రామస్వామి దీక్షితులు సంగీత విద్యాభ్యాసమునకు శ్రీకారము చుట్టించి, తత్సిద్ధాంతములను వివరించి మంచి శిక్షణ నొసంగిరి. అంతేగాక రామస్వామి దీక్షితులు శ్రీ పురందరదాసు కాలము నుండి కర్ణాటక సంగీతములో అనుసరించబడిన ఆచరణాత్మక సంగీతమును, ప్రాచీన మధ్యయుగములలో రచయితలు వివరించిన రీతులను, ఆధునిక కర్ణాటక సంగీతముపై వేంకటమఖి వంటి రచయితల ప్రతిపాదనలు అనుసరించి సంగీత శాస్త్ర సిద్ధాంతములను వివరించిరి.

వేంకటమఖి రచించిన గీతములు, ప్రబంధములు ముత్తుస్వామి దీక్షితులవారి విద్యాభ్యాసములో ప్రముఖస్థానము నాక్రమించినవి. ప్రయోగాత్మక సైద్ధాంతిక సంగీత రంగముల రెండింటిలోనూ వేంకటమఖికి గల ప్రావీణ్యము ముత్తుస్వామి దీక్షితులవారి సాధనా

పరిణామములో ప్రముఖపాత్ర వహించినది.

దీక్షితులవారు గాత్రములోను, వీణా వాద్యములోనూ కూడ నిష్ణాతులు. వీటి సమ్మేళనము దీక్షితులవారి చేతిలో విలక్షణమైన సొగసులతో, నూతన బాణీకి ఆలవాలమైనది దీక్షితుల వారి సంగీతములో గల కొన్ని విశిష్ట లక్షణములకు కారణము ఆయనకు వైణిక గాత్ర సమ్మేళనా కళలో గల విద్వత్తు.

శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారు వేద వేదాంగములలోను, వ్యాకరణ ఛందోజ్యోతిష్య, ఆగమ, మంత్ర, తంత్ర, యోగ శాస్త్రాది విద్యలలోను, పరిపూర్ణ పాండిత్యము సంపాదించుటయే గాక వాటిని తన రచనలలో ఇమిడ్చి లోకమునకు అందించిన మహనీయులు. రాగ తాళ ప్రదర్శనలో ఉద్భవించు అద్భుతమైన సొగసులను వ్యక్తము చేయుటలో దీక్షితుల వారి రచనలకు అవియే సాటి. అవి ఒక విశిష్ట వర్గమున కు చెందినవి.

దీక్షితులవారి రచనలు శ్రావ్యమైన సంగీత రూప సంప్రదాయ రాగ చిత్రీకరణలతో అతిశయించినవి. సమగ్ర రాగ స్వరూపమును అంతనూ ప్రత్యేకమైన బాణీలో తన కీర్తనలలో అమర్చి సంగీత లోకమునకు అందించిన మహామనీషి. సంగీత శాస్త్రమునకు ప్రాముఖ్యమైన రాగ స్వరూపమును ఏక సంపుటిగా చేసి వాటి విశిష్టతను ఆ కీర్తనల యందు ఇముడ్చుటయే గాక మంత్రమునే రాగనామముగా, రాగనామమునే మంత్రముగా తన రచనల యందు ఉదాహరించి మంత్ర సిద్ధి పొందు విధానమును కూడ తెలియజేసిన ధన్యులు శ్రీ ముత్తుస్వామి దీక్షితులు.

"నాహం వసామి వైకుణ్ఠే నయోగి హృదయే రవౌ
మద్భక్తాయత్ర గాయన్తి తత్ర తిష్ఠామి నారద।"

"వైకుంఠములోనూ, మునుల హృదయాలలోను సూర్యుని యందుగాక నా భక్తులు ఎక్కడైతే నా గురించి కీర్తనము చేయుచుందురో అక్కడ నేను నివసించి యుందును నారదా!" అన్న శ్రీ మన్నారాయణుని వాక్కులు సంగీత ప్రశస్తిని సుస్పష్టముగా పేర్కొనుచున్నవి. సంగీత త్రిమూర్తులు భక్తిమార్గము ననుసరించి మోక్షమార్గమునకు సంగీతమును సాధనముగా చేసికొనిరి. ముత్తుస్వామి దీక్షితుల వారు ఆ పరదేవత యొక్క

స్వరూప, స్వభావములను ఆపాదమస్తకము తన కృతులలో వర్ణించిరి. ఆ వర్ణనలో శ్రీ శంకర భగవత్పాదుల వారు సౌందర్యలహరి యందు ఆమెను వర్ణించిన విధము, భావము ప్రస్ఫుట మగుచుండును. దీనికి ఉదాహరణ ముందుగల కృతులలో వివరించడమైనది.

దీక్షితుల వారు పరమాత్మను నాద స్వరూపునిగా వర్ణించిరి. "మారరతి ప్రియం" అను 'రతి ప్రియ' రాగ కీర్తనలో పరమాత్ముని "భావరాగతాళ స్వరూపకం" అని కీర్తించినారు. పల్లవిలో రాగనామమును కూర్చిరి. వీరి కీర్తనలు సంస్కృత సాహిత్య పటిమతో గూడి దీర్ఘ సమాస భూయిష్ఠములై శక్త్యుపాసనా మార్గమునందుగల గోప్యమైన విషయములతో నున్నవి. వీరి కృతులలోని భాషాపటిమ రాగపరిపూర్ణత, అర్థ గాంభీర్యము, భక్తి భావనా నిరతి, విలంబకాల విశ్రాంతి కల్పనా చాతుర్యము, యతిప్రాస లక్షణము, స్వరలయ సౌందర్యములతో నిండి సంగీత సాహిత్య సంపత్సమన్వితములై యుండుటచే ఎట్టివారినైననూ మంత్ర ముగ్ధులను గావించుననుటలో సందియము లేదు.

వాగర్థములవలె దీక్షితుల వారి ప్రతి కృతి రాగభావములతో మిళితమై బంగారు ప్రాకారములతో నిర్మింపబడి అందు అపూర్వ మణులతో పొదుగబడిన భవనముల వంటివి. ఆ కృతుల గమనము విళంబకాలములో ఉండి అంబారీతో అలంకరింపబడిన గజగమనమును పోలి యుండును. ఈ కృతులు నాదవేదమయమై ఓంకారమును ప్రతిధ్వనింపచేయుచున్నవి. వీరి శైలి నారికేళ పాకముగా నుండును. విళంబకాల ప్రాధాన్యముగల రచనలగుటచే గురుముఖముగా నేర్చుకొనిన గాని పట్టుబడవు. విళంబకాలములో మాత్రమే రాగ రూపాంతరములను, సౌందర్యమును పరిపూర్ణముగా, యధాతధముగా వ్యక్తీకరించుటకు సాధ్యమగును. త్వరితగతిలో అనేక సున్నితమైన రాగచ్ఛాయలు మరుగున పడిపోవుటకు అవకాశముండును. ఈ కారణము వలన రాగ రూపముల విస్తరణకు విళంబ కాలమే సరియైనదని భావించి రాగాలాపనలో దానికి ప్రముఖ స్థానమును కల్పించిరి. దీక్షితుల వారు విళంబకాలములో కృతులు రచించుటకు కారణము ఆకృతులలో గల రాగభావసంపద, వీణా వాద్యములో ఆయనకు గల ప్రావీణ్యమే కారణములుగా పేర్కొనవచ్చును. కొన్ని కృతులలో చరణముల చివరి భాగము

మధ్యమకాలములో ఉండును.

రాగభావనా సౌష్ఠవమే దీక్షితుల వారి రచనలకున్న మహోత్కృష్ట లక్షణము. దీక్షితుల వారు ఆ పరదేవత నాదమును తన రూపముగా చేసికొనినదని అనేక కృతులలో వర్ణించిరి. 'వంశవతి' అనురాగములో గల "వంశవతి శివయువతి" అనుకృతి యొక్క అనుపల్లవిలో "ద్వావింశచ్ఛ్రుతి స్వరస్వరూపిణి" అనిరి. స్వరములు, 22 శ్రుతులు, దేవీ స్వరూపాన్వితములుగా అభివర్ణించిరి. వంశవతి అనురాగనామమును పల్లవి ప్రారంభములో నిక్షేపించిరి.

దీక్షితుల వారు వైణికులు, గాయకులు. వీరు గానము చేయునపుడు వీణను సహకార వాద్యముగా ఉపయోగించెడివారనుటకు భైరవి రాగములో రచించిన 'బాలగోపాల' అనుకృతిలో 'వైణిక గాయక గురుగుహనుత' అని పరమాత్మను గూర్చి ప్రస్తావించుచు ఈ వాస్తవికాంశమును సూచించిరి. దీక్షితుల వారు వైణికులగుటచే ఆగమకములన్నింటిని తన సంగీత రచనలలో ఇమిడ్చిరి. దీనికి నిదర్శనము వీరి కీర్తనలు గమక పరిపుష్టితో ప్రత్యేక సంప్రదాయముగా నుండును. మరియు వీరు 'గమకక్రియ' రాగము నందు రచించిన 'మీనాక్షిముదందేహి' అను కృతి యొక్క చరణములో ఆ పరదేవతను 'వీణావాదన దశ గమక క్రియే' అని వర్ణించిరి. ఇంకను ఆ రాగనామములోనే ఆ విశిష్టతను ప్రస్ఫుటింపజేసిరి. "దశగమక క్రియే" అనుటలో రాగనామమును పొందుపరచిరి.

కర్నాటక హిందూస్థానీ సంగీత బాణీల రెండింటిలోను గమకములు సార్వత్రికమైనవి. కాని హిందుస్థానీ సంగీతములో జారు వంటి గమకములకే ఎక్కువ ప్రాధాన్యము కలదు దీక్షితుల వారి కృతులలో ఈ గమకములను ఆలాపించు సమయములో వారికి హిందుస్థానీ సంగీతములో గల విశేష పాండిత్యము, దాని విశిష్టత ద్యోతకమగుచుండును.

రాగాలాపన సంగీతకళ యొక్క అత్యున్నత రూపముగా ఎల్లప్పుడును పరిగణింపబడుచున్నది. దీక్షితుల వారు కృతులలో రాగరూపమునకు ప్రాముఖ్యతనిచ్చి దాని పూర్తి స్వరూపము నిక్షేపించిరి. సంగీత శాస్త్ర సిద్ధాంతములలో నిక్షిప్తమైన ఆలాపన

పద్ధతిలో గల ఆక్షిప్తిక, రాగవర్ధిని, విదారి లేదా మకరిణి అంగములను అనుసరించి రాగ చిత్రీకరణమును గావించిరి. దీక్షితుల వారు కృతి చిత్రీకరణలో ఈ పద్ధతినే అనుసరించిరి. ఈ కృతులు మంద్రస్థాయి నుండి తారస్థాయి వరకు సంచరించుచు రాగ పరిపూర్ణ చిత్రమును ప్రదర్శించెడివిగా నుండును. దీక్షితులవారి కృతులు తాళగతి లో అమర్చుటకు చక్కని సాహిత్యముతో రూపుదిద్దుకొనిన రాగాలాపనగ వర్ణింప వచ్చును.

దీక్షితుల వారు అనేక ప్రధాన రాగములలోను, ప్రాచీన రాగములలోను, సుప్రసిద్ధ జనరంజక రాగములలోను, అపూర్వరాగములలోను, వివాది మేళములతో సహా 72 మేళ కర్తరాగములలోను, కృతులు రచించిరి. ఆయా రాగ లక్షణములకు సంబంధించిన వివిధ అంశములను వీరి కృతులలో పొందుపరచిరి. ఉదాహరణ - తోడి రాగము ప్రధాన రాగములలో ఒకటి. ఈ రాగస్వరూపమును పరిపూర్ణముగా చిత్రీకరించుచు అనేక కృతులు రచించిరి. విభిన్న స్వరూపములతో ఎత్తుగడ (ఎడుప్పు) కలిగి రాగ చిత్రణయు ప్రదర్శించుటయే ప్రత్యేకత. పల్లవి విభిన్నస్వరములతో ప్రారంభమగు కొన్ని కీర్తనలు-

| | | |
|---|---|---|
| 1. దాక్షాయిణి | - దైవతము(మంద్రస్థాయి) | |
| 2. శ్రీ సుబ్రహ్మణ్యో | - గాంధారము | మధ్యస్థాయి |
| 3. మహాగణపతిం | - మధ్యమము | మధ్యస్థాయి |
| 4. పాలయమాం | - పంచమము | మధ్యస్థాయి |
| 5. రామచంద్రాయ | - దైవతము | మధ్యస్థాయి |
| 6. కమలాంబికే | - నిషాదము | మధ్యస్థాయి |

ఈ కృతులు తోడిరాగమును వివిధ కోణముల నుండి ప్రదర్శింపచేయుచున్నవి. ఈ కోణములన్నింటి నుండి ఆ రాగమును దర్శించ వచ్చును. ఆ విధముగా దీక్షితుల వారు ఒకే రాగము నందు అనేక కృతులు రచించినను ఒక కృతికి మరియొక కృతికి సంచారము లోను, ప్రస్తారములోను, భావములోను ఎంతో వైవిధ్యము ప్రస్ఫుటమగు చుండును. ఉదాహరణకు -

కాంభోజి రాగములో కృతులు :- 1. శ్రీ సుబ్రహ్మణ్యాయ

2. కమలాంబికాయైః (నవావరణ కృతి)

శంకరాభరణ రాగములో కృతులు :- 1. అక్షయలింగవిభో

2. దక్షిణామూర్తి

ఈ రీతిలో ఇంకను భైరవి, కళ్యాణి మొదలగు రాగములలో అనేక కృతులు రచించిరి. సావేరి, శహన, అఠాణ, రామక్రియ (కామవర్ధిని) గమకక్రియ (పూర్వకల్యాణి) సారంగ మొదలగు సుప్రసిద్ధ జనరంజక రాగములలో కూడ ఈ విధముగానే కృతులు రచించిరి.

ఒకే మేళ కర్త రాగము నుండి ఉద్భవించిన అనేక జన్యరాగములలో దీక్షితులవారు రచనలు చేసిరి. ఉదాహరణకు మాయామాళవగౌళ రాగము నుండి జనించిన 30 జన్యరాగములో రచనలు చేసిరి. అవి సాళంగనాట, ఛాయాగౌళ, మంగళ కైశికి, మేఘరంజని, టక్క, నాదనామక్రియ, పాడి, రేవగుప్తి, కన్నడబంగాళ, గౌళ, లలిత, గుజ్జరి, గుండకక్రియ, మలహరి, బౌళి, ఆర్ద్రదేశి, దేవరంజి, సౌరాష్ట్రము, పూర్వి, గౌళీపంతు, మారువ, సావేరి, మాళవ పంచమము, పూర్ణ పంచమము, మార్గదేశి, ఫరజ్, గౌరి, వసంత, మొదలగునవి ఉదాహరణ- 1. రేవగుప్తి రాగములో - సదావినత సాదరే

2. ఛాయాగౌళ రాగములో - సరస్వత్యా భగవత్యా

3. మారువ రాగములో - మారువకాది మాలిని

మారువ రాగములోని కీర్తనలో తన్ను రక్షింపుమని ఆ పరదేవతను వేడుకొనుచు రచించిన చిన్న కీర్తన. ఇందు పల్లవి అనుపల్లవి, మధ్యమకాల సాహిత్యము కలవు, పల్లవి ప్రారంభము లోనే మారువ రాగనామమును ఇమిడ్చిరి.

మంగళకైశికి, ఘంటా, గోపికావసంత, నారాయణగౌళ మొదలగు ప్రాచీన రాగములలో కృతులు రచించిరి. దీక్షితులవారు కొన్ని ప్రాచీన రాగలక్షణములను, స్వరూప స్వభావములను, తెలిసుకొనుటకు దీక్షితులవారి కృతులు మాత్రమే ఆధారము. ఉదాహరణకు 'ఘంటా'రాగములో 'శ్రీ కమలాంబకే' అను అష్టమావరణ కృతిని పేర్కొనవచ్చును.

దీక్షితుల వారు మాత్రమే ప్రయోగించిన అనేక అపూర్వ రాగములు కూడ కలవు. ఉదాహరణకు సారంగ నాట, ఛాయాగౌళ, పూర్వి, పాడి, మాహురి, శుద్ధవసంత, కుముదక్రియ, అమృతవర్షిణీ, భానుమతి, తరంగిణి, మాంజి, గుజ్జరి (ఘూర్జరి) మెదలగునవి. ఈ రాగములను గూర్చి తెలిసికొనుటకు దీక్షితులవారి కృతులు మాత్రమే ఆధారము.

1. తరంగిణి రాగములో - మాయే త్వం పాహి

ఈ కృతి యందు చరణములో గోపుచ్ఛయతిని ఇమిడ్చిరి. వేంకటమఖి సంప్రదాయములో ఈ రాగము 26 వ మేళకర్త రాగము.

2. భానుమతి రాగములో - 'బృహదంబా మదంబా జయతి' అను కృతిని తంజావూరు నందు గల బృహన్నాయికి పై రచించిరి. వేంకటమఖి సంప్రదాయమున ఈ రాగము 4 వ మేళకర్త రాగము.

3. ద్విజావంతి రాగములో రచించిన 'చేతశ్శ్రీ' ఏకైక మహోజ్జ్వల కీర్తనగా నిలిచియున్నది.

దీక్షితులవారు అసంపూర్ణమేళపద్ధతిలో రచించిన కృతులలో ఉదాహరణకు ఘూర్జరి రసమంజరి, రాగములను పేర్కొనవచ్చును.

1. ఘూర్జరి రాగములో - 'గుణీజనాది' అను కృతి అమ్మవారిపై రచించిరి. దీనిలో 'ఘూర్జరి రాగప్రియే శివే' అని పల్లవి లోనే రాగనామమును సూచించిరి.

2. రసమంజరి రాగములో - 'శృంగారరస మంజరీం' అను కృతి కంచిలోని కామాక్షి దేవిపై రచించిరి. రాగనామమును పల్లవి యందు నిక్షిప్తము గావించిరి. వేంకట మఖి సంప్రదాయములో ఈ రాగము 72 వ మేళకర్తగా పేర్కొనబడుచున్నది. దీనికి సమానమైన రాగము గోవిందాచార్యులు పేర్కొనిన 'రసికప్రియ' రాగము. "శృంగార రసమంజరి' అను కృతిలో ఆ పరదేవత 72 రాగాంగరాగములలోను అనుభూతిని పొందుచున్నదని వర్ణించిరి.

వివాదిమేళ నిర్వహణలో దీక్షితులవారు వేంకటమఖి మార్గదర్శకత్వమును యథాతథముగా అనుసరించిరి. వీరు 40 వివాదిమేళములలో కృతులు రచించిరి.

ఉదాహరణకు -

1. కనకాంబరి రాగము ఒకటవ మేళములో "కనకాంబరి కారుణ్యామృతలహరి",

2. ఫేనద్యుతి రాగము రెండవ మేళములో "శ్రీ దక్షిణామూర్తి ",

3. కళావతి రాగము 31వ మేళములో " కళావతి కమలాస్యువత్",

4. వంశావతి రాగము 54వ మేళములో "భక్తవత్సలం" - అను కృతులను పేర్కొనవచ్చును.

దీక్షితుల వారు భానుమతి రాగములో - 'గురుగుహ స్వామి' అను కీర్తనను రచించిరి. ఇది అపూర్వరాగము. మరియు వివాదిమేళ రాగము. కాని దీక్షితులవారు ప్రావీణ్యముతో ఆ రాగములో గల వివాది దోషము వ్యక్తము గాకుండా కీర్తన రచించిరి.

దీక్షితుల వారు కాశీలో నున్న కాలములో హిందుస్థానీ సంగీతమును శ్రద్ధగా వినుచు ఆకళింపు చేసికొనిరి. వేంకటమఖి రూపొందించిన సంప్రదాయములో పెరిగిన వారగుటచే హిందుస్థానీ సంగీతముపై ప్రగాఢాభిమానము పెంచుకొనిరి. ఇది ఆయన సంగీతముపై విశిష్ట ప్రభావమును నెఱపినది. కొన్ని హిందుస్థానీ రాగములు కర్ణాటక సంగీతములో విలీనమైనప్పటికిని వేంకటమఖి తదనంతరము కొన్ని మార్పులు వచ్చినవి. ముత్తుస్వామి దీక్షితులవారి రచనలలో అవి తిరిగి స్వతస్సిద్ధమైన రూపమును పొందినవి. దీక్షితుల వారు కాశీలో ఉన్న కాలములో ప్రత్యక్షముగా హిందుస్థానీ సంగీతమును అభ్యసించుట ఫలితముగా నిజమైన హిందుస్థానీ సంగీత రూప ప్రతిని ప్రదర్శించగలిగిరి. ఉదాహరణకు హిందుస్థానీ సంగీతములోని 'సారంగ' రాగమును 'బృందావని' అను నామముతో కర్ణాటక సంగీతము గ్రహించినది. ఇటువంటి మార్పులు చేయుట సాధారణ విషయముకాదు. ఉదాహరణకు హిందుస్థానీ సంగీతములోని మాల్కోస్ - హిందోళగా కర్ణాటక సంగీతమున కలదు. వేంకటమఖి బృందావని రాగములో "అంబర కేశ శంభురే" అను గీతమును రచించి దానికి రాగలక్షణము కూడ పేర్కొనిరి. ఈ బృందావని రాగము యొక్క ఆరోహణ - స రి మ ప ని స - అవరోహణ స ని ప మ రి స. తీవ్రకాకలి నిషాదమును, కొన్ని విశేషప్రయోగములును మినహాయించిన ఇది కర్ణాటక సంగీతములోని మధ్యమావతి

రాగలక్షణమునకు సమానమైనది. ఈ గీతము లోని బృందావని రాగలక్షణము హిందుస్థానీ సంగీతములోని సారంగరాగ లక్షణమునకు పూర్తిగా తుల్యమైనది. వెంకటమఖి తరువాత రెండు రాగముల కలయికతో ఏర్పడిన బృందావన సారంగ రాగము కొన్ని మార్పులను పొందినది. అవి సాధారణ గాంధారమును అరుదుగా ఉపయోగించుట, కాకలినిషాదమును విశేష ప్రయోగములలో వదలివేయుట అనునవి ఈ రాగ స్వరూపములో పూర్తి మార్పును తెచ్చినవి.

దీక్షితుల వారు "రంగపురవిహార", సౌందరరాజం","స్వామినాథేన" వంటి కృతులు బృందావన - సారంగ రాగములో రచించిరి. సాధారణగాంధారమును తక్కువగా ఉపయోగించుట మినహాయించిన, ఆయన రాగవిన్యాసమును పూర్తిగా హిందుస్థానీ సంగీతములోని సారంగరాగ విన్యాసముతో నున్నది. ఇంకను, దీక్షితులవారు యమునా కల్యాణి రాగములో 'జంబూపతే' అను కృతిని రచించిరి. ఈ కృతి రాగభావసంపద వైభవమునకు సాటిలేనిది. ఈ రాగము హిందుస్థానీ సంగీతములో ఇమాం. వీరు అమీర్ కళ్యాణి రాగములో రచించిన "పరిమళ రంగనాథం" అను కృతి మరియొక మహోత్కృష్టమైన రచన. హిందుస్థానీ సంగీతములో ఈ రాగలక్షణము నిర్వహించిన పద్ధతి ఈ కృతిలో వ్యక్తీకరించుట జరిగినది. ఈ రాగమునకు హిందుస్థానీ సంగీతములోని కేదార రాగచ్ఛాయలు గోచరించుచుండును. క్రమముగా కొన్ని శతాబ్దముల తరువాత కర్ణాటక సంగీతములో అంతర్భాగమైనది. ద్విజవాణి నామముతో కర్ణాటక సంగీతములో లీనమైన మరియొక హిందుస్థానీ రాగము జయజయవంతి. ఈ రాగములో దీక్షితులవారు రచించిన 'చేతశ్శ్రీ బాలకృష్ణమ్' అను కృతి ఈ రాగలక్షణమునంతను పరిపూర్ణముగా ప్రదర్శించు సంగీతసౌధము.

మాళవ పంచమము అను రాగములో దీక్షితులవారు "వాసుదేవ ముపాస్మహే" అను కీర్తనను రచించిరి. ఇది కొద్ది మార్పులను కలిగి హిందుస్థానీ సంగీతములోని బసంత్ రాగమువలె ఉండును.

దీక్షితులవారు ఖాట్‌మండూరు లోని - పశుపతేశ్వరునిపైనను, బదరీలోని శ్రీ సత్యనారాయణ స్వామిపై కీర్తనలు రచించిరి. ఇవి రెండును శివపంతువరాళి రాగములో ఉన్నవి. దీనిని ప్రస్తుతము శుభపంతువరాళి అని పేర్కొనుచున్నాము. ఇది వెంకటమఖి సంప్రదాయములో 45వ మేళకర్త. ఈ రాగము హిందుస్థానీ సంగీతములో 'మియాంకి తోడి'కి సమానమైన రాగము. ఇది హిందుస్థానీ సంగీతములో జనరంజకమైన రాగములలో ఒకటి. హిందుస్థానీ సంగీతములో దీక్షితులవారికి గల విశేష పరిజ్ఞానము మరియే వాగ్గేయకారునికీ లేదని నిస్సందేహముగా చెప్పవచ్చును.

అంతేగాక దీక్షితులవారు పాశ్చాత్య బృంద గీతములను ఆకళింపు చేసికొని వానికి సంస్కృత సాహిత్యమును సమకూర్చినారు. ఇవి దాదాపు ఏబది గీతములు మనకు లభ్యమగుచున్నవి. ఉదాహరణకు - "గాడ్ సేవ్ ది కింగ్" అను సుప్రసిద్ధ గీతమునకు "సతతం పాహి సంగీత శ్యామలే సర్వాధారే" అని దేవీపరముగా చేసిన రచన చక్కని ఉదాహరణ. పాశ్చాత్య సంగీతమునకు ప్రధానమైన జనకరాగము శంకరాభరణము. ఈ రాగములో సుమారు ముప్పదియైదు రచనలు చేసిరి. ఉదాహరణకు - "గురుమూర్తే బహుకీర్తే గురుసేనాధిపతే " అను రూపకతాళము లోని రచన. ఇది పల్లవి, అనుపల్లవి చరణము గల చిన్ని కీర్తన. "పరదేవతే భవభక్తమోహిని పాహిమాం" అను మఱియొక కీర్తన కూడ రూపకతాళములో రచించిరి. ఇది పల్లవి సమష్టి చరణములు మాత్రమే గల చిన్ని కీర్తన. కొన్ని కీర్తనల యందు పల్లవి, అనుపల్లవి మాత్రమే కలవు. ఉదాహరణకు -

"పాహిదుర్గే భక్తిం దేహి" అను ఏకతాళములో రచించిన కీర్తన.

దీక్షితుల వారి కుటుంబమునకు యూరోపియన్ సంగీతముతో సాన్నిహిత్యము ఏర్పడుటకు కారణము వీరి జీవిత చరిత్ర యందు వివరించడమైనది. ఈ సంగీత ప్రభావము వీరి రచనల యందు కలదనుటకు నిదర్శనము పైన పేర్కొనిన కీర్తన వలన తెలియుచున్నది. ఈ విధముగా కర్ణాటక హిందుస్థానీ, పాశ్చాత్య సంగీతములలో విశేషపాండిత్యము గల వాగ్గేయకారులు శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారు.

దీక్షితుల వారు యాత్రార్థియై అనేక దివ్య క్షేత్రములను దర్శించినపుడు అచట గల దేవతలపై అనేక కృతులను కీర్తనలను రాగమాలికను దరువును రచించి, కర్ణాటక సంగీతమునకు ఎనలేని సేవ చేసిరి. వీరి రచనలు పద సౌష్ఠవము భక్తి భావము భాషా పటిమ, అర్థగాంభీర్యము, సంస్కృత సాహిత్య సౌందర్య సమన్వితములై, ఓజః ప్రసాద మాధుర్య గుణాన్వితములై, మంత్ర యంత్ర తంత్ర శాస్త్ర రహస్యములను వెల్లడించునవిగా నున్నవి.

ముత్తుస్వామి దీక్షితుల వారి కీర్తనలు అనేక సాహిత్య సొగసులతో రస పుష్టితో నిండి యున్నవి. ఇంకను వీరి రచనలు యతి, ప్రాసయతి, అంత్య ప్రాస, అను ప్రాస నియమములతోను, యమక, శ్లేషాలంకారములతోను మనోహరముగా నుండుట ముందు పేర్కొనిన కీర్తనలలో విశ్లేషించుట జరిగినది. ఉదాహరణ కావ్యపద్ధతిలో వీరు అన్ని విభక్తులలోను రచనలు గావించిరి. దీనిని బట్టి దీక్షితుల వారికి భాష పై గల విశిష్టాధికారము ద్యోతకమగుచున్నది. దీక్షితుల వారి కృతులలో భుక్తి ముక్తి లక్షణము పరిపూర్ణముగా నున్నవనుటలో సందియము లేదు.

సంగీత త్రిమూర్తులైన శ్రీ త్యాగరాజు, శ్రీ ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి ముప్వురును ఒకే కాలములో ఒకే గ్రామములో జన్మించినప్పటికి వీరి రచనల యందు ఎంతయో వైవిధ్యము గలదు. ఈ కాలములోనే సంగీత రచనలలో 'కృతి ' అనునది రూపుదాల్చినది. ఈ కృతులలో పల్లవి, అనుపల్లవి, చరణము అను ముఖ్యాంగములుండును. ఇవియే కాక కృతికి ప్రత్యేక శోభను చేకూర్చునట్టి అంగములు కూడ కలవు. అవి 1. చిట్ట స్వరము 2. శోల్‌కట్టు స్వరము, 3. స్వర సాహిత్యము, 4. స్వరాక్షరము, 5. మధ్యమకాల సాహిత్యము, 6. మణిప్రవాళ సాహిత్యములు. కొన్ని కీర్తనలలో సమష్టి చరణము కూడ కలదు. శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు తన రచనలలో ఈ ప్రత్యేకాంగములను ఇమిడ్చి కృతికి ప్రత్యేక శోభను కల్గించిరి.

చిట్ట స్వరము రెండు లేక నాలుగు లేక ఇంకను అధికమైన ఆవర్తములతో కూడిన రచన. దీనిని కృతిలో అనుపల్లవి తరువాత చరణాంతమందు గానము చేయుదురు. ఇది సాధారణముగా మధ్యమ కాలములో నుండును. ఈ చిట్ట స్వరములను తాళము

తప్పకుండ, రాగభావముతో అనులోమ, విలోమ క్రమముతో పాడు సంప్రదాయము కూడ కలదు. ఇట్టి చిట్ట స్వరము గల రచనలను ముత్తుస్వామి దీక్షితుల వారు రచించిరి. ఉదాహరణ - 'కమలాంబాం భజరే' - అను 'కల్యాణి' రాగములో రచించిన రెండవ నవావరణ కృతి.

శోల్‌కట్టు స్వరము కూడ చిట్టస్వరముల రకమునకు చెందిన రచన. చిట్ట స్వరములలో కొన్ని కొన్ని చోట్ల స్వరములకు జతులను కూడ జతపఱచి రచింతురు. అట్టి జతులను పాడునపుడు వాటిపైన గాని క్రిందగాని ఉండు స్వరములననుసరించి స్వరమునకు బదులు జతులను గానము చేయవలసి యుండును. ఈ శోల్‌కట్టు స్వరము శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి రచనలలో గోచరించుచుండును.

ఉదాహరణకు:"శ్రీ మహా గణపతి రవతుమాం - గౌళరాగములోని కృతి, ఆనందనటన ప్రకాశం - కేదారరాగము" అను రెండు కృతులను పేర్కొనవచ్చును.

స్వర సాహిత్యములలో స్వరముల క్రింద నుండు సాహిత్యము నందు అక్కడక్కడ పైనుండు స్వరముల వంటి అక్షరములే సాహిత్యము నందు కూడ రచింపబడి అవి మిగిలిన సాహిత్య భావమునకు సరిపోవునట్టి అర్థము నిచ్చునట్లుగా నుండును. అట్టివి స్వరాక్షరములు గల రచనలుగా పేర్కొనబడును. ఇట్టివి రచించుటకు సంగీత సాహిత్యములో విశేష పాండిత్యముండవలయును. దీనికి ఉదాహరణ దీక్షితులవారు రచించిన "పున్నాగవరాళి" రాగములోని "కమలాంబికాయా" అను నవావరణ కృతిని పేర్కొనవచ్చును.

ఈ కృతి చరణములో - గమ మామా సమా మ<u>మ</u> <u>గమని</u> దప

దశ ముద్రా <u>సమా</u> రా ధిత.

కృతిలో ధాతువు, మాతువులు రెండు మధ్యకాలములో రచించిన అట్టి భాగమును మధ్యమకాల సాహిత్యము అందురు. ఈ మధ్యమకాల సాహిత్యమును అనుపల్లవి, చివరను, చరణాంతమందును గానము చేయుదురు. కొన్ని కృతులలో చరణమంతయు మధ్యమకాల సాహిత్యములోనే ఉండును. ఇట్టి మధ్యమకాల సాహిత్యములు శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి కృతులలో సమృద్ధిగ గోచరించుచున్నవి.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి రచనలు ఎక్కువగా విళంబ కాలములో నుండుటచేత వీరి రచనలలో ఈ మధ్యమకాల సాహిత్యము కృతికి అత్యంత శోభను, చేకూర్చుచున్నది. ఉదాహరణ:-

1) త్యాగరాజాయ నమస్తే-బేగడ రాగము లోని కృతి.

2) శ్రీ కమలాంబా జయతి -ఆహిరి రాగము-తొమ్మిదవ ఆవరణ కృతి.

3) చేతశ్రీ బాలకృష్ణం-ద్విజావంతి రాగములోని కృతి.

మణి ప్రవాళ సాహిత్య కీర్తనలు రచించిన వాగ్గేయకారులలో శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారు ముఖ్యులు. ఒక కృతిలోని సాహిత్యము నందు అక్కడక్కడ రెండు లేక మూడు ఇతర భాషలతో కూడిన సాహిత్యమును జతపరచి అర్థము చెడకుండునట్లుగా రచించిన దానిని మణి ప్రవాళ సాహిత్యమందురు. ఉదాహరణ- 'వేంకటా చలపతే' అను 'కర్ణాటక కాపి' రాగము లోని కృతిని పేర్కొనవచ్చును.

సమష్టి చరణము గల కృతులను శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారు రచించిరి. కృతిలోని అను పల్లవి లోనే చరణమునకు బదులు మధ్యమకాల సాహిత్యము రచించబడిన దానిని సమష్టి చరణము అందురు. ఉదాహరణ -

1. మరకతవల్లీ మనసాస్మరామి - కాంభోజి రాగము లోని కృతి.

2. శ్రీ గురుగుహ తారయా శుమాం - దేవక్రియ (శుద్ధసావేరి) రాగము లోని కృతులు.

వర్గకృతులు రచించిన వాగ్గేయ కారులలో శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారే అగ్రగణ్యులు. వీరు రచించిన గురుగుహ కీర్తనలను తిరుత్తణి కీర్తనలని కూడ వ్యవహరింతురు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడు తనకు వృద్ధ బ్రాహ్మణ రూపములో దర్శన మొసంగి జ్ఞానమును అనుగ్రహించెనని దీక్షితుల వారు ఆనందముతో ఈ స్వామిని "గురు గుహ" యని ప్రస్తుతించుచు కీర్తనలను గానము చేసిరి. అవి మొత్తము తొమ్మిది.

1. శ్రీ నాదాది గురుగుహో జయతి జయతి - మాయామాళవగౌళ రాగము.

2. మానస గురుగుహ రూపం భజరే రే - ఆనందభైరవి రాగము.

3. శ్రీ గురు గుహస్య దాస్యోహం - రాగపూర్వీ రాగము.

4. శ్రీ గురుణా పాలితోస్మి - పాడి రాగము.

5. గురు గుహాయ - సామరాగము.

6. గురు గుహా ధన్యం - బలహంస రాగము.

7 గురుగుహ స్వామిని - భానుమతి రాగము.

8. శ్రీ గురురుహ మూర్తే - ఉదయరవి చంద్రిక రాగము.

9. శ్రీ గురుగుహ తారయాశుమాం - దేవక్రియ (శుద్ధసావేరి) రాగము.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు షోడశగణపతులపై కృతులు రచించిరి. ఇవి ఆగమశాస్త్రాను సారము, గణపతి తత్త్వము, ఉపాసన, మహిమ, వర్ణనలతో నిండియున్నవి. షోడశ గణపతులు - 1. బాలగణపతి, 2. తరుణ గణపతి, 3. భక్తగణపతి. 4. వీర గణపతి, 5. శక్తి గణపతి, 6.ద్విజ గణపతి, 7. సిద్ధిగణపతి, 8. ఉచ్ఛిష్ట గణపతి, 9. విఘ్నగణపతి, 10. క్షిప్ర గణపతి, 11. హేరంబ గణపతి, 12. లక్ష్మీగణపతి, 13. మహాగణపతి, 14. విజయ గణపతి, 15. నృత్త గణపతి, 16. ఊర్ధ్వ గణపతి.

ఇంకను దీక్షితులవారు నవగ్రహ కీర్తనలను సూళాది సప్తతాళములలో రచించిరి. వీనిని ద్వితీయాద్యాయమున పేర్కొనుట జరిగినది. వీరు కమలాంబ నీలోత్పలాంబ నవావరణ కృతులను రచించిరి. కమలాంబా నవావరణ కృతుల వివరణము పంచమాధ్యాయమున కలదు. నీలోత్పలాంబ నవావరణ కృతులను గౌళరాగవర్గ కృతులని కూడ అందురు. ఈ కృతులలో ప్రసిద్ధి చెందినవి విభక్తి కృతులు ఎనిమిది. అవి -

1. నీలోత్పలాంబ జయతి - నారాయణగౌళ - ప్రథమా విభక్తి.

2. నీలోత్పలాంబాం భజరే - రీతిగౌళ - ద్వితీయా విభక్తి.

3. నీలోత్పలాంబికయా - కన్నడ గౌళ - తృతీయా విభక్తి.

4. నీలోత్పలాంబికాయై - కేదార గౌళ - చతుర్థీ విభక్తి

5. నీలోత్పలాంబికాయాః - గౌళ - పంచమీ విభక్తి.

6. నీలోత్పలాంబా యాస్తవ - మాయామాళవగౌళ - షష్ఠీ విభక్తి.

7. నీలోత్పలాంబికాయాం - పూర్వగౌళ - సప్తమీ విభక్తి.

8. శ్రీ నీలోత్పలాంబికే - ఛాయా గౌళ - సంబోధనా ప్రథమా విభక్తి.

వీరు నీలోత్పలాంబపైన రచించిన రీతిగౌళ రాగకృతి మఱియొకటి కలదు గాని, అది ఈ వర్గమునకు చెందినది కాదు.

దీక్షితుల వారు మయూరమున గల అభయాంబపై తొమ్మిది కృతులను రచించిరి. ఈ కృతులు కూడ అన్ని విభక్తుల యందును కలవు. అవి -

| | | |
|---|---|---|
| 1. అభయాంబ జగదంబ - | కళ్యాణి రాగము - | పథమా విభక్తి. |
| 2. ఆర్యామభయాంబాం - | భైరవి రాగము - | ద్వితీయా విభక్తి. |
| 3. గిరిజయా, అపజయ - | శంకరాభరణ రాగము - | తృతీయ విభక్తి. |
| 4. అభయాంబికాయై - | యదుకుల కాంభోజి రాగము - | చతుర్థీ విభక్తి. |
| 5. అభయాంబికాయాః - | కేదార గౌళరాగము - | పంచమీ విభక్తి. |
| 6. అంబికాయాః అభయాంబికాయాః - | కేదారరాగము - | షష్ఠీవిభక్తి. |
| 7. అభయాంబికాయాం - | శహన రాగము - | సప్తమీ విభక్తి. |
| 8. దాక్షాయణి - | తోడిరాగము - | సంబోధన ప్రథమా విభక్తి. |
| 9. శ్రీ అభయాంబ నిన్ను - | శ్రీరాగము - | మంగళ హారతి. |

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు పంచలింగ స్థలకృతులను కూడా రచించిరి. వీని వివరణ షష్ఠాధ్యాయమున కలదు. ఈ విధముగా అనేక వర్గకృతులను రచించిన మహా వాగ్గేయ కారులు శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారు. వీరి రచనలు రాగముద్ర, ప్రబంధముద్ర, స్థలముద్రలతో అలరారు చున్నవి. వీటిని గూర్చి ముందు పేర్కొనిన కీర్తనలలో వివరణ యున్నది.

దీక్షితులవారి కృతులలో సంగీత సాహిత్యములతో పాటు లయ సౌందర్యములు నిండి యున్నది. సూళాది సప్త తాళములలో దీక్షితులవారు నవగ్రహ కృతులను రచించి కర్ణాటక సంగీతమున గల లయ ప్రాధాన్యము, మాధుర్యమును ప్రస్ఫుటింప జేసిరి.

ధృవ, మఠ్య, రూపక, ఝంపె త్రిపుట, అట, ఏక తాళములకు సూళాది సప్తతాళములని పేరు.

సంగీత రచన యొక్క కాలప్రమాణమును తెలుపునది తాళము. దీనికి దశ ప్రాణములు కలవు. అవి కాలము, మార్గము, క్రియ, అంగము, గ్రహము, జాతి, కళ, లయ, యతి, ప్రస్తారము. దీనిలో తొమ్మిదవ ప్రాణమైన యతి ప్రాణములో గల గోపుచ్ఛయతి, స్రోతోవహయతులను వీరి రచనల యందు ఇమిడ్చిరి. వీనిని గూర్చి చతుర్థాధ్యాయమున గల 'త్యాగరాజయోగ వైభవం' అను ఆనందభైరవి రాగ కృతి యందు వివరణము కలదు.

"శ్రుతిర్మాతా లయఃపితా" అని సంగీతము శివశక్తి ఉభయాత్మకముగా ఉపాసింపబడుచున్నది. సంగీతజ్ఞానము శివశక్తి జ్ఞానమునకు ఆధారమన్నది శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారి కృతులలో స్పష్టముగా గోచరించుచున్నది. శ్రుతిలయల సంతతియే స్వర, రాగ, తాళ, మాత్రఛందస్సులు. శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు సమస్త సంగీత విద్యలో గల శివశక్తి రూపమును శ్రీవిద్యగా మలచికొనిరి .

అక్షరములు, పదములు, వాక్యములు, వృత్తి, రీతి, గుణాలంకారాది రూపముగానున్న సాహిత్యము శివశక్తి సహిత భావముగా రూపొందించుకొనిన శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారి సంగీత సాహిత్య ప్రాశస్త్యము ఇంతింతని నిరూపించనలవికాని మహావాగ్గేయ కారులు.

శంకర భగవత్పాదుల వారి అద్వైత సిద్ధాంతమును అనుసరించుటలో పూర్వులైన వేంకటమఖి సంప్రదాయమును అనుసరించుటలోను, తండ్రియైన రామస్వామి దీక్షితులవారివలె రాగమాలికను రచించుటలోను ముత్తుస్వామి దీక్షితులవారిపై పూర్వుల ప్రభావము అనేక విషయములలో ద్యోతకమగుచున్నది.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి ప్రభావము తరువాత వచ్చిన వాగ్గేయ కారులపై కలదు. 19వ శతాబ్దమునకు చెందిన సుబ్బరామ దీక్షితులు బాలస్వామి దీక్షితులకు దత్తపుత్రుడు. సుబ్బరామ దీక్షితులపై ముత్తుస్వామి దీక్షితుల వారి ప్రభావము

కలదు. ఉదాహరణకు వీరు రచించిన రాగమాలిక -"నీసరి లేరని కోరిన" అను తిశ్రజాతి ఏకతాళములోని నవరత్నమాలికను పేర్కొనవచ్చును.

క్రీ॥శ 1829 - 1847 కాలమున తిరువాన్కూరు సంస్థానమును పరిపాలించిన స్వాతి తిరునాళ్ మహరాజుపై దీక్షితుల వారి ప్రభావము కలదు. వీరు సంగీత సాహిత్యములలో అద్భుతమైన పాండిత్యమును సంపాదించుటయే గాక, తెలుగు, సంస్కృత, మళయాళ భాషలలో మణిప్రవాళ సాహిత్యములో కీర్తనలను రచించిరి. దీక్షితుల వారి ప్రభావము వీరిపై గలదనుటకు మరియొక నిదర్శనము గలదు. స్వాతి తిరునాళ్ నవరాత్రులలో దేవిపై పాడుటకు తొమ్మిది కృతులు రచించిరి. ఇవి నవరాత్రి కృతులుగా ప్రసిద్ధి చెంది నేటికిని నవరాత్రులయందు అ క్రమములోనే వానిని గానము చేయుచున్నారు.

ముత్తుస్వామి దీక్షితుల వారి ప్రభావము క్రీ॥శ॥ 1803 - 1882 కాలమునకు చెందిన సుబ్బరాయశాస్త్రి పైన కూడ కలదు. వీరు సంగీత రత్నత్రయములో ఒకరైన శ్యామశాస్త్రుల వారి కుమారుడు. వీరి రచనా విధానములో దీక్షితుల వారి శైలి హిందూస్థానీ సంగీతములో గల రాగములలో రచనలు చేయుటయందును, మధ్యమకాల సాహిత్యము, చిట్టస్వరముగల కృతులను రచించుటలో గోచరమగుచుండును. ఉదాహరణగా 'అమీర్ కల్యాణి' రాగములో గల 'వేంకట శైల విహార' అను కృతిని పేర్కొనవచ్చును.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి ప్రభావము 18వ శతాబ్దమునకు చెందిన మహాకవి ఊత్తుక్కాడ వెంకట సుబ్బయ్యర్ రచనలపైన కూడ కలదు. దీక్షితుల వారి వలననే సుబ్బయ్యర్ కూడా కొన్ని గుచ్ఛకృతులను రచించిరి. దీక్షితుల వారి నవావరణ కృతుల ననుసరించుచు వెంకట సుబ్బయ్యర్ కూడ నవావరణ కృతులను సంస్కృతములో రచించిరి. దీక్షితుల వారి తరువాత నవావరణ కృతులను రచించిన వాగ్గేయకారులు శ్రీ ఊత్తుక్కాడ వెంకట సుబ్బయ్యర్ మాత్రమేనని నిస్సందేహముగా చెప్పవచ్చును. ఈ కృతుల ధాతు, మాతువులు పరిశీలించిన దీక్షితుల వారి శైలిని పోలియున్నది. వీరు కూడా దీక్షితుల వారి వలె ఏకాదశ నవావరణ కృతులు రచించిరి. అవి-

| చక్రము / ఆవరణము - | సాహిత్యము - | రాగము - | తాళము |
|---|---|---|---|
| 1. ధ్యాన శ్లోకము - | వాంఛసి - | కల్యాణి - | ఆదితాళము |
| 2. త్రైలోక్య మోహన చక్రము - | సంతతం అహం - | దేశాక్షి - | ఆదితాళము |
| 3. సర్వాశా పరిపూరక చక్రము - | భాజశ్వ శ్రీ - | నాదనామ క్రియ - | ఆదితాళము |
| 4. సర్వ సంక్షోభిణీ చక్రము - (అష్టదళ పద్మము) | సర్వజీవదయ - | శుద్ధ సావేరి - | తిశ్రచాపు తాళము |
| 5. సర్వసౌభాగ్యదాయక చక్రము - | యోగయోగేశ్వరి - | ఆనందభైరవి - | ఖండత్రిపుట తాళము |
| 6. సర్వార్థ సాధక చక్రము - | నీలలోహిత - | బలహంస - | ఖండధృవ తాళము |
| 7. సర్వరక్షాకర చక్రము - (అంతర్దశారము) | సదానందముయి - | హిందోళ - | సంకీర్ణ మర్య తాళము |
| 8. సర్వరోగ హర చక్రము - | సకలలోక - | ఆరభి - | ఆది తాళము |
| 9. సర్వసిద్ధి ప్రదాయక చక్రము - | శంకరశ్రీ - | మధ్యమావతి - | ఆదితాళము |
| 10. సర్వానందమయ చక్రము - | గురుగుహ జననీ - | నవరస కన్నడ - | ఆదితాళము |
| 11. ఫలశ్రుతి - | శ్రీమవేధారనుజం - | మణిరంగు - | ఆదితాళము |

ఇంతేగాక సుబ్బయ్యర్ సప్తరత్న కృతులను నామముతో ఏడు కృతులను రచించిరి అవి-

| | | | |
|---|---|---|---|
| 1. భజనమాత్ర - | నాటరాగము - | ఆదితాళము - | 10 చరణములు గల కృతి. |
| 2. మాధవహృధి - | కల్యాణి - | ఆదితాళము - | 7 చరణములు గల కృతి. |
| 3. అగణిత మహిమ - | గౌళ - | ఆదితాళము - | 8 చరణములు గల కృతి. |
| 4. బాలసరసా - | కీరవాణి - | ఆదితాళము - | 7 చరణములు గల కృతి. |
| 5. మహాసాయా - | అభోగి - | ఆదితాళము - | 2 చరణములు గల కృతి. |
| 6. విశతి విశతి కృష్ణా - | గౌరీమనోహరి - | చాపుతాళము- | 3 చరణములు గల కృతి. |
| 7. సుందరనందా - | మధ్యమావతి - | ఆదితాళము - | 5 చరణములు గల కృతి. |

ఈ విధముగా పూర్వుల ప్రభావము ముత్తుస్వామి దీక్షితుల వారి పైనను, ముత్తుస్వామి దీక్షితుల వారి రచనల ప్రభావము తరువాత వచ్చిన వాగ్గేయకారులపైనను కలదు.

★ ★ ★

# నవమాధ్యాయము

శ్రీః

# నవమాధ్యాయము

## ఉపసంహారము

"శ్రీమతాం శుచీనాం గేహే యోగభ్రష్టో౽భి జాయతే" - అని భగవద్గీత వచనము. పూర్వజన్మము నందు యోగభ్రష్టుడైన వాడు మరుజన్మమున శ్రీమంతులు, శుచి, శుద్ధి కలవారి వంశమున జన్మింతురని చెప్పబడినది.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి వంశము శ్రీమంతము, శుచిమంతము, విద్యా వంతము, సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక, వేద వేదాంగాది సకల విద్యలకు నెలవైన వంశము. అట్టి వంశమున జన్మించిన శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి రచనలను గూర్చి అధ్యయనము చేసి అందలి శివశక్తి తత్త్వ ప్రతిపాదనమును, శ్రీవిద్యా విషయములను, ఆ రచనల యందలి సంగీత సాహిత్య ప్రాశస్త్యమును భావించి వివరించుటకై సాగిన పరిశోధనా ఫలితమును సిద్ధాంతీకరించి ఈ వ్యాసమున నిరూపించుటే ప్రధాన లక్ష్యము.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి వంశీకులు తరతరాలుగా శ్రీవిద్యాదీక్షను పొందిన వారు. శివశక్తి బిందు విలసనమును గూర్చిన వివేకము ఈ వంశీకులకు సహజ సంపన్నము. ముత్తుస్వామి దీక్షితుల వారి జన్మము భగవతీ కటాక్షఫలము. తండ్రియైన రామస్వామి దీక్షితుల వారికి శ్రీ బాలాంబిక ముక్తాహారము ప్రసాదించుట అనునది శ్రీవిద్యకు సంకేతమైన ముక్తాహారము నొసంగునటు వంటిదే. ముక్తాహారము నందలి మౌక్తికములు శుద్ధ విద్యాంకురములు. శుద్ధవిద్యాంకురాకార ద్విజ పంక్తి నుండియే దీక్షితుల వారి జననము. అనగా దీక్షితుల వారికి శ్రీ విద్య వెన్నతో పెట్టిన విద్య.

"తత్ చేతసా స్మరతి నూనమబోధపూర్వం

భావస్థిరాణి జననాంతర సౌహృదాని"-

అని కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలములో పేర్కొనిరి.

శ్రీవిద్య ఆది దంపతుల ఆనందరూప స్పంద విశేషముగా జగన్మంగళకరమైనది. అట్టి విద్యనుపాసించు వానికి సర్వరహస్యములు వివేకముతో ప్రసన్నమగును.

సర్వరహస్యమనగా నామరూపాత్మకమైన జగత్తు. సగుణ, నిర్గుణ పరబ్రహ్మ తత్త్వము యొక్క సమగ్ర స్వరూపము విదితమగుటకు తల్లి వంటిది శ్రీవిద్య.

ఇట్టి శ్రీ విద్యనుపాసించిన శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి కృతులలో శివశక్తి మేళన రూపమైన జగద్విలాసము, దివ్యతత్త్వము స్తుతింపబడినది. ఒక్క స్తుతి మాత్రమే కాదు. ప్రతికీర్తనము నందు దీక్షితుల వారి ఉపాసనా రూపమైన ధ్యానక్రమము, షట్ చక్రవిలసనము, శివశక్తుల వైభవముతో ఒప్పుచుండును. వివిధ క్షేత్రములలో గల దైవములను గూర్చిన కృతులను ఈ సిద్ధాంత వ్యాసమున వివరించుట జరిగినది. ఇవి అన్నియు శివశక్తి, తత్త్వబోధకములు. బంగారము ఒక్కటే ఆభరణములనేకములన్నట్లు విద్య ఒక్కటే యైనను దానిచే వెలసిన దైవములు వివిధములు. ఆ ఏకత్వము నందుగల వైవిధ్యమును, వైవిధ్యమున గల ఏకత్వమును వాఖ్యానించుకొన్నచో దీక్షితుల వారి కృతులు మనకు అవగాహనలో శ్రీ విద్యా స్వరూపమును విశదీకరించును. అట్టి విశదీకరణమే ఈ సిద్ధాంత గ్రంథము యొక్క ప్రయోజనము.

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారు ప్రతి కృతి శివశక్తి తత్త్వము, సంగీత సాహిత్య కళా వైభవముతో తొణికిసలాడుచునే యుండుననుటలో సందియము లేదు.

★★★

# ఉపయుక్త గ్రంథ పట్టిక


1. గిర్మాజీ రావు కె.వి.ఎస్.ఎం - ఆంధ్ర సంగీత శాస్త్రము - ప్రథమ భాగము- గుత్తి - 1953 (ఆం. సం. శా)
2. జగన్మోహన రావు పిడూరు -ప్రజ్ఞావిలాసము (షట్చక్ర రహస్య ప్రకాశము) - ప్రథమముద్రణ - ది వరల్డ్ టీచర్ ట్రస్టు - 1990. (ప్ర.వి)
3. జానకి రామన్ ఎస్.ఆర్ - సంగీత శాస్త్ర సారము - మొదటి భాగము ప్రథమ ముద్రణ - శ్రీరామా ప్రింటర్సు -తిరుపతి -1986. (సం.శా.సా)
4. జానకి రామన్ ఎస్.ఆర్. - సంగీత శాస్త్ర సారము - ద్వితీయ భాగము ప్రథమ ముద్రణ - శ్రీరామా ప్రింటర్సు - తిరుపతి-1989 (సం.శా.సా)
5. పరబ్రహ్మశాస్త్రి కొలచిన అద్వైత - (సం.పా) - శ్రీచక్ర విశేషపూజాః - ప్రథమ ముద్రణ - జై భారత్ పబ్లిషర్సు - విజయవాడ. (శ్రీ. వి. పూ)
6. పార్థసారధి టి.ఎన్, నరసింహారావు భావరాజు. (సం.క, పరి.క) - శ్రీ ముత్తుస్వామి దీక్షితుల కృతులు- మొదటి ముద్రణ - త్రివేణి పబ్లిషర్సు- మచిలీపట్టణము - 1978 (శ్రీ ము.ది)
7. మల్లికార్జునం కందుకూరు (అ.ను) - దేవీమహాత్మ్యము లేక దుర్గా సప్తశతి -శ్రీ రామకృష్ణ మఠం ప్రింటింగ్ ప్రెస్ - మదరాసు - 1956. (దే.మ)
8. రజనీకాంతరావు బాలాంత్రపు ఆంధ్ర - వాగ్గేయకారక చరిత్ర - ప్రచురణ నెం. 306 - విశాలాంధ్ర ప్రచురణాలయం - విజయవాడ. (వా.చ)
9. రజనీకాంతరావు బాలాంత్రపు - భారతీయ సంగీత సంప్రదాయము ఆంధ్రులకృషి - 1975. (భా.సం.ఆ)
10. రంగారావు మల్లాప్రగడ - భారతీవ్యాఖ్య - ద్వితీయ ముద్రణ - మాతృశ్రీ అధ్యయన పరిషత్ - 1989. (భా.వ్యా)
11. రామకృష్ణశాస్త్రి నిరాఘాటం- వాగ్గేయకారరత్న -శ్రీ ముత్తుస్వామి దీక్షితులు మొదటి ముద్రణ - వాణీ ఆర్ట్సు ప్రింటర్సు - తెనాలి - 1995-96. (వా.ర)
12. రామశాస్త్రులు మచ్చేంబోలు - శ్రీమద్భావనోపనిషత్ - శ్రీ సాయి బాబా ముద్రణాలయము - విజయనగరము - 1958. (శ్రీ. భా)

13. రామలింగేశ్వరరావు తుమ్మలపల్లి - శ్రీచక్ర విలసనము - ద్వితీయ ముద్రణ - త్రివేణి పబ్లిషర్సు - మచిలీపట్టణము - 1974. (శ్రీ. చ. వి.)

14. రామ్మూర్తిశాస్త్రి సింహంభట్ల - కామకలావిలాసము - వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ - చెన్నపురి - 1959. (కా.క.వి.)

15. రామ్మూర్తిశాస్త్రి సింహంభట్ల - శ్రీశారదా చతుశ్శతీస్తవము - ప్రథమ ముద్రణ - సౌభాగ్యముద్రాక్షర శాల - బెజవాడ - 1934. (శ్రీ. శా.చ)

16. రామలింగేశ్వరరావు తుమ్మలపల్లి - సౌందర్యలహరి (జగద్గురు శ్రీ శంకర భగవత్పాదుల విరచితము) - బాల సరస్వతీ బుక్ డిపో కర్నూలు - 1993. (సౌ.ల)

17. వరాహనరసింహాచార్యులు వింజమూరి - శ్రీముత్తుస్వామి దీక్షితుల చరిత్రము - చతుర్థపుష్పము - కాకినాడ ముద్రాక్షరశాల - 1935. (ము.దీ.చ)

18. వేదాంతం భాగవతార్, అనంత కృష్ణయ్యర్ - గురుగుహ గానమృతవర్షిణి - 1936-37. (గు.గా)

19. వేంకటేశ్వరరావు వడ్లమూడి - శ్రీచక్రదర్శనము - ప్రథమ ముద్రణ - విజయవాడ ఆఫ్‌సెట్ ప్రింటర్సు - 1994. ( శ్రీ. ద)

20. వేంకటకోటేశ్వరరావు రాచకొండ - శ్రీలలితా రహస్యనామ గూఢార్థదీపిక - ప్రథమ ముద్రణ - కళ్యాణీ ప్రెస్ - తెనాలి - 1972. ( శ్రీ ల.ర.నా.గూ)

21. వేంకటరామ అయ్యర్ టి.ఎల్. - ముత్తుస్వామి దీక్షితార్ - సూర్యనారాయణ, టి. (అ.ను.) - నేషనల్ బుక్ ట్రస్టు, న్యూ ఢిల్లీ, ఇండియా - 1996. (ము.దీ)

22. సత్యనారాయణ అరపిరాల -సంగీత కళాప్రదర్శిని - మొదటి భాగము పాండురంగ ప్రింటింగ్ వర్క్స్, విజయవాడ - 1979 (సం.క)

23. సత్యనారాయణగుప్త గజ్జె. (సం.గ) - ఉపనిషత్ కల్పతరువు - ప్రథమ సంపుటము - ప్రార్థనా గాన ప్రచార సంఘము - 1988. (ఉ.క)

24. సుబ్బరామ దీక్షితులు - సంగీత సంప్రదాయ ప్రదర్శిని-మొదటి భాగము - ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ - హైదరాబాదు - 1973. (సం.స. ప్ర)

25. సుబ్బరామ దీక్షితులు - సంగీత సంప్రదాయ ప్రదర్శిని - రెండవ భాగము - ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ - హైదరాబాదు - 1974. (సం.స.ప్ర. 2వ)

26. సుబ్బరామ దీక్షితులు - సంగీత సంప్రదాయ ప్రదర్శిని - మూడవ భాగము - ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ - హైదరాబాదు - 1976. (సం.స.ప్ర. 3వ)

27. సుబ్బరామ దీక్షితులు - సంగీత సంప్రదాయ ప్రదర్శిని - నాల్గవ భాగము - ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ - హైదరాబాదు - 1979.(సం.స.ప్ర. 4వ)

28. సంగీత సారసంగ్రహము - మద్రపురీ సంగీత విద్వత్సభ వారిచే ప్రకటితము - శ్రీవత్స ముద్రాణాలయము - మద్రాసు 1940. (సం.సా.)

29. శార్జ దేవుడు - సంగీత రత్నాకరము - సంస్కృతమూలము. శ్రీరామమూర్తి గ్రంథం -(అ.ను.) - ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ- 8వ ప్రచురణ - హైదరాబాదు 1966. ( సం.ర)

30. శ్రీనివాసరావు వేమూరి- పూర్వగాథాలహరి - వేంకట్రామా అండ్ కో- విజయవాడ - 1986. (పూ.ల.)

31. శ్రీరామచంద్రుడు పుల్లెల - శ్రీ రాజశేఖర విరచిత కావ్య మీమాంసా - ప్రథమముద్రణ - నాగలక్ష్మి ఆర్ట్ ప్రింటర్స్ - హైదరాబాదు - 1979. ( శ్రీ. రా. శే. వి. కా. మీ.)

32. భగవద్గీత - కప్పగంతుల మురళీకృష్ణ (సం.పా) - క్వాలిటీ పబ్లికేషన్స్ - విజయవాడ - 1982. (భ.గ)

## తెలుగు పత్రికలు

1. భారతి - జూన్ - డిసెంబర్, 1935

2. వాణి మాసపత్రికలు

★ ★ ★

# ఆంగ్ల గ్రంథములు


1. *Das .R.K.*- TEMPLES OF TAMILNADU - Second Edition- Printed by Bharatiya Vidya Bhavan -1991

2. *GOSVAMI ,O.*- THE STORY OF INDIAN MUSIC - Ist edition - Asia Publishing House - Madras - 1957

3. *GOWRIE KUPPU SWAMY& HARIHARAN .M* . READINGS ON INDIAN MUSIC - Printed by Eswaran, M. College Book House - Tiruvandrum - 1979

4. *GOVINDA RAO T.K.* - COMPOSITIONS OF MUDDUSWAMI DIKSHITAR - Ist Edition - Ganamandir Publications - 1997.

5. *JOHN WOOD ROFFE* - INTRODUCTION TO TANTRA SASTRA - Third Edition - Ganesh & Company Pvt. Ltd., Madras - 1955

6. *JOHN WOOD ROFFE* - SHAKTI AND SHAKTA - Ganesh & Company Pvt. Ltd.,

7. *MIRA. S* - BHĀVANOPANISAD - Text & Commentary of *BHĀSKARARAYA* - Ganesh & Company - 1976.

8. *RAGHAVAN Dr. V.* - MUTHUSWAMI DIKSHITAR - A Publication of the National Centre of Performing Arts - Bombay.

9. *RAMASWAMI M.S.* - THE AMBROSIA OF MUTHUSWAMY DIKSHITAR - Part I - Printed by Alannu Printing Works - Madras - 1989.

10. *RAMASWAMI M.S.* - THE AMBROSIA OF MUTHUSWAMY DIKSHITAR - Part II - Printed by Alannu Printing Works - Madras - 1989.

11. *RANGARAMANUJA AYYANGAR R* . - HISTORY OF SOUTH INDIAN (ÇARNATIC) MUSIC - 1972.

12. *RAMASWAMI AIYAR M.S.* - SVARA MELA KALANIDHI

13. *SUBBARAYA SARMA Y.* - SRI KUNDALINI SAKTHI-SURPENT POWER - Davalath Printers, Bangalore - 1971.

14. *SAMBA MOORTHY P.* - HISTORY OF INDIAN MUSIC - The Indian Music Publishing House, Madras - 1962.

15. *SAMBA MOORTHY P.* - GREAT COMPOSERS - BOOK I - Second Edition - The Indian Music Publishing House, Madras - 1962.

16. *SAMBA MOORTHY P.* - SOUTH INDIAN MUSIC - Book I to VIII - The Indian Music Publishing House, Madras - 1968,69,70,71,72,73,74 & 75.

17. *VARAHA NARASIMHACHARYA. VINJAMURI* - TALA LAKSHANAM - 1979.

18. *ṢANKĀRĀCARYA* - PRAPANCASĀRA TANTRA - Introduction by - *ARTHUR ĀVALON* and Edited by *ATALĀ NANDA SARASVATI* - Part I & II in one Vol. - First Edition - Delhi - 1935.


★ ★ ★

# ఆంగ్ల పత్రికలు - ప్రత్యేక సంచికలు


1. Janakiraman S.R. - SRI MUTHUSWAMY DIKSHITAR AND HIS CONTRIBUTION TO CARNATIC MUSIC - The Journal of the Madras Music Academy - 64. Vol. VII - 1986.

2. Janakiraman S.R. - DIKSHITAR'S CONTRIBUTION TO MUSIC - The Journal of the Madras Music Academy Vol. 66,68,70,72,74,76,78,80,82.

3. Raghavan Dr.V - A COMPARATIVE STUDY OF MUTHUSWAMI DIKSHITAR AND THE OTHER COMPOSERS - PURANDARA DASA AND KSHETRAJNA. The Journal of the Madras Music Academy - 1978.

4. Raghavan Dr. V - SOME ASPECTS OF DIKSHITAR'S COMPOSITIONS AND TREATMENT OF RAGAS - The Journal of the Madras Music Acadmy Vol.I.

5. Narasimha Yoga - MUSICAL SCHEME OF NAVAGRAHA KRITIS The Journal of the Madras Music Acadamy - 32 - 1961.

6. Rama Varma Tampuram - DIKSHITAR ON DEVI & GANAPATI - Published By Kerala Education Quarterly - 1961.

7. Venkata Ramayyer, A. - MUTHUSWAMY DIKSHITAR AND HINDUSATNI MUSIC - Published in Souvenir of Kalasagar - Hyderabad - 1971.

8. SPECIAL ISSUE ON BIRTH B1 CENTENARY OF SRI MUTHUSWAMI DIKSHITAR - METHA R.C. (EDITIOR) PARTHASARATHY T.S. (GUEST EDITOR). The Journal of the Indian Musicological Society, Bombay & Baroda - Vol. 6 No.3 September 1975.


★ ★ ★